
కవిత్వం

నెమలికన్నులు



దార్ల వెంకటేశ్వరరావు

నెమలికన్నులు

(కవిత్వం)

దార్ల వెంకటేశ్వరరావు

ప్రచురణ:

మంజుశ్రీ ప్రచురణలు

హైదరాబాదు

2016

NEMALIKANNULU (Freeverse Poetry)
Darla Venkateswara Rao

First Edition	:	2004
Revised Edition	:	2016
Copy Right	:	Author
Copies	:	500
Price	:	125/-

Books available at :
Visalaandhra, Navodaya,
Prajasakti Book House, Hyderabad
and Leading Book Stalls
www.kinige.org,
www.avkf.org
www.vrdarla.blogspot.com

ISBN : 978-81-908963-5-1

For Communication :
B 202, Sai Cluster Apartment,
Sivajinagar Colony
Near Lingampally Railway Station
Opp: Bharat Petrol Bunk, Seri Lingampally,
Hyderabad -500 019.
Ph: 09989628049,
E mail: vrdarla@gmail.com

Published by :
Manjusree Publications
Hyderabad

Printed at :
Himalaya Graphics, Hyderabad

అంకితం



అమ్మ, నాన్నలకు భక్తితో...!

విషయసూచిక

అనుబంధం

పురివిప్పిన నెమలి కన్నులు

కృతజ్ఞతలు

నా జీవితం కోసం తమ జీవితాల్ని త్యాగంచేసిన నా తల్లి దండ్రులకు, నా జీవిత భాగస్వామి డా॥ మంజుశ్రీకి, తమ్ముడు డా॥ దార్ల రవికుమార్, చెల్లి విజయ కుమారి, అన్నయ్యలు శామ్యూల్, సత్యనారాయణలకు, ఈ కవిత్వం ఇలా వెలువడడానికి కారణమైన వాళ్ళందరికీ నా ధన్యవాదాలు

ఈ కవితలన్నింటినీ ఆంగ్లభాషలోకి అనువదించి, ఈ కవితా సంపుటికి విశ్లేషణాత్మకమైన ముందుమాటలు రాసిన డా॥ జె. భీమయ్య గార్కీ, ఆచార్య తుమ్మల రామకృష్ణగార్కి నా ప్రత్యేక కృతజ్ఞతలు.

ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, వార్త, సూర్య, ప్రజాశక్తి, విశాలాంధ్ర, ప్రజాసాహితి, ఆంధ్రప్రదేశ్, మూసీ, రమ్యభారతి, ఇంకావుంది, ముంబైజన్, దట్స్‌తెలుగు, ప్రజాకళ, వెబ్‌ప్రపంచం తదితర పత్రికల్లో ఈ కవితలను ప్రచురించిన వారికీ, ప్రసారం చేసిన ఆకాశవాణి హైదరాబాదు వారికి నా సుమాంజలులు

ఈ కవితలను ప్రచురించిన *అమ్మ, మావూరు, మాదిగ చైతన్యం, దండోరాదరువు, కైతునకల దండెం, కడుపు మీదకొట్టకుండ్రి, జన కవనం, కోటి గొంతులు, కవితావార్షిక, కావడి కుండలు, మునుం, పొన్నాల సురేంద్రమాదిగ సంస్మరణ సంచిక* మొదలైన కవితా సంకలనకర్తలకు నా నమోవాకాలు

అప్పటికే ఆయా సందర్భాల్లో కొన్ని కవితలను అనువదించిన ఆచార్య కె.పురుషోత్తం, ఆచార్య తుమ్మపూడి భారతి, డా॥ పి. హరిపద్మరాణి, డా॥ వి.వి.బి. రామారావు, డా॥ ఎం.మురళీ మనోహర్ గార్లకు నా కైమోడ్పులు

ఈ కవితలను వివిధ సిద్ధాంత గ్రంథాల్లోను, పరిశోధన వ్యాసాల్లోను, ప్రసంగాల్లోను పేర్కొంటున్న వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన ఆచార్యులు బన్న అయిలయ్య, అల్లాడి ఉమ, ఎం. శ్రీధర్, సైమన్ చార్ ల్సీ, కొలకలూరి మధుజ్యోతి, జి.వి. రత్నాకర్, గుండెడప్పు కనకయ్య, వి. శంకరరావు, జె. అప్పారావు, తదితరులందరికీ నా హృదయాంజలులు.

పి. కృపాకర్ మాదిగ, అఫ్సర్, డా॥ గుండిమెడ సాంబయ్య, తుల్లిమల్లి విల్సన్ సుధాకర్, కీ.శే. 'సూర్య' హరినాథ్, డా॥ కె.లక్ష్మీనారాయణ, జి.సుబ్బారావు, కాసుల ప్రతాపరెడ్డి, ఎఱ్ఱాశాస్త్రి, ప్రసాద్ చరసాల, బొల్లోజు బాబా, గుడిపాటి, టి.వేదాంతసూరి గార్లకూ... పుస్తకాన్ని ముద్రించే పనిలో తన పూర్తి సహకారాన్ని అందించిన మిత్రుడు డా॥మల్లెగోడ గంగాప్రసాద్ గారికీ,

ముందుమాటలు, అభిప్రాయాలు రాసిన డా॥ జె. భీమయ్య, ఆచార్య తుమ్మల రామకృష్ణ, ఆచార్య ననుమానస్వామి, ఆచార్య కె. ఆశాజ్యోతి, ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, ఆచార్య పులికొండ సుబ్బాచారి, ఆచార్య పి. కేశవకుమార్, డా॥ జి. వి. రత్నాకర్, డా॥ విస్తాలి శంకరరావు, డా॥ నాగభైరవ కోటేశ్వరరావు, డా॥ పొనుగోటి కృపాకర్ మాదిగ, డా॥ కె. లక్ష్మీనారాయణ, డా॥ ఊటుకూరి వరప్రసాద్, సైదులు ఐనాల, జి. సుబ్బారావు , దుగ్గినపల్లి ఎఱ్ఱాశాస్త్రి, కాసుల ప్రతాపరెడ్డి, మల్లవరపు సుధాకరరావు, గోగు శ్యామల, డా॥ బద్దిపూడి జయరావు, ఇ.వెంకటేష్, వేల్పూరి కామేశ్వరరావు , డా॥ మల్లెగోడ గంగాప్రసాద్, గిన్నారపు ఆదినారాయణ, బడిగె ఉమేశ్, డా॥ నారాయణం సురేశ్ బాబు, **డా॥ యస్.ఎల్.వి. ఉమామహేశ్వరరావు** , వేముల ఎల్లయ్య గార్లకూ...

ప్రూఫ్ రీడింగ్ లో సహకరించిన డా॥ మంజుశ్రీ, సుమలత, కవితలకు, మా విద్యార్థులు బడిగె ఉమేశ్, ఎం. చంద్రమౌళిలకు, లేఔట్ చేసిచ్చిన మాధవి గ్రాఫిక్స్ రామకృష్ణగార్కి, ముఖచిత్రాన్ని వేసిన ప్రముఖ చిత్రకారుడు ఏలే లక్ష్మణ్ గార్కీ, ప్రింటింగ్ చేసిన హిమాలయా గ్రాఫిక్స్, హైదరాబాదు వారికీ.... నా కృతజ్ఞతలు

1 జనవరి, 2016

–దార్ల వెంకటేశ్వరరావు

పునరుత్థానం (నా మాట)

కళ్ళు పలికిన భావాలన్నీ చదివేయగలమా?
మనసుని స్కాన్ చేయగలమా?
మదిలోతుల్ని కొలవగలమా?
మనిషిని అర్థం చేసుకోవాలంటే ఎన్ని పార్శ్వాల్ని చూడాలి?
గ్రామం ఒకరికి అందమైన ఆనందవనం.
మరొకరికి కుల,మత, వర్గ,విద్వేషాల సంకెళ్ళమయం.
పట్టణమూ, నగరమూ అంతే...
కొన్ని రంగురంగుల హరివిల్లులా ఉంటాయి
అందరాని చందమామలా కూడా ఉంటాయి.
అమ్మ, నాన్న, స్నేహితుడు, బడి, గుడి అన్నీ జ్ఞాపకాలే.
జ్ఞాపకాల్లోనూ, అనుభూతుల్లోనూ వ్యత్యాసాలెన్నెన్నో...
మనిషెక్కడుంటాడు?
తానున్నదే తననివాసమవుతుందా?
తన నివసించేచోటే తానుంటాడా?
తాను స్థానికుడా? తాను వలసవాదా?
తానెక్కడనుండొచ్చాడు? ఎక్కడికి పోతున్నాడు?
స్థానికం, జాతీయం, అంతర్జాతీయం,
విశ్వజనీనం, విశ్వాంతరాళం... అంతేనా
తానుండేది భౌతికంగానేనా? తన అస్తిత్వాన్ని గుర్తించేదెలా?

తనను ప్రేమించినవాళ్ళతో తానెలా ఉంటాడు?
తనని ప్రేమించని వాళ్ళతో తానెలా ఉంటాడు?
తననెవరూ ప్రేమించని మనిషుంటాడా?
తనని ప్రేమించకపోయినా తాను ప్రేమించే మనిషుండడా?
అలాంటివాళ్ళు ఎలా ఉంటారు?
వాళ్ళ ప్రేమాభిమానాలెలా ఉంటాయి?
ప్రేమంటే ఏమిటి? వ్యక్తీకరించేదా? వ్యక్తీకరించలేనిదా?
ప్రేమెక్కడుంటుంది? అమ్మలోనా? నాన్నలోనా?
అన్నలోనా? అక్కలోనా?
కుటుంబంలోనా? ఇవేమీ లేనివాళ్ళకు ప్రేముండదా?
అనాథలకు ప్రేముండదా?

పిల్లలకు ప్రేమంటే, తల్లిదండ్రులకూ ఉండాలా?
పిల్లల్లేకపోతే ప్రేమతెలీదా? ప్రేమంటే ఏమిటి?
ఇవన్నీ మీ చేతిలోని'నెమలికన్నులు' కవిత్వంలో ఉన్నాయి.
ఈ కవితలెక్కువగా గతంలో 'దళితతాత్త్వికుడు' పుస్తకంలోనివే.
ఆ పుస్తక ప్రతులన్నీ అయిపోయాయి.
మానవానుభూతులు ఒక్కటి కావడమో
ఆ అనుభూతుల్లో, ఆ స్పందనల్లో తమని తాము చూసుకోవడమో
కవిత్వవస్తువు విశ్వజనీనం కావడమో
ఈ కవిత్వాన్నింకా చదవడానికి కారణమనుకుంటున్నాను.
ఆ అనుభూతుల పరిమళాలేవో కవిత్వమయ్యాయి.
కవిత్వమంటే నాకెంతో ఇష్టం.
నాఆత్మీయతను పంచుకునే అవకాశాన్నిస్తాయి.
నా స్పందనల్నీ, నా ఆవేశాల్నీ, నా ఆనందాల్నీ, నా దు:ఖాల్నీ...
నాలో చేరిన అనేకమందిని నేనై
ఇలా ఏకోన్ముఖమై కవిత్వమయ్యాను
యూనివర్సిటీ టీచింగ్ లో అకడమిక్ విశ్లేషణలో పడ్డాను
కవిత్వం రాయడానికి కొంతకాలం దూరమైయ్యాను.
ఒక శూన్యమేదో నన్నావరించినట్లనిపించినప్పుడల్లా
మళ్ళీ కవిత్వాన్నయ్యేవాణ్ణి
అలా కొన్ని కలిసి ఈ 'నెమలికన్నుల్లో' చేరాయి.
దళితతాత్త్వికుడు కవిత్వాన్ని స్పర్శించి
ఆత్మీయంగా కొంతమంది వ్యాసమయ్యారు.
మరికొంతమంది పరిశోధన గ్రంథాల్లో విశ్లేషణలయ్యారు.
ఇంకొంమంది ప్రసంగమయ్యారు.
కొన్నింటిని అనుబంధంగా అందిస్తున్నాను.
పరివర్ధిత ప్రతిగా మీముందుకొచ్చిన నన్ను
ఆత్మీయంగా ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

–దార్ల వెంకటేశ్వరరావు

లిప్తకాల స్వప్నం

ఇది నా జీవితం! నాలాంటి వారి జీవితం!! ఆకలీ, అవమానం నిండుకుండగా ఉండే దళిత జీవితానుభవమే నాకీ కవిత్వాన్నిచ్చింది. జీవితం ఒక ఆరాటం. దళితుడి జీవితం మరీ పోరాటం. గమ్యం మరింత సంక్లిష్టం. ఊహ తెలిసినప్పటి నుండీ 'ఊహ'కు రూపం రావడమెంత కష్టమో అనుభవించాను. ఆ అనుభవాలు, అనుభూతులతో 'నేను' కవిత్వమయ్యాను. కానీ, అన్ని 'నేను'లు 'నేనే' కాదు. కవిత్వం జీవితాన్వేషణ! కవిత్వం జీవిత సంఘర్షణ!! ఈ జీవిత సంఘర్షణ... ఈ అన్వేషణలకేది గమ్యం? కళ్ళెదుటనే కాటికి వెళ్ళే వాళ్ళను చూస్తున్నా, కాలాన్ని కట్టేయలేని జీవితాన్వేషణ! గడియారం నిరంతరం తిరగాల్సిందే! ముళ్ళల్లో భేదాలు! వాటి వేగంలో భేదాలు! అన్నీ మళ్ళీ మళ్ళీ వచ్చిన దారిలోనే తిరగాలి! అదొక నిరంతర ప్రయాణం!

మానవుడూ నిరంతర ప్రయాణికుడే!
నిరంతర అన్వేషకుడే!
ఒక్కో కులం, ఒక్కో మతం, ఒక్కో మార్గం!
జీవితం ఒక నమూనా పాత్ర! నేనూ ఒక నమూనా నయ్యాను.
నా పాత్ర పోషణలోనూ రాగద్వేషాలకతీతుణ్ణి కాలేకపోయాను.
నేనిప్పుడు క్షణకాలపు అసహనాన్ని! క్షణకాలపు జ్ఞాపకాన్ని!!
లిప్తకాల స్వప్నాన్ని!!!

నాకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలతో

మీ

- దార్ల వెంకటేశ్వరరావు

5-9- 2004

(తొలి ప్రచురణ 'దళితతాత్త్వికుడు' కు రాసుకున్న నా ముందుమాట)

సామాజిక ప్రతిఘటన కవిత్వం

– డా॥ జె. భీమయ్య
అసిస్టెంటు ప్రొఫెసరు,
సెంటర్ ఫర్ కంపారిటివ్ లిటరేచర్,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్,
హైదరాబాదు.

నేను స్వతహాగా సృజనాత్మక రచయితను కాను; కవిని అంతకంటే కాను. కవిత్వంపై మాట్లాడటం అంటే అది నాకు ఒక గొప్ప సాహసం లాంటిదే. రచనలపై అందులోను కవిత్వం గురించి నాలుగు మాటలు మాట్లాడాలన్నా భావం, అనుభవంతో పాటు ఈ రెండింటినీ మోసుకెళ్ళే భాష సమపాళ్ళలో ఉండాల్సి వస్తుందేమో. కవిత్వం రాయటానికి సాహిత్యానుభవం లేకపోయినా బాధాకరమైన సామాజిక, ఆర్థిక అనుభవాలున్నాయి; ఆవేశాలూ ఉన్నాయి. వాటికి నేను అక్షర రూపాన్ని ఇవ్వలేకపోతున్నాను. నేను చేయలేని పనిని నా మిత్రుడు డా॥ దార్ల వెంకటేశ్వరరావు చేసినందుకు ముందుగా ఆయన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

దార్ల వెంకటేశ్వరరావు 'విస్తరిస్తున్న విమర్శకుడ'ని ప్రముఖ విమర్శకుడు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి చక్కగా వ్యాఖ్యానించారు. దార్ల విస్తరిస్తున్న విమర్శకుడే కాదు, పదునెక్కుతున్న కవి మిత్రుడు. సమాజంలో ప్రధానజీవన స్రవంతికి దూరంగా విసిరేయబడిన వారి జీవనగాథలను, బాధలను, ఆర్థిక అణచివేతలను కళ్ళకు కట్టినట్లు తనదైన శైలిలో వర్ణిస్తూ కవిత్వాన్ని పండిస్తున్న కృషీవలుడు దార్ల. తనను దార్ల అని సంబోధించడం నాకు ఎంతో ఆప్యాయతను కల్గించేమాట. ఒక గొప్ప రచయితగా కలిగే భావన. ఇప్పటికీ, మరియు ఎప్పటికీ విమర్శకుడుగా స్ఫురించే పదం అది. ప్రేమకు నిర్దిష్టమైన నిర్వచనం ఇవ్వలేనట్లే కవిత్వానికి కూడా ఇవ్వలేము. అయినప్పటికీ, కవులు కవిత్వాన్ని రకరకాలుగా నిర్వచించే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. '*'అప్రయత్నంగా ఉబికి వచ్చే శక్తివంతమైన భావాల ప్రవాహమే కవిత్వం"* అని ఆంగ్ల కాల్పనిక కవి విలియమ్ వర్డ్స్ వర్త్ అన్నాడు. కవిత్వం ఒక ఊహపు లావాగా లార్డ్ బెర్నాడ్ షా వర్ణించాడు. *"మంచి*

మనసు యొక్క ఆనందకర క్షణాలే కవిత్వమ' ని మరో కవి సెలవిస్తాడు. సామాజిక, రాజకీయ సమకాలీన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కవి తాను నివసించిన వాతావరణ పరిసరాలు, సామాజిక సంబంధాల వంటి కారకాలు కవిత్వం రాయడానికి ప్రేరేపిస్తాయి.

కవి స్పందనలు అలా నిర్మితమవుతాయి. దళిత కవిత్వం పైన పేర్కొన్న ఏ నిర్వచనంతోను పొసగదు. భారతదేశంలో ఉన్న సామాజిక పరిస్థితులు ఇతర దేశాల కంటే భిన్నమైనవి. తరతరాలుగా కొనసాగుతున్న కులజాడ్యం ఇతర అనుభవాలకంటే కూడా విచిత్రమైంది. మనం నివసించేది మనిషిని మనిషిగా గుర్తించని సమాజం. అన్ని రంగాల్లోను కూకటివేళ్ళతో పాతుకుపోయిన కులమే ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఈ సమాజాన్ని నడిపిస్తుంది. కులాన్ని పెంచి పోషించి, అట్టడుగు సామాజిక వర్గాలను అణచివేసే మరో బలమైన వర్గం రాజకీయవర్గంగా రూపొందుతుంది. బలమైన వర్గం దాదాపు అన్నికులాలలోను కనిపిస్తుంది. మొన్న శ్రీకాకుళం జిల్లా లక్షింపేటలో దళితులపై జరిగిన మారణకాండ దుర్మార్గమైన ఈ వర్గ ఫలితమే. ఇది అగ్రకుల దురహంకార చర్యగా అనిపించినప్పటికీ కులదుస్తుల్లో దాగున్న వర్గ శత్రు చర్యగా అర్థం చేసుకోవాలి. ఇది జరగనంతకాలం కారంచేడు, లక్షింపేట వంటి దురాగతాలు పునరావృతమవుతూనే ఉంటాయి. దళిత సాహిత్యం ప్రతిఘటనా సాహిత్యంగానే నిలిచిపోకుండా దళిత రచయితలు, కవులు తమ కవిత్వానికి వర్గ స్పృహ అనే చక్రాలను జోడించి ముందుకు నడిపించాలి. లేకపోతే అది కులం చుట్టూ పరిభ్రమించే పరిమిత సాహిత్యంగా ముద్రవేసుకుంటుంది. ప్రతిఘటన చైతన్యం దీనికి శ్వాస. ఇలాంటి అగ్రవర్ణ దురహంకార దూకుడు చర్యల ఫలితంగా ఏర్పడే ఆవేశానికి సమాధానంగా ఇచ్చిన అక్షరరూపమే దార్ల కవిత్వం.

కుల అణచివేత, అవమానకర పరిస్థితులపై తిరగబడిన కవిత్వమే దార్ల కవిత్వం. అందుకే, దార్ల సామాజిక ప్రతిఘటన కవి. తాను రాసే కవిత్వాన్ని సామాజిక ప్రతిఘటన కవిత్వమంటున్నాను. సామాజిక అణచివేతలో ప్రతి దళితుడూ బాధితుడే. దళితుల్లోను కులం నిచ్చెన మెట్లు ఉన్నందున ప్రతి దళితునికీ కలిగే అనుభవం ఒకటే అవ్వదు. ఆర్థిక అసమానతల కారణంగా జీవన వైరుధ్యాలు

భిన్నమైన అనుభవాల్నే కలిగిస్తాయి. దళితులందరినీ కులపరంగా ఒకేగాటన కట్టేసినప్పటికినీ భిన్న అనుభవాల రీత్యా భౌతిక పరిస్థితులపరంగా వారిని ఒకటిగా చూడలేం. ఒక కులసమస్యపైనే సాహిత్యాన్ని సృష్టించుకుంటే, అది కుల సాహిత్యమే అవుతుంది. అనుభవానికెన్నో పార్శ్వాలున్నాయి. జీవితం ఎన్నో కోణాల్లో కొనసాగుతుంది.

ప్రతి కులంలోనూ అణచివేసే వర్గం ఉంటుందని గ్రహించాలి. సామాజిక అణచివేతను చవిచూసిన ప్రతిపాఠకుడూ తన వేదనను ఈ "నెమలికన్ను"ల్లో చూసుకుంటాడు. తనను ఇతరుల్లో చూస్తూ, ఇతరుల్ని తనలో చూసుకుంటున్న ప్రతిఘటన సాహిత్య పోరాటసారధి దార్ల. దార్ల కవిత్వం ప్రతిఘటన ఒడిలో వెలిసిన అక్షరనిధి. దానికి దార్ల ప్రతినిధి. ఈ మాటల్లోని అంతరార్థం తెలియాలంటే ఈ కవిత్వం వెలువడడానికి గల సామాజిక, సాహిత్య ఉద్యమాలను కొద్దిగానైనా స్పృశిస్తే మరింత స్పష్టత ఏర్పడుతుంది.

దళితోద్యమ ప్రస్థానం :

భారతదేశంలోని కులం సమాజాన్ని వివిధ వర్గాలుగా విభజించింది. ఆదిలో సమాజం ఏ ప్రయోజనాల్ని ఆశించి కులవిభజన జరిగినప్పటికీ అనేక అంతర్విభజనలకు కారణమైంది. ఈ విభజనలే మానవుల మధ్య దూరాల్ని పెంచేలా చేశాయి. క్రమేపీ అది వ్యవస్థకే తీవ్రనష్టమని తెలిసిన తర్వాత సంస్కరణలు మొదలయ్యాయి. అవి మతంతో విడదీయరాని బంధంతో పెనవేసుకోవడం వల్ల మత సంస్కరణలు కూడా కుల నిర్మూలనలో భాగంగా కొనసాగాయి. కులం హిందూమతంతో అవినాభావమైన సంబంధాన్ని పెనవేసుకుంది. అందువల్లనే కుల సంస్కరణలు, మతసంస్కరణల్లో భాగమయ్యాయి. భారతీయులు హిందూ మతేతర వలసలు ఆపడానికి భక్తి ఉద్యమం, సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమాలు ముందుకొచ్చాయి. అందువల్ల భారతదేశంలో కుల నిర్మూలనోద్యమాలకు సుదీర్ఘమైన చరిత్ర ఉంది. దీన్ని స్వాతంత్ర్యానికి ముందూ, తర్వాతా అనే విభాగాలుగా చూడాల్సి ఉంది.

భారత జాతీయోద్యమంలో సంస్కరణోద్యమాలు అంతర్భాగంగా కొనసాగినా, ఆ ఉద్యమాలు కుల నిర్మూలన లక్ష్యంతో ఏర్పడినవి కాదు. అందుకనే

భారత జాతీయోద్యమంలో ఈ లక్ష్యాలను సాధించే దిశలో దళితుల సమస్యల పరిష్కారం కోసం దళిత నాయకులు తమ తమ ఉద్యమాలను కొనసాగించారు. జోతీరావు ఫూలే (1827–1899), స్వామి నారాయణ గురు (1855–1928), ఇ.వి.పెరియార్ రామస్వామి నాయకర్ (1879–1973), డా.బి.ఆర్.అంబేద్కర్ (1891–1956) తదితరులు దళిత సమస్యల పరిష్కారం కోసం పోరాడిన వారిలో ముఖ్యులు. అయితే, గాంధీజి (1869–1948) కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జాతీయోద్యమంలో భాగంగా సంస్కరణోద్యమాన్ని నడిపారు. గాంధీజీ ప్రకటించిన హరిజనుల దేవాలయ ప్రవేశం, అస్పృశ్యతా నివారణ ప్రకటనకు స్పందించి దేశవ్యాప్తంగా దళితులు ఈ ఉద్యమంలో భాగస్వాములయ్యారు.

అయితే, మరాఠీ దళితసాహిత్యానికి ఒక ప్రత్యేక చరిత్ర ఉంది. భక్తి ఉద్యమ ప్రతినిధి, 14వశతాబ్దపు మహర్ సంత్ అయిన చొక్కమేల నుండి నేటి అంబేద్కర్ వరకు దళితసాహిత్య ప్రస్థానం జరిగింది. హిందూ మత సంస్కృతి, కుల వివక్ష లాంటి సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా పోరాడిన చొక్కమేల చరిత్రలో నిలిచిన దళితుడు. చొక్కమేల దళితుల సమాన హక్కుల కొరకై పోరాడినప్పటికీ హిందూ మతాన్ని సమర్థించినందుకు ఆయన్ని అంబేద్కర్ తిరస్కరించాడు. అయినప్పటికీ, చొక్కమేలతోనే కుల వ్యతిరేకపోరాటానికి బీజం పడిందనేది తిరుగులేని వాస్తవం. ప్రతిఘటనలో చైతన్యం లేకపోవచ్చు. కానీ, మనుషులంతా ఒకటే అని నినదించడం సామాన్యవిషయం కాదు. అది వ్యక్తి సామాజిక చైతన్యానికి తార్కాణం.

జోతీరావు ఫూలే శూద్ర కుటుంబంలో జన్మించినప్పటికినీ దళితుల సామాజిక సమాన హక్కులకై మరియు మహిళాస్వేచ్ఛకై పోరాడిన ఒక గొప్ప సంస్కరణవాది. థామస్ పెన్ అనే తాత్వికుని ప్రభావంతో తన పోరాటాలను కొనసాగించాడు. అంబేద్కర్ పోరాటాల పటిమ జోతీరావు ఫూలే నుండి వచ్చిందే. దళితుల సమస్యలు ప్రచురించడానికి అగ్రవర్ణ ప్రచురణ కర్తలు ముందుకు రాలేదు. ఎందుకంటే సమస్యలు కూడా అంటరానివి, వారి పవిత్రాంశాలను మైల పరిచేవి. అంబేద్కర్ “మూక్ నాయక్”ను ఈ పరిస్థితుల్లోనే ప్రారంభించాడు. దళితసమస్యలపై అవగాహనను పెంచే వ్యాసాలు ప్రచురించాడు. బాబూరావు బాగుల్ సంపాదకత్వంలో

‘*అస్మితాదర్శ్*’ అనే సంచిక వెలువడింది. మూక్ నాయక్ పనినే అది కూడా నిర్వర్తించింది. 20వ శతాబ్ది ప్రారంభంలో దళితరచయితలైన గోపాల్ చాచా వాలంగ్ కార్, కిసాన్ ఫగోజీ భన్సోడ్, ఘన్‌శ్యామ్‌వాటికార్, శంకర్ రావు ఖరత్ మొదలైన వాళ్ళు దళితసాహిత్యాన్ని ముందుకు తీసుకువెళ్ళినవారిలో ముఖ్యులు.

దళితసాహిత్యానికి ఊతమిచ్చే క్రమంలో దయాపవార్, అర్జున్ డాంగ్లే, నామ్ దేవ్ దాసల్, రాజదాలే మరియు జె.వి. పవార్ లాంటి యువకులను వెన్నుతట్టి ప్రభావితం చేశాడు బాబూరావు బాగుల్. ఈ క్రమంలోనే నామదేవ్ దాసల్ ఆకార్ (Shape-1967) అనే కవితా సంకలనాన్ని వెలువరించాడు. అర్జున్ డాంగ్లే గూడ చెవాని హల్ తే ఆహె (1977) అనే కవితా సంకలనాన్ని తీసుకొచ్చాడు. మరాఠీ సాహిత్యం రెండు దశల్లో వెలువడింది. దళితపాంథర్ ఉద్యమ పూర్వపు దశ, దళిత్ పాంథర్ ఉద్యమ మలి దశ.

1972లో ఏర్పడిన దళిత పాంథర్స్ ఉద్యమం మరాఠీ దళిత సాహిత్యాన్ని ఉద్ధృత పరిచింది. విస్తృతపోరాటానికి దోహదపడింది. ఈ ఉద్యమం బ్లాక్ పాంథర్స్ ఉద్యమ ప్రభావంతో నిర్మితమైంది. అమెరికాలో నల్ల వారు సామాజిక సమానత్వపు హక్కుల సాధనకై ఏర్పడిన బ్లాక్ పాంథర్స్ ఉద్యమం మరాఠీ దళిత రచయితలను ఉత్తేజపరిచింది. కులవివక్ష, అంటరానితనం, పేదరికానికి వ్యతిరేకంగా దళిత పాంథర్స్ తమ ఉద్యమాన్ని నిర్మించారు.

1972లో భారత స్వాతంత్ర్యపు 28వ వార్షికోత్సవం సందర్భంగా నల్ల జెండాలతో తమ నిరసన వ్యక్తంచేస్తూ దళితపాంథర్స్ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఆ ఊపిరితోనే 1973లో నామ్‌దేవు దసాల్ శక్తివంతమైన కవిత్వాన్ని *“గోల్ పితా”* పేరుతో వెలువరించాడు. సామాన్య ప్రజల సమస్యలు చర్చిస్తున్న క్రమంలో ముంబాయి మురికివాడలపై వ్యభిచార గృహాలపై కవిత్వాన్ని రాసి మధ్యతరగతి పాఠకుల్లో సంచలనం కలిగించాడు.

దళిత్ పాంథర్స్ ఉద్యమంలో ముఖ్యుడైన నామ్ దేవ్ దాసల్ 1982లో The *Sunday Observer* కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇలా అంటాడు. “*If the aim of social struggle was the removal of unhappiness, then poetry was necessary because it expressed that unhappiness*

vividly and powerfully"(370) సామాజిక పోరాటాల ఉద్దేశ్యం దుర్భరతను పోగొట్టాలని ఉండే కవిత్వం అవసరం ఎందుకంటే అది అసంతృప్తిని స్పష్టంగా మరియు శక్తివంతంగా వ్యక్తీకరించింది కాబట్టి.

మరాఠీ సాహిత్యంలో గానీ, మరే ఇతర సాహిత్యంలో గాని కవిత్వమే ముందుగా పుట్టింది. 5వ శతాబ్దంలో గ్రీకునాటకాలతో పాటు కవిత్వం కూడా వెలువడింది. అందుకేనేమో దార్ల తన ప్రతిఘటనను తెలియజేయటానికి కవిత్వాన్ని ఒక ఆయుధంగా ఎంచుకున్నాడు. కాబట్టే చాలా శక్తివంతంగా చెప్పగలిగాడు. కవిత్వంతో మొదలైన మరాఠి దళితసాహిత్యం విప్లవ పంథాతో నడిచింది. కానీ, అది ఎక్కువ కాలం నిలువలేదు. పదిసంవత్సరాల కాలంలో దళిత్ పాంథర్స్ ఉద్యమం రెండుగా చీలిపోయింది. వామపక్షభావజాలంతో రాసిన కవిత్వం అంబేద్కర్ దళిత స్పృహతో సృష్టించిన సాహిత్యంతో పొసగలేదు. దళితులు రెండు వర్గాలుగా చీలిపోయారు. 1980 దశకంలో మరాఠీ దళితరచయితలు తమ స్వీయచరిత్ర, చిన్న చిన్న కథలు రాస్తూ మరాఠీ దళిత సాహిత్యాన్ని చాలా శక్తివంతంగా ఆవిష్కరించారు. శరణ్ కుమార్ లింబాలే, బేబీ కాంబ్లే, ఊర్మిళా పవార్, వసంతమూన్ లాంటి వారు సమకాలీన మరాఠీదళిత రచయితల్లో అగ్రగణ్యులు.

60వ దశకంలోని మరాఠీ దళితసాహిత్యలో యాంగ్రీయంగ్ మెన్ (Angry Young Men) ప్రచురించిన లిటిల్ మ్యాగజీన్ (Little Magazine) ప్రముఖ స్థానం పొందింది. మార్క్సిస్టు ప్రభావంతో రాసిన నారాయన్ సత్వే కవిత్వం అభ్యుదయ సాహిత్యానికి మరియు దళిత సాహిత్యానికీ ఊపిరి పోసింది. మార్క్సిస్టు అభ్యుదయ మరియు దళిత సాహిత్య స్రవంతులు తమ సైద్ధాంతిక పోలికతో తిరుగుబాటు చేసినవే. చాలామంది దళిత రచయితలు తిరుగుబాటు ధోరణిలో కవిత్వం రాసి, లిటిల్ మ్యాగజీన్‌లో ప్రచురించిన వారే. వీరిలో బాబూరావు బాగుల్ అగ్రగణ్యులు. లిటిల్ మ్యాగజీన్ సాహిత్య ఉద్యమం సంప్రదాయ సాహిత్యానికి వ్యతిరేకంగా వచ్చినదే. *"మేము అనుకున్నట్లే రాస్తాం. మాపై పెత్తనం చెలాయించ దానికి మీరెవరు? "* అనే ధోరణిలోనే రాయబద్ద కవిత్వం. దార్ల కవిత్వ ధారను ఈ కోణంలోనే చూడాలి. దళితునికి కలిగిన సామాజిక అనుభవాలు ఇటువంటి

స్పందననే కలిగిస్తాయి. ఆ స్పందనలే సాహిత్యాన్ని సృష్టించుకుంటున్న క్రమంలో అనేక ప్రక్రియలుగా వ్యక్తమవుతుంటాయి. ఇటువంటి స్పందనలే ఇక్కడ కవిత్వంగా రూపుదిద్దుకున్నాయి. అంబేద్కర్ ఔరంగాబాద్ లో మిలింద్ కళాశాల స్థాపించినందువల్ల దళితసాహిత్యానికి మరత్వాడా కేంద్రంగా ఆవిర్భవించింది. దళితేతరులు కూడా ఈ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. ఎం.ఎన్. వాంఖేడ్ తన ఉన్నతవిద్య కోసం అమెరికా వెళ్ళారు. తిరుగు ప్రయాణంలో అక్కడి నల్లవారి సాహిత్యాన్ని (Black Literature) తన వెంట తీసుకొచ్చారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాల పట్ల తిరుగుబాటు ధోరణి, గగుర్పొడిచే జీవితానుభవాలు ఆ సాహిత్యంలో ప్రతిబింబించాయి. రచయిత, నల్లవారిపై తులనాత్మక అధ్యయనం చేశాడు.

రామాయణ, మహాభారతాలను సమీక్షిస్తూ, వాటిలో దళితులకు స్థానం లేకుండా చేసిన వైనాన్ని గుర్తించాడు. నల్లవారిలాగే దళితులు కూడా తిరగబడాలని చెప్తూ తమ సమస్యలను ప్రతిబింబించేలా తమ సాహిత్యాన్ని సృష్టించుకోవాలని సూచించాడు. మిలింద్ కళాశాలలో మెజార్టీ విద్యార్థులు దళితులే అయినందువల్ల "మిలింద్ సాహిత్యపరిషత్" ను స్థాపించి, అస్మిత్ (అస్మితాదర్శ్) అనే త్రైమాసిక పత్రికను ప్రారంభించాడు. వివిధ ప్రక్రియల్లో రాయబడిన మరాఠీ దళితసాహిత్యం "దళిత్ పాంథర్స్" ఉద్యమానికి నాంది పలికింది. శ్రమకు సంబంధించిన ఒక మరాఠీ కవిత

"My father spent his life
Carrying heavy sacks on his neck
Turned from young to old"

(chend wanken, 20, *Poisoned Bread)*

తెలుగు స్వేచ్ఛానువాదం :

"తన వీపుపై బరువైన సంచులను
మోస్తూ జీవితాన్ని గడిపాడు మానాన్న
యవ్వనం ముసలిదైయ్యింది"

అలాగే దార్ల రాసిన కవితా ఖండికల్లో ఒకదాన్ని గమనించండి.“నాన్న వేసే గునపం పోటుకి పెరుగుగడ్డలా విరిగిపడే *మట్టిబెడ్డల బరువు నాకు తెలుసు”* (*ఇప్పుడు నా శ్లోకంలో...*) ఈ రెండు కవితలను పోల్చి చూస్తే, తండ్రులిద్దరూ ఎదుర్కొన్న సమస్య ఒక్కటే. ఇద్దరూ శ్రామికులే. ఓ తండ్రి తన మెడకు బరువైన సంచులను మోయడం వల్ల వీరికి యుక్త వయస్సులోనే ముసలితనం వచ్చేసింది. వయస్సు ముసలితనం కాకపోయినా చేస్తున్న శారీరక శ్రమ ముసలితనంలోకి నెట్టేసింది. మరో తండ్రి గునపం పోటు పొడవడం, ఆ పనిని రాత్రిపూట చేయడం అనేది పనిలో కనబరిచే నైపుణ్యానికి మరియు అంకిత భావానికి తార్కాణం. పగటిపూట అయితే చూసి గునపంపోటు వేయవచ్చు. కానీ, ఈపనిని రాత్రి చేయటం మరింత నిరంతరం దళిత శ్రామికులకు కలిగే అనుభవాన్ని కవిత్వీకరిస్తున్నాడు దార్ల. పైరెండింటిలోనూ శ్రమే ప్రధానం. శ్రమకు కులం లేకపోయినా, ఆ శ్రమించేవాళ్లంతా అత్యధికులు కింది కులాలవాళ్ళే కావడం గమనార్హం. అందుకే ఆ ఇద్దరి శ్రమజీవుల భాషా వేరైనా, శారీరక శ్రమ ఒక్కటే. దళితులు శ్రామికులే కాదు, (రిక్షా) కార్మికులు కూడా. అందుకే దళితానుభవం అంటే ఒక్క కులవివక్షగానే చూడటం సరికాదు. దానికి తోడు పేదరికం వల్ల కలిగే బాధ కూడ. పేదరికం, కులవివక్ష కలగలిసిన దారుణ పరిస్థితే దళితానుభవం. విశిష్ట స్థానంలో ఉన్న దళితులు ఆర్థిక అసమానతల గురించి మాట్లాడరు. ఇది విచిత్రమైన విషయం. కుల అవమానాలపైన మరియు ఆత్మగౌరవంపైనే వారి దృష్టంతా. కానీ, రెండు సమస్యలు సమానస్థాయిలో ఎదుర్కొంటున్న దళితుడి జీవితం అతి దుర్భరం. ఆంగ్లభాషలో వచ్చిన తమిళ దళిత కవిత్వం దీనికి అద్దం పడుతుంది.

“Brother,
I am pedaling this rickshaw for fifteen years
Two girls, one boy
The elder and the younger have the
same husband
The son sometimes pedals this rickshaw
Doesn’t give my thing at home
My wife sells brooms

The house rent is hundred and fifty rupees
I make some money only from school trips
Now, that too is drivied up because its
two months vacation"

(Kappilan. Tamil Dalit Writing. Ed.by Ravikumar and R.Azgarasam, New DelhiG UP, 2012.21)

తెలుగు స్వేచ్ఛానువాదం :

"సోదరా, పదిహేను సంవత్సరాలుగా
నేను రిక్షా తొక్కుతున్నవాణ్ని
నా కిద్దరు ఆడపిల్లలు, ఒక మగపిల్లాడు
పెద్దమ్మాయికీ, చిన్నమ్మాయికీ కలిపి ఒకే భర్త
నా బిడ్డా కొన్నిసార్లు ఈ రిక్షానే తొక్కినా
ఇంటికి తెచ్చేది మాత్రమేమీ ఉండదు
చీపుర్లు అమ్ముతుంది నాభార్య
మాయింటి అద్దె నూట యాభైరూపాయలు
బడిపిల్లలు దింపేపనికి నా సంపాదన
రెండు నెలల సెలవుల వల్ల అదీ మృగ్యమైపోయింది"

ఈ కవితా ఖండికను పరిశీలిస్తే, తండ్రి రిక్షాతొక్కడం మరియు తల్లి చీపుర్లు అమ్మటం, కొడుక్కి వారసత్వంగా వచ్చింది కూడా రిక్షా తొక్కడమే. ఇద్దరి కూతుళ్ళకూ ఒక్కడే భర్తకావడం ఒక వాస్తవం పేదరికం వల్ల కలిగిన ఫలితం. వరకట్నం ఇచ్చుకోలేక కూతురు మానాన్ని కూడా తాకట్టు పెట్టే వైనం. ఇవన్నీ శ్రమకు తగ్గట్టే విలువ లేని సమాజపు వికృత రూపాలు. వీటికి బలయిపోతున్నవాళ్ళంతా కింది వర్గానికి చెందిన శ్రామికులు. ఆ శ్రామికుల్లో ప్రధానంగా కనపడేది అత్యధికులు దళితులే. ఒక తండ్రీ – కొడుకు రాత్రీ పగలూ పనిచేసినా కుటుంబాన్ని పోషించలేకపోవడానికి గానీ, మరొక తండ్రీ, కొడుకూ, భార్యా కుటుంబమంతా పనిచేసినా కనీస అవసరాలే తీర్చలేని వాళ్ళు తమ పిల్లల పెళ్ళిళ్ళు చేయడానికి పడుతున్న దీనావస్థను కళ్ళకు కడుతున్నాయీ కవితలు.

"పొద్దుకాలమంతా వాళ్ళకే కదా పజ్జేసేది
కాసిన్ని గెంజినీళ్ళైనా పొయ్యమని అర్థించాడు
కట్టెలు కొట్టుకొస్తే పోస్తామన్నారు" (*బడిలో అమ్మ ఒడిలో...*)

పై కవితలో దార్ల తండ్రి శ్రమజీవితాన్ని వ్యక్తీకరించినప్పటికీ ఆ జీవితం తన తండ్రిదే కాదు. అది అశేష శ్రామిక తండ్రుల జీవితాన్ని తన తండ్రిలో చూసుకుంటున్నాడు. ప్రతి శ్రమజీవీ దళితుడు కాకపోవచ్చు. కానీ, శ్రమజీవుల్లోని అధిక సంఖ్యాకులంతా దళితులే. కవితలో "వాళ్ళకే" అనేది ఆధిపత్య కులాలను సూచించేమాట. అగ్రవర్ణ ఇళ్ళలో, కులాల్లో విధిగా వెట్టిచాకిరీ చేసే సాంప్రదాయం చరిత్రలో ఉంది. నేటి వ్యవస్థలో సామాజిక మార్పు కారణంగా ఒక కూలివాడు తన సేవను లేదా శ్రమను ఎవ్వరికైనా అమ్ముకోవచ్చు. తన శ్రమను అమ్ముకునే స్వేచ్ఛ లభించింది కానీ, శ్రమదోపిడీ నుండి బయటపడే స్వేచ్ఛ ఇంకా రాలేదు. గంజి బతుక్కీ, చాకిరికీని ముడిపెట్టిన ఆధిపత్యవర్గం గంజినీళ్ళు కూడా ఇవ్వకుండా శ్రమను దోచుకునే రోజులు దగ్గరపడుతున్నాయని గ్రహిస్తున్నది.

'*'కొట్టుకొస్తేపోస్తా'* అనే నిబంధన ఒక అగ్రవర్ణుడే కాదు; ఆర్థికంగా కరడుకట్టిన అంటే అగ్రవర్గంగా ఉన్న ఏ సమాజమైనా శ్రామికుడిపై ప్రయోగించే మాటలివే. దార్ల ఒక వైపు కుల స్పృహతో రాస్తూనే మరొక వైపు వర్గ సమస్యను ఏకరువు పెడుతున్నాడు. శ్రమదోపిడిని సూచించే కవితా ఖండికలు దార్ల కవిత్వం అనే చెట్టు ఆకుల చాటున ఫలాలు ఉన్నట్లు ఉంటాయి.

స్వాతంత్ర్యం వచ్చినా ఇతరుల జీవితాల్లో సాధించినన్ని మార్పులు దళితుల్లో కలగలేదు. దళితులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అణచివేతకు గురవుతూనే ఉన్నారు. 1968లో ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణాజిల్లా కంచికచర్లలో కోటేశు అనే దళితుణ్ణి దొంగతనం చేశాడనే నెపంతో అగ్రవర్ణభూస్వాములు సజీవదహనం చేశారు. 1983లో పదిరికుప్పంలోను దళితుల్ని కిరోసిన్ పోసి సజీవదహనం చేశారు. తాము మంచినీళ్ళు తాగే చెరువులో పశువుల్ని కడగొద్దన్నందుకు అగ్ర వర్ణ భూస్వాములు కారంచేడులో 1985, జూలై 16వ తేదీ రాత్రి దళితులపై దాడి చేసి ఎనిమిదిమందిని దారుణంగా చంపేశారు. 1987లో నీరుకొండలో, 1991లో చుండూరులోనూ అనేక మంది దళితులను హత్యచేశారు.

ఈ నేపథ్యంతో రాసిన కవితల్ని సేకరించి 1995లో జి.లక్ష్మీనరసయ్య, త్రిపురనేని శ్రీనివాస్ ల సంపాదకత్వంలో '*'చిక్కనవుతున్నపాట*' కవితా సంకలనం వెలువడింది. దీనితో తెలుగుసాహిత్యంలో దళితసాహిత్యం ఒక గొప్పస్థానాన్ని సంతరించుకుంది.

కుసుమ ధర్మన్న (1894–1948), గుర్రంజాషువా(1895– 1971), బోయి భీమన్న (1911–2006) మొదలైన తొలితరం దళిత రచయితలు గాంధీజీ ప్రభావంతో సంస్కరణోద్యమంలో భాగంగా దళిత సమస్య పరిష్కారమవుతుందని భావించారు. తర్వాత అది అసాధ్యమని రెండవ తరం దళిత కవులు గుర్తించి విప్లవ సాహిత్యంలో భాగస్వాములుగా ఉంటూ బొజ్జాతారకం, శివసాగర్, గద్దర్ మొదలైన వారు తమ సాహిత్య రచనల్ని కొనసాగించారు. అయినా, కులాన్ని ప్రధాన ఎజెండాగా తీసుకోని విప్లవపార్టీలతో ప్రత్యక్షంగా కొంతమందీ, పరోక్షంగా మరికొంతమంది విభేదించిన వారే మూడవతరానికి చెందిన దళిత రచయితలు. వీరు ఆత్మ గౌరవ నినాదంతో దళిత సమస్యలను సృజనీకరిస్తున్నారు. సంస్కరణవాదంతో మొదలైన దళితకవిత్వం ఆత్మగౌరవ నినాదంతో కొనసాగుతుంది. దార్లను మూడవతరం దళిత కవిత్వానికి ప్రతినిధిగా భావించాలి.

దళితులు కొద్దికొద్దిగా విద్యావంతులు కావడం, తమ సమస్యల మూలాల్ని గుర్తించి రాజకీయాధికారానికి ప్రయత్నించడానికి 1985లో ఉత్తర భారతదేశంలో బహుజన సమాజ్ పార్టీ స్థాపించడం, దాని ప్రభావం ఆంధ్రప్రదేశ్ లో కూడా కనిపించడం వంటి పరిణామాలన్నీ అగ్రవర్ణ భూస్వాముల్ని తీవ్రమైన నిర్ణయాలు తీసుకునేలా చేశాయి. నేనింతకు ముందన్నట్లు ఆ నిర్ణయాల ఫలితంగానే కారంచేడు నుండి లక్షింపేట వరకు అనేక సంఘటనలన్నీ జరిగాయి. దళితుల్ని భయపెట్టడం, అంతర్విభజనలకు ప్రోత్సాహమివ్వడం, ఆ సమస్యల్ని పరిష్కారం కాకుండా తమ రాజకీయాధికారాన్ని కొనసాగించడమనే పద్ధతులు కొనసాగుతూనే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ లో జరుగుతున్న దళిత అంత:సంఘర్షణను, ప్రాంతీయ ఉద్యమాలను ఈ దృష్టితో పరిశీలించవలసిన అవసరం ఉంది. తమ అంతర్గత సమస్యల్ని సత్వరం పరిష్కరించుకోవాల్సిన తరుణంలో దళితుల్లోని కొన్ని ఆధిపత్యవర్గాలు "అగ్రవర్ణ" స్వభావంతో వ్యవహరిస్తున్నాయి. దీని వల్ల సామాజిక ఉద్యమంగా మొదలైన ఎస్సీ వర్గీకరణోద్యమం సాహిత్యంలో మాదిగ సాహిత్య నిర్దిష్టతకు మార్గం వేసింది. ఈ పరిణామాలన్నీ దార్ల కవిత్వంలో ప్రతిఫలించాయి.

దార్ల నెమలికన్నులు :

ఆలోచనకీ, అనుభవానికీ, ఆచరణకీ అవినాభావ సంబంధాన్ని చూడగలిగే కవితా సంపుటి ఈ నెమలికన్నులు. దార్ల గత మూడు దశాబ్దాల నుండీ రాస్తున్న కొన్ని కవితల్ని, అందులోనూ, దళిత జీవిత పరిణామ గమనాన్ని గుర్తించి వాటిని ప్రచురించిన పుస్తకమిది. *"నెమలికన్నులు"* అనగానే బాల్యస్మృతులు అని వెంటనే చాలామందికి స్ఫురిస్తుంది. కానీ, ఈ బాల్యస్మృతులెవరివి? కేవలం ఈ కవివేనా? కాదనిపిస్తుంది. ఈ కవిత్వం చదువుతున్నవాళ్ళందరిదీ అనిపిస్తుంది. ఈ కవితలన్నీ దళితుని జీవితంలోని అనేక ఘట్టాల్ని పొరలుపొరలుగా పట్టిచూపిస్తాయి. పుట్టినప్పుడు, బడిలో చేరిన తర్వాతా, స్నేహితులతో ఆడిపాడే వయసులో, యువకుడిగా అప్పుడప్పుడే ఉడుకురక్తంతో ముందడుగేస్తున్న ఆలోచనలు, నలుగురితో కలిసిమెలిసి ఉండేటప్పుడు ఎదురయ్యే భావజాల సంఘర్షణలు, కలిసుండాలన్నా కలవనివ్వని సమాజంతో తప్పనిసరై చేయాల్సిన పోరాటాలు, ఆ పోరాటాల్లో అసువులు బాసేవాళ్ళ పట్ల ప్రేమాభిమానాలెన్నో ఈ కవిత్వంలో అరలు అరలుగా ఒదిగిపోతాయి. కవితలుగా విడివిడిగా ఉంటూనే దళిత జీవితాన్ని పట్టినడిపించే ఏకసూత్రతాంశాలెన్నో ఈ కవితా సంపుటి నిండా పరుచుకున్నాయి.

"ఈ కులంలో పుట్టకపోతే
నేనూ ఇంకొకలా ఆలోచించేవాణ్ణేమో
ఈ కులంలో పుట్టటమే మంచిదయ్యింది
అవమానమంటే అర్థమైంది
అందర్నీ ప్రేమించడమూ తెలిసింది"
(బడిలో అమ్మ ఒడిలో...)

పుట్టుక మనిషి అస్తిత్వాన్ని నిర్ణయిస్తుంది. ఆ మనిషి పుట్టిన తర్వాత ఆ పరిస్థితులే మనిషి ఆలోచనల్ని ప్రభావితం చేస్తుంటాయి; ఆ పరిస్థితులు ఆ మనిషి పుట్టకముందే నిర్ణయమైనప్పటికీ, వాటిని మనిషి పుట్టిన తర్వాతైనా సరిచేసుకోవడానికి ప్రయత్నించాలని భావిస్తూ ఈ కులంలో పుట్టడం వల్లే "అందర్నీ ప్రేమించడం తెలిసింద"ని అంటాడు కవి. గాయమైనవాడికే బాధ తెలుస్తుంది. వేదనకు గురైనవాడికే వ్యథ తెలుస్తుంది. ఈ గాయమూ, వేదనలు "కులం" వల్ల కలగడం

అత్యంత విషాదకరం. ఎందుకంటే, ఒకకులంలో పుట్టిన వ్యక్తిని జీవితాంతం ఆ కులం వెంటాడుతుంది. అందుకే చారిత్రకంగా చూస్తే అనేకవందల సంవత్సరాల నుంచీ కులం చేసిన గాయాలనుండి దళితసాహిత్యం పుట్టిందనీ, దళితకవిత్వం మానవుల్ని ప్రేమించడాన్ని, మానవుల మధ్య ఉండాల్సిన అనుబంధాల్ని గుర్తుచేస్తుందీ ఈ కవిత.

దళితులకు కలిగే అవమానాలన్నీ ప్రధానంగా కులాన్ని ఆశ్రయించుకొని ఉంటాయి. ఏ దళితకవి రాసిన కవితను చూసినా ఆ కవితలో మరోదళితుని జీవితం కూడా ప్రతిబింబిస్తుంది. ఆ కవితను చదువుతున్న పాఠకుడు తన జీవితాన్నే తాను చదువు కుంటున్నట్లు భావిస్తుంటాడు. ఈ కవితా సంపుటిలో అటువంటి కవితా ఖండికలెన్నో ఉన్నాయి. అందరిలా చదువుకోవాలని దళితుడికీ ఉన్నా దళితునికి అనేక వందల సంవత్సరాల పోరాటాల ఫలితంగా గానీ చదువుకొనే హక్కు లభించలేదు. తీరా ఆ హక్కు సాధించినప్పటికీ ఏవో అరకొర సదుపాయాలతో కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవడానికైనా అవకాశం లభించింది. అయితే, అక్కడ బోధించే అనేక పాఠాలు కొన్ని కులాలకోసం మాత్రమే రాసినట్లుంటాయి. అవి పసిమనసుల్ని గాయాలు చేస్తుంటాయి. అవి దళితుల్ని మరీ మనోవ్యథకు గురిచేస్తుంటాయంటాడు కవి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలంతా ఇంచుమించు దళితులే. పెత్తందారీ పిల్లల పాఠాలు వేరు పాఠశాలలూ వేరు. దళిత పిల్లలకు కలిగే అనుభవం కాన్వెంటు పోరలకు ఉండదు.

"ప్రాచీన సాహిత్యం పాఠమైనప్పుడల్లా
నా ముఖకవళికలన్నీ మారిపోయేవి
బయటపడకూడదనో
పారిపోవాలనో
బహిష్కరించాలనో
అనుకుంటుండేవాణ్ణి
మూకుమ్మడిగా కళ్ళన్నీ నా పైనేఫోకస్!"

(బడిలో... అమ్మ ఒడిలో...)

ఈ కవితా ఖండికలో దళిత విద్యార్థి మానసికస్థితిని కవి అద్భుతంగా ఆవిష్కరించాడు. తెలుగు సంప్రదాయం లేదా ప్రాచీన సాహిత్యంలోని కొన్ని భాగాల్ని ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత పాఠశాలలు, కళాశాల, విశ్వవిద్యాలయాల స్థాయిల్లో నిర్బంధ పాఠ్యాంశాలుగా నిర్ణయిస్తున్నారు. కులం ప్రస్తావన లేకుండా ఈ సాహిత్యాన్ని అధ్యయనం చేయడం దాదాపు అసాధ్యమే అని చెప్పొచ్చు. పుట్టుకతోనే కొన్ని కులాలు ఉత్తమమైనవనీ, మరికొన్ని నీచమైనవనే భావనలు పసిపిల్లల మనసుల్లో గాఢంగా ముద్రవేయడానికి ఇలాంటివి కూడా దోహదపడుతుంటాయి. అందుకే ప్రాచీన సాహిత్య పాఠం వింటుంటే ఆ చిన్నవయసులో విద్యార్థుల్లో కలిగే అలజడిని గొప్ప నైపుణ్యంతో ఆవిష్కరించాడు కవి. చిన్ననాటి నుండే ఎదురైన అనుభవాల వల్ల కలిగిన హేతువాద భావాలు, మూఢత్వంపై నిరసనతో మాత్రమే కవితను ముగించలేదు. దానిలోనే పరిష్కారాన్ని కూడా అందించాడు కవి. ప్రత్యామ్నాయ పాఠ్యాంశాల్ని ప్రవేశపెట్టాలని "దళిత తాత్త్వికుడు" కవితాఖండికలో ఇలా ఆకాంక్షించాడు.

"ఆధిపత్యపోరులో
భావజాలంతో పాటు
నా భాషా జీవం కోల్పోతున్నప్పుడల్లా
కంపల్సరీ క్లాసికల్ సబ్జెక్టులా చేసైనా సరే
సోషియోలింగ్విస్టిక్స్ క్లాస్ చెప్పాలనిపిస్తుంది"

"ఇక్కడ క్లాసికల్ లిటరేచర్‌ని కంపల్సరీ చేసి చెప్పడాన్ని పరోక్షంగా నిరసిస్తూనే అవసరమైనవాటిని నిరాకరిస్తున్నారనే ధ్వనిని వ్యక్తం చేశాడు కవి. నాకు తెలిసినంత వరకు, ఈ కవి సెంట్రల్ యూనివర్సిటీలో అధ్యాపకుడుగా చేరేటప్పటికి "దళిత సాహిత్యం" అని గానీ, "దళిత స్టడీస్" అనే పేర్లతో గానీ కొన్ని ప్రత్యేక కోర్సులుగా లేవు. తొలిసారిగా తెలుగు డిపార్టుమెంటులోనే 2005 లో దళిత సాహిత్యం ఒక ఐచ్ఛిక పాఠ్యాంశంగా ప్రవేశపెట్టారు. ఈకోర్సుకి రూపకల్పన చేసి, కొత్తకోర్సు పెట్టాలని కోరుకున్నది ఈ కవే కావడం, తన కవిత్వంలో ఏనాడో ప్రతిపాదించిన ప్రత్యామ్నాయాన్ని ఆచరణలో కనిపించేలా చేయడం గొప్ప విషయం. బహుశా, ఆ ఆకాంక్ష వల్లనేనేమో, ఈ కవి తాను అసిస్టెంటు ప్రొఫెసరుగా చేరగానే హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీలో 2005 నాటికే ఎం.ఏ., తెలుగులో "దళిత సాహిత్యం"

ఒక ఐచ్ఛిక పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాడు. ఆ తర్వాత సెంట్రల్ యూనివర్సిటీలో ఇన్‌క్లూజివ్ అండ్ ఎక్స్ క్లూజివ్, దళిత్‌స్టడీస్, ఆదివాసీ – దళిత్‌స్టడీస్ మొదలైన పేర్లతో ప్రత్యేకించి సెంటర్స్ ఏర్పడ్డాయి. వీటితో పాటు చాలా డిపార్టుమెంట్స్ లో దళిత్ స్టడీస్ ని ఒక పాఠ్యాంశంగా ప్రవేశపెట్టారు. ఇవన్నీ ప్రస్తావించడమెందుకంటే సాధారణంగా కవిని దార్శనికుడని అంటారు. అధ్యయన కేంద్రాల్లో దళిత సబ్జెక్టను కోర్సులుగా మలిచి దిశా నిర్దేశం చేసిన దార్ల దార్శనికుడే. ఈ కవిత్వంలో ఆ దార్శనికత కనిపిస్తుందని చెప్పడమే దీని ఉద్దేశం.

దళితుడు తన కులం గుర్తింపుతోనే బతకాలని ఆశించడు. సమాజం బలవంతంగా ఆ కులం ముద్రవేస్తుంది. కొన్ని కులాలవాళ్ళైతే స్వేచ్ఛగా తమ కులాన్ని చెప్పుకుంటారు. రాసుకుంటారు. అది వాళ్ళకి సమాజంలో గౌరవాన్నిస్తుంది. దళితుడి పరిస్థితి దీనికి భిన్నంగా ఉంటుంది. అందుకే దళితులు తమతో పరిచయమైన కొత్తవాళ్ళతో గానీ, అంతకు ముందే పరిచయమై, తమకులం తెలియనంతవరకు మాట్లాడేటప్పుడు కూడా తమకులాన్ని చెప్పుకోవడానికి ఇష్టపడరు. అదే దళితేతర కులాలవాళ్ళలో చాలామంది ఇతర కులాలవాళ్ళని నిందిస్తూనో, తమకులాన్ని ముందే గొప్పగా చెప్పుకొనో తమ సంభాషణలు కొనసాగిస్తుంటారు. అలాంటి పరిస్థితిలో దళితుడి మానసికస్థితి ఎలా ఉంటుందో ఈ సంపుటిలో గల రెండుమూడు కవితా ఖండికల్లో వర్ణించాడు కవి. *"ఒక మౌనం మాట్లాడి మనసుని దహించేస్తుంటే*

మరొక మౌనం ఘనీభవించి
నన్నే అనిశ్చిత లోయలోకి తోసేస్తుంది!
నా శరీరంలో నాది కాని ప్రాణం చేసే స్వారీకి
ఇంకెంత కాలమిలా అలసిపోవాలి?" (ఎంతకాలమిలా...!)

ఎప్పుడూ మనిషి తనచుట్టూ చక్కని వాతావరణం ఉండాలని కోరుకుంటాడు. అది ప్రకృతి మాత్రమేకాదు; మానవ సంబంధాల్లో కూడా ఆ ఆహ్లాదకర వాతావరణ ఉండాలనుకుంటాడు. అటువంటి మానవుల మధ్య జరిగే సంభాషణలు కూడా అంత ఆహ్లాదకరంగా ఉండాలి. మన సంభాషణల్లో కులం, మతం, వర్ణం, వర్గం, లింగం, ప్రాంతం, భాష వంటివెన్నో వస్తుంటాయి. వీటిపట్ల అందరికీ ఒకేరకమైన

అభిప్రాయాలు, అనుభవాలు ఉండాలనేమీలేదు. వాళ్ళ వాళ్ళ జీవిత నేపథ్యాల నుండి ఆ ఆనుభవాలు వస్తుంటాయి. ఆ సంభాషణల సందర్భంలో కొన్ని గొప్పవీ, మరికొన్ని అల్పమైనవీ అనే భావనలు కొంతమంది మనసుల్ని తీవ్రంగా బాధిస్తుంటాయి. వీటిని గమనిస్తూ మన సంభాషణలు కొనసాగించాలి. ఎదుటివాళ్ళపై ఆధిక్యాన్ని చెలాయించాలనో, అధికులుగా నిలబెట్టాలనో ప్రయత్నించే వాళ్ళూ ఉంటారు. వాళ్ళ వల్లే ఈ మానసిక వ్యథలు, కథలు. వీటిని గుర్తెరిగి ప్రవర్తించాలనే సంఘర్షణతో కూడిన చిక్కని కవితా పాదాలివి. తమ తమ సమస్యలకోసం తమవాళ్ళే కలిసినప్పుడు మనసు విప్పి మాట్లాడుకోవాల్సిన సమయంలో మాట్లాడుకోకపోతే కూడా ఆ సమస్యలు అపరిష్కృతంగానే ఉండిపోతాయి. అది ఆత్మ వంచనవుతుందని అంటాడు కవి.

‘‘మనం కలిసినప్పుడల్లా,
స్వచ్ఛంగా మాట్లాడేసుకోవాలనుకున్నా
కళ్ళనిండా కాంతిని నింపేసుకోవాలనుకున్నా
బాధలన్నింటినీ కలిపి
ఓ పాత్రలో నింపేసుకోవాలనుకున్నా
ఏదో అడ్డొస్తూ
మనం లోతుల్ని తాకని మరేవో కబుర్లతో
కాలాన్ని స్వారీ చేయిస్తుంటాం!
యాంత్రిక సంభాషణల్తో నడిచిపోతుంటాం!! ’’
(ఒంటరిగా బద్దలౌతూ...!)

ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సమస్య ఉంటుంది. ఆ సమస్యలతో బాధపడే వాళ్ళు వాటిని బయటపెట్టి పరిష్కారాలకు ప్రయత్నించాలి. ప్రపంచవ్యాప్తంగా శాస్త్ర, సాంకేతికరంగాల్లో విప్లవాత్మకమైన మార్పులొస్తున్నాయి. కమ్యూనికేషన్ వ్యవస్థలో మరింత ముందుకెళుతున్నాం. దీనిలో భాగంగానే ఇంటర్నెట్ వ్యవస్థ వచ్చింది. ఇది ఖచ్చితంగా అభివృద్ధిగానే చెప్పుకోవాలి. దీన్ని ఆసరాగా చేసుకొని ఈ మధ్యకాలంలో పుస్తకాలన్నీ డిజిటైజేషన్ చేస్తున్నారు. ఇప్పటికే కేవలం కొన్ని పుస్తకాలు, పత్రికలు ఇ-ఫార్మేట్‌లో మాత్రమే “జర్నల్స్”గా వెలువరిస్తున్నారు.

కాగితం ఖర్చు తగ్గించడం, పర్యావరణాన్ని కాపాడ్డం, అన్నింటికంటే కోరుకున్నది, కోరుకున్నప్పుడు అందుకోవడమనేది డిజిటైజేషన్ ద్వారా సాధ్యం చేస్తామంటున్నారు. ఇప్పటికే పాత, కొత్త పుస్తకాలన్నీ "అందరికీ" అందుబాటులోకి తేవాలనే ఆలోచనతో ఈ డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతమైంది. ఇది మంచి ఆలోచనే. కానీ, నేటికీ కనీససౌకర్యాలు లేని గ్రామాలెన్నో ఉన్నాయి. వాళ్ళంతా చిన్నదో పెద్దదో ఓ గోడల ఇళ్ళో, పూరిగుడిసో కట్టుకుంటే వాటికి ప్రభుత్వం పన్నువేస్తుంది. ఆ పన్నుతో పాటు గ్రంథాలయ పన్నుకూడా కలిపి వసూలు చేస్తుంది. మరి వాళ్ళకి తాము వసూలు చేసిన పన్నుల్లో కనీసం కొంతైనా గ్రంథాలయాలకు కేటాయించాలి కదా?

అసలు గ్రంథాలయాలున్న గ్రామాలెన్ని? ఉన్న గ్రంథాలయాల్లో తాము వసూలు చేస్తున్న డబ్బులో కేటాయిస్తున్న దెంత? అనే ప్రశ్నలొకవైపు పుట్టుకొస్తుంటే, ఉన్న గ్రంథాలయాల్నే మూసేస్తున్నారనీ, కనీసం పత్రికలు కూడా కొనడంలేదనీ గగ్గోలు పెడుతున్నవాళ్ళు మరికొంతమంది. అన్నీ ఇంటర్నెట్‌లోనే చదువుకోండనే ప్రభుత్వ విధానాలు. ఇంకా అక్షరం ముక్కకే దగ్గరకాని గ్రామీణులకు, దళితులకు అవన్నీ ఏవిధంగా అందుతాయని ప్రశ్నిస్తూ."కూలుతున్న గ్రంథాలయం" కవితలో ఇలా అంటాడీ కవి.

> "తొందరగా ఏదో ఒకటి చెయ్యాలి
> *రిక్టారు స్కేలు మీద ప్రమాద సూచికలు*
> *ఇంటర్నెట్ ప్రకంపనల్తో*
> *గ్రంథాలయ గోడల్లో పగుళ్ళు...*
> *పుస్తకాలన్నీ డిజిటైజేషన్ చేసినంత మాత్రాన*
> *ముద్రిత పుస్తకాలన్నీ పూడ్చేయడమేనా?*
> *ఇంకా అక్షరమే తెలియని వాళ్ళ*
> *చేతికి మౌస్ నిస్తారట!*
> *మరో మిలీనియం దాకా వెతికినా*
> *నాకిక అక్షరం ముక్క మళ్ళీ కన్పించనివ్వరేమో!!*
> *ప్రతీదీ అంతర్జాలంలోనే చూసుకోవాలట*
> *ఇక అరచేతిలోనే స్వర్గం*

ఇంటర్నెట్ ఓ మోహినీ
అమృతానికి ఇక అవతలుండాల్సిందేనేమో!"
(కూలుతున్న లైబ్రరీ)

ప్రపంచీకరణ పేరుతో దళితుల్ని మళ్ళీ మోసం చేసే ప్రయత్నాలు మొదలైయ్యాయని ఈ కవిత చెప్తుంది. అన్నీ ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉండగా మళ్ళీ ముద్రిత పత్రికలు, పుస్తకాలెందుకని అనడంలో మోసం ఉంది. ఇంటర్నెట్‌లో పత్రికలు చదువుకోవాలంటే ఖర్చుతో కూడిన పని. అంతేకాకుండా, వాటిలో పెట్టే పత్రికల్లో స్థానిక వార్తలకు ప్రాధాన్యాన్నివ్వరు. రకరకాల ఫార్మేట్స్‌లో ఆ పత్రికల్ని పెడుతుంటారు. ఒకరు పి.డి.ఎఫ్.లో పెట్టచ్చు, మరొకరు యూనికోడ్‌లో పెట్టొచ్చు, ఇంకొకరు తామే తయారు చేసిన సొంత ఫాంట్సుతో కూడిన ఫార్మేట్సులో పెట్టొచ్చు. ఇంకా జె.పి.జి. ఫార్మేట్లోనో, వాయిస్ ఫార్మేట్లోనో... ఇలా రకరకాలుగా పెట్టొచ్చు. వీటిని విద్యావంతులైనవాళ్ళు కూడా అందుకో లేకపోతున్నారు. గ్రామీణులు,తరతరాలుగా అక్షరాలకు దూరంగా వెళ్ళగొట్టబడిన దళితులు వాటినెలా అందుబాటులోకి తెచ్చుకోగలుగుతారు? ఇక, ఆన్‌లైన్‌లో పత్రికలు, పుస్తకాలు కొనుక్కొనో, డౌన్‌లోడ్ చేసుకొనో ఇప్పుడిప్పుడే అక్షరాస్యులవుతున్న దళితులు ఇంటర్నెట్‌లోనే చదువుకోవడం ఇంత త్వరగా జరిగేపనేనా? అందుకే ఈ డిజిటైజేషన్ పేరుతో గ్రంథాలయాల్ని మూసేయడం మంచిదికాదంటూనే, దాన్నొక "మోహిని"గా పోలుస్తున్నాడు కవి. సాగరమథనం జరిగినప్పుడు అమృతం కంటే ముందు అనేకం పుట్టుకొచ్చాయనీ, చివరికి అమృతం కూడా వచ్చిందనీ, దాన్ని దేవతలకు అందకుండా రాక్షసులు లాగేసుకున్నారనీ, ఆ సమయంలో విష్ణువు మోహినీరూపం ధరించి అలా వ్యవహరించాడనీ భారతీయ పురాణాలు చెప్తుంటాయి. ఆ పురాణాల్లో అమృతాన్ని పంచేటప్పుడు మోహినీ రూపంలో తన అందచందాల్ని చూపి ఒకవర్గానికే దాన్ని అంతటినీ అందేలా చేసినట్లే, నేడు ఇంటర్నెట్, డిజిటైజేషన్ పేరుతో విజ్ఞానాన్ని అంతటినీ కొన్ని వర్గాలకే అందుబాటులో ఉంచే ప్రయత్నం జరుగుతుందంటాడు కవి. దీన్ని చెప్పడానికి "మిథోపోయి" అనే కవిత్వ నిర్మాణాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకున్నాడు కవి. పురాణగాథలను కవిత్వంలో చెప్పటాన్ని Mythopoe అంటారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల్లోనే కాదు, యావత్తు భారతదేశంలో జరుగుతున్న సామాజిక ఉద్యమాలను గమనించడానికీ, అదీ దళిత సమస్యలపై జరుగుతున్న పోరాటాలను గమనించడానికి ఈ కవితాసంపుటి చక్కని అవకాశాన్నిస్తుంది. సుమారు మూడుదశాబ్దాల భారతీయసమాజంలోని అనేక పార్శ్వాలను ఈ కవితల ద్వారా గుర్తించవచ్చు. అందుకే ఇది చదవదగ్గ కవిత్వం అంటున్నాను. చదివితీరవలసిన కవిత్వంగా భావిస్తున్నాను. ఈ కవిత్వాన్ని చదవమనీ, దళితానుభూతిని ఆస్వాదించమనీ మీ అందరినీ ఆహ్వానిస్తున్నాను.

❖ ❖ ❖

బడిలో... అమ్మ ఒడిలో...!

ఈ కులంలో పుట్టకపోతే
నేనూ ఇంకొకలా ఆలోచించేవాణ్ణేమో
ఈ కులంలో పుట్టటమే మంచిదయ్యింది
అవమానమంటే అర్థమైంది
అందర్నీ ప్రేమించడమూ తెలిసింది

ప్రాచీన సాహిత్యం పాఠమైనప్పుడల్లా
నా ముఖకవళికలన్నీ మారిపోయేవి
బయటపడకూడదనో
పారిపోవాలనో
బహిష్కరించాలనో
అనుకుంటుండేవాణ్ణి
మూకుమ్మడిగా కళ్ళన్నీ నాపైనే ఫోకస్!
ఎన్నిసార్లు చంపుతావంటూ
దేవుణ్ణే కాలర్ పట్టుకోవాలనిపించేది!!

నాకు తెలీదు
అమ్మ గర్భంలోనైనా
అవమానాలకి దూరంగా ఉన్నానో లేదో...!
అయ్యక్కాలుమీద మచ్చెలా వచ్చిందని

ఈ మధ్యనే అమ్మనడిగితే
ప్రశ్నించడం నేర్చుకుంటున్నాడేమవుతుందో
అనుకుంటూ తడబడుతూనే చెప్పింది...
"*నువ్వు కడుపులో వుండగా*
పెద్ద తుఫానొచ్చింది
ఊళ్ళోవాళ్ళంతా వెళ్ళిపోయారు పెద్దోళ్ళింటికే!

నేనూ కడుపీడ్చుకుంటూ
కాసింత చోటిమ్మని బతిమాలాను
మైలపడిపోతే
చచ్చిపోతామంటూ
లోనికేకాదు
పంచక్కూడా చేరనివ్వలేదు.
రివ్వు రివ్వున గాలి
పెద్ద పెద్ద ఉరుములు

హోరు హోరున వర్షం
ఎప్పుడేమవుతుందో ఎవరికీ తెలీదు
కూకటివేళ్ళతో కూలిపోతున్నా
ఆ చెట్లే దిక్కయ్యాయా రెండ్రోజులూ!

తుఫాను వెలిసిన మర్నాటికి
ఆకలితో నకనకలాడి కళ్ళుతిరిగి పడిపోయాను
నిండుచూలాల్ని బతికించమని ప్రాధేయపడుతూ
'పెద్దోళ్ళింటి' కే మళ్ళీ వెళ్ళాడు మీ అయ్య
పొద్దుకాలమంతా వాళ్ళకే కదా పన్జేసేది!

కాసిన్ని గెంజినీళ్ళైనా పొయ్యమని బతిమాలాడు
కట్టెలు కొట్టుకొస్తే పోస్తామన్నారు
ఖాళీకడుపుతో తూలిపడుతున్నా
కట్టెలతోపాటు
గాటు పెట్టుకునైనా
కాసిన్నైనా గెంజినీళ్ళైనా సంపాదించాడు!

గుక్కెడు మాత్రమే గుటకేశాను
కడుపులో ఇమడలేదు
మీ అయ్య రుచిచూస్తే తెలిసింది
పెద్దోళ్ళు పోసింది బియ్యం కడుగేనని!"

ఇంకెన్ని గుండెల్లో దాచుకున్నారో
గుచ్చి గుచ్చి అడిగితేతప్ప
చెప్పరెప్పుడూ నాకు !
ఈ కులంలో పుట్టడమే మంచిదయ్యింది
ఈ కులంలో పుట్టకపోతే
మనుషుల్ని ప్రేమించలేకపోయేవాణ్ణేమో!
అవమానాలకు తట్టుకోలేక
దురాగ్రహం పట్టలేక
హత్యలెన్నింటినో చేసేవాణ్ణేమో!!

❖ ❖ ❖

(కడుపుమీద కొట్టకుండ్రి : 2001,
మీ బోనులో మరో సింహం : 2008, కైతునకల దండెం : 2008)

మా వూరు నవ్వింది

కథల్లోనో, టీవీల్లోనో, సినిమాల్లోనో
పచ్చని పొలాల్ని చూసినప్పుడల్లా
మాయమ్మ, మా అయ్యలతో కలిసి
పురుగుల్నీ, పాముల్నీ లెక్కచేయకుండా
రాత్రుల్ని ఎన్నింటినో లాంతరు బుడ్డుల్తో
పగటిగా మార్చుకుని
గుల్లల్తోనూ,
గూడల్తోనూ,
నీటి చుక్కల్నే తడుపుకున్న నా కళ్ళల్లో
ఆ పాత దృశ్యాలేవో పలకరించి పోతుంటాయి.
ఆ గాయాల చేతుల్తోనే కారం పచ్చడి నూరుతూ
మా కళ్ళకు కనిపించకుండా
మా అమ్మ పడిన బాధంతా గుర్తొచ్చి
అన్నం తినడం అమాంతంగా ఆపేస్తుంటాను
నిస్సహాయతతో నాలోకి నేనే ఉండగట్టికిపోతుంటాను
హుస్సేన్ సాగర్, గండిపేట, హిమాయత్ సాగర్...
ఏ నీటి గలగలల్ని చూసినా
మా వూరిలో ప్రవహించే కాల్వలే నా కళ్ళల్లో...!

గోచి పెట్టుకునో
చిరిగిపోయిన లాగు కట్టుకునో
తుప్పల్ని నరికి నరికీ
పూడికల్ని తీసి తీసీ
వంపు సొంపుల్తో వయ్యారాల్ని నేర్పి నేర్పీ

కిల కిల నవ్విస్తూ,
పంట చేలల్లోకి ప్రవహింపజేసిన ఆ కాల్వలే నా కళ్ళల్లో...!

అందరూ ఊరుని గొప్పగా కీర్తిస్తుంటే
నాకు మాత్రం
మరేదోలా వర్ణించాలనిపిస్తుందెందుకో!
నా యీడు పిల్లలంతా
బళ్ళో కేరింతలు కొడుతుంటే
గుడి గుడి కుంచాలాడుతుంటే
కొమ్మల రెమ్మల్లో కోతికొమ్మచ్చాట్లాడుతుంటే
నేనూ వాళ్ళతో కలవాలనుకున్నాను

ఇంతలోనే ఎవరో దొంగ దూరాడన్నారు
నన్ను తరుముకొచ్చారు
నా ఒళ్ళంతా రక్తం కారేలా కొట్టారు
దిక్కున్నోళ్ళతో చెప్పకోమన్నారు
దిక్కులన్నీ పిక్కటిల్లేలా ఏడ్చాను
అమ్మ కన్నీళ్ళ సంద్రమైంది
అయ్య కళ్ళల్లో ఎర్ర సూర్యుళ్ళను చూశాను
అవన్నీ ఊరు కట్టుబాట్లముందు
దిగతుడుపై పోయాయ్!
ఒక నిస్సహాయతో, ఒక మహా నిరసన
వాళ్ళ గొంతుల్లో ధ్వనించింది
వాళ్ళ చేతల్లో కనిపించింది
వాళ్ళ కళ్ళల్లో నిప్పులై కురిసింది
"మనం సదూకోకూడదంటే యిన్నేందిరా
మనమూ సదూకొనే రోజుల్రాకపోవు లేరా'

భయపెట్టే గ్రామ పెత్తందారీతనం
మా అమ్మా, అయ్యల గొంతుల్లో
ఆవేదన జీరకు
సజీవ సాక్ష్యాలుగా నాకనిపించే
మా వూరి పాఠశాల,
మా వూరి పశువుల పాకలు!

నన్నో కులం గుంపులోనో
నన్నో దొంగ ఓటరుగానో
అక్రమ కేసులు బనాయించిన నేరస్తుడిగానో
అవసరానికో చలిమిడి ముద్దగా చేసుకునే
మా వూరు నన్ను చూసి నవ్వింది!

తప్పనిసరి పరిస్థితుల్లో
మా అయ్యే కత్తిరింపు వెయ్యడం వల్లనో
మా అమ్మే బట్టలన్నీ మల్లె పువ్వుల్లా ఉతకడం వల్లనో
ఇంటిపనీ, పంటపనీ చేయడం వల్ల వచ్చిన నిగారింపు వల్లనో
పక్షుల కిలకిలరావాలు
నామాటల్లో పలకడం వల్లనో
నిలువెత్తు మనిషిగా
నిలబడిన నన్ను చూసి
మా వూరు నవ్వింది!

అమ్మ, అయ్యలు
చెట్టెక్కో, పుట్టెక్కో
పట్టెడన్నంతో పాటు
గుప్పెడు అక్షరాల్నీ నింపడంతో

ఊరు అర్థం చేసుకోలేనన్ని
డిగ్రీలు ప్రేమించిన నన్ను చూసి
మా వూరు మళ్ళీ నవ్వింది!

అయినా... మా వూరిని నేను మరిచిపోలేను
అక్కడక్కడా
రహస్య ద్వారాల రాగబంధాలుంటాయి కదా!
వాటిని బహిరంగ రహదారులుగా మార్చేందుకే
మళ్ళీ... మళ్ళీ... మా ఊరికే నా ప్రయాణం!

❖ ❖ ❖

(ఆదివారం ఆంధ్రజ్యోతి అనుబంధం: 20 ఆగస్టు 2000
రంజని వారి 'మా ఊరు' కవితా సంకలనం)

నభూతో నభవిష్యతి

పొద్దు
నడి నెత్తినైనా దాటకుండానే
జీవితంలో
సంధ్య మసకలు
దారి పొడవునా
పెదవి దాటని పన్నీటి జల్లుల
ఆలింగన మరకలు!
అలంకరించబడి
నట్టింట్లో అమరిన డస్ట్ బిన్
సీటు పక్కనే లిప్తకాలం
సింహదరహాసమయ్యే కుక్కపిల్ల
నన్ను చూసి
పగలబడిన నవ్వు!
మోసగించటమో
మోసగించబడటమో
బతుకు బంగారు బాటకు నిర్వచనమేనా...?

నవ్వుతూ నరకాన్నైనా
ముద్దుపెట్టుకోవడం నయంకదూ!
జీవనచౌరస్తాలోకొచ్చిన కొత్తలో
వెలుగులు విరజిమ్మిన వసంతం
ఇంతతొందరగా
భవిష్యత్తు మొగ్గల్ని చిదిమేసి

శిశిరమైన చీకటి అవతారం!
రంగుల ప్రపంచం
అద్భుతమైన రూపం
వికృతమై వెక్కిరిస్తూ
రక్తసిక్తమైన కాన్వాస్!

పరాయి మెచ్చుకోలు దాహం తీర్చుకోవడానికే
ఎండమావుల్లో
నిస్సత్తువ్వయ్యేంతవరకూ పరుగు!

కనిపెంచిన ఇన్నేళ్ళ తల్లికి
ఊతమై నిరీక్షిస్తున్న ఆశల కర్రను కాల్చే
పిడుగుపాటు కానుక
గర్భశోకం!!

❖ ❖ ❖

(ఆదివారం ఆంధ్రభూమి అనుబంధం: 18 జూన్ 2000)

ఎక్సరే రిపోర్ట్!

అద్దం ముందు నిలబడిన నిజం
ఎక్సరే తీసి నన్నెగతాళి చేస్తుంది
రమ్మని ఎన్ని సార్లు రాసినా
ఇంటికెళ్ళి మళ్ళీ తియ్యని మాటలతో
జీవరహిత ముఖం చూపించడానికిష్టం లేకనే
బిజీ వేషం!

ఉత్తరం రాయడం నేరమే
అబద్ధాల్ని అందంగా పోస్టుచేసి
భ్రమల్ని పెంచుకునేలా చేసే
ఉత్తరం రాయడం నేరమే!

కానీ...
రోజూ ఉత్తరానికెదురు చూసే చూపులకి
పోస్టుమ్యాన్‌కైనా
తానే ఓ ఉత్తరం రాయాలనిపించదూ...
ఉత్తరం రాయకుండానే
రోజూ ఉత్తరానికెదురు చూసే నాకు
పోస్టుమ్యాన్ నిట్టూర్పులే సజీవ సాక్ష్యం!
అయినా...అబద్ధాల్ని అందంగా పేర్చేసి
హఠాత్తుగా
ఫిరంగినెప్పుడో పేల్చేయడమెంత నేరం!
నగర వీధుల్లో నేను

నాకు నేనే మోసం
శోధనో... పరిశోధనో...
వినయం బానిసత్వమైతే
జీవితం మోయలేనంత బరువు!

క్యాజువల్ లైఫ్...
ఆకాశవాణి నా ఆశాగానంలో
చైతన్య ప్రబోధమో
శృంగారాన్నొలక బోసే యుగళగీతమో
నిరాశను గొంతులోనే దాచుకుంటూ
క్యా చేసెయ్యాలి!

అద్దం ముందు నిలబడిన నిజం
ఎక్సరే తీసి నన్నెగతాళి చేస్తుంది!
గర్భంలో రూపింపక మునుపే
నన్నెరిగిన దేవుడా!
లోకానికిన్ని నమూనా పాత్రలవసరమా?
విషాదమెంత తియ్యగా మారిపోయింది
ఇక చెలమను మూసెయ్యలేను
పాదరసమట్టం పైకొచ్చేసి గాజునాళం పగిలిపోయినా సరే!

❖ ❖ ❖

(ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక: ఆగస్టు 2001)

అంతర్జాతీయ మార్కెట్లో పవిత్ర ప్రేమ!

ఇంకా నెలలు పూర్తిగా నిండక మునుపే
ప్రపంచంలో పడిన సంబరంతో
సంకన సంచి తగిలించిన మరుక్షణమే
నా చేతిలో...
పిచ్చుకకు రాబందుల రెక్కలొచ్చిన సమాచారం!

నమ్మకం నరక బడుతున్నట్లు
నన్నొదిలి ఎగిరిపోవడానికి
నీకు లోహవిహంగాల్ని తొడిగిందెవరు?

చందమామని వదిలి ఉండలేనని
ఒట్టేసుకున్న వెన్నెల
ఏ సూర్యకిరణ స్నానంలోనో వెలిసిపోయి
శుక్ల పక్షానంతా
కృష్ణపక్షానికిచ్చేసిందో
చంద్రుని కింక
ప్రతి రాత్రీ కాళరాత్రే!

వెన్నెల్ని పున్నమి రాత్రుల్ని చేసి విహరించడం
పచ్చని బీడుల్లో
జల్లులన్నీ
తొలకరి చినుకుల్లా మార్చుకుని గంతులేయడం
కాగితాల పడవల్లో
మన కలల్ని ఊరేగించడం
నీ అందెల రవళి

నా ఓంకార నాదంగా
నా సుప్రభాత గీతంగా విన్న క్షణాలు...
ఇక ఇవన్నీ...
హృదయపేటిక చివరి అరలో దాచుకున్న
చిన్ననాటి నెమలికన్నులు కావాల్సిందేనా?

ఏమని చెప్పనీ పిచ్చి చకోర పక్షికి
కాగడాలు ఆరిపోకుండా చమురు తేవడానికే
ఆఘమేఘాల మీద
ఆ దేశానికి పోయావని చెప్పనా?

అదేమీ కాదు
అల్లుకునే లతకి
ఎన్నాళ్ళకీ పందిరి కాలేకపోయిన
విద్యాధిక నిరుద్యోగుడు
అవినీతితో జతకట్టలేని
అసమర్థుడైనందుకు అసహనమని చెప్పనా?

కాదు కాదు...
నీ కామ మోక్ష ధర్మం
ఇప్పుడిప్పుడే 'అర్థ'మౌతుంది!
పవిత్ర ప్రేమను కూడా
అంతర్జాతీయ మార్కెట్
ఏ బలహీనతతోనో నిన్నూ లోబరిచేసుకుంది కదూ!

ప్రియా...!
నువ్వు నుదుటి మీద కుంకుమ బొట్టు పెట్టుకునేటప్పుడు
అద్దంలో చూసుకోవద్దు

ఒక అధరామృత స్మృతి
విషబింధువై తాకి
తొలగిపోని మచ్చేదో గుర్తుకొస్తుంది!

మూతబడని ఈ మూగ దృశ్యాన్ని
తొలివేదనకే రాలిన ముత్యాల గుసగుసల్ని
ఏనాడైనా
ఇంటర్నెట్ నుండైనా
తీసుకుని ధరించే వీలుందేమో చూడు!

పోన్లే కనీసం పోయేముందైనా
నీ కనుకొలిక కోటికాంతుల్లో
ఓ కిరణాన్నైనా విదల్చలేకపోయావా
దానితోనే సంతృప్తిపడి
పవిత్రంగా
సైనేడ్ కౌగిలిలో మిగిలి పోయుండేవాడ్ని!!

❖ ❖ ❖

(*ఆదివారం ఆంధ్రజ్యోతి అనుబంధం* : 30 ఏప్రిల్ 2000)

ఆ రాత్రి

ఆ క్షణంలో ఎందుకలా విలవిల్లాడిపోయాను
నాలో ఫిక్స్‌డ్ డిపాజిట్టు చేసిన
ఏ అనుబంధాన్నో
అర్థాంతరంగా లాగేసుకున్నట్టు
ఆ క్షణంలో ఎందుకలా విలవిల్లాడిపోయాను

గదిలోకొస్తే
ఏదో కోల్పోయిన వెలితి
నిండిపోతున్న ఒంటిరితనం
బరువెక్కిపోతున్న హృదయం
భవిష్యత్తు ముందే తెలియడమెంత నరకం!

బయటికిపోతే
నీతో విహరించిన స్థలాల వెక్కిరింత
ప్రతి దానిలోనూ నువ్వే... నువ్వే...నువ్వే..
నాకు మనశ్శాంతి లేకుండా పోతుంది!

నువ్వెళ్ళిపోయే తారీఖు
నిర్ణయమైనప్పుడే
నాలో ప్రవేశించిన ఆందోళన, అసహనం...
శత్రు ముసుగు కప్పడానికెంత ప్రయత్నం
నిన్ను జయించలేకపోతున్నాను!

ఉష్ణ కాల తుషారబిందువూ
ఈ సాయంకాల సూర్యకిరణాలు
అలాగే నిలిచిపోవాలనుకున్నా

ఎదురు చూస్తున్న
ఎక్కాల్సిన రైలూ
దిగాల్సిన ప్లాట్ ఫారమ్
జీవన్మరణ ప్రయాణాల రైలాగదు!

అమావాస్యకు దగ్గరవుతున్న
చందమామ
జీవితాన్ని రోజూ
భయపెడుతుంది!

మమతానుబంధాల్ని పెంచుకోవడం
రాగద్వేషాల్ని తుంచుకోవడం
జీవులకే కాదు
స్థల కాలాలకీ అతీతం కాదేమో!!

❖ ❖ ❖

ఎంతకాలమిలా?

నా నయనేంద్రియాల్లో మిళితమైన
నిజానిజాల్ని విడదీసి
బయటకు ప్రసరించడానికి
భయపడుతుంది చూపు!

నా పెదవులు
నరంలేని 'ఆ' నాయకత్వానికెందుకో
వణికిపోతూ
వాక్కుల్ని భీమా చేసుకుంటున్నాయ్!

ఒక మౌనం మాట్లాడి
మనసుని దహించేస్తుంటే
మరొక మౌనం ఘనీభవించి
నన్నో అనిశ్చిత లోయలోకి తోసేస్తుంది!

నా శరీరంలో
నాది కాని ప్రాణం చేసే స్వారీకి
ఇంకెంత కాలమిలా
అలసిపోవాలి?

ఏ.సి.రూములోని
గడియారపు పెండ్యూలమై
ఉక్కబోసి

ఊపిరాడక
నలిగిపోతూ

కాలంతో కసరత్తు చేసేకంటే
నా పూరిగుడిసెలోనే
ఎండైనా
వానైనా
చలిలోనైనా
ఎండిపోయి
తడిసిపోయి
వణికిపోయైనా
అలసిన కళ్ళనిప్పుడు
"నా" కను రెప్పలతోనే
కప్పేసుకోవాలనుంది!

❖ ❖ ❖

(*ఆదివారం ఆంధ్రభూమి అనుబంధం* : 16 ఫిబ్రవరి 1997)

తీయని బాధ చేసిన గాయం !

ఆ జాలి చూపులే
నా మదిని కల్లోల ప్రాంతంగా ప్రకటిస్తున్నాయ్
ఆ మౌనమే
నా కనులలో
బయటకు కనిపించని
కన్నీటినేదో ప్రవహించేలా చేస్తుంది!
ఆ సహనమే
నన్ను పట్టుకుని కుదిపేస్తుంది
ఆ చిలిపి కోపమే
నన్ను చిన్నపిల్లాడ్ని చేసి లాలిస్తోంది

నిస్సహాయతా?
బలహీనతా?
నీదా?
నాదా?

ఏమర్థం కాని
సుడిగాలిలా వెంటాడే శేషప్రశ్నలు!
ఏమర్థం కావడం లేదు
సమస్యల ఖైదీలో బంధితుడ్నయ్యాను
దానికి నేనే తాళాలు వేసుకుని
నా స్వేచ్ఛను నేనే బంధించుకున్నాను
ఎంతోఎత్తు కెదగాలనుకుని
తక్షణానంద విహంగానికున్న రెక్కల్ని విరిచి

ఆవేదన మూల్గులు వింటున్నాను
రక్షకభటులైపోతున్న చేతులు
మనసు రొదపెడుతున్నా కట్టేసుకుని కదలని కాళ్ళు!

ఆలోచించని క్షణంలోనైనా
దయ జలపాతమై వర్షించక మానడం లేదు
దానివల్ల "ఫలం" ఎవరికీ దక్కదని ఎలాగూ తెలుసు
విచిత్రమేమిటో గాని...
ఆ నీటితో మాత్రం
మానస క్షేత్రమంతా దహించుకు పోతోంది!
పుస్తకాలు, పరీక్షలు, అక్షర కుసుమాల జల్లుల్లో తడుస్తూ
కోరికల మృగాలకు జడుస్తూ
చేస్తున్న తపస్సు ఫలించాలని ఆకాంక్షిస్తావే
మరి నిజం చెప్తే నమ్మవేంటి?

పోనీ నీకేదైనా అబద్ధం చెప్పి
నిన్నో అగాథంలోకి తోసెయ్యలేను
నీ అరటి మొవ్వలాంటి మనసుని
హారతి చేయలేని నిస్సహాయుడ్ని!
ఈ మనసు విధించిన కర్ఫ్యూ నుండి నన్ను రక్షించవూ!!

❖ ❖ ❖

(*ఇంకావుంది* వారపత్రిక: 1995)

పుట్టుమచ్చ మీద ప్రేమ

పుట్టుకతో వచ్చిన మచ్చ
ఒకరికి అందమైన అలంకారంగాను
మరొకరికి అసహ్యంగాను మారుతుంది
నాకున్న పుట్టుమచ్చలో
నా ఎదుటి వాళ్ళకేమి దర్శనమవుతుందో
శత్రువు + శత్రువు = మిత్ర బృందం!
భిన్నభావజాలాలైనా
రహస్య రణవ్యూహంలో
వాళ్ళదంతా ఒకే దృక్పథం
రేపు యుద్ధానికెళ్ళాలని తెలిసీ
ముందు రాత్రి
శత్రువు పాదాల్ని ముద్దు పెట్టుకోవడమెందుకు?
అలంకారమో, అసహ్యమో
నా పుట్టుమచ్చ మాత్రం
నాకు రక్షణ కవచమేనని గుర్తుచేసింది
ఆత్మగౌరవానికీ, ఆత్మవిశ్వాసానికీ
వెన్నుపూసై నిలిచిన
ఓసౌందర్య రమణీ! నా పుట్టుమచ్చా...!!
నిన్ను నేను ప్రేమిస్తున్నాను!!

❖ ❖ ❖

(*ఆదివారం ఆంధ్రభూమి* అనుబంధం: 4 అక్టోబరు 1998)

హాస్టల్లో అమ్మ!

మా యూనివర్సిటీ హాస్టల్లో
మిగిలిపోయిన అన్నం పట్టికెళ్ళడానికి
తెల్లవారగట్ల వచ్చే
ఓ తల్లి దీనవదనంలో
మా అమ్మ రూపం అందంగా కన్పిస్తుంటుంది!

నన్ను పెంచిన తీరు
ఆ తల్లిలో ప్రతిబింబిస్తుంటే
నా కళ్ళ ఎడారిని
ఓ జాలి నిట్టూర్పేదో
దయతో నన్ను ఆర్ధ్రంగా తడుపుతుంటుంది
మా వూరి పెళ్ళి పందిళ్ళలో
ఆకలి పాత్రనై
అమ్మ చేతిలో ఒదిగినప్పుడు
చెత్తకుప్పల్లోనైనా పడేసే
కఠినాత్ముల కర్కశ కేకలకి
తల్లడిల్లిన నా తల్లి హృదయాన్ని
అప్పుడప్పుడూ
మా హాస్టల్లో చూస్తుంటాను!
నిస్సహాయుడ్నై
చీకటి గదిలో ఒంటరినై
నాలో నేను
కన్నీటి కెరటాల్లో కొట్టుకుపోతుంటాను...
ఇంతలో ఎక్కడినుండో

అమ్మ అమృతహృదయమై
లాలిస్తూ...
జోలపాడుతూ...
ఆకలినీ, అవమానాల్నీ
మూటకట్టుకుని తిరుగుతున్న
ఈ ప్రపంచాన్ని జయించమనే
మేలుకొల్పు గీతం విన్పిస్తుంటుంది!

❖ ❖ ❖

(ప్రజాశక్తి దినపత్రిక : 22 డిసెంబర్ 2001),
(రంజని 'అమ్మ' కవితా సంకలనం : 1997)

కూలుతున్న లైబ్రరీ!

ఏదైనా మాయో, మంత్రమో,
యంత్రమో వుంటే బావుణ్ణు
తొందరగా గ్రంథాలయంలోని పుస్తకాలన్నీ
ఔపోసన పట్టేసేవాణ్ణి
ప్రపంచీకరణ...
ఇక అరచేతిలోనే స్వర్గం
ఇంటర్నెట్ ఓ మోహినీ తాండవం
నేనిక అమృతానికిక అవతలుండాల్సిందేనేమో!
గ్రంథాలయాన్ని చూసినప్పుడల్లా
అమ్మ నులివెచ్చని కడుపులో
కేరింతలు కొడుతున్న పసివాడిలాగో
యవ్వనం కరిగిపోకుండా
కలకాలం నిలిచిపోయినట్లో
పుస్తకాలతల్లినెప్పుడూ
విడిచి ఉండలేననిపిస్తుంది!
ఒకప్పుడు సీసం పోస్తారేమోనని దాక్కున్న
చెవుల్నిప్పుడు
ప్రతీ బుక్ ర్యాక్ నుండీ
విందులకాహ్వానిస్తూ వేదఘోషలు!
అక్షరం ఒక వైపు
అన్నం ఒక వైపు పెడితే
నేను అక్షరాన్నే హత్తుకుంటాను ఆబగా!
మాతాత ముత్తాతల నుండీ
ముడతలు పడిన కడుపుల్లో

అంబలైనా దొరుకుతుందేమో గాని
అక్షరం ముక్కని మాత్రం కనపడనివ్వలేదు కదా
వర్ణాధిక్య పెద్దలు!
అక్షరమంటే అందుకేనేమో నా కంత ఆత్రం!
తొందరగా ఏదో ఒకటి చెయ్యాలి
రిక్టరు స్కేలు మీద ప్రమాద సూచికలు
ఇంటర్నెట్ ప్రకంపనల్తో
గ్రంథాలయ గోడల్లో పగుళ్ళు...
డిజిటైజేషన్ చేసినంత మాత్రాన
పుస్తకాలన్నీ పూడ్చేయాలా?
ఇంకా అక్షరమే తెలియని వాళ్ళకి చేతికి మౌస్ నిస్తారట!
ఊళ్లో గ్రంథాలయాలన్నీ ఖాళీ
అన్నీ ఇంటర్నెట్ లోనే చూసుకోవాలట!!
మరో మిలీనియం దాకా వెతికినా
నాకిక అక్షరం ముక్క మళ్ళీ కన్పించదేమో!!
లైబ్రరీలోనే చచ్చిపోయి
మళ్ళీ లైబ్రరీలోనే
ఓ పుస్తకమై పుట్టాలనే కోరిక
పుట్టుకతోనే చచ్చిపోవాల్సిందేనేమో!!

❖ ❖ ❖

(*కడుపుమీద కొట్టకుండి* : 2001)

గోడకివతలివైపు...!

నీతో గడిపినంత సేపు
పరిమళభరిత సరస్సులో క్రీడలాడినట్లే వుంటుంది!
హృదయం నిర్మలమై ప్రశాంతకిరణాల్ని
వెదజల్లినట్లే వుంటుంది!
ఉత్సాహం మనసుని గాలిలో ఆకాశమంతా
చెట్టపట్టాలేయిస్తుంటుంది!
బంతిని కొట్టిన కొద్దీ చైతన్యవంతమై
సంఘర్షణ శక్తినిస్తూ
నీ సమ్మోహన శక్తి ముందు అన్నింటినీ మరిచిన శిలనై
నీముందే నిలిచిపోవాలనుంటుంది!
మనమధ్య నిలువెత్తు గోడలు
అందమైన అద్దాల్లాంటి గోడలు
మనల్ని కలవనివ్వని అద్దాల గోడలు!

బలవంతంగా నా చేతనే తాకట్టు పెట్టబడిన
నా వస్తువు మీద నాకే పెరిగిపోతున్న వడ్డీ మాత్రం
రాబందులా ముఖాన్ని రక్కేస్తుంటే
కారేది రక్తం కాదు
సిగ్గుతో నేలకొరిగిపోతున్న చెమటచుక్కలు!
ఎలా చూడగలను నీకళ్ళలోకి....

ప్రలోభం ఇంద్రజాలం ప్రదర్శించే
అద్భుతవశీకరణ శక్తి!!

❖ ❖ ❖

(సాహితి, ఆంధ్రభూమి దినపత్రిక : 6 అక్టోబర్ 1997)

జల్లెడ వేసుకో !

అక్కడ...
ఆశల గూళ్ళలో సీతాకోక చిలుకలు
రంగు రంగుల కథలు చెప్పుకుంటున్నాయి
వృద్ధాప్యం ముద్దు ముద్దుగా
అడుగులు నేర్చుకుంటుందని
అమ్మా నాన్నల అదృశ్య వాక్కు
చేతి కర్రనందించమని అడుగుతూనే వుంది

నేనేమో
సముద్రలోతుల్లో కెళ్ళి
తిమింగలాల్తో పోట్లాడుతున్నాను
పర్వతాలెక్కి మేఘాల్తోనూ
ఎర్రెనెర్రని సూర్యుళ్ళతో
ఏవేవో చర్చల్లో తలమునకలౌతున్నాను

అనుభవంలోకొచ్చిన ఇంగిత జ్ఞానమేమో
ఇసుమంత దాచకుండా
నాలో నన్ను జల్లెడవేసుకోమంటుంది
నిట్టూర్పుల వడగాల్పులు తగలకముందే
శూన్య దృక్కులు చూడకుండా
ఇప్పటికైనా మేల్కోమంటుంది!

❖ ❖ ❖

(*ఆదివారం ఆంధ్రప్రభ* అనుబంధం: 13 అక్టోబర్ 1996)

కల అదృశ్యం కాదు!

కలల అలలపై
చెంగుచెంగున గంతులేస్తుంటే
కలలెంత తీయగా ఉంటాయి
కన్పించని ఊహల పుష్పక విమానంలో
విహరించే వినోదాల బృందావనమెంత అందంగా వుంటుంది
కళ్ళు తెరిస్తే
కన్నీళ్ళెంత స్వచ్ఛంగా ఉంటాయి?
మళ్ళీ రాని బాల్యం
స్మృతులు స్మృతులుగా కురుస్తూ
మనసంతా గాయమైపోతుంది!
మాడ్చుకుని తిన్న ఆకలి
మా అమ్మ పాదాలపై పడి ఏడుస్తుందిప్పుడు
మా అమ్మే స్వయంగా ఉత్తరం రాస్తుంది
మా అమ్మే స్వయంగా ఉత్తరం చదువుతుంది
మా అమ్మ కూడా పట్టుచీర కట్టుకుని
పేరంటానికెళుతుంది
ఫ్యాను కింద కబుర్లతో
కలర్ టి.వి. రీవీగా చూస్తుంది
పుణ్య క్షే త్రాలెన్నింటినో సందర్శిస్తుంది
అధికారికంగానే!
మా అయ్యేమో
తెల్లపంచెలో మహారాజై
మీసం మీద చెయ్యేస్తాడు
నాకింకేం కావాలి?

కోర్కెల గుర్రమెక్కేస్తాను
'కొక్కొరోకో' అన్న యథార్థ ఫిరంగికి
విరిగిపడిన కలల శకలాలు...
నన్ను కప్పేశాయి

దృశ్యాల్ని శాసించే నియంతనైతే ఎంత బావుణ్ణు!!

❖ ❖ ❖

(దీపావళి ప్రత్యేక సంచిక, ఆంధ్రప్రభ వారపత్రిక : 3 -11-1999)
(నేను పారితోషికం అందుకున్న మొట్టమొదటి కవిత)

శంబూకుడి మీద సెప్పలేనంత ప్రేమ!

సీతాకోక చిలుకలిప్పుడు
సరిహద్దురేఖల్ని గమనిస్తూ
రెక్కల్నాడించుకోవాల్సిందేనేమో!

ఏమో...
గెడ్డంతో కనిపించిన వాడల్లా
లాడెన్ వారసుడో
మార్క్స్ మానస పుత్రుడో అన్నట్లు
అగ్ని పరీక్షల్ని నిర్వహిస్తూ
ప్రతి రోజూ ద్వారం దగ్గర జాగిలాలు!

ప్రేమంతా తానై
ఆ ఒడిలో ఒంపేసిన సునీతను చంపేసి కూడా
క్యాంపస్‌లోనే
అచ్చోసిన ఆంబోతులా తిరిగే వాడికి లేని
అగ్నిపరీక్షలిప్పుడు అమలైపోతున్నాయ్!
పంద్రాగస్టు నాడు
పాలవాళ్ళ రూపంలో
కన్యత్వం 'పర్వదిన'మైపోయినప్పుడు
రాజభవన్ వరకూ రోడ్డంతా క్యాంపస్సే!
ఆ ఆనవాళ్ళు కూడా
హైటెక్‌లో అంతరించిపోయాయి!
నాడేమయ్యాయా
అగ్ని పరీక్షల ఆలోచనలు?

ఔను...!
ఆ ఆలోచనలెప్పుడూ
నివురుగప్పుకున్న నిప్పు కణికలే
ఒక్కదెబ్బకు రెండు పిట్టల్ని కాల్చగలిగే
కళ్ళని టార్గెట్ చేసి
అమాయక వేలు కోసం
తపస్సు చేసిన మహర్షులు
ఓ శంబూకుడ్ని ప్రేమించేశారు!!

❖ ❖ ❖

(ప్రజాశక్తి బుక్ హౌస్ వారి 'జన కవనం' సంకలనం, 2002)

ఓ మైలురాయి !

పరస్పరం కత్తులు దూసుకోవడం
మల్లగుల్లాలు పగలుగొట్టుకోవడం
అవసరమైనన్ని
ధృతరాష్ట్ర కౌగిళ్ళలో చిక్కుకుపోవడం!

ఒకప్పుడు ఎదురుపడితే చాలు
పరవశంతో మెరిసిపోయే ముఖం
నేడు విద్వేషాల లోగిళ్ళకు ఆలవాలమవ్వడం
సమకాలీన సందర్భమో
అసంకల్పిత ప్రతీకార చర్యో
మన మధ్య మరో చరిత్రకి
ఓ మైలు రాయి పాతేసింది!

గొంతు తడిసింది
కడుపు నిండిందా?
ఆకులు ఖాళీగానే మిగిలిపోయాయి
ఆశలు ఆశలుగానే మిగిలిపోవాల్సిందేనా?
సరళీకృత అధోగతి విధానం
రాజ్యాంగ సమీక్షా ప్రహసనం
ప్రతిభ చౌరబాటుని పారద్రోలడానికి
ప్రతీ దాన్నీ ప్రయివేటు పరం చేయడమే శరణ్యమట!
జీవితమంతా

హైటెక్ టెక్నాలజీలోనే...
క్లోనింగ్, జీనోములొస్తున్నాయ్!
పిచ్చోడి చేతిలో రాయి కానుందా!!

మనమధ్య మనకున్న బింకాలింకా
సడలనన్నాళ్ళూ
సంకెళ్ళింకా బిగువవుతూనే వుంటాయి
కవుల మొక్కుబడి అక్షరాల్లోనే కాదు
కార్యదీక్షా సామర్థ్యంలోనూ
దళిత సమైక్య జెండా లెగరేయగలగాలి!

అప్పుడు కదా
మనల్ని నెత్తుటి పువ్వుల్ని చేసి
నేలలో పాతేసినా
బంగారమై బయటకు రావచ్చు
సముద్రంలోకి తోసేసినా
ముత్యాలై మెరిసిపోవచ్చు
ఆకాశంలో విసిరేసినా
వాన చినుకులై ప్రాణం పోయొచ్చు
ఇక మన జెండాలన్నీ ఏక జెండాలుగా
ఎగరెయ్యడమే మన తక్షణ కర్తవ్యం!

❖ ❖ ❖

(కడుపుమీద కొట్టకుండ్రి: 2001)

దళిత తాత్త్వికుడు

అన్నీ మామూలైపోయాయి
కొత్త బట్టలేసుకున్నప్పుడల్లా
వింత వింతగా చూసేవాళ్ళెదుట
ఏదో తప్పుచేసినట్లింకా కుంగిపోలేను

రంగునీ, రూపాన్నీ, భాషనీ...
అన్నింటినీ అనుమానించినా
ఆత్మన్యూనత కింకా అర్థం కల్పించలేను

ఇతివృత్తాల మూస ధోరణిలో
నా తల్లిని పని మనిషనీ
నా తండ్రిని తోటమాలనీ
ఏవేవో చిత్రించే
ఊహల్నిక ఊహలుగానే మిగుల్చుకోవడం మంచిది
ఆ దేవుడే దిగొచ్చినా
మొదటి ప్రాధాన్యత నా తల్లి దండ్రులకే!
నేనిప్పుడు దళిత సౌందర్య తాత్త్వికుణ్ణి!!

ఆధిపత్యపోరులో
భావజాలంతో పాటు
నా భాషా
జీవం కోల్పోతున్నప్పుడల్లా
కంపల్సరీ క్లాసికల్ సబ్జెక్టులా చేసైనా సరే
సోషియో లింగ్విస్టిక్స్ క్లాస్ చెప్పాలనిపిస్తుంది

ఓ మహా దేశభక్తుడా!
మళ్ళీ మళ్ళీ స్వాతంత్ర్యపోరాటంలో
నా మనవలెక్కడ
మళ్ళీ మళ్ళీ బలికావాల్సి వస్తుందనో
మా దేశాన్ని తాకట్టు పెట్టొద్దంటూ
గగ్గోలు చేస్తూ
ప్రాణాలైనా గడ్డిపరకల్లా విసిరేస్తున్నాం

నీ వక్రీకరణ చరిత్రలో
నా పేరు కోసమెప్పుడూ
తాపత్రాయపడుతూ
పింఛను కోసం వెంపర్లాడను
లాఠీలు, తూటాలకు
నా ప్రాణాలొడ్డయినా
నేను నాదేశాన్ని కాపాడుకుంటాను

నీదంతా వక్రీకరణ చరిత్ర
స్వాతంత్ర్య సమరయోధుడిగా నమోదవ్వాల్సింది పోయి
నేరస్తుడిగానో
కరడు గట్టిన ఉగ్రవాదిగానో
నాకెన్నెన్ని జాబితాలు సిద్ధమౌతాయో
అందుకే నీదంతా వక్రీకరణ చరిత్ర
నాకళ్ళ ముందు నిన్ననే జరిగిన
మద్యపాన నిషేధోద్యమంలో
నా తల్లి పేరేది?
భర్తే పోటీ చేసినా

ఓటేయడానికే ఇల్లు కదలని అమ్మలక్కలు
నేడు ఉద్యమనేతలుగా సన్మానాలందు కోవడమేంటి?
కార్గిల్ 'ఆపరేషన్ విజయ్'లో
ఎందరో ప్రాణాలు పోగొట్టుకున్నా
ఆచార్య పద్మపాణి కెగిరిన కీర్తిపతాక
మరికొందరి కెందుకు ఎగరలేదు?
జరపరేషాను గుందిరా బయ్ నీ చెరిత్రంతా...

❖ ❖ ❖

"శివ శివా సంస్కృతి భ్రష్టుపట్టి పోతోంది
ఇంగ్లీషు న్యూ ఇయర్
వాలెంటైన్స్ డే...
పేర్లతో తెస్తున్న ప్రపంచానురాగం
మన సనాతన సంస్కృతిని
భ్రష్టుపట్టించేస్తున్నాయ్
కోల్‌కత్తా కాళిక నాలికల్ని చాచి
ముంబయ్ వీధుల్లో ఊరేగించుకుంటూ
ఒరిస్సా, గుజరాతుల్లో
రాక్షస రతుల్తో
సజీవదహనాల్తో
సిస్టర్స్ శీలంపై మరకలతో
భీతావహుల్ని చేస్తూ
చార్మినార్ చౌరస్తాలో
ఊచకోతలు కోస్తూనైనా
నరనరాల్లో యాంటీవైరస్ నెక్కించాలి'

నన్ను నిరంతరం ద్వేషించినా
నన్ను నిరంతరం వేధించినా
నాకు నిన్ను ప్రేమించడమే తెలుసు

ఇప్పటికైనా
నువ్వెప్పటికైనా
అమ్మ తినిపించే గోరుముద్దల రుచిని చూడు
పసిపాపల పాల బుగ్గల్ని నిమిరి చూడు
కష్టపడి పనిచేసి
మిట్టమధ్యాహ్నం చెట్టు నీడకెళ్ళి చూడు
నీకూ ప్రేమించడమే తెలుస్తుంది
ప్రేమించడంలోనే
అమరత్వముందనీ అనుభవమౌతుంది!

❖ ❖ ❖

(కడుపుమీద కొట్టకుండి : 2001)

చేనేత దృశ్యాలు

దారం వడికే
చేతులిప్పుడు మగ్గం మీద
పేనుకుంటున్న మరమగ్గాలు

నేత కార్మికుని
రక్తంతో తడిపిన
అద్దకాల్లో కొత్త మెరుపులు!

పత్తిపువ్వులో పగిలి
మరమగ్గం గొయ్యిలో
పూడ్చుబడ్డ కూతురి పెళ్ళి కల!

యంత్ర కౌగిళ్ళ
ధృతరాష్ట్ర స్పర్శలో
గాంధీజీ నూలు రాట్నం!

తెగిపోయిన దారం
ఎగిరిపోయిన కండె
ముగిసిపోయిన చేనేత అల్లిక!

❖ ❖ ❖

(www.thatstelugu.com)

ఒంటరిగా బ్రద్దలౌతూ...!

మనమేంటో మనకి తెలిసినా
ఒకరి గురించి
మరొకరం తెలుపుకోవడం మనకిష్టముండదు!

మనం కలిసినప్పుడల్లా
స్వచ్ఛంగా మాట్లాడేసుకోవాలనుకున్నా
కళ్ళనిండా కాంతిని నింపేసుకోవాలనుకున్నా
బాధలన్నింటినీ కలిపి
ఓ పాత్రలో ఒంపేసుకోవాలనుకున్నా
మనం లోతుల్ని తాకని
ఏవేవో కబుర్లతో కాలాన్ని స్వారీ చేయిస్తుంటాం!
యాంత్రిక సంభాషణల్తో నడిచిపోతుంటాం!!

మోసం చేసుకుంటున్నామని తెలిసినా
మన మూలాల్లోకి వెళ్ళడానికేదో అలజడి
చులకన భావమో
సానుభూతి చినుకులో
అలముకునే ఆధిక్యతో
ఏదేదో మనల్ని దూరం చేస్తుందని తెలిసినా
మళ్ళీ మనం కలుసుకున్నప్పుడల్లా
మనకి మనమే వంచన చేసుకుంటాం!
ఊహల్లో విహరించలేక
వాస్తవాల్నీ జీర్ణించుకోలేక
మనసుల్ని మరొకరు
తనివి తీరా తడిమి చూసుకోవాలనుకునీ

వడివడిగా నడిచే తలపులతో దగ్గరకొచ్చి కూడా
మనం మళ్ళీ మళ్ళీ మొదటికే తిరిగిపోతుంటాం!

వద్దు ఎవరి గురించి
ఎవరూ తెలుసుకోవద్దు
పరస్పర గౌరవం బద్దలు కాకూడదనుకుంటూనే
ఆలోచనల వంతెనల్ని
కృత్రిమంగా దాటలేక
మనకి మనమే ఒంటరిగా బ్రద్దలైపోతుంటాం!!

❖ ❖ ❖

(ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక : ఫిబ్రవరి, 2000)

సమాధులు

స్మశానంలో
సమాధుల్ని చూసినప్పుడల్లా
నా కేవో సుదూరంగా
వెలుతురు కిరణాలు కనిపిస్తాయి

సమాధుల దగ్గరకెళ్ళినప్పుడల్లా
ఎక్కడ నుండో
నాకేదో తీయని భాషా వినిపిస్తుంటుంది

కొన్ని సమాధుల్ని స్పర్శించినప్పుడల్లా
మొగ్గలోనే జీవితాల్ని చిదిమేసిన
అసంతృప్తి విన్పిస్తుంటుంది

సమాధులడిగే ప్రశ్నలకు
సమాధానాలకై అన్వేషణలో పడతూ
ఒక్కో సమాధినీ ముద్దుపెట్టుకుంటుంటే
నా పెదవులు, చేతులతో సహా
నేనే నిలువెత్తు రక్తం మరకనైపోతుంటాను
చంపడానికో పేరు పెట్టబడిన పిచ్చికుక్కలై
ముక్కముక్కలైన
మాంసం ఖండాలేవో రక్తాన్ని కారుస్తున్నట్లున్నాయ్
ఈ సమాధులు
మామూలు సమాధులు కాదు

ఒక్కొక్క సమాధీ
కాంతినివ్వడం కోసమే కాలిపోయిన
ఒక్కొక్క జాతికాగడా!

ఒక్కొక్క సమాధీ
దళిత రాజ్యం కోసం
నల్లసూర్యుడై నినదిస్తున్న చైతన్య ముద్ర!

అందుకేనేమో...
కొన్ని సమాధులంటే నాకిష్టం
సమాధుల్లో పూడ్చబడిన
లక్షల కొలది దళిత వీరులతో
మాట్లాడడమంటే నాకు మరింతిష్టం!!

❖ ❖ ❖

(కడుపుమీద కొట్టకుండ్రి : 2001)

మాదిగ మ్యానిఫెస్టో

కందిన చరిత్ర గాయం
దండోరా గేయమై మ్రోగుతోంది
శత్రు శిబిరంలో
సింహ స్వప్నమై
అంటరాని తనంలో
మళ్ళీ అంటరానితనం పెంచే
ఇంటర్ సుపీరియారిటీని భరించలేక
అంతరాంతరాల్లోని
అగ్నిపర్వతం పగిలిందిప్పుడే!

ఎన్నాళ్ళ నుండో
పర్వతాలెక్కి వీచే తుఫాన్లతోనూ
ఎర్రని సూర్యుళ్ళతోనూ
ఎన్నెన్ని చర్చలు జరిపానో...!

మా ఘోషను వినని తుఫాన్లు
మండించడమే తప్ప
మా చలిని గుర్తించని సూర్యుళ్ళు!

సముద్ర లోతుల్లోకెళ్ళాను
మొసళ్ళ విజృంభణల్ని చూశాను
చిలక పలుకుల్తో
ఉరుకులూ పరుగులూ నేర్పుతున్నట్లే నేర్పుతూ

అందితే స్వజాతినే తినేస్తున్న
అవకాశవాద కొరమీనుల సమూహం పాడిన
సమైక్యతా గీతాలనూ విన్నాను

గుడినీ, గోపురాన్నీ మింగుతున్నప్పటికీ చాలదంటున్న
బకాసుర తిమింగలాల్ని చూసి భయంతో ఉలిక్కిపడ్డాను

అడవి తల్లి కదా అనుకొని అక్కడికి పోయి చూస్తే
అధికారం రక్తం మరిగిన సింహాలు
జూలు మెలేసి చిత్ర వధ చేస్తున్నాయ్
జిత్తులు చేసి కుట్రలు పన్నే గుంట నక్కలు
గోతులు తవ్వుతూనే వున్నాయ్

అన్నా !
నాకు నీ అన్నం
పరమాన్నమైంది కానీ...
నా కూడు నీకు...
దాన్ని చూసేసరికే
ఊర బెట్టే తోళ్ళ కంపు కొట్టింది కదా!
"యాక్ మాదిగోడి అన్నం తినాలా... " అంటూ
వాంతులు చేసుకున్న నీ ప్రేమాభిమానాలను
జాలి కన్నీళ్ళతో ఊడ్చి పారేశాను

అన్నా...!
నువ్వే నాతో కలిసి తినలేవ్
నువ్వే నాతో కలిసి జీవించలేవ్
అన్నా...

"కోతి – పిల్లుల రొట్టె కథ" ను
మరిచిపోతున్నావు కదూ!

ఇక నన్ను నేనుగా
కాపాడు కోవాల్సిందేనేమో!!
నా వ్యక్తిత్వం మీద
అవమాన ముద్ర వేస్తున్నాడు
అది నా ఆత్మను దహించకుండా మేల్కోవాలి
నా చెట్టు కాయలు
నాకే దక్కేలా
నా బతుకు నా బతుగ్గా
బతకాలనే విత్తనాలే
నాకో నినాదాన్నిచ్చాయ్
గుండె దండోరాన్ని మ్రోగించమన్నాయ్!

హ్రస్వదృష్టికి, దూరదృష్టికి
భేదం తెలుసుకున్న
విచక్షణతోనే మాట్లాడుతున్నాను
విభిన్నజాతుల వస్తు ప్రదర్శనశాల
నా భారతదేశం నుండే మాట్లాడుతున్నాను

నేను ఛీత్కారాల గొంగళి పురుగునై
విసిరేయబడ్డప్పుడు
నా చుట్టూ నేనే సాలిగూళ్ళు అల్లుకుంటున్నప్పుడు
నాలోకి నేనే
కుంచించుకు పోతున్నప్పుడు
అభయ హస్తమిచ్చి ఆత్మ విశ్వాసాన్నిచ్చిన వాళ్ళను

వాళ్ళెవ్వరైనా నేను మర్చిపోలేను
నా శరీరంలో శరీరమై
నా మనసులో మనసై
నా మనిషిలో మనిషై
నా ప్రాణంలో ప్రాణమైన వాళ్ళను
వాళ్ళెవరైనా చిన్ని రంధ్రం నుండే చూడలేను

నాబతుకు బతుగ్గా బతకడమంటే
ప్రాకృతికావస్థలోకి కూరుకుపోవడం కాదు...
తరతరాలుగా గోచీ పాతల్ని
డాక్టర్ అంబేద్కర్‌లా
ధవళవస్త్ర జిలుగుల్ని మెరిపించడం
బాబూ జగజ్జీవన్‌రామ్‌లా
అధికారంతో పోటీపడటం
మహాకవి గుర్రం జాషువాలా
కమ్మని కావ్యాన్నాలపించటం
నా దండోరాలో మా మాదిగోడులో
నా గుండె స్పందనలో స్పష్టమైన మార్గముంది!

❖ ❖ ❖

(మాదిగ చైతన్యం : 2007)

ఇప్పుడు నా శ్లోకంలో...!

కణ్వుడి ఆర్ద్రత నాకిష్టం
కర్ణుడి ఆవేదనతో కలిసిపోవడం నాకిష్టం
కరుణశ్రీ కవిత్వంలో తడిసిపోవడం నాకిష్టం
అన్నింటికంటే నాన్నంటే నాకు మరింత ఇష్టం!

ఆరు మానెల గింజల కోసం
పదహారు మైళ్ళెల్లి
అర్ధరాత్రి వరకూ తడిసి ముద్దైన నాన్నంటే నాకిష్టం!

ఆ చీకట్లో అర్జునుడు
అన్నం ముద్ద సరిగ్గా తిన్నాడో లేదో గానీ
కాళరాత్రుల్లోనూ నాన్న వేసే గునపం పోటుకి
పెరుగు గడ్డలా విరిగిపడే మట్టి బెడ్డల బరువు నాకు తెలుసు!
రేపల్లెలో కృష్ణుడు
రజత పాన్పుపై పవళించాడో లేదో తెలియదు గానీ...
పరిగ గింజల్ని నాన్న జల్లెడ పడుతుంటే
నివ్వెరపోయి చూడటం నాకు తెలుసు!

ఒకప్పుడు నాన్నను వెలేసిన శ్లోకం
నాన్న పాదాలపై పడిందిప్పుడు
నాన్నకిప్పుడు శ్లోకం సొంతం
నాన్నిప్పుడు నాలో ఉన్నాడు!

❖ ❖ ❖

నగర పురస్కారం!

నేన్నిర్మించిన నా నగరం
నన్నక్కున చేర్చుకుంటుందనుకున్నాను
పగలనక, రాత్రనక
ఆకలనక, దప్పికనక
నీరసమనక, నిద్రనక
నగర నిర్మాణంలోనే కలిసిపోయింది నా జీవితం!

ఒకప్పుడు...తాజ్‌మహల్ నిర్మాణంలో
కలిసిపోయింది నా జీవితం
పవిత్ర ప్రేమకు పునాదులయ్యో
వెన్నెల చల్లదనంలో
శ్రమను మరిపించే కుడ్యాలయ్యో
మహాకవి కవిత్వమయ్యో
అక్కడ నిలవగలిగాను...!

ఇక్కడ...నేన్నిర్మించిన నా నగరాన్ని చూడాలని
రోడ్డు మీద కొస్తే
నడివీధి నడకల్లో నెరజాణత్వపు మెలికల్లేవని
నా నగరమే నన్ను కాళ్ళిరగదీసి
నన్నో వికలాంగుణ్ణి చేసింది
నగరం ఒక పువ్వయ్యింది
నా ముక్కుకి తాళం పడ్డది
నగరం ఒక ఫలమైంది

నా నోరు కట్టేయబడింది
నగరం ఒక ఇంద్ర భవనమైంది
ఓ శాపమేదో నా అస్తిత్వాన్నే భస్మం చేసింది!

నేన్నిర్మించిన నా నగరం
నన్నక్కున చేర్చుకుంటుందనుకున్నాను
నగరం నా ఇల్లనుకున్నాను
నగరం నా కుటుంబమనుకున్నాను
నగరమే నేను
నేనే నగర మనుకున్నాను
నగర నిర్మాణంలోనే కలిసిపోయాను

నగరం నన్ను తిరస్కరించింది
నన్ను తిరస్కరించిన నగరం
పురస్కారాని కెంపికయ్యింది
నగరమిప్పుడు...
రసాన్ని పీల్చేసి
చొప్పను కాల్చేసే
అవకాశవాద మానవ స్వభావం!

❖ ❖ ❖

(*కవితా మాలిక* : 2005)

తెలుగు గుండెల్లో 'క్లాసికల్' గుబులు

నాకిప్పుడు సంతోషించాలో దుఃఖించాలో
తెలియనంత అయోమయంగా వుంది
మళ్ళీ పాతకాలానికేమైనా
లాక్కొని పోతారేమోనని భయంగా వుంది

మళ్ళీ కందుకూరి, గురజాడ, గిడుగుల అడుగుల్ని
వెతుక్కోవాల్సింది వస్తుందేమోనని
గుండె గుబులుగానే వుంది
ప్రాచీనాంధ్ర భాషకు క్లాసికల్ గుర్తింపొచ్చిందని
నిన్ననే వచ్చిందో ఈ మెయిల్ !

మూలనున్న బండీరాల్నీ,
అలూ, అలూల్నీ,
అరసున్నాల్నీ
మువర్ణాల్నీ
కృత్రిమత్వాన్నంతా కుమ్మరించి
బలవంతంగా బంధించి
బాణాల్లా గురిపెట్టిందా ఈ మెయిల్!
అది ఇన్‌బాక్స్‌లో కొచ్చిన
స్పామ్ మెయిల్ విషసర్పంలా వుంది
రసికుని ముందు బుసకొడుతున్న యువతిలా వుంది
శృంగార దేవతై
నిలబడిన రహస్య వైరస్‌లా వుంది
ఇంగ్లీషులో రాసుకుని తెలుగులో చదువుతున్న
టి.వి.యాంకర్ తెలుగు చిలక పలుకులు పలికినట్లుంది!

నిజమైన తెలుగంటే
ప్రజల సజీవ ప్రవాహం కదా!
అతకని అక్షరాలతో ఇదేంటిలా అసహ్యంగా

కాలంతో పరుగెట్టలేని పొడ పాములా పడుంది!
ఇదేనా ప్రాచీనాంధ్రకు తెచ్చే పునర్వైభవమంటే?
సంస్కృతాన్నో, అచ్చ తెనుగునో...
కృతకంగానో గుదిగుచ్చడమేనా పునర్వైభవమంటే?

నాకిప్పుడు సంతోషించాలో
దుఃఖించాలో తెలియనంత అయోమయంగా వుంది
మళ్ళీ పాతకాలానికెక్కడ
లాక్కుపోతారోనని భయంగా వుంది

మళ్ళీ కందుకూరి, గురజాడ, గిడుగుల అడుగుల్ని
వెతుక్కోవాల్సొస్తుందోనని గుండె గుబులుగా వుంది

వినసొంపైన గోదావరీ గల గలల అక్షర రమ్యతతో
ప్రసన్న కథా కలితార్థయుక్తి రమణీయ మలుపులతో
ధర్మాధర్మ రాజనీతి కళా చాతుర్యంతో
మందార మకరంద మాధుర్యాన్ని నింపిన
పచ్చని పొలాల్లో ఆడుతూ పాడుతూ కనిపించే
పల్లె పడుచుల కేరింతలతో

తెలుగు భాషా సాహిత్య రమను పండించిన పద్యం మనదే!
ఔను... పద్యం మనదే...
కాదన్నదెవరు!
తేనె తియ్యగా వుందని

నీటిని తాగినట్లు తాగి దాహం తీర్చుకోలేం కదా!
బూజు పట్టిన తాళపత్రాల్లోనే పడున్న
ముత్తాతల్నీ పైకి లేపి
సన్మానిస్తున్నందుకు కూడా సంతోషమే
కానీ... ముని మనవడి మాటల్ని కూడా
వింటారో లేదోనని మాత్రం భయంగా వుంది!

పురాణం, ఇతిహాసం, ప్రబంధం, శతకం...
ఇవే మన సంస్కృతీ సంప్రదాయాలంటూ
కంప్యూటర్ యుగంలో కూడా కంఠస్తమే పట్టమంటారేమో
విజ్ఞాన విషయంగా కాకుండా
తెలుగంటే కళగానే మిగిల్చేస్తారేమో ! ఏమో!!
పంచెలతో, పిలకలతో జంఘాల శాస్త్రులవ్వమంటారేమో
కృతక భాషనే మాట్లాడమంటారేమో
ప్రామాణికమే భాషంటూ మాండలికాన్నే నిషేధిస్తారేమో!
ఏమో... ఏమైనా జరగొచ్చు!!
క్లాసికల్ తెలిగిప్పుడు
కొత్త క్లాస్ నేదో సృష్టిస్తుందేమోనని
నిజంగా భయంగానే వుంది!
క్లాసికల్ తెలుగంటే
ప్రాచీనమో, సంప్రదాయమో
శిష్టమో, విశిష్టమో
మీకిష్టమైన పేరుతోనే పిలవండి
తెలుగు భాషను మాత్రం
ప్రజల భాషగానే మననివ్వండి

ఆదాన ప్రదానాలన్నీ సహజం కదా
విరోధి నామ సంవత్సరమా?
నీతో విరోధం తప్పదా?

నాకిప్పుడు సంతోషించాలో
దుఃఖించాలో తెలియనంత అయోమయంగా వుంది
పాతకాలానికి లాక్కుపోతారేమోనని భయంగా వుంది
మళ్ళీ కందుకూరి, గురజాడ, గిడుగుల అడుగుల్ని
వెతుక్కోవాల్సొస్తుందేమోనని గుండె గుబులుగానే వుంది!!

❖ ❖ ❖

(*విశాలాంధ్ర సాహిత్యానుబంధం* : 1 ఫిబ్రవరి 2010)

ఇప్పుడు కావాల్సింది!

ఇప్పుడు కావాల్సింది
ధారాపాతమై కురవడం కాదు
అగ్ని నేత్రమై మండాలి !
ఇప్పుడు కావాల్సింది
గుండె ద్రవించడం కాదు
వజ్ర సంకల్పాన్నందించాలి !
ఇప్పుడు కావాల్సింది
జాలితో ఊద్చేయడం కాదు
నెత్తుటి పువ్వుల్ని ధరించాలి !
నిన్నటి వరకున్న "పునాది" వేరు
నేటి ఉపరితలం రెప రెపలు వేరు
నిస్సారమౌతున్న 'వేం ?
పెంట'లో పరిమళం చేరింది
కులం వాసన గుర్తించాలి !
ఇప్పుడు కావాల్సింది
ఒంటి చేతి తప్పట్లు కాదు
కరచాలనం చేస్తూనే
విరిచే నొసటి విరుపులు కాదు
మేధో కార్ఖానాలు మార్మోగాలి !

❖ ❖ ❖

(కర్నూలు జిల్లా, వేంపెంటలో మాదిగలపై భూస్వాములు సాగించిన మారణకాండకు ప్రతీకారంగా మావోయిస్టులు స్పందించిన అనంతరం...)

(*ప్రజాసాహితి* మాసపత్రిక: ఏప్రిల్, 2006)

ముఝే యాద్ రఖ్‌నా...!

"పర్ దేశీ పర్ దేశీ జానా నహీ
ముఝే చోడ్ కే ముఝే చోడ్ కే...
పర్ దేశీ మేరీ యారా వాదా నిభానా
ముఝే యాద్ రఖ్ నా కహీ భూల్ నా జానా..."

ఒక పాట
ఎంత మందికి జీవనాధారం
ఒక పాట
ఎంత మందికి జీవనోత్సాహం
అలసి సొలసి పయనించే వారికి
ఆ పాటే అలసట తీర్చేది

ఓ సన్నని గొంతు
రెండు చిల్లపెంకుల్లో దూరి
పరిమళ ప్రవాహమై గొప్ప ఆహ్లాదాన్నిచ్చేది
ప్రతి సాయంత్రం
సంధ్య కిరణాల్ని చూడలేకపోయినా
పూర్చులేకపోయినా
పూర్చులేని
ఏదో వెలితిని తీర్చేది
సృష్టి విచిత్రమైందే
పూవుల్లోని తాజాదనాన్నో
రంగుల్లోని మేళవింపునో
ప్రకృతిలోని కిలకిల రావాల్నో

రాబట్టాలనెంతగా ప్రయత్నించినా
ఎక్కడో తొంగిచూసే కృత్రిమత్వమే!

“పర్ దేశీ పర్ దేశీ జానా నహీ
ముఝే చోడ్ కే ముఝే చోడ్ కే...
పర్ దేశీ మేరీ యారా వాదా నిభానా
ముఝే యాద్ రఖ్ నా కహీ భూల్ నా జానా...”
ఆ గొంతులో దూరి అనుకరించినా
కళ్ళున్న వాళ్ళకీ
కొత్త ప్రపంచాన్ని చూపే కొత్త పాటయ్యేది

ఆ పాటే...
ఆ గొంతులోనే
తొలిసారి విన్నప్పుడు
ఆ పక్క గదిలోకి పోతే బావుణ్ణనుకున్న
ఆ సహించలేని చెవులే ఇప్పుడు
కనీసం ఆ చేతికర్రల మువ్వల చప్పుడు కోసమైనా
వెతుకులాట!

పాడేదొకటే పాట
‘పర్ దేశీ పర్ దేశీ జానా నహీ...”
ఒక చరణమయ్యో
పల్లవయ్యో మాత్రమే
పైసా కోసం చాపే ఆ చేతిలో
ఇప్పుడెంత పెట్టాలన్నా ఎలా సాధ్యం?
గడ్డిపోచకీ విలువుంటుంది

బతుకునెంతో పరవశింపజేసినా...
కోల్పోయినాకే ఆ పాట విలువ తెలిసింది
ఆ పాడిన మనిషి విలువ తెలిసింది

ఇప్పుడు ...
ఆ వెళ్ళే రైల్లో పాట కోల్పోయిన అనాథలెందరో!

"పర్ దేశీ పర్ దేశీ జానా నహీ
ముఝే చోడ్ కే ముఝే చోడ్ కే...
పర్ దేశీ మేరీ యారా వాదా నిభానా
ముఝే యాద్ రఖ్ నా కహీ భూల్ నా జానా..."

❖ ❖ ❖

(20 డిసెంబర్ 2005)
(ప్రజాసాహితి మాసపత్రిక)

ప్రాంతీయ చైతన్యం!

ఆర్పవలసింది ముందు బ్లో అవుట్స్‌ని కాదు
అవన్నీ తాత్కాలికమే
తరలిపోతున్న సంపద...
కాలి బూడిదవుతున్న ప్రాంతం...
ఆ మట్టిలో పుట్టినోళ్ళలో మట్టి...
దోబూచులాటల్లో మోసం...
తప్పని సరై రగులుతున్న గుండె మంటలు...
ఈ మంటలార్పండి ముందు!
రాయలసీమ, తెలంగాణ, కోనసీమ...
ప్రాంతాలుగా విడిపోతేనేమి
అస్తిత్వ పోరాట ధ్వనుల్లో ...స్థానిక గొంతుల్నీ వినండి
రియలెస్టేట్స్, ఇండస్ట్రియలిస్ట్స్, బ్యూరోక్రాట్స్...
పేర్లేవైతేనేమి
అంతా దోపిడీల నయా వలసవాదమే.
ఫ్యాక్షనిజం, క్యాస్టిజం, ఆక్వాయిజం...
అంతా పొల్యూషనే...
పూరి గుడిసెలన్నీ తవ్వోడలకే బలి
అంతర్జాతీయ రింగ్ టోన్
ఆకాశ హార్మ్యాల్లో " గూడు" పుతానీలు
ప్రతీ ప్రాంతమిప్పుడు డబ్ల్యుటివొ ముగ్గులతో కళ కళలు!
ఒక్క ప్రాంతమైనా చూడగలరా
ఇవిగో నమ్ముకున్న నేలతల్లికి పెట్టిన రంధ్రాలు
చమురన్వేషణలో పచ్చదనాల్లోని విధ్వంసాలు
కుప్పకూలిన చెట్టంత అనుబంధాలు

పైసా పైసా కూడబెట్టుకున్న అరెకరం
కొండచిలువై మింగేసిన రొయ్యల చెరువు
చూపలేనివింకా ఎన్నెన్నో...!
పేదరాసి పెద్దమ్మ
పరిగ గింజల్ని కలబెట్టుకోవడానికే
కరువైన కట్టెలు
శవాన్ని తగలబెట్టడానికెలా వస్తాయ్ ?
గ్యాసిక్కడే పుడుతున్నా
ఇంధనంగా దాన్ని మార్చుకోలేని అశక్తత!
ఒంట్లో, ఇంట్లో, కంట్లో, అన్నింట్లోనూ
ఏవేవో ప్రలోభాలు!
కోనసీమిప్పుడు
ప్రపంచ బ్యాంకుకి డబ్బు కట్టల్ని మోసే
రోజు వారీ కూలీ!
కోనసీమిప్పుడు
బ్లో అవుట్స్ రూపంలో రక్తం కక్కుతున్న
కలర్ టి.వి.!
కోనసీమిప్పుడు ఓ దారుణ ప్రియదర్శనం!!

❖ ❖ ❖

('తూరుపు' కళింగాంధ్ర కవిత్వం : 2006)

కాంక్రీటు పిచ్చుగూళ్ళలో...!

అమ్మని నా దగ్గరే పెట్టుకుని
అన్నీ నేనై సాకాలనుందన్నాను
రెక్కలు కట్టుకున్న అమ్మ
ఆ పల్లె నుండి ఈ నగరాని కెగబాకిన తీగను తాకింది

ఒకప్పుడు కొంగు పట్టుకుని వేలాడిన చిట్టి చేతులే
తినమని నోట్లో ముద్దలు పెడతాయనుకుంటే
రూపాయల కట్టలతో పాటు అన్నీ పళ్ళెంలో పోసి
అన్నీ అమ్మ ముందు పెట్టేసి హడావిడిగా ఆఫీసుకేవో
మోసుకుపోతుంటాయ్ బరువు బరువుగా !

సద్ది పెట్టెలో అన్నీ పెట్టాం
ఇంట్లో రంగుల టి.వి.,
మాట్లాడాలంటే ఫోను
కాంక్రీటు పిచ్చుగూళ్ళల్లో
చుట్టూ జన సంద్రం పలకరించే మనిషి తప్ప!

మెట్లెక్కుతాను అర్ధరాత్రో, అపరాత్రో
ఆమే, నేనూ చెరో చేత్తో
బిర్యానీ ప్యాకట్టో, పూర్తి చేయాల్సిన ఆఫీసు ఫైలుతోనో!
గుర్తుకొస్తాయ్
చల్లారి పోయిన పదార్థాలు ముందున్నపుడు
అమ్మ వేడి వేడిగా వడ్డించిన అమృత రుచులు!
అమ్మపై తొక్కిన చిందులు!
వచ్చిన నిమిష మింకా కాకుండానే
రింగు రింగున మోగే కర్ణభూషణం

అమ్మతో మాట్లాడదామనుకున్నంతలోనే
కొంపలు మునిగిపోయేలా
మనసుని వికలం చేసే సంభాషణేదో సాగిపోతుంది
నెట్ వర్క్ అందనట్లు మధ్య మధ్యలో
"ఆ... ఏంటమ్మా ... ఇందాకేదో అన్నావ్..."
మళ్ళీ రింగు రింగుల కర్ణభూషణం
మనసెరిగిన అమ్మ మౌనిలా మారిపోతుంది
పొద్దున్నుండీ మాట్లాడాలనుకున్న
ప్రవాహాన్నంతా గొంతులోనే కుక్కేస్తుంది
అలాంటప్పుడు అమ్మను చూడాలంటే భయం
అలాంటప్పుడు అమ్మతో మాట్లాడాలంటేనే భయం
అలాంటప్పుడు అమ్మను ఇంటికి రమ్మనాలంటేనే భయం!!
ఇవేనా ఒకప్పుడు వదిలి ఉండలేనని
మారాం చేసిన చిట్టి పొట్టి పాదాలు?
ఇవేనా ఒకప్పుడు
పెద్దయ్యాక కార్లో ఊళ్ళన్నీ తిప్పుతాననీ
ఊయల్లో ఊపుతాననీ
ఉద్యోగం చేసి కష్టాలన్నీ తీర్చేస్తాననీ
పువ్వుల్తో దేవతలా పూజిస్తాననీ...
తీయని కబుర్లెన్నో చెప్పి తేనె కార్చిన పెదవులు?

❖ ❖ ❖

(ముంబై ఒన్ మాసపత్రిక, సూర్య దినపత్రిక, 18 ఫిబ్రవరి, 2013)

వింటావులే... నిశ్శబ్ద విస్ఫోటనం!

డియర్ సద్దాం!
నీకు తెలుసా వాడిప్పుడు
మృత్యువై వెంటాడుతున్న మృత్యువు వాడు
భయం నటించడం కూడా ఇష్టపడని
జెడ్ కేటగిరిలో నిర్భయ జీవిత మతడు
ప్రజాస్వామ్యాన్నీ, సార్వభౌమాధికారాల్నీ
జీర్ణం చేసుకున్న అగ్రరాజ్యాధిపత్యమతడు!
వాడిప్పుడే కాదు
ఎప్పుడూ ప్రజాస్వామ్యాన్ని స్నేహిస్తూ
రాజరికాన్నే ఆలింగనం చేసుకుంటాడు
ప్రజాస్వామ్యానికి తేనెపూసి
నియంతృత్వంతో నాలుక తెగేలా చేస్తాడు
వాడిప్పుడేకాదు ఎప్పుడూ చెప్పిన మాటకు
చేసిన పనికీ పొంతనుండనివ్వడు
మన నీటినీ, కన్నీటినీ తాగుతాడు
మన గాలినీ, మన ఊపిరినీ పీల్చేస్తాడు
వాడెప్పుడూ ఓ విత్తనమయ్యో, ఓవృక్షమయ్యో ఓ పేటంటయ్యో
మన మేథో తీరమ్మీద స్వారీ చేస్తుంటాడు
ప్రేమతో కౌగిలించుకున్నా
ప్రతీకారంతో రగిలిపోయినా
వాడి గురించి ఒక్కమాటలో చెప్పాలంటే
నిలువెత్తు విశ్వమానవత్వ నాశన రూపమతడు!

కాలు కింద భూమి కదులుతోంది
కనికరం పనిచేయదు మౌనం బద్దలవ్వాల్సిందే
బొందిలో ప్రాణం
బొందలో పెట్టకముందే మేల్కోవాల్సిందే!
వాడి కలల గుడారాల్ని కూల్చాల్సిందే!!
మైడియర్ సద్దాం!
అందరూ చావాల్సిందే
చావుకి నిర్భీతితో కొత్త నిర్వచన మిచ్చావ్
నీలోనూ లోపాలున్నా
యుద్ధం చేయాల్సిన వాడితోనే
నువ్వు యుద్ధం చేస్తున్నందుకేనేమో
నీతో చేస్తున్నా నా కరచాలనం
ప్రపంచాన్ని శాసిస్తున్న శాసనాన్ని
ధిక్కరించినందుకే నీకు నేను చేస్తున్నా ఓ సలామ్!
నిజానికి ఓడిపోయిందెవరో మాకందరికీ తెలుసు
నిజానికి ప్రపంచ ప్రజల గురికి వేలాడదీసిందెవరో
మాకు తెలుసు!
కట్టేసి కాల్చేసి
ఎన్‌కౌంటర్లంటున్న వాటిని ఎన్నింటిని చూడట్లేదు
ఓటేసేవరకూ
హొూరెత్తే వాగ్దానాలెన్నింటిని వినట్లేదు

❖ ❖ ❖

(2000)

పిచ్చోడి మీద జాలేస్తుంది!

పిచ్చోడి మీద జాలేస్తుంది
పిచ్చోడు తన– పర భేదం గుర్తించలేక
అర్థం పర్థం లేని అరుపులతో
విసిరే రాళ్ళకు జాలి కాక మరేమి చేస్తుంది.
విశ్వమే నాదంటాడు
తానే దానికధిపతి నంటాడు
కులికేది మాత్రం
రాళ్ళూ, ముళ్ళూ కుప్ప లేసుకున్న ఇంద్రభవనంలోనే!!
మాటకీ చేతకీ పొంతనుండదు
వ్యక్తావ్యక్త ప్రేలాపనకు అర్థమేమిటో
తనకేమి కావాలో తనకే తెలియదు
నిరంతరం తానొక సుడిగుండమవుతుంటాడు
పిచ్చోడి మీద జాలేస్తుంది!
మురికి నీళ్ళొద్దని మంచి నీళ్ళిచ్చినా
అన్ని రుచులతో సన్న బియ్యమన్నం పెట్టినా
విషమంటూ విసిరికొడ్తాడు
మళ్ళీ తానే పట్టెడన్నం పెట్టమని అరుస్తుంటాడు
పిచ్చోడి మీద జాలేస్తుంది!
అతడిదే సౌందర్యమో అంతు పట్టదెవ్వరికీ
నిత్యం అమావాస్యలోనే పున్నమినీ
నిండు పౌర్ణమిలోనే అమాసనీ వెతుక్కుంటాడు
ప్రకృతితో తాదాత్మమయ్యే కళా తాత్వికుడ్ని

కారణం లేకుండానే కరుస్తుంటాడు
పిచ్చోడి మీద జాలేస్తుంది!
నడవడమే చేతకానివాడు
పరుగు పెట్టేవాళ్ళతో పోటీపడుతూ
పాదచార్లందరికీ అడ్డు పడుతుంటాడు
తనస్థితిని తానే అర్థం చేసుకోలేక
"రోడ్డు" నే ధ్వంసం చేయాలనుకుంటాడు
ఇసుకరేణువుల్నైనా పెళ్ళగించలేక బోర్లాపడుతుంటాడు
పిచ్చోడి మీద జాలేస్తుంది!
అవసరార్థం పవిత్రా పవిత్ర భేదాల్ని మరిచి
తల్లినీ, చెల్లినీ, భార్యనీ వేధిస్తుంటాడు
ఎప్పుడే మవుతుందోనని ముదురుతున్న మధాన్ని మాన్పలేక
వాళ్ళూ పిచ్చోళ్ళు కాలేక
వాడ్ని గుళ్ళోకీ, ఊళ్ళోకీ రాకుండా తరిమేస్తారు
పిచ్చోడి మీద జాలేస్తుంది!
నిజమే... నీచేష్టలన్నీ చూస్తుంటేనే కదా
ప్రవర్తనకీ, ప్రవర్తనకీ మధ్య
నువ్వొక విభజన రేఖవనిపిస్తుంది
నిన్ను చూసినప్పుడే నిజంగా నాకు జ్ఞానోదయమైంది
నిన్ను చూసినప్పుడే నిజంగా నేనెలా వుండాలో తెల్సింది
నాకిప్పుడేంటో గానీ...పిచ్చోడి మీద ప్రేమ పుడుతోంది!!

❖ ❖ ❖

(2-11-2004)

ఒక పెట్రోల్ సంతకం!

ఔను... బ్లాక్ మెయిలింగ్ కరెక్టే
అది మాదా? మీదా?
అదే నాకర్థం కావడం లేదు!
అన్యాయాన్ని అన్యాయమని గొంతెత్తినప్పుడల్లా
మమ్మల్నేదోలా నిందించడం
మీకు మామూలైపోయిందనుకున్నాం
చేతిలో కిరసనాయిల్ బాటిల్ చూసినప్పుడల్లా
సెల్ టవరెక్కి రోదిస్తున్నప్పుడూ
మాది బ్లాక్ మెయిలింగని
అడ్డగోలుగా మాట్లాడావు
రా...
నిండుహృదయంతో రా... చూద్దువు గాని
నీకింకా తెలిదేమో
మాదీ న్యాయపోరాటమేనని
ఎలుగెత్తి చాటమని
వర్గీకరణ సూర్యుడు తానో పెట్రోల్ సంతకమయ్యాడు
రా...
రాజ్యాంగం సాక్షిగా చూద్దువు గాని...
రా...
మన రిజర్వేషన్స్ కి ఇస్తున్నట్లే ఇచ్చిన
కమిటీ రిపోర్ట్స్ సాక్షిగా చూద్దువు గాని...
రా...
టవర్లెక్కి చర్మరోగాలతో కూరుకుపోయిన

ఉద్యమకారుల వేదనల సాక్షిగా చూద్దువు గాని...
రా...
ఎంతకక్కినా బయటకు రాని
నిరసనల కిరోసిన్ వాసనల సాక్షిగా చూద్దువు గాని...
మాదో నీదో బ్లాక్ మెయిలింగ్!
మీరింకా ఉమ్మడి బావుల్ని
మూకుమ్మడిగానే తోడుకోండి
మీరింకా సినిమా నటీమణుల త్యాగాల్ని
విదేశీ రాణుల ప్రణయాల్నే పరవశించి రాసుకోండి
చచ్చిన శవాలపైనే దశాబ్దోత్సవాలు చేసుకోండి
మేము మాత్రం
కనీసం రెండు మెతుకుల కోసమైనా
మాప్రాణాల్ని సురేందర్‌లా జెండాను చేసి ఎగరేస్తాం!
మా కలాల నిండా
మా నెత్తురును సిరాగా నింపుకుంటాం!

❖ ❖ ❖

(పొన్నాల సురేంద్రమాదిగ స్మృతి సంచిక)

కోస్తా మాదిగోళ్ళూ తెలంగాణ బాటలోనే...!

మీలాగే మేమూ
మాకు రావాల్సినయన్నీ మాకియ్యమని
మా సోదరుల్తో పోరాడుతున్నోళ్ళమేనండి!
ఏదో బతుకు తెరువెతుక్కొంటూ
కడుపులోకి కాసిన్ని గెంజికోసం వచ్చినోళ్ళమేనండి!
మేమేమీ వోమనోదు లాంటోల్లం కాదులెండి
మీ అధికారాన్ని గుంజుకోవడానికో
మీపై తెల్లోడల్లే పెత్తనం సెలాయించడానికో
వచ్చినోళ్ళం కాదులెండి!
రియలెస్టేట్ యాపారం సేత్తూ
మీ భూములన్నీ లాక్కోవడానికొచ్చినోళ్ళం అసలే కాదండి!
అందర్లా మీరూ మమ్మల్ని అనుమానంతో సూసినా
మొన్నటి దాకా మనదంతా ఒకటే బాసంటే
అచ్చరాలా నిజమనుకున్నామండి
మొన్నటిదాకా మిమ్మల్ని మాట్టాడించి నప్పుడల్లా
మాకెందుకో నవ్వొచ్చేసేదండి
ఆయ్... నిజ్జంగానండి
రౌడీలు, దొంగలూ, హాస్యగాళ్ళతోనే
మీ బాసలోనే మాట్టాడిత్తున్నారని
నిజ్జంగా మాకప్పుడు తెలీదండి...ఆయ్!
ఈమద్దె మమ్మల్నీ అలాగే మాట్లాడిత్తుంటేనే
మాకూ తెలిసిందండి...

మా బాసనేదో అబాసు పాల్జేత్తున్నారని!
మా బాసతోనే మమ్మల్ని యేలనజ్జేత్తున్నారని
మా బాసతోనే మమ్మల్ని సంతలో అమ్మేత్తున్నారని!!
మీకూ మాకూ సేలా యిసయాల్లో పోలికలున్నాయండీ
నిజ్జానికి మనిద్దరిదీ
"ఉమ్మడి" తెచ్చిన తంటాలేనండి!
మనిద్దరమిప్పుడు
"జాతీ యని" బంధంలో చిక్కుకుపోయామండీ!
రాజ్జెమైనా,రాజ్జాంగమైనా పెజల గోసినాల గందా
మా కులపెద్దలే నయమేమో నండీ...
కాత్త కల్లో గలాసు సారో తాగేసి
అటో యిటో తగువు తేల్చేత్తారండీ
యీళ్ళేంటండీ...
మా వూళ్ళో అమ్మోర్లా
అన్నీ సెప్పినా అర్థం కానట్టు
పెద్ద పెద్ద కళ్ళేసుకుని మిడిగుడ్డుల్తో సూడ్డమే తప్ప
పెదాల్నిప్పట్లేదేంటండీ...!
బాసా పెయత్తనంగానో
ఉమ్మడి సెద్యూలుగానో
గారడీవోళ్ళ
యేయో విద్దెల్తో
మాయల్నే సేత్తున్నారు సుమండీ!
యెవళ్ళకో యెప్పుడో యిచ్చిన వరాలే
మాకిప్పుడు ఒరకత్తులవుతాయని
మేమెప్పుడూ అనుకోలేదండి

ఆయ్...

ఆ కత్తుల కోత బాదేంటో

మాకిప్పుడే తెలిసొస్తుందండీ!

ఆయ్..

యింకా సెప్పాలండీ...!

మాదీ గోదారి జిల్లానే నండి

గోదారోళ్ళంతా

గోదాల్లా బొజ్జలు పెంచుకున్నోళ్లే కాదండోయ్!

మమల్నందరినీ చేరదీసిన కిరస్తానీ వోళ్ళు

సదువులూ సంస్కారం నేర్పారంటారే

ఆ దళితులనే మమ్మల్నీ పిలుత్తార్లెండి

ఇంకా సెప్పేదేముందండీ

చెప్పులు కుట్టుకుంటూ

యే రోడ్డు మూల్లోనో తప్ప

సదువుకుని సర్కారు కొలువులో వున్న

మా మాదిగోళ్ళను లెక్కపెట్టండి

వేళ్ళమీద కూడా కనపడరండి!

ఇసాలాంధ్రలో ఇసాల భావాలెక్కడున్నాయని

మీరెతుకుతున్నట్టే

మాల మాదిగోళ్ళంతా యెక్కడ ఒక్కటో

యిళ్ళల్లోనో

పెళ్ళిల్ల లోనో

సివరికి సొశానంలోనైనా

యెక్కడైనా ఒక్కటై కనిపిత్తా రేమోనని

తెగయెతుకు తున్నామండి
మాకూ నేతిబీరకాయలో నెయ్యే
దొరికేత్తందంటే నమ్మండి!
ఈ నేతి బీరకాయల్ని పంచేటోళ్ళంతా
మా మాల మాదిగల్నిక కలవ నియ్యమనుకుంటున్నారేమో
మా కుటుంబ కలహాల్లో తప్ప
మా కష్ట కాలాల్లో
మేమూ నూటైదుమందిమేనని
నిరూపించే సమయమూ ఒకటుందని తెలుసులెండి!!

❖ ❖ ❖

(*కావడికుండలు* :2010, *మునుం* కవితా సంకలనాలు, 2013)

నాన్న స్పర్శ

వలస పక్షి కిప్పుడేదో విరిగిన చప్పుడు
చెట్టు నిండా పండ్లు
కొమ్మల్నీ, రెమ్మల్నీ అలముకున్న ఏకాకులు
పండిన వెలితి
ఎంత తీయని బంధం
నోట్లో ఊరుతున్న కాకరకాయ రసం

పొద్దున్నే భుజాన్నెక్కుతున్న సూర్యుడు
రైలు దిగినప్పుడు వెన్నెలవుతాడు
పాద లేపనాలు, అగ్ని హోత్రాలు, మంత్ర మహిమలు
యంత్ర భూతాలు, హిమాలయాలు, స్వర్గ నరకాలు
ఏకధాటిగా కురిపించిన రసం
ఉక్కిరి బిక్కిరై
చందమామ కౌగిళ్ళలో రసాభాసం!

తట్టుకోలేక పోతున్నాను
కాసేపు మట్టివాసనల్నీ, పైరుగాలినీ పీల్చాలి!
అవిగో నీటి కయ్యల్లో ఎగిసిపడే చేది పరిగలు
నాన్న పువ్వులా విసిరిన
వలలో పడుతున్న నీటి దండలు
ఆకాశమంత ఎత్తు నుండే
నాన్న అందించే ముంజకాయలు

పొలాల్లో పలకరిస్తున్న కందికాయలు...
"నమో వెంకటేశా...
నమో తిరుమలేశా..."
మా టూరింగు టాకీసులో సినిమా మొదలయ్యింది
నాన్న భుజమ్మీద చంటి పిల్లాడినై పోవాలి!
కానీ...అదిగో ...

నాన్న ఒంట్లో మూలుగలన్నీ పీల్చేసి
చిన్నన్నయ్య జీవితాన్నంతా తాగేసి
కుమ్మన రాజు కొబ్బరి తోటలో
దారి కడ్డంగా నిలబడ్డ రక్తం తాగే రాక్షసి!!

❖ ❖ ❖

(*వార్త ఆదివారం అనుబంధం*
సృజనలోకం, వరంగల్ వారి *నాయిన* కవితా సంపుటి : 2006)

నానీ... నువ్వెప్పుడొస్తావు రా !

"డాడీ... ఇన్నాళ్ళూ నువ్వెక్కడున్నావు
నీకెన్నో చెప్పాలి...
నీ కెన్నో ముద్దులివ్వాలి"

ప్రతి రోజూ ఒకటే కల!
నానీ... ఇంకా పుట్టని నా చిట్టికన్నా
ఇంత అర్థరాత్రి ముఖం కడుగుతారేంటని
అమాయకంగా అడిగే మీ అమ్మకు
నేనేమని చెప్పను రా
ప్రతి కలకీ నువ్విస్తున్న
కన్నీటి ముత్యాల దండల్ని
బాత్‌రూములో దాచేస్తున్నానని చెప్పనా
నా మధుమోహనాంగీ!
మళ్ళీ మళ్ళీ పిలుస్తుంటుందని చెప్పనా
పిచ్చిదిరా మీ అమ్మ
నేనేది చెప్పినా నమ్మేస్తుంది
నిన్నూ నాలోనే చూసుకుంటుంది కదా!
ఇప్పటికే ఊహలకి రెక్కల్ని తొడిగి
నీకో అక్కను చేసి
అందరికీ
నేనో అబద్దాల కోరునయ్యాను రా
సముద్రమంత వేదనని కడుపులో దాచుకునీ

నన్నూరడించే అమ్మతోనూ
నువ్వాడుకుంటున్న
కలవరింతల్ని
కనిపెట్టలేననుకుంటున్నావు రా !
రా రా నానీ
రారా నా చిట్టి కన్నా
నువ్వు రాకపోతే
మబ్బుల్ని వెతుక్కుంటూ
నేనే వచ్చేస్తాను !

❖ ❖ ❖

(ప్రతీ ఏడాదీ జూన్ మూడవ ఆదివారం ఫాదర్స్ డే)
(వార్త ఆదివారం అనుబంధం: 23 డిసెంబర్ 2012)

ఇక్కడ పుట్టడమే నేరమా?

పుట్టుక గురించెవరైనా మాట్లాడుతుంటే
నా వెన్నులో
వణుకు పుట్టు కొస్తుంది

విశ్వం పుట్టడానికెన్ని సిద్ధాంతాలున్నాయో...
నాకు తెలియదు కానీ...
ఈ ప్రపంచంలో నేను పుట్టడానికి మాత్రం
ఒక్కటే సిద్ధాంతం
వంశ పారంపర్యంగా దళిత కుటుంబం వాళ్ళే
దేవుడి పెళ్ళాలై పోవడం!!

భూస్వామ్యానికి భోగవస్తువునై
పెత్తందారీ చిత్తాన్ని
రాగరంజితం చేయడం!
వాళ్ళ కామదాహానికి బలైపోతూ
తరతరాలుగా మాతంగిగా నలిగిపోవడం!

అంతా పుట్టుక గురించి
ఏవేవో పురాణాల్ని పవిత్రంగా వినిపిస్తుంటే
నేను కూడా
ఏ పోలేరమ్మనో,
ఏ పోచమ్మనో
వాళ్ళందర్నీ

రచ్చబండ మీద కీడ్చుకొచ్చి
నేనెవడికి పుట్టానో
నా కెవడి వల్ల ఎవడు పుట్టాడో
ఆ దేవతల
చేతనే చెప్పించాలనిపిస్తుంది!

అయినా నాకో అనుమానం ...
మహాపురుషుల పాదాల నుంచి పుట్టినోళ్ళు తప్ప
ఈ దేవుళ్ళెవ్వరికీ
ఇతరుల యవ్వనాలంతగా రుచించవేమో ? !

❖ ❖ ❖

(*ఆంధ్రప్రభ సాహితీగవాక్షం*, 29 జనవరి 2007)

వికసించిన నల్ల వజ్రం!

శంబూకుడు...
రాముద్నెదిరించిన శంబూకుడై
అందమైన ఓ కలగన్నాడు

అడవి తల్లి సవ్వడి విని
అడవిలో పుష్పమయ్యాడు
ఎఱ్రజెండాను గుండెకు గుచ్చుకొని
గజ్జె కట్టిన పిడికిలయ్యాడు

బరువెక్కుతున్నా
అరుణారుణిమలోనే
అమరమవుతున్న గుండె
జెండాలా రెపరెపలాడాలనుకుంది

జెండా
ఉపరితలంలోనే ఊగిసలాడుతున్నా
నీడ నేలకే కదా చేరుతుందనుకున్నాడు

కారుతున్న నల్ల రక్త స్పర్శ వల్లనో
ఎంత అరిచినా నల్ల గొంతుల ఆర్తనాదాలు
వినిపించనివ్వకుండా అడ్డుకున్నందు వల్లనో
కలవరంతో నల్లబారిన ముఖాల్ని
తెల్లబోయి చూశాడు

బరువెక్కుతున్న గుండెల్నీ
తిమ్మిరెక్కుతున్నా పిడికిల్నీ తాకకుండా
శ్లోకాన్నర్థం కానివ్వని సీసంలా
"ఆ" పుట్టుక వాసన గిట్టనిది పునాది నాయకత్వం!

పోగొట్టుకున్న చోటునుండే వెతకాలి
మట్టి వాసన గిట్టని సుత్తీ కొడవళ్ళకు
మట్టి వాసనలోని మహత్తును చూపాలి
పగిలిన స్వప్నం నుండే
నల్ల వజ్రమై వికసించాడు
జెండా పునాదిలో
కులం బలం నిరూపించడానికో
చైతన్యవంతమైన ప్రతీకయ్యాడు!

***

(శంబుక ప్రత్యేక సంచిక : 2005)

వారసత్వం?

మా ముత్తాత
చెప్పులు కుట్టేవాడు

మా తాత
కూలి కెళ్ళేవాడు

మా అయ్యేమో
అక్షరం కోసం ఆశగా
ఎదురు చూసేవాడు

నేనిప్పుడు
కవిత్వం రాస్తున్నాను

రేపు
నా కొడుకు
ప్రొఫెసరవుతాడు!

❖ ❖ ❖

ఒక మధురానుభూతి

కలలా ఉంది
కళగా ఉంది
కల నిజమైనట్లుంది
రాయలసీమ కరువు తీరినట్లుంది
తెలంగాణా వీణ మోగినట్లుంది
కోనసీమ మీగడ బొండం తాగినట్లుంది
పండిన గుంటూరు మిరపతోటలా కమనీయంగా ఉంది
డిసెంబరు నెల్లో కప్పేసిన మంచుని జయించిన
కొత్త సంవత్సరం కొత్త పొద్దులా ఉంది

ఎంత మారిపోయిందిప్పుడు
నాడు మూలకి విసిరేసి
బూజు పట్టిన భావాలతో నిండిన గదిలా
ఆధునికతను అవతలకి విసిరేసినట్లుండేది
నేడెంత మారిపోయిందిప్పుడు!

పాఠాలు విన్న విద్యార్థి స్థానం మారినా
'ఆ' స్థానం మారని నిత్య విద్యార్థినవుతూనే
మాష్టారు ముందు నిలబడేదెప్పుడూ…
చదువుకున్న చోటే చదువు చెప్పే చోటయ్యింది
చెప్పలేనా మధురానుభూతి
చదువు చెప్పిన గురువులే

సహాధ్యాపకుడిగా ఒడి చేర్చుకున్నప్పుడు
ఎలా వర్ణించగలనా దివ్యానుభూతి!

కలలా ఉంది తళతళ మెరిపోతోంది
తెలుగుకన్న కంప్యూటర్ కలని
తెరమీదే చూస్తున్నట్లుంది
పైకొచ్చే కొద్దీ పొద్దుని చుట్టేస్తూ
మేధోతీరం మీద వాలి
మింగేయాలని చూసే కర్ణ గ్రహణాలు
ఆపగలవా ఆ నిజకిరణాల్ని!
పాస్ వర్డ్సేకాదు
అవకాశాల్తో చొచ్చుకొచ్చే వైరస్‌నీ
కనిపెట్టగలడా అవధాన కవి రవి
కడిగిన ముత్యమై
పైపైకొచ్చే అమృతంగమయ భానూదయుడే!

అనుభవమిదిగో నా స్మృతి పథంలో
ఆ అరవైలో చూశాను
ఆరేళ్ళ బాల్యం నడిచిన ముద్రల్నీ
ఒక్కొక్క అడుగు పడినప్పుడల్లా
అమరావతి గుడిగంటలు మీ గుండెల్లో
ప్రతిధ్వనించిన పులకాంకురాల్నీ
గుడిలో కనిపించిన బడిలో మాష్టారింకా
పేరుపెట్టే పిలుస్తుంటే చూశాను
ఆనందాశ్రువుల్లో మెరిసిపోతున్న కళ్ళనీ
ఒదిగి ఒదిగి ప్రవహిస్తున్న
ఆచార్యత్వంలోనూ మీ వినయాన్ని!
ఆ ఆరవైలోనే చూశాను
పదహారేళ్ళ నవయౌవన ప్రాయాన్నీ

అమరం వరమైన పద్యాల హారంతో
ఒళ్ళు పులకరించిన కృష్ణానదినీ
అదిగో ఆ మురళీ మాధుర్య గానంలో
సరస రుచులూరిస్తున్న
బాల్య సఖుడ్ని చూసినప్పుడల్లా
కృష్ణవేణి మళ్ళీ మళ్ళీ పొంగుతోంది!

ఆ అరవైలోనే చూశాను పుట్టిన ఊరూ
కన్నతల్లి స్పర్శతో రూపుకట్టిన పసిమొగ్గవ్వడాన్నీ
శిథిల శకలాల్లోనే సౌందర్య భరితమైన
జన్మస్థలాన్ని దర్శించిన మీ ఉద్వేగాన్నీ!!

పురావస్తు శాఖకు చెప్పాలి
అమ్మలా ఆహ్వానించే
చల్లని వేపచెట్లనీ, అశ్వత్థ వృక్షాల్నీ
మళ్ళీ మళ్ళీ మనోహరంగా కనిపించే
మనిషి పుట్టిన ప్రతిచోటునీ
బ్రహ్మరాతల్లో రాసుకున్న
వారాలబ్బాయి మట్టి పలకల్నీ
జ్ఞాపకాలై పుష్పించే
స్మృతికెరటాలేవో తవ్వుకొచ్చే

వీథి వీథుల్నీ
ప్రొటెక్టెడ్ ఏరియాలుగా ప్రకటించాలని
పురావస్తుశాఖకు చెప్పాలి !
కలలా ఉంది
కలలోని కళ కళ్ళెదుటే ప్రత్యక్షమైనట్లుంది

ఆయన పలికే ప్రతి పలుకూ సావధానం
మేథో గీతగీసే సంతకమో చమత్కారం
అహర్నిశలు శ్రమించే వారికో పురస్కారం
భాషా సాహిత్య సంస్కృతులూ
ప్రాజెక్టుల్లో చేరి
నల్లబల్లపై కదులుతున్న తెల్ల పావురాలు
ఎంత మారిపోయిందిప్పుడు ఈ తెలుగుశాఖ
పునాదుల్లోని పూరిగుడిసె
నవజీవన కాంతుల్తో కొత్తజన్మ ఎత్తినట్లే ఉంది.

❖ ❖ ❖

(ఆచార్య పరిమిరామనరసింహంగారి షష్టిపూర్తి సంచిక, 2006)

మరక మంచిదే

మనుషుల్ని రోబోలుగా రోబోల్ని మనుషులుగా చేసేయ్.
మరక మంచిదే నంటూ గొడుగు మ్యాన్ కీ
ఉతుక్కోవడానికో సబ్బునిచ్చేయ్
శిక్షణ నిచ్చేదీ, శిక్షించేదీ నువ్వే
నటించమనేదీ ఆ నాట్య విన్యాసాల్ని
రంగుల డబ్బాల్లో చూపించేదీ నువ్వే.
తెలియకొకసారి నీ వల్లో పడినా
తెలిసినా బయటపడలేని మన్మోహనం నీది
తెలియనట్లు నటించేయక తప్పని తిప్పలు
ప్రపంచానికో సుందరిని ప్రకటించు
విలువలూ, వలువలూ అన్నీ ఒలిచేయ్
ప్రపంచ నలుమూలల్నుండీ
ప్రపంచానికి కనిపించని లావాదేవీలన్నీ ముగించేసేయ్
నీకు నువ్వే సాటి
నమ్మకాన్ని నమ్మే వాళ్ళున్నంతకాలం
నీ నమ్మకాన్ని కొనేవాళ్ళున్నంతకాలం
నిన్ను నమ్మేవాళ్ళున్నంతకాలం
నీకు నువ్వేసాటి.
మనుషుల్ని రోబోలుగా
రోబోల్ని మనుషులుగా చేసేయ్ మరకమంచిదే!!

❖ ❖ ❖

రహస్యం విప్పిన చిలుక!

నిన్నటి దాకా నా సీతాకోకచిలుక
రెక్కలు తొడిగినట్లుండే
కోటి సోయగాల కోనసీమ
సంక్రాంతి ముగ్గుల్లో
పారాణింకా ఆరని సిగ్గు మొగ్గల్లో
దీపావళి కాంతుల నిత్య సింగారిణి!
గుండెల్లో కొలస్ట్రాల్ పేల్చిన పేలుళ్ళకో
నమ్మిన మనసు దహించిన బ్లోఅవుట్లకో
"మారక"ద్రవ్యమై
హాస్పిటల్ బెడ్‌పై వాలిపోయింది!
చూపులన్నీ నిర్జీవాలు
కోప తాపాలన్నీ బలవంతపు ప్రయత్నాలు
మాటల్లో వేదాంతం
చేతల్లో విద్యుక్తం
క్షణ క్షణాల్లో జీవితం
వరం పొందాకే నిర్వేదం!
నీటి బుడగలో, మట్టి కుండలో
కొవ్వొత్తి వెలుగులో
ఆకాశ నక్షత్రాల్లో...
తెలుస్తున్న జీవ రహస్యం!

❖ ❖ ❖

(ఆంధ్రభూమి 'సాహితి' సాహిత్యానుబంధం, 15 ఆగస్టు 2010)

అంతా భ్రాంతియేనా...

నాకోసం ఎవరో
ఎదురు చూస్తుంటారు
నేను వెళ్ళాలి
నేను వెళ్ళకపోతే
ఎంతమందికి నిరాశ
నేను వెళ్ళకపోతే
ఎన్ని పనులాగిపోతాయ్!
అంతా నిజమేనా
ఫోను స్విచ్చాఫ్ చేసినప్పుడు
చాన్నాళ్ళ నుండీ మెయిల్ తెరవనప్పుడు
కొన్నాళ్ళు ఆఫీసుకి వెళ్ళనప్పుడు
ఇంటికి ఆలస్యమైనప్పుడు
చెప్పిన సమయానికి వెళ్ళలేనప్పుడు
మన కోసం వాళ్ళూ
వాళ్ళ కోసం మనమూ
ఇలాగే అనుకుంటామా?
ఏమో!

❖ ❖ ❖

ఒక తాత్త్విక లోకంలో...!

నువ్వు నా కళ్ళల్లోకి చేరి
ఆకాశమంతటా
దృశ్యాదృశ్యాలతో
కాంతి గీతాల్ని నింపేస్తుంటావు
నీలో లీనమైనప్పుడల్లా
ఉన్మత్తమైన పోటీకి
పోటీగా మారకుండా
ప్రపంచమే నేనౌతూ
ప్రపంచాన్ని మించిన
అస్తిత్వమేదో
కొట్టుమిట్టాడు తుంటుంది!

❖ ❖ ❖

(ఆదివారం ఆంధ్రభూమి అనుబంధం: 24 జనవరి 1999)

అణువులో అణువునై ...

అలా నీలో తడుస్తున్నంత సేపూ
నాలో ఎక్కడినుండి ప్రవహిస్తుందో
తనువంతా కాంతులీనుతున్న
ఓ విద్యుల్లత!
మనసంతా మేఘాల్లో తుళ్ళింత!!
ఏకాకిని చేసి భయపెట్టే
నిరాశ నిశీధికి
నిలయమైన నాకళ్ళు
నీరాకతో తేజోవంతమై మెరిసిపోతున్నాయ్
ఆ అణువులో ఒక అణువునై
లయమై పోవాలనుకునే
ఇన్నేళ్ళ నిరీక్షణకో
సుమధుర సుందర సాక్షాత్కారం!!

❖ ❖ ❖

('మూసీ' ద్వైవార్షిక ప్రత్యేక సంచిక : నవంబరు-డిసెంబరు, 1999)

నువ్వు - నేను

నువ్వు లేనిదున్నట్లు, వున్నది లేనట్లు చూపించగలవు
కపటత్వాన్ని కనిపెట్టగలననే కసాయత్వం నీది
నా కళ్ళకు గంతలు కట్టేయండి
అయినా నీ గుండెల్లో భయాన్ని ప్రదర్శిస్తా

నువ్వు బహిరంగంగానే శపించగలవు
నా నాలుక పలికితే సత్యం తెలిసిపోతుందనే భయం నీకు
నా నాలుకను కోసేయండి
అయినా నీ గుండెల్లో భయాన్ని ఘర్జిస్తా

నువ్వు నీనాదాల్తో ఉదాత్తానుదాత్త మర్మాల్ని చేయగలవు
నా కర్ణభేరి గుర్తిస్తుందనే గుబులు నీకు
నా చెవుల్లో మరింత సీసం పోసెయ్యండి
అయినా నీ గుండెల్లో భయాన్ని వినిపిస్తా

నువ్వు పవిత్రంగా మూడోపాదంతో నర్తించగలవు
నాపాదాలడుగుపడితే భూదేవికి సుఖమేదో తెలుస్తుందని దడనీకు
నా కాళ్ళను ఇనపసంకెళ్ళతో బంధించేయండి
అయినా నీ గుండెల్లో భయాన్ని నడిపిస్తా.

❖ ❖ ❖

(5-09-15)

మినీ కవితలు

ఏదో చల్లని స్పర్శ
ఘనీభవించిన మౌనం
ప్రవాహమై
ఉరుకుతోంది

చెట్టు పిలిచింది
నీడనివ్వడానికి
విశ్రమించి
చెట్టునే లేకుండా చేశాడు

కళాకారుని మెడలోనే

దేవుని సన్నిధిలోనే పడింది
జన్మధన్యమైందని
నవ్వింది పూదండ

నిద్దురకీ తెలిసిపోయింది
ఇద్దరి మధ్యా
ఎడబాటెందుకని
ఎటో వెళ్ళిపోయింది

గుప్పిట విప్పాను
కనిపించిందొక
ఒయాసిస్

జీవితాన్వేషణ
ఇంటర్నెట్‌లో కులుకుతున్న
నిద్రను లాక్కొని రావడానికే
ప్రయాణమయ్యా
ఇంత అర్థరాత్రైనా

ఇంకా తెలవారడం లేదు
బిగి కౌగిట సూర్యుడ్ని
కమలిని
విడిచి పెట్టలేదేమో

సముద్రం ఒడ్డున
బాల్యంతో
ఆడుకొంటున్న
అర్థరూపాయి సీడ్ బతుకు

చెల్లి దాచుకున్న చిల్లర
అమ్మ తాకట్టుపెట్టిన డబ్బులు
సుందరాంగి చేతిలో
ఐస్ క్రీమ్!

గుండె పగులుతున్నా
బద్ధకం పిల్లి
కవిత్వాన్ని

వందనివ్వడం లేదు!
గుప్పెడు చప్పట్లు
బుట్టెడు పువ్వులు
నిండిపోయింది
కళాకారుని గుండె.

సమీక్షల్లో దూరి
చంటి పిల్లాడు శాసనాలు
క్షమించు గాక
ఈ అమాయకత్వాన్ని.

ఉబుసు పోవట్లేదు
కాసేపు ప్రపంచంతో
ఆడుకోవాలి
నెట్ బ్రౌసింగ్‌తో!

ఇంటికి బంధువొచ్చినా
ఎవరైనా విందుకొచ్చినా
ముందుగా పలకరించేది
ముంగిళ్లోని మా టి.వి.గారే!

ఎవరన్నారు దీన్ని కవితని
బాధనో, సంతోషాన్నో
అక్షరాల్లో

ఒంపేసుకున్నానంతే
ఇస్త్రీ మడత
ఆఫీసు కొచ్చేసరికే
చెమట కంపు
సిటీ బస్సు ప్రేమాలింగనం!

కపట ప్రేమ ఎరకి
మళ్ళీ ఇంకో చేపపిల్ల
గేలానికి తగిలాకే కదా
ముళ్ళు గుచ్చుకున్న మూలుగు!

యూనివర్సిటీ క్యాంపస్‌కి
రాత్రీ పగలూ లేదు
నిన్ననే
అడ్మిషన్లు పూర్తయ్యాయి!
శీతాకాలంలో దుప్పటి

అమ్మ ఒడిలో వెచ్చదనం
మళ్ళీ గుర్తొచ్చింది
బాల్యం!

పండు కొబ్బరాకుని చూసి
పచ్చి కొబ్బరాకుకి నవ్వు
ప్రారంభిస్తున్నట్లుందిప్పుడే

జీవితాన్ని!
ఎంత నడకిది
భూమి తల్లి ఒడిలో
మనవన్నీ
చిన్ని పాదాలే!

ఫోన్ బాయ్ మెమరీలో
తికమక పెట్టే
హాస్టల్ స్టూడెంట్స్
పాస్ వర్డ్స్!

ఎంత సముద్రమైనా
నా చిన్ని రెక్కల ముందు
ఓడిపోవాల్సిందే కదా!

❖ ❖ ❖

అనుబంధం

పురివిప్పిన నెమలి కన్నులు

గాయం పాడిన పాట

– ఆచార్య తుమ్మల రామకృష్ణ

నా మిత్రుడు దార్ల వెంకటేశ్వరరావు తన కవిత్వానికి ముందుమాట రాయమన్నారు. తను అలా ఎందుకడిగాడో ఎంత ఆలోచించినా బోధపడలేదు. నా మట్టుకు నేను కవిత్వం చదవడమే తప్ప కవిత్వం గురించి ముందుమాటలు ఎప్పుడూ ఏమీ రాయలేదు. 1982లో ఓసారి విజయనగరం వెళ్ళి చాసోని కలిసాను. మాటల మధ్యలో చాసో వచనం రాసేవాళ్ళు బాగా కవిత్వం చదవాలి. ముఖ్యంగా వచన కవిత్వం అని సలహా యిచ్చారు. అప్పట్నుంచి వచనకవిత్వాన్ని ఆబగా చదివేవాణ్ణి.

దార్లతో నాకు పదేళ్ల పరిచయం ఉంది. ఈ పదేళ్ళూ ఎన్నో విషయాలు మాట్లాడి ఉంటాం. వ్యక్తిగత, శాఖా సంబంధమైన విషయాలే కావచ్చు. ఈ కులాల గురించి, జాతుల గురించి, మతాల గురించి, అణచివేతల గురించి, పీడనల గురించి, అస్పృశ్యత గురించి, అమానవీయ సంఘటనల గురించి, సైద్ధాంతిక విషయాల గురించి, దృక్పథాల గురించి...ఇలా ఎన్నో మాట్లాడి ఉంటాం.

ఇప్పుడు దార్ల కవిత్వం చూస్తూ ఉంటే ఎందుకో నన్ను నేను తడుము కుంటూ ఉన్నాను. నా మూలాలు నేను వెతుక్కుంటూ ఉన్నాను. నిజానికి ఈ కవితలో ఉన్నది కన్నీళ్ళా, కడుపుకోతా, గాంఢ్రింపా, పొలికేకా...ఏమిటాని ఆలోచిస్తే తాను ఎవరితోను పంచుకోలేనివి, చెప్పుకోలేనివి ఈ ప్రపంచంతో పంచు కోదలిచాడా? అని అనిపిస్తుంది.

దార్ల కవిత్వం చదువుతుంటే మా పల్లెలు, మా పొలాలు, వాటిని ఆనుకుని ఉండే వాడలు, పేటలు వాటి చుట్టూ అల్లుకుని ఉన్న కుల మత, జాతి వివక్షలు, కక్షలు, ఇంకా నా బాల్యం, నేను పొందిన అవమానాలు, నాకెదురైన రకరకాల సమస్యలు ఇలా ఎన్నెన్నో గుర్తుకొచ్చాయి. ఎక్కడైనా భూమి, ఆకాశం, గాలి, వెలుతురు, నీరు ఒకేలా ఉంటాయేమో కానీ, మనుష్యుల్లోనే తేడా. వాళ్ళ ప్రవర్తనల్లోనే తేడా, వాళ్ళ ఆలోచనల్లోనే తేడా, వాళ్ళ మనస్తత్వాల్లోనే తేడా. అందువల్ల పైకి మనుషులంతా ఒకేలా కనిపించినా వాళ్ళ అంతరాలు, అంతరంగాలు వేరు వేరుగా ఉంటాయి. ఎటొచ్చీ బుద్ధిజీవులు వీళ్ళని తరచిచూస్తే తప్ప మచ్చలు, పుట్టుమచ్చలు కనిపించవు. ఆ లోతుల లోగిళ్ళలోకి దార్ల వెళ్ళాడు కాబట్టే, అతనికి అందమైన ముసుగుల వెనుక దాగిన నగ్న రూపాలు కనిపించాయి. ఆ రూపాల కుటిలత్వాలు, క్రౌర్యాలు, నయవంచనలు కవిత్వ రూపంలో దర్శనమిచ్చాయి. అందుకే దార్ల కవిత్వం చదువుతుంటే ఏది వాస్తవమో? ఏది అవాస్తవమో? ఏది కల్పనో విడమర్చి చెప్పడం కష్టంగా ఉంది.

ఏ వ్యక్తి అయినా తనలోని భావోద్వేగాలను ఇతరులతో పంచుకునే ప్రయత్నం చేస్తాడు. అయితే సృజనకారుడు ఒకవ్యక్తితో కాకుండా ఒక పెద్ద సమూహంతో పంచుకోవాలనే కోరికతో తనలోని దుఃఖాలకీ, ఆనందాలకీ, అవమానాలకీ, అణచివేతలకూ అక్షర రూపం యిస్తాడు. అదే సృజనగా, ఈనాటి రచనగా పరిఢవిల్లుతోంది. సాహిత్యం ఎక్కడి నుంచో ఊడిపడదు. అనుభవాల్లోంచి , ఆలోచనల్లోంచి తనలోంచి, సమాజంలోంచి పుట్టుకొస్తుంది. అలా నిసర్గంగా పుట్టుకొచ్చిందే మా దార్ల కవిత్వం.

సామాన్యుడు ఊహించనంత ఎత్తుకు ఎదగడం ఎంతకష్టమో నాకు తెలుసు. ఒక దళితుడు అధ్యాపకుడిగా, ఉపన్యాసకుడిగా, విమర్శకుడుగా, అన్నింటికీ మించి కవిగా నిలదొక్కుకోవడం వెనుక ఎంత శ్రమ, పట్టుదల, దీక్ష కలిగి ఉండాలో అంతా దార్ల కలిగి ఉన్నాడని చెప్పడానికి అతడు బోధించిన, ప్రచురించిన పుస్తకాలు, వెలువరించిన కవిత్వం నిలువెత్తు సాక్ష్యాలుగా నిలుస్తాయి. దార్ల తన విద్యార్థి దశను గుర్తుకు తెచ్చుకుంటూ *'బడిలో... అమ్మ ఒడిలో...'* కవితలో...

> "ప్రాచీన సాహిత్యం పాఠమైనప్పుడల్లా
> *నా ముఖ కవళికలన్నీ మారిపోయేవి*

బయట పడకూడదనో
పారిపోవాలనో
బహిష్కరించాలనో
అనుకుంటుండేవాణ్ణి
మూకుమ్మడిగా కళ్ళన్నీ నా పైనే ఫోకస్!
ఎన్నిసార్లు చంపుతావంటూ
ఆ దేవుణ్ణే కాలర్ పట్టుకోవాలనిపించేది!!" అంటాడు.

ఇవన్నీ అవమానాల గాయాల్లోంచి పొంగి పొరలిన అక్షరాలు. వంచనల్లోంచి, పీడనల్లోంచి, అణచివేతల్లోంచి, ఆధిపత్యాల్లోంచి... ఇలా రకరకాల దుఃఖాల్లోంచి కార్చిన కన్నీళ్ళు ఈ కవితలు. మన ప్రమేయం లేని కులం, మతం, జాతి అవి చూపే విద్వేషాలు, విద్రోహాలు విలయాల్లోంచి తప్పించుకోవడానికి మనిషి పడే తపన ఈ కవితల్లో అంతర్లీనంగా ప్రహహిస్తోంది. జీవితాన్ని ప్రేమించడం వల్లే జీవితంలోని దుర్మార్గాలు తెలిసొస్తాయి. ఆ దుర్మార్గాల్ని ఖండించడమే నిజంగా జీవితాన్ని ప్రేమించడం. అనుభవాల్లోనుండి ఎక్కువగా పాఠాలు నేర్చుకుంటాం. జీవిత అనుభవాలకు మించిన గొప్ప పాఠాలు మరెక్కడా ఉండవన్న సత్యం ఈ కవితల వల్ల తెలిసొస్తోంది.

దార్ల 'కవిత్వాన్ని ఎందుకు ఎంచుకున్నాడనే' ప్రశ్న వేసుకుంటే ప్రధానంగా 'తనను తాను ఆవిష్కరించుకొనేందుకు' అనే సమాధానం వస్తుంది. ఇక్కడ తన్ను తాను ఆవిష్కరించుకోవడం ఆత్మాశ్రయం కాదు. అలాగని ప్రత్యేకమూ కాదు. దార్ల ఒక వర్ణానికి– అంటే అట్టడుగు పంచమ వర్ణానికి ప్రతినిధి. ఎన్నో అవమానాలు, అడ్డంకులు అధిగమించి , విశ్వవిద్యాలయ స్థాయిని అందుకున్న వ్యక్తి. అదే అయితే దార్ల లాగ ఉన్నవాళ్ళు చాలా మంది ఉన్నారు. అదొక్కటే విశేషం కాదు. అంతకు మించి దార్ల సృజనశీలి. తాను ఎంచుకున్న కవిత్వ రచన తనలోని సంఘర్షణల్ని వ్యక్తీకరించడానికి, తన సమూహాన్ని సమాజం ముందు ఆవిష్కరించడానికి ఎంతగానో ఉపకరిస్తోంది. తనలోని విమర్శకుడు తన సృజన విద్యను అప్పుడప్పుడు సరిదిద్దుతుంటాడు. అందువల్లనే వ్యర్థ ప్రయోగాలు, నిరర్థక వాక్యాలు దార్ల కవిత్వంలో తక్కువగా ఉంటాయి. ఎవరికైనా తన చుట్టూ ఉన్న సామాజిక నిర్మాణం అర్థం కాకపోతే తను చదివే సృజన సాహిత్యం బోధపడదు.

దార్ల తన చుట్టూ ఉన్న సామాజిక నిర్మాణాన్ని ఎంతో నిశితంగా పరిశీలిస్తాడు. అందులోని లోపాలను మూలాల నుండి వెతుకుతాడు.

ముప్పైయ్యేళ్ళ జీవిత గాయాల జ్ఞాపకాల్లోనుంచి మూడు వేల సంవత్సరాల సాంఘిక చరిత్రను తడమడం ఈ కవిత్వంలోని ప్రత్యేకత. పుట్టుక, మరణాల మధ్య ఈ సంతోషాలు, ఈ ఆనందాలు, ఈ దుఃఖాలు, ఈ వేదనలు మనిషి చుట్టూ ఎన్ని బంధాల్ని పెనవేసిపెట్టాయో దార్ల కవిత్వం చదివితే తెలుస్తుంది. దార్ల ఉగాది కవి కాదు; దార్ల సంక్రాంతి కవి కాదు; దార్ల ఆకాశవాణి కవీ కాదు; దూరదర్శన్‌ల కవీ కాదు; దార్లకు కవిత్వ రచన ఒక సామాజిక బాధ్యత. "బడిలో... అమ్మ ఒడిలో..." అన్న కవితలో దార్ల కుల వివక్ష నగ్న స్వరూపాన్ని బొమ్మ కట్టిస్తాడు.

'ఈ కులంలో పుట్టటమే మంచిదయ్యింది
అవమానమంటే అర్థమైంది
అందర్నీ ప్రేమించడమూ తెలిసింది" అంటూనే
"నాకు తెలీదు
అమ్మ గర్భంలోనైనా
అవమానాలకి దూరంగా ఉన్నానో లేదో...!'

అనే సందేహాన్ని వ్యక్తం చేస్తాడు.

ఈ కవితలో దార్ల చెప్పిందాని కంటే పాఠకులు ఆలోచించు కోవడానికి వదిలిపెట్టిన అంశాలే ఎక్కువ. ఈ కవిత పాఠకుడి మస్తిష్కంలోకి జొరబడి మంట పుట్టిస్తుంది. అవమానం ఎంత తీవ్రమైందో ఆలోచించమంటుంది. ఈ కవితలో కథాకావ్య లక్షణం దాగుంది.

ఇటీవల బాల్యం గురించి మాట్లాడడం, రాయడం ఒక Fashion అయిపోయింది. అందమైన బాల్యం గురించి, ఆహ్లాదకరమైన పల్లెపట్టుల గురించి రాయడం ఎక్కువైంది. కథలు, కవితలు చాలానే వెలువడ్డాయి. అయితే అందరి బాల్యం ఒకేలా లేదు. ఉన్నవాళ్ళ బాల్యంలా లేనివాళ్ళ బాల్యం ఉండదు. ముఖ్యంగా అట్టడుగు కులంలో పుట్టిన వాళ్ళ బాల్యం నిండా అవమానాలు, ఛీత్కారాలు, రకరకాల గాయాలు వెంటాడుతుంటాయి. అందుకే దార్ల 'మా వూరు నవ్వింది' కవితలో...

"అందరూ ఊరుని గొప్ప గొప్పగా కీర్తిస్తుంటే
నాకు మాత్రం
మరేదోలా వర్ణించాలనిపిస్తుంది ఎందుకో!" అంటాడు.

అందరిలో తనూ కలవాలనుకుంటాడు. అందరిలా ఉండాలనుకుంటాడు.

కానీ–

"ఇంతలోనే ఎవరో దొంగ దూరాడన్నారు
నన్ను తరుము కొచ్చారు
నా ఒళ్ళంతా రక్తం
దిక్కున్నోళ్ళతో చెప్పుకోమన్నారు
దిక్కులన్నీ పిక్కటిల్లేలా ఏడ్చాను
అమ్మ కన్నీళ్ళ సంద్రమైంది
అయ్య కళ్ళల్లో ఎర్రని సూర్యుళ్ళు...
అవన్నీ ఊరు కట్టుబాట్ల ముందు దిగదుడుపై పోయాయ్!" అని నిట్టూర్పుకు లోనవుతాడు.

కుల, మత వర్ణ సమాజాల్లో అట్టడుగు కులంలో పుట్టిన కారణంగా ఎన్ని అవమానాలు భరించాల్సి వస్తుందో ఈ కవిత చదివితే తెలుస్తుంది. అలాంటి బాల్యం నెమరు వేసుకోవడం ఎలా సాధ్యమని వెంటనే ప్రశ్నిస్తాడు. *'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ'* అనేది ఆర్యోక్తి. కన్నతల్లి, పుట్టినూరు స్వర్గం కన్నా గొప్పవన్నారు. అయితే ఇక్కడ ఎవరికి? అన్న ప్రశ్న ఉదయిస్తుంది. ఒకే ఊరు ఒక్కొక్కరికి ఒక్కొక్కలా కనిపిస్తుంది. దానికి కారణం అందరి జీవితాలు ఒకేలా ఉండవు. ఇందుకు దార్ల రాసిన 'మా వూరు నవ్వింది" కవిత ఒక అక్షర సాక్ష్యం.

మనుషులు తమ అవసరం మేరకు వాడుకుని పక్కకు పెట్టే మనస్తత్వాలను ఈ *"గర్భశోకం"* కవితలో వర్ణించాడు. ప్రేమకు, అభిమానానికి ఆధిపత్యానికి మధ్య జరిగిన ఆత్మ సంఘర్షణ. అవసరం మేరకే పిల్లి పిల్లనైనా, కుక్కనైనా ఒళ్ళో కూర్చోపెట్టుకుంటాం. తర్వాత మళ్ళీ వాటిని ఇంటి బయటనే పెడుతుంటాం. ఇలాంటి స్థితిని వర్ణిస్తూ...

"నట్టింట్లో అమరిన డస్ట్‌బిన్
సీటు పక్కనే లిప్తకాలం సింహ దరహాసమయ్యే కుక్కపిల్ల
నన్ను చూసి పగలబడిన నవ్వు!" నవ్వించంటాడు.

సాధారణంగా ప్రతి పరిశోధకుడూ ఒకవైపు తన పరిశోధన సకాలంలో పూర్తిచేయాలనుకుంటాడు. మరోవైపు ఉద్యోగం కోసమూ ఆరాట పడుతుంటాడు. ఆర్థికపరమైన ఒత్తిడులు ఉంటాయి. ఇలా ఎన్నో భరించాల్సివస్తుంది. అలాంటి మానసిక స్థితిని "ఎక్సరే రిపోర్టు" కవితలో–

"అద్దం ముందు నిలబడిన నిజం
ఎక్సరే తీసి నన్నెగతాళి చేస్తుంది
ఒక్కోసారి ఉత్తరం రాయడం నేరమే
అబద్ధాల్ని అందంగా పోస్టుచేసి
భ్రమల్ని పెంచుకునేలా చేసే
ఉత్తరం రాయడం నేరమే!' అంటాడు.

ఒక పరిశోధక విద్యార్థి తాను మానసిక వ్యథకు గురవుతున్న పరిస్థితిని ఇందులో ఆవిష్కరించాడు. సామాన్య కుటుంబంలోంచి ప్రపంచ ప్రసిద్ధికెక్కిన విశ్వవిద్యాలయంలో పరిశోధనలో అడుగుపెట్టి తన లక్ష్యాన్ని చేరుకొనే ప్రయాణంలో ఎన్ని అంతరాలో, ఎన్ని అవాంతరాలు దాటాలో కొంచెం లోతుగా పరిశీలిస్తేనే తెలుస్తుంది.

"నగర వీధుల్లో నేను
నాకు నేనే మోసం
చేసేది శోధనో... పరిశోధనో...
వినయం బానిసత్వమైతే
జీవితం...
మోయలేనంత బరువు!
క్యాజువల్ లైఫ్... ఆకాశవాణి నా ఆశాగానంలో
చైతన్య ప్రబోధమో,
యుగళగీతమో

నిరాశను గొంతులోనే దాచుకుంటూ
క్యూ చేసెయ్యాలి!" అంటాడు.

ఈ కవిత చదివితే ఒక మనిషి బతకడం కోసం, లక్ష్యం కోసం ఎన్ని భరించాలో, ఎంత వేదనని అనుభవించాలో తెలుస్తుంది. అలాంటి వాతావరణంలో ఆలోచనలు ఎలా పదునెక్కుతాయి? ఊహలెలా విచ్చుకుంటాయి?

పుట్టిన ప్రాణి ఎప్పుడో ఒకప్పుడు గిట్టుతుందని అందరికీ తెలుసు. అయితే, మరణం ఎదురైనప్పుడు మనసు ఎలా గిల గిలా కొట్టుకుంటుందో "ఆ రాత్రి" కవితలో–

"ఆ క్షణంలో
ఎందుకలా విలవిల్లాడి పోయాను
నాలో ఫిక్సిడ్ డిపాజిట్టు చేసిన
ఏ అనుబంధాన్నో అమాంతంగా
లాగేసుకున్నట్లు
ఆ క్షణంలో ఎందుకలా విలవిల్లాడిపోయాను !" అని ఒక భయానక స్థితిని వర్ణించాడు దార్ల.

ఇది ఒక వ్యక్తిది మాత్రమే అనగలమా? ఆరోగ్యం క్షీణిస్తున్నదనే ఆందోళన ఏర్పడినప్పుడు మనిషిలో కలిగిన భయం మూలంగా జ్ఞాపకాలను నెమరు వేసుకోవడం, మరణం ఎప్పుడో తెలిసినప్పుడు మనం వేసుకొనే తాత్త్విక ముసుగుని తొలగిస్తూ –

"మమతానుబంధాల్ని పెంచుకోవడం
రాగద్వేషాల్ని తెంచుకోవడం
జీవులకే కాదు స్థల కాలాలకీ అతీతం కాదేమో!!" అని అంటాడు.

మనిషికో నీతి, నిజాయితీ ముఖ్యం. మనమున్నా లేకపోయినా మన భావాలుంటాయి. నీతి, నిజాయితీల్లేని వాళ్ళతో జీవించడమెలా ఉంటుందో చెప్తూ...

"ఒక మౌనం మాట్లాడి మనసుని దహించేస్తుంటే
మరొక మౌనం ఘనీభవించి
నన్నే అనిశ్చిత లోయలోకి తోసేస్తుంది!" అంటాడు దార్ల.

ఒకడి మానసిక స్థాయి మరొకడికి ఎప్పటికీ అర్థం కాదు. ముఖ్యంగా కవిని అర్థం చేసుకోవడం అందరూ అనుకున్నంత సులువు కాదు. తన అంతర్లోకాలు తెలిస్తే తప్ప ఆకృతి పొందిన అక్షరాల వెనుక దాగి ఉన్న స్పందనల్ని తెలుసుకోలేం. గుండెతడి, తడున్న గుండెకే తగులుతుంది. మరణానికి దగ్గరగా వెళ్ళిన వాడికే ప్రాణం విలువ తెలుస్తుంది. పంచేంద్రియాలు భీష్మించుకున్నప్పుడే అసలు జీవిత రహస్యాలు బోధపడతాయి. నిప్పుల సెగ నిప్పును ముట్టుకున్నప్పుడే తెలుస్తుంది. దూరానికి అన్నీ బాగానే ఉంటాయి. దగ్గరకు వెళితేనే దాని నిజ స్వరూపాలు బయటపడతాయి. విలువల కోసం బతకడం అందరూ అనుకున్నంత సులువేమీ కాదు. వేషాలు మార్చుకొని, రూపాలు మార్చుకుంటే ఎక్కడైనా నెగ్గుకురావచ్చు. ఓటమి ఎప్పుడూ అపజయం కాదు. గెలుపు విజయసంకేతమూ కాదు. ఎలా బ్రతికామన్నది ముఖ్యం. ఏ విలువల మధ్య నిలబడ్డామన్నది ప్రధానం. గెలుపు ఓటముల మధ్య విలువల సంఘర్షణ. నేనిప్పుడు ఓడిపోవడానికి కూడా సిద్ధమౌతాను నా విలువలకోసం... నా కవిత్వం కోసం... నా ప్రాణం కోసం. నా కవిత్వం నా సంఘర్షణ. నా కవిత్వం నా జీవితం. నా కవిత్వం నా సమాజం. నా కవిత్వం నా బహిరంతర్లోకాలు అంటాడు దార్ల. ఇవన్నీ బోధపడాలంటే తన కవిత్వంలోని ఆయువుపట్టుని వెతకాలి. దార్ల పైకి కనిపించేంత సాదాసీదా మనిషికాదు అనేది ఆ కవిత్వం చదివినప్పుడు బోధపడుతుంది. తను, తనతో, సమాజంతో, సమాజ నిర్మాణంతో పడిన సంఘర్షణే తన కవిత్వం.

సీటు ఓపెన్‌లో వస్తే రిజర్వేషన్‌లో చూపించడానికి జరిగిన కుట్రలు తెలిస్తే ఎలా ఉంటుంది? ఎవరు ఎవరికి శత్రువో ఎవరు ఎవరికి మిత్రుడో చెప్పడం కష్టం. ప్రతిభతో ఒక అవకాశాన్ని సంపాదించుకున్నా, అతని ప్రతిభని నిర్లక్ష్యం చేసి అతణ్ణి ఒక రిజర్వేషన్ కింద జమకట్టి చూడ్డం ఆ మనిషిని ఎంతగా బాధిస్తుందో *"పుట్టుమచ్చ మీద ప్రేమ"* కవితలో చూడొచ్చు.

"పుట్టుకతో వచ్చిన మచ్చ
ఒకరికి అందమైన అలంకారం
మరొకరికి అసహ్యం!"

ఇక్కడ పుట్టుమచ్చ కులానికి ప్రతీక అని కవిత చదివిన వాళ్ళకి స్పష్టంగానే తెలుస్తుంది. ఈ దేశంలో కులం కంపు పోనన్నాళ్ళూ అది రకరకాలుగా మనుషుల

మధ్య అంతరాల్ని సృష్టిస్తూనే వుంటుంది. ఒకసారి ఒకరికి కులం మేలు చేయవచ్చు. మరొకసారెప్పుడో ఆ కులమే కీడూ చేయవచ్చు. అందుకే కులం కావచ్చు, మతం కావచ్చు, ప్రాంతం కావచ్చు. వీటి వల్ల ఎవరైనా ప్రయోజనం పొందినా అది తాత్కాలికమే. నీతి, నిజాయితీ, ప్రేమతత్వాన్ని అలవరచుకున్న నాడే నిజమైన మానవ సంబంధాలు పరిమళిస్తాయి. అదే దార్ల కవిత్వం ద్వారా ఆకాంక్షించేది.

దార్ల కవిత్వం నిండా ఒకజీవన సమరం, ఒక సామాజిక పోరాటం పరచుకోనుంది. ముఖ్యంగా దళిత జీవితంలోని సంఘర్షణలు, సంవేదనలు, ఆత్మ గౌరవాలు, ఆలోచనలు, కన్నీళ్ళు, తిరుగుబాట్లు... ఇలా ఎన్నో అందాలు అంతర్లీనంగా దాగి ఉన్నాయి. ఇదంతా కేవలం ఒక వ్యక్తి జీవితానికి సంబంధించినవి కావు. ఒక వర్ణానికి, ఒక సమూహానికి, ఒక అణగారిన అంటరాని జీవితానికి సంబంధించినవి. కవిత్వ పరంగా దార్ల వెలిగిస్తున్న కాగడా ఒక అగ్ని పర్వతంలా లావాలు విరజిమ్మాలని ఆశిద్దాం. ఈ కవితా సంపుటి దళిత కవిత్వానికి ఒక అదనపు ఆస్తి కావాలని కోరుకుంటున్నా.

కవిత్వం మంత్రజాలమే కావచ్చు. అదొక ఆల్కెమీనే కావచ్చు. కానీ, అది అందించే సత్యం ముఖ్యం. కవిత్వం అనుభవించడానికి, పలవరించడానికే కాని. తూకపురాళ్ళతో తూచడానికి కాదు. మానవ ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి సాహిత్యానికి మించిన సాధనం మరొకటి లభించేంతవరకు కవిత్వాన్ని ఆశ్రయించక తప్పదు కదా. కాబట్టి కవిత్వపు లోగిళ్ళలో నిలుచుకోవడమెందుకు? తలుపులు తెరిచి లోనికి అడుగులు వేయండి. నేను చెప్పిన సత్యాలన్నీ మీ కళ్ళకూ కనిపిస్తాయి.

– ఆచార్య తుమ్మల రామకృష్ణ
శాఖాధ్యక్షుడు, తెలుగుశాఖ,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్,
హైదరాబాదు. ఫోన్ : 9949055015

❖ ❖ ❖

పుట్టు మచ్చను బొమ్మ కట్టించిన 'నెమలి కన్నులు'

– ఆచార్య నసుమానస్వామి

తెలుగులో దళిత సాహిత్యావిర్భావానికి హేతువుగా నిలిచింది 1961లో కాశ్మీర్ లో వెలసిన 'దళిత ఫాంథర్స్ సంస్థ'. అది 1972లో మహారాష్ట్రలో అంబేద్కర్ ఆలోచనలను పుణికి పుచ్చుకొని దేశంలోని వివిధ రాష్ట్రాల్లో దళిత ఉద్యమాలు ఊపందుకొనేందుకు దోహదపడింది. 2010 నాటికి వేళ్ళూనుకొన్న దళితవాదం అనేక భాషా సాహిత్యాల్లో రచనా పరంగా పెనుమార్పులను తెచ్చింది. ఈకాలంలోనే సృజన పరంగా, ప్రతిఘటన పరంగా, సామాజిక పరంగా, ప్రజాస్వామ్య పరంగా ఒక యుగాన్ని స్థాపించుకొంది. అనుభవజ్ఞులైన దళితసాహిత్య విమర్శకులు దాన్నే "దళిత మిలీనియం" అన్నారు. ప్రతి దళితకవి, రచయిత తలెత్తుకు తిరిగింది ఈ యుగంలోనే.

భాషలో కొత్తదనం, భావవ్యక్తీకరణలో నూతనత్వం, కవిత్వంలో దళిత సౌందర్యం, సందేశాల్లో మౌలికత అనేవి దళిత ఉద్యమ సాహిత్యంలో చోటు చేసుకున్న విశిష్టతలు. సూర్యుని చుట్టూ భూమి తిరిగినట్టుగా ఆత్మకథనం చుట్టూ సాహిత్య ప్రక్రియలన్నీ తిరుగుతూ వచ్చాయి. అందుకే దేశంలో వచ్చిన ఏ రచనోద్యమాలకులేని చరిత్రను దళితోద్యమం దక్కించుకుంది. ఈ నేపథ్యంలో ఆత్మకథా కథన రచనా ప్రక్రియ పురుడు పోసుకుంది. తొలుత మరాఠీ భాషలో దళిత రచయితలు నూతన వరవడికి శ్రీకారం చుట్టేందుకు ఈ ఆత్మకథన రీతిని

మొదలు పెట్టారు. అది కూడా కథా ప్రక్రియలో ప్రారంభం కావడం విశేషం. తెలుగు పొద్దుపొడుపు మరాఠీలోంచి తొంగి చూచిన "దళిత కథలు" దళిత రచనా సంప్రదాయంలో ఈ తరహా రచనా పద్ధతికి చెందిందే ఈ *"నెమలికన్నులు"* కవిత్వం.

హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యుడు, దళితకవి, పరిశోధకుడు డా. దార్ల వెంకటేశ్వరరావు తనకున్న బాల్యంనాటి అనుభవాలను, ప్రశ్నించే తత్వాన్ని, ఎదిగిన నాటి ఆలోచనలను పుస్తకంలో నెమిలికన్నులుగా తరతరాలుగా నిలిచేలా కవిత్వీకరించాడు. హృదయంలో నిలిచిన శబ్ద తరంగాలకు అక్షరరూపం ఈ కవిత్వం. ఇది కరుడుగట్టిన సమాజం మీద పగబట్టి, ప్రతిఘటన స్వరాన్ని నింపు కొని విచ్చుకొన్న కవిత్వ జలపాతంలా సాగింది. సుప్తచేతనలో *"లిప్తకాల స్వప్నం"* పరాధీనత్వాన్ని స్ఫుర్శింప చేసిన జయకేతనం రెపరెపల్లో శాశ్వతమైన విజయగర్వం తొంగిచూసింది. నిచ్చెనమెట్ల సమాజంలో కట్టుబానిసగా స్తంభించిన "నీలిబాల్యం" చైతన్యం అణు విస్ఫోటనంలా పేలి కావ్యమంతా వ్యాపించింది. ఒక్కొక్క మెట్టులో సాలభంజికల్లా ఎదురైన అనుభవా లను, ప్రశ్నిస్తుంటే కృంగిపోతూ కూడా పరమపద సోపానాలెక్కిన జీవితం కవిత్వం నిండా పర్చుకొంది.

ప్రతి మనిషికి అనుభవాలు, ఆలోచనలుంటాయి. అవి గత అనుభవాల కంటే భిన్నంగా ఉంటే అవి తప్పక చరిత్ర పుటల్లోకి ఎక్కడం ఖాయం. అవి ఇతరులనూ ప్రభావితం చేస్తాయి. జ్ఞాపకాలు అక్షరబద్ధం అయ్యేందుకు సామాన్యుని జీవితానికి అద్దంపట్టే ఆత్మకథా కథనం అనివార్యంగా చోటు చేసుకొంటుంది. ఈ నెమలికన్నులు రచన అలాంటిదే. సృజనలో ఒరవడి, కథనంలో ఉత్కంఠ, విశద పర్చడంలో చతురత కవికున్న సుగుణం. ఈ కవితా ఖండికలన్నింటిలో త్రిప్రాయ జీవితసారం ఆవిష్కృత మయింది. ఓ దళితకవి *"నా రక్తంలో డాలర్, రూబుల్, పౌండ్, రూపాయలు ప్రవహిస్తున్నా"* యనిచెప్పి దళితునికే ప్రతీక చేసినట్టుగానే ఈ కవి పుట్టుమచ్చను చేసిన కల్పనా చాతుర్యం ఆలోచనలో పడేస్తుంది. '*'అలంకారమో, అసహ్యమో నా పుట్టుమచ్చ మాత్రం నాకు రక్షణ కవచమేనని గుర్తు చేసింది"* అనే తాత్వికాలోచనా లోతుల్ని స్పృశించింది. కవి ఖాదర్ మొయిద్దీన్ కాన్సెప్ట్‌కు భిన్నంగా, అర్ధయుక్తంగా భాసించిందీ పుట్టుమచ్చ.

నెమలికన్నుల్లోని ప్రతి కవితా ఖండికలో ఎక్కడో ఒక చోట ఉదాత్తమయిన భావన చోటు చేసుకొని సృజన ఆసాంతం మెరుపులా జిగేలు మంటుంది. 1995 లో అచ్చైన "తీయని బాధ చేసిన గాయం" కవితే కావ్యానికంతటికీ భిత్తికగా నిలిచింది. తనకంటూ ఒకశైలి కోసం తాపత్రాయపడుతున్న ఈ కవి అందులో కృతకృత్యులైనారనే చెప్పాలి. "నభూతో న భవిష్యతి" కవితలో '*నవ్వుతూ నరకాన్నైనా ముద్దు పెట్టుకోవడం నయం కదూ"* అనేది శీర్షికకు తగినట్టుగానే ఉంది. ఒక వ్యక్తికి గాదు ఒక జాతికే బానిసత్వం భారంగా మారింది ఈ దేశంలో. కవి మరింత ముందడుగేసి "వినయం బానిసత్వమైతే జీవితం మోయలేని బరువవుతుందంటాడు" కవి *ఎక్స్‌రే రిపోర్టు* కవితలో. అలాగే "ఆ రాత్రి" లో "అమావాస్యకు దగ్గరవుతున్న చందమామ రోజూ భయపడుతుందీ జీవితాన్ని" లాంటివి భావుకతకు భావ తీవ్రతకు మచ్చుతునకలుగా పేర్కొనాలి.

చంద్రుణ్ని వీడని వెన్నెలలా కవిత్వం వెంట దళితత్వం వెన్నంటి ఉండడం నెమలికన్నులలోని విశేషం. "అలంకారమో, అసహ్యమో నా పుట్టు మచ్చ మాత్రం నాకు రక్షణ కవచమేనని గుర్తు చేసింది" అనే తాత్విక ఆలోచనల లోలోతుల్ని స్పృశించింది. *"వంశ పారం పర్యంగా దళిత కుటుంబం వాళ్ళే దేవుడి పెళ్ళాలయి పోవడం*" మన జాతిలోనే ఉంది. కర్మ సిద్దాంతమున శీలాన్ని దేవుని పాలుచేయడం కాదు. ఇక్కడ పెత్తందారీ చిత్తాన్ని రాగరంజితం చేసే వ్యవస్థ. అందుకే కవి "మహా పురుషుని పాదాల నుంచి పుట్టినోళ్ళు తప్ప ఈ దేవుళ్ళెవరికీ ఇతరుల యవ్వనాలంతగా రుచించవేమో" అంటూ ఆక్రోశాన్ని వెళ్ళగక్కుతున్నారు. కవి పగిలిన స్వప్నం నుండే నల్ల వజ్రమై వికసించాడు.

ఏ జీవితమయితేనేమి దానికి "కాస్త రసపోషణ" అవసరం. కవి అయితే మరింత పోషించవల్సి వస్తుంది. నవయవ్వనంలో విత్తకుండా అంకురించిన ప్రేమ అనతి కాలంలోనే *"సంకన సంచి తగిలించిన మరుక్షణమే పిచ్చుకకు రాబందు రెక్క లొచ్చిన సమాచారం*" అందింది. అప్పుడు "నమ్మకం నరకబడుతున్నట్లు" అనిపించింది. ప్రేమ "హృదయ పేటిక చివరి అరలో దాచుకొన్న చిన్న నాటి నెమలి కన్నులు కావల్సిందేనా?" సందేహం కలిగి సైనైడు కౌగిలిగా ఉలికిపాటు కలిగిస్తుంది. *"అల్లుకొనే లతకి ఎన్నాళ్ళకీ పందిరి కాలేకపోయిన*" సంపాదనలేని

ప్రియుడు గదా. నిరుద్యోగ ప్రేమికునికి '*'భవిష్యత్ ముందే తెలియడం నరకం'* అయింది. తీయని బాధ చేసిన గాయం '*'కనిపించని కన్నీటినేదో ప్రవహింప చేస్తుంది" ఈ అనర్థాలకు మూలం ప్రేమించుకునే హృదయాల* "మధ్య నిలువెత్తు గోడలు" కదా "*ఇసుమంతా దాచకుండా జల్లెదేసుకో మంటుంది* ఇంగిత జ్ఞానం, శూన్య దృక్కులు చూడకుండా ఇప్పటికైనా మేల్కోమంటుంది. ప్రతిఘటన కంఠాన్ని విచ్చుకొనేలా చేసే కవన ఖడ్గం ఆలోచన లెప్పుడూ నివురుగప్పిన నిప్పు కణికలే కావాలంటుంది. అప్పుడు కదా మనల్ని నెత్తుటి పువ్వుల్ని చేసి నేలలో పాతేసినా బంగారమై బయటకు రావచ్చుననేది నిజం.

పుట్టు మచ్చను బొమ్మ కట్టించిన ఈ కవికి కనిపెంచిన తల్లిదండ్రులంటే తరగని ప్రేమ. *"నాన్న భుజాల మీద చంటి పిల్లాడినై పోనా'* అంటూ నాన్న అనురాగాన్ని రంగరించి అందించాడు. *"ఇప్పుడు నా శ్లోకంలో"* అనే కవితలో "ఒకప్పుడు నాన్నను వెలేసిన శ్లోకం, నాన్న పాదాల మీద పడిందిప్పుడు, నాన్నకిప్పుడు శ్లోకం సొంతం. నాన్న ఇప్పుడు నాలో ఉన్నాడు" అంటూ పున్నమినాటి నుండి క్షీణిస్తూ వచ్చిన చంద్రుడు పునర్జన్మించి నెలపొడుపులా తాను ఆవిష్కరించుకొన్నాడు కవి. కింది కులమైనందుకు దళితులు సహజంగానే పెత్తందార్లంటే భయపడుతుంటారనీ, అందువల్ల తమ పిల్లల్ని కాపాడుకోవాలని నిరంతరం ఆలోచిస్తుంటారని చెప్తూ "అయ్యకి కాలుమీద మచ్చెలా వచ్చిందని అమ్మనడిగితే, ప్రశ్నించడం నేర్చుకొంటున్నాడేమవుతుందో అనుకుంటూ, తడబడుతూనే చెప్పింది" అయినా కవి ఈ కులంలో పుట్టడమే మంచిదయిందన్నాడు. ఎందుకంటే "అవమానమంటే అర్థమైంది" కాబట్టి. ఇప్పుడు నల్ల బల్లపై, కదులుతున్న తెల్లపావురమైనందుకు, నిలువెత్తు మనిషి నిలబడిన నన్ను చూసి మావూరు నవ్వింది" అంటూ గర్వపడ్డాడు కవి. ఆ నవ్వుని రెండు రకాలుగా వర్ణించాడు కవి. ఒకటి ఆత్మ గౌరవానికి, మరొకటి దళితుల అభివృద్ధిని సహించని వాళ్ళ ఎగతాళి తనానికి నిదర్శనంగాను వివరించాడు. ఆకలి అయినప్పుడు తల్లడిల్లిన కన్నవారి హృదయాల్ని చూసిన కవి కళ్ళు ఇప్పటికీ చెమ్మగిల్లుతూనే ఉన్నాయి. మమతానురాగాలను *"నా కనురెప్పలతోనే కప్పేసుకోవాలనుందని'* ఆ తాదాత్మ్యం చెందుతూనే ఉంటాడు.

దళిత తాత్వికుడైన ఈ కవి అమ్మ భాష పట్ల తరగని అభిమానం పెంచుకొన్నాడు. "నా భాష జీవం కోల్పోతున్నప్పుడల్లా కంపల్సరీ క్లాసికల్ సబ్జెక్టులా చేసైనా సరే సోషియో లింగ్విస్టిక్స్ క్లాస్ చెప్పాలనిపిస్తుంది" అంటూనే "తేనె తియ్యగానే ఉందని నీటిలా దాహం తీర్చుకోలేం కదా" అంటాడు. తెలుగు భాషను మాత్రం ప్రజల భాషగానే మననివ్వండి అనేది కవి గారి ఆవేదన. ఈ విధంగా "స్థానిక గొంతులూ లేవండి" కవితలో అంతా పొల్యూషనే పూరి గుడిసెలన్నీ తవ్వోడకు బలి, *"కాంక్రీట్ పిచ్చుక గూళ్ళు"* లో కొత్త జీవితాన్నేదో కోరుకుంటూ బాల్య జ్ఞాపకాలన్నింటినీ తొక్కుకుంటూ నగరంలో నేను *"ఒక మధురానుభూతి"*లో చదువుకొన్న చోటే చదువు చెప్పే చోటయింది, "వింటావులే నిశ్శబ్ద విస్ఫోటనం"లో కనికరం పని చేయదు మౌనం బద్దలవ్వాల్సిందే, "*నగరం పురస్కారం*"లో నన్ను తిరస్కరించినందుకు నగరం పురస్కారాని కెంపికయ్యిందనడంలో వ్యంగ్యం ఉంది. *"సమాధులు"*లో కాంతి నివ్వడం కోసమే కాలిపోయిన ఒక్కొక్క జాతి కాగడా లాంటి సృజనశీల భావాలు "*నెమలి కన్నులు*"లో కోకొల్లలు. సాహితీ వేత్తలకు, కవులకు ఈ కవితా సంపుటి తప్పక నచ్చుతుందని ఆశిస్తూ, దార్ల కవిత్వాన్ని ఆహ్వానిస్తున్నాను.

Prof. Nanumasa Swamy
Best Teacher Awardee., A.P.Govt.
Emeritus Professor of Telugu,
Osmania University, Hyderabad.
Mobiles: +917416121933,+9181214645

❖ ❖ ❖

మానవత్వాన్ని ప్రసవించిన "నెమలి కన్నులు"

- ఆచార్య కె. ఆశాజ్యోతి

ప్రసవ వేదన స్త్రీల జన్మ వేదన అనుకుంటాం. కానీ కవిత్వం వెలార్చడంలో పురుషుడెంత ప్రసవ వేదన అనుభవిస్తాడో డా॥ దార్ల కవిత్వం చదివితే అవగత మవుతుంది. హృదయ వేదన అక్షరీకరింపబడి అమానవీయతలు - కులాల కుమ్ము లాటలు - స్త్రీలపై సాగే హింసలు - వ్యవస్థలో అసమానతలు - అణచి వేతలు- గర్భశోకాలు - దళితులపై మారణకాండలు - గ్లోబలీకరణ నేపథ్యంలో దిగజారుడు తనాలు - ఇలా ఇన్నిటిని పెకలించడానికి ఎన్ని నొప్పుల్ని భరించాలో...! ఎంత విహ్వలతని దిగమింగాలో!

కవిత్వం రాస్తూ కవి కొన్ని సార్లు తనను తాను మరచిపోతున్నట్టు కనిపిస్తున్నా సమకాలీన సమాజంలో వెతలకు గురి చేసే ఆలోచనల తాకిడి తట్టు కొలేక బాల్యం-అమ్మ లాలన - ప్రేమ తాదాత్మ్యత - పుట్టిన ఊరు జ్ఞాపకాలను ఓదార్పులై తొంగి చూడడంతో గుత్తులు గుత్తులుగా స్మృతుల్ని పంచుతాడు. అలాగే మినీ కవితలు చిందించే మెరుపుల్ని పాఠక హృదయాలపై విత్తనాలుగా చల్లుతాడు.

కవిత్వం ప్రవచించడం సులువే - ప్రసవించడం కష్ట సాధ్యం! ఐనా సరే ఆ ప్రయత్నం చేస్తూ అమ్మ తనాన్ని కవిత్వంలో చూపడంతో తన జాతిపట్ల- దేశం పట్ల- ప్రపంచం పట్ల తనకు గల నైతిక బాధ్యతను హక్కుగా భావించి తన తోటి మానవాళికి ఆ అవసరాన్ని బాధ్యతను గుర్తు చేయడమే ధ్యేయంగా సాగుతుంది

దార్ల కవిత్వం. కవిత్వమంతా కుత కుత ఉడుకుతున్న అన్నంలా ఉంటుంది. గంజి వార్చాలేమో అని అనిపించినా అత్తెసరుగా నీళ్ళు కలిపాదని అనిపించి ఆద్యంతమూ కవిత్వం చదవాలనిపిస్తుంది. కొంత పలుకు అక్కడక్కడా తగిలినా ఆ పలుకు కూడా కవిత్వానికి అప్పుడప్పుడూ అవసరమనిపించేలా సాగడం వల్ల కవిత్వం ఆస్వాదయోగ్యం అయ్యింది. మెర మెచ్చులేని కవిత్వం పొర పొచ్చాలున్న ఈ సమాజానికి ఎంతో అవసరం. ఆ అవసరాన్ని తెలుసుకున్నాడు గనుకే, అసమ సమాజంలో లోపాలన్నిటి పట్లా ఆలోచనలతో – అవగాహనతో మానవతా దిక్సూచిగా కవిత్వాన్ని ఎన్నుకున్నాడు. ఎన్నుకున్న కవిత్వాన్ని అల్లుకుంటూ వెళ్ళాడు. ఒక ఆర్తి – ఆవేదన – అంతర్మథనం – అంతస్తత్వం – అంటరానితనం – అన్నీ కలిసి అంతర్గంగా ప్రవాహమై అంగలార్చే కవిత్వ దాహమై ప్రతి హృదయాన్ని తాకుతుంది.

నెమలి కన్నులు కవితా సంపుటి మన బాల్యంలో మన పుస్తకాలలో భద్రంగా దాచుకున్న నెమలీకల్ని గుర్తుకు తెస్తాయి. సప్త వర్ణ సౌందర్యాల సమ్మోహనంగా పలకరిస్తాయి. పలకరింపులలో మానవతా పరిమళాలను చిలకరిస్తాయి. కొంత నిశ్శబ్దత– నిర్వేదం కనబడినట్టు అనిపించినా అది నివురు గప్పిన నిప్పని గ్రహించాలి. తీవ్ర కంఠ స్వరం అక్షరాల వెనుక నిశ్శబ్దంగా ఉన్న వైనం నిశితంగా గమనించాలి. నెమలికన్నుల వెనుక ఉన్న అగ్ని కీలల్ని పరిశీలించాలి. అగ్ని కాంతుల్లో మెరిసే నల్ల వజ్రాలను రాపిడికి గురి చెయ్యాలి. కవిత్వంలో ప్రతిఫలించే పసితనాన్ని – కన్న తల్లి స్పర్శనీ ఆస్వాదించాలి. ప్రతి సమాజం దాని తీరు – తెన్ను ఎలా ఉందో తెలుసుకోవడానికి దార్ల కవిత్వం చదవాలి. చదివిన ప్రతి ఒక్కరూ కవి పరిశీలించిన అంశాలను ఆలోచించక తప్పదు. ఈ కవిత్వం మానవాంతరాళాల్లోని వేదనకు మచ్చు తునక. ఆలోచింప చేసే కవిత్వం రాసిన డా॥ దార్ల వెంకటేశ్వరరావు గారికి శుభాభినందనలు!! భవిష్యత్తులో ఇలాంటి కవిత్వాన్ని మరింతగా ఆశిస్తూ ..... శుభాకాంక్షలతో ....!

– ఆచార్య కె. ఆశాజ్యోతి

ఛైర్ పర్సన్, తెలుగుశాఖ, బెంగుళూరు విశ్వవిద్యాలయం,
జె.బి. క్యాంపస్, బెంగుళూరు –560 056
ఫోను: 080–2296 1788, 080–2296 1786
E-mail: ashajanardan@gmail.com

❖ ❖ ❖

మానవ మనోకుహరం విస్మరిస్తున్న చలన సూత్రాలీ "నెమలి కన్నులు"

– ఆచార్య కొలకలూరి మధుజ్యోతి

"నెమలి కన్నులు" పేరుతో కవితా సంకలనం వెలువరిస్తున్న డా॥ దార్ల వెంకటేశ్వరరావు గారికి అభినందనలు.

నెమలి కంటి చుట్టూ అంచెలంచెలుగా ఎంత అందమైన రంగులు?!
కవి కలం కంటి చుట్టూ ఎన్నెన్ని అనుభూతుల వర్ణాలు?
ఎన్ని కన్నులు.....? ఎన్ని వర్ణాలు...... ?!
మూడు వస్తువులు......అనుభూతి పరంపరలు.

"మావూరు నవ్వింది", "ఇక్కడ పుట్టడమే నేరమా" రెండు కవితలూ దళితమే. పుట్టిన ఊరిపట్ల మమకారం లేనిదెవ్వరికి? పుట్టిన ఊరు, బాల్యం నుంచీ కష్టాలను అవమానాలను వివక్షను దళితుడికి ఇస్తూనే ఉంటుంది. బిడ్డ దుఃఖాన్ని తల్లి దండ్రులూ తొలగించలేరు. వారూ ఈ దుఃఖపు చట్రంలోని వారే కనుక. విద్యను కాదని కాయకష్టం మీదనే దళితులను అణచిన కుల అహంకారం వెచ్చని కన్నీటి ఊటనే ఇచ్చింది. దళితుడు అన్నింటా దరిచేరరాని వాడే కాని, ఓట్ల దగ్గర మాత్రం అత్యంత ప్రీతిపాత్రుడు.

"నన్నే కులం గుంపులోనో
నన్నే దొంగ ఓటరుగానో
అక్రమ కేసులు బనాయించబడిన నేరస్థుడిగానో
అవసరానికో చలిమిడి ముద్దగా చేసుకొనే సమాజ మోసాన్ని ఊరు

నైజాన్ని "*మా వూరు నవ్వింది*" కవితలో చాటాడు కవి. దళితుడు కష్టాల కొలిమి నుంచి బయట పడాలంటే విద్య ఒక్కటే మార్గం. విద్యా సంపన్నుడేని తప్పని సరి అయి అక్కున చేర్చుకుంటుంది ఊరు అంటాడు కవి, దళిత విద్యావశ్యకతను చాటుతూ, వివక్ష ఎంత బలంగా ఉన్నా, ఊరు ఎంత అవమానాన్ని అందించినా, జన్మభూమి పట్ల ఇష్టాన్ని "*అక్కడక్కడా రహస్య ద్వారాల రాగ బంధాలుంటాయి కదా!*' అంటూ, అదే ఊరితో ముడిని పెనవేసుకొనేలా చేస్తాయని ఇష్టాన్ని వ్యక్తం చేశాడు.

దళిత జీవితాలలో ఉన్న మానని పుండు మాతమ్మ వ్యవస్థ. తమ ఆడబిడ్డలను ఆ తల్లి పేరిట వదిలేయటం దళితులలో ఉన్న దురాచారం. దాని వలన భూస్వాములు పెత్తందార్లు ఆమెను భోగవస్తువు చేసి ఆనందిస్తారు. మానని పుండుగా ఉన్న రుగ్మతకు చట్టాలు మల్వాన్నిచ్చినా, కులస్వామ్యపు ధనస్వామ్యపు దొరలు పుండును పచ్చిగానే ఉంచుతారు. అది అలా ఉంటేనే వారికి లాభం.

"భూస్వామ్యానికి భోగ వస్తువునై
పెత్తందారే చిత్తాన్ని రాగరంజితం చేయడం!
వాళ్ళ కామదాహానికి బలైపోతూ
తరతరాలుగా మాతంగిగా నలిగి పోవడం"

(ఇక్కడ పుట్టడమే నేరమా?)

దారుణం. ఈ దారుణానికి దళిత స్త్రీ మాత్రమే బలి కావటం కవికి, జాతికి అర్థం కాని విషయం. దళిత సమస్యను చిత్రించిన ఈ రెండు కవితలూ ఆర్ద్రమైన హృదయావిష్కరణ ఫలితం.

పల్లెనుంచి పట్టణం వచ్చే ఏ యువకుడైనా పడే బాధే *"ఎక్స్‌రే రిపోర్టు".* ఇంటికి తరచూ వెళ్ళలేక నెపాల వాయిదాను బాసట చేసుకొంటాడు. అదే సమయంలో తనవారి కబురుకోసం పరితపిస్తాడు. ఇది సహజం కవికి ఇది కవిత్వ మార్గం. రకరకాల బాధ్యతల నమూనాలో తనను తాను ఒదిగేలా చేసుకోవాలి తప్పదు. అది ప్రగతి సూత్రం. కాని ఆ క్రమంలో లుప్తమైపోతున్న "నేను" తనం నిలదీస్తుంది.

"గర్భంలో రూపింపక మునుపే నన్నెరిగిన దేవుడా!

లోకానికిన్ని నమూనా పాత్రలవసరమా?" అని ప్రశ్నిస్తుంది. బాధ్యతల చదరంగంలో కొట్టు మిట్టాడుతూ ఎదురు తిరిగే స్వభావాన్ని జోకొట్టలేక అల్లాడే అటువంటి క్షణాలే కవిత్వమై ఓదార్పునిస్తాయి.

తల్లి దండ్రులను పట్టించుకోని నేటికాలంలో ఒక్కరోజైనా పట్టించుకొనేలా చేసే పాశ్చాత్య సంప్రదాయపు సంబరం"ఫాదర్స్ డే", "మదర్స్ డే" తండ్రుల కోసం బిడ్డలు ఆలోచించేది మాత్రమే కాదు తండ్రులు బిడ్డల కోసం ఆలోచించేది కూడా అని కవి పేర్కొంటున్నాడు. తల్లిదండ్రులకు భగవంతుడిచ్చే వరం పిల్లలు. పసిప్రాణి స్పర్శ, చేష్ట అన్నీ వివశత్వాన్నిచ్చే అలౌకికానందాలే. తల్లి బిడ్డకై పరితాపం చెందటం ఓ ఆనవాయితీగా హక్కుగా ఉన్న లోకంలో, ఇంకా జన్మించని ఎదురు చూపులను ఇచ్చిన చిట్టి తండ్రిని ఆర్తిగా ఆహ్వానిస్తున్న తండ్రి వేదన విశేషమే.

"ప్రతీ కలకీ నువ్విస్తున్న
కన్నీటి ముత్యాల దండల్ని
బాత్‌రూములోదాచేస్తున్నానని చెప్పనా"

(నానీ.....నువ్వెప్పుడొస్తావురా!)

అంటూ పిల్లలకై తపన తల్లి దండ్రులిరువురికీ సమానంగా ఉంటుందనే వాస్తవాన్ని కవి వేదనా మయంగా అందించారు. యాంత్రిక ప్రపంచంలో మానసిక ప్రకంపనలు, కన్నీరు తెప్పించినా పన్నీరు చిలికించినా స్వాగతాలే. జీవిత తాపత్రయాలలో మానవ మనోకుహరం విస్మరిస్తున్న చలన సూత్రాన్ని నెమలికంటి చెమ్మతో ఆపాదిస్తున్న డా॥ దార్ల వెంకటేశ్వరరావు గారికి శుభాభినందనలు.

– ఆచార్య కొలకలూరి మధుజ్యోతి

శాఖాధ్యక్షులు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్,
డిపార్టుమెంటు ఆఫ్ తెలుగు స్టడీస్,
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి, ఆం.ప్ర.

❖ ❖ ❖

మాదిగ కవిత్వపు సరికొత్త కెరటం

– ఆచార్య పులికొండ సుబ్బాచారి

తెలుగు కవిత్వంలో మున్నెన్నడూ లేని వైవిధ్యం గడచిన రెండు మూడు దశాబ్దాలలో వచ్చింది. అంతకు ముందున్న అభ్యుదయ కవిత్వం లేదా విప్లవ కవిత్వం, అభిముఖంగా సంప్రదాయ కవిత్వం ఈ మూడింటిని దాటి విస్తృతంగా చర్చించే మరొక వింగడింపు విషయ పరంగా చెప్పడానికి లేదు. దిగంబర కవిత్వం మరొక భిన్నమైన పాయగా నిలిచింది. కాని వస్తుపరంగా అది అభ్యుదయ, విప్లవ కవిత్వాలకు భిన్నమైనది కాదు. కాగా వచన కవిత వంటి ప్రక్రియా పరమైన వర్గీకరణలను గురించిన చర్చకు సంబంధించినది కాదు ఇక్కడి చర్చ.

గడచిన మూడు దశాబ్దాలలో సామాజికపరంగా తెలుగు కవిత్వంలో గుణాత్మకమైన మార్పు ('qualitative change') వచ్చింది. అదేమంటే తెలుగు కవిత్వాన్ని అస్తిత్వ వాదం అనేది ఆక్రమించింది అని చెప్పవచ్చు. ఎనభైయవ దశకం నుండే స్త్రీవాద కవిత్వం, దళిత కవిత్వం స్పష్టమైన రూపు దిద్దుకున్నాయి. ఆ తర్వాత మైనారిటీ కవిత, బి.సి వాద కవిత అనేవి స్పష్టంగా తమకు వేరే గొంతులు ఉన్నాయి అని చెప్పుకుని ఉనికిని ప్రతిష్ఠించుకున్నాయి. ఈనాడు అవి స్పష్టమైన కవిత్వపు వర్గీకరణలలో చోటు చేసుకున్నాయి. దక్షిణ భారతదేశంలో ఇటీవలి కాలంలో వచ్చిన సామాజిక ఉద్యమాలలో చెప్పుకోవలసింది మాదిగ దండోరా. దళిత ఉద్యమం దళిత కవిత్వం తనదైన ఆవరణను ఏర్పరచుకున్న తర్వాత, వచ్చిన మాదిగ రిజర్వేషన్‌కు సంబంధించిన సామాజిక ఉద్యమం తెలుగువారైన దళితులను రెండు భిన్నమైన స్కంధావారాలలోనికి వేరు చేసింది.

ఇక్కడ నేను దళిత సంబంధమైన రాజకీయ సంబంధమైన చర్చ చేసే వేదిక కాదు దీన్ని గురించి ఇప్పటికే విడిగా రాసి ఉన్నాను. దళితులలో అంతర్గతంగా తిరిగి ఒక అస్తిత్వ సమస్య తలెత్తింది. మాదిగ, మాల ఉద్యమాలు బహిరంగంగా వారి వారి సామాజిక ప్రయోజనాలకోసం చేసిన ఉద్యమాల ప్రభావం ఆ కులాలలోని మేధావులు కళాకారులు తదితరుల పైన కూడా బాగా పడింది. దళిత కవులు పరస్పరం మంచి అవగాహనతో సిద్ధాంత భూమికతో ఉన్నప్పటికీ దళిత స్పృహను అందరూ చెప్పినప్పటికీ రెండు కులాల్లో ఉన్న వృత్తి పరమైన భేదం ఇంకా చాలా విషయాలలో సంస్కృతి పరమైన భేదాన్ని వారి కులానికి సంబంధించిన అస్తిత్వంగా భావించారు. దళిత కవులు విశేషించి మాదిగ వర్గానికి చెందిన కవులు తాము ప్రత్యేకమైన అస్తిత్వాన్ని కలిగి ఉన్నామని నిరూపించుకునే ప్రయత్నం చేశారు. వారికి వారు తమను మాదిగ కవులుగా తమది దళిత కవిత్వమే అయినా ప్రత్యేకంగా మాదిగ కవిత్వం అని ప్రత్యేక అస్తిత్వాన్ని వారికి వారే సంపాదించుకున్నారు. మాదిగ కవిత్వాన్ని సాహిత్య విమర్శకులు ప్రత్యేకించి గుర్తించి పేరు పెట్టడం జరగలేదు. ముందే ప్రత్యేక అస్తిత్వాన్ని సంతరించుకున్న ఒక ప్రత్యేక వింగడింపును మాత్రమే నేను కాని నావంటి ఇతర సాహిత్య విమర్శకులు కాని చూస్తున్నారు. విశ్లేషిస్తున్నారు.

మాదిగ కవులకు సంబంధించిన ప్రత్యేక కవితా సంకలనాలు వచ్చాయి. ముఖ్యంగా కైతునకల దండెం అనేది మాదిగ సాహిత్యం, కవిత్వం ఒక ప్రత్యేకమైన స్రోతస్సుకు చెందుతుందని నిరూపించింది. మాదిగలకున్న చర్మకార వృత్తి దేవతారాధనలు, వారి కళారూపాలు ముఖ్యంగా మాదిగల ఉపకులాలైన వారి చిందు భాగవతం, డక్కలి పటం కథ, బైండ్ల కథ, ఇంకా ఇతరమైన వారి కళా రూపాలు. విశేషించి మాదిగ వారి డప్పు మాదిగల కులానికి చెందిన సాంస్కృతిక చిహ్నాలైనాయి. వీటిని కవులు వారి కవితల్లో ప్రతిబింబించారు. కాగా దళితులలో మాలలకు వారి ఉపకులాలకు ఉన్న వృత్తి నేపథ్యాలతో వీరు తమ నేపథ్యం భిన్నమైనది అని తమ కవితల్లో చెప్పుకోగలిగారు. సోషల్ ఎక్స్ క్లూజన్ అనేది బయటి నుండి జరిగే సామాజిక క్రమంగా ఇది ఒక ఉన్నత వర్గం చేసే సామాజిక పరమైన దురన్యాయంగా చూచే పరిణామంగా ఉంది. ఇక్కడి సామాజిక పరిణామం దానికి భిన్నంగా కూడా ఉంటుందని తెలియవచ్చింది. ఒక సామాజిక వర్గం

కూడా సోషల్ ఎక్స్ క్లూజన్ కు కారణమై ప్రత్యేకమైన అస్తిత్వాన్ని పొందడానికి సోషల్ ఎక్స్ క్లూజన్ అనేది నకారాత్మక సామాజిక పరిణామం కాక సకారాత్మక సామాజిక పరిణామం అవుతుందని దీనివల్ల ఒక కొత్త సామాజిక పరిణామం బయటికి వచ్చింది. మాదిగ అస్తిత్వ ఉద్యమం మాదిగ కవిత్వపు సరికొత్త వింగడింపు ఈ సామాజిక కారణాల వల్ల ప్రత్యేకమైన రూపాన్ని పొందాయి.

ఇటీవలి కాలంలో ఈ కారణంగా ఉద్భవించిన దళిత కవులలో ప్రత్యేకమైన స్రోతస్సుకు చెందిన మాదిగ కవులలో దార్ల వెంకటేశ్వరరావును ఒక సరికొత్త కెరటంగా చెప్పుకోవాలి. ఒక కవి కవిత్వాన్ని అంచనా వేసేటప్పుడు ఆ కవి తాను వచ్చిన ఏ నేపథ్యంలో రాశాడనే ఈ సామాజిక స్పృహ లేకుండా అతని కవిత్వాన్ని అంచనా వేయలేము. దార్ల వెంకటేశ్వరరావు తాను గడిచిన పది పదిహేను సంవత్సరాలుగా రాసిన కవిత్వాన్ని ఒక సంకలనంగా తీసుకు వచ్చాడు. దార్ల కలం పట్టేనాటికే దళిత కవిత్వం స్పష్టమైన రూపం పొంది దానిదైన సామాజిక ప్రభావాన్ని చూపుతూ ఉంది. దళిత నేపథ్యంలో దారిద్ర్యాన్ని అనుభవించడం మాత్రమే కాకుండా సామాజిక వివక్షకు గురై కఠినమైన జీవితాన్ని అనుభవించిన వాడు కావడం వల్ల ఆ నేపథ్యాన్ని రంగరించే ప్రతి కవితను రాశాడు. అదంతా అతని కవితల్లో ప్రతిబింబించింది. ఇలా రాయక పోతేనే ఆశ్చర్య పడవలసి వస్తుంది. తనకున్న దళిత వేదనను తన కుటుంబ వేదనను చక్కగా ప్రతి కవితలోను ప్రతిబింబించాడు దార్ల వేంకటేశ్వరరావు.

దార్ల కవిత్వంలో వస్తువును పరిశీలించినప్పుడు రాసేది దళిత విషయం హృదయ దళనానికి సంబంధించినదే అయినా కూడా అందులో చక్కటి సృజనను వైవిధ్యాన్ని కూడా చూపాడు. తనదైన ముద్ర చాలా కవితల్లో ఉంది.

మొదటి కవితలోనే తన స్వంత పరిచయం లాగా తన దళిత కుటుంబ నేపథ్యాన్ని చక్కగా వచనాత్మకంగా వివరించాడు. *"ఈ కులంలో పుట్టక పోతే నేను మనుషుల్ని ప్రేమించే వాడిని కాదేమో'* అని కొత్తగా భావిస్తాడు ఈ కవితలో ఒక వాక్యంలో. మిగతా దళిత కవులు రాసిన చాలా సామజికాంశాలను దార్ల కూడా రాసాడు. వాటిని గురించి ప్రత్యేకించి చెప్పవలసిన పనిలేదు. కాని మిగతా వారికి తట్టని కొన్ని కోణాలను దార్ల కొన్నింటిని చూపాడు. వాటిని గురించి చెప్పాలి.

గ్రంథాలయాలను డిజిటైజ్ చేసి వాటిని కంప్యూటర్లలోనికి ఎక్కించి పుస్తకాలను తొలగించడం అనే పని వల్ల దళిత నేపథ్యం అనేది ఎలా నష్టపోతుంది అని భావిస్తూ ఒక కవిత రాసాడు దీనిపేరు *"కూలుతున్న గ్రంథాలయం"* పలకా బలపాలకే దూరమైన వారు ఇప్పుడిప్పుడే పుస్తకాలు పడుతున్న దళితులకు డిజిటల్ లైబ్రరీలు అనేవి ఇంటర్ నెట్ అనేవి మరింత అందని మానిపండ్లు అవుతాయని సామాజికంగా మరింత వీరిని విజ్ఞానానికి దూరం చేస్తాయని ఇతని భావన. దీన్ని మంచి సృజనాత్మకంగా చెప్పగలిగాడు.

"ప్రతిదీ అంతర్జాలంలోనే చూసుకోవాలట
ఇక అరచేతిలోనే స్వర్గం
ఇంటర్నెట్ ఒక మోహినీ నృత్య తాండవం,
ఇక అమృతానికి ఆవల ఉండవలసిందేనేమో"

అనే పంక్తులున్నాయి. ఇవి మామూలుగా వచన ప్రాయంగానే ఉన్నాయి. కాని ఇందులో మంచి పౌరాణిక ధ్వని ఉంది. క్షీరసాగర మథనంలో అసురులు సురులు కలిసి మధించారు. విష్ణువు మోహిని అవతారంలో వచ్చి అమృతాన్ని దేవతల కిచ్చి తమకు న్యాయంగా రావలసిన అమృతాన్ని విష్ణువు తమకు రాకుండా మోసం చేసాడనే విషయాన్ని ఇక్కడ బాగా అర్థవంతంగా ధ్వని గర్భితంగా రాశాడు. అంతే కాదు, క్షీరసాగర మథనంలో మరొక కోణాన్ని ఇక్కడ గమనించవచ్చు. అసురులు చేసినది కష్టమైన పని, దేవతలు చేసింది అంత కష్టంలేని పని అదెలాగంటే అసురులు పాము తలవైపున పట్టుకున్నారు. అంటే ప్రమాదం జరగడానికి అవకాశం ఉన్నవైపు పనిచేశారు. కాని దేవతలు ప్రమాదరహితమైన పక్షాన ఉండి పనిచేశారు. నిజానికి వచ్చిన ఫలితంలో ఎక్కువ భాగం వారికి చెందాలి కాని దాన్ని దేవతలకు చెందేలా చేశాడు విష్ణువు. ఈ విషయాన్ని నేటి దళిత సమస్యకు అన్వయించి చెప్పడం. దళితులను అసురులతో ఐడెంటిఫై చేయడం చాలా మంచి వ్యూహం. నేటి దళితులు రావణుడిని, నరకాసురుడిని, బలి చక్రవర్తిని సకారాత్మక అంటే మంచి కోణంలో చూస్తున్నారు. వారు వంచనకు గురైనవారుగా సామాజిక దళనానికి గురైనవారుగా చూస్తున్నారు. ఈ నేపథ్యంలో దార్ల కవిత మంచి దళిత స్వరాన్ని వినిపించింది అని చెప్పాలి.

యధాతథంగా పుస్తక సమీక్ష చేయడం నా ఉద్దేశం కాదు. దార్ల రాసే కవిత్వానికి సామాజిక నేపథ్యాన్ని చెప్పడమే ఇక్కడి నాలక్ష్యం. అయినా ఇక్కడ కొన్ని మాటలు చెప్పాలి. దార్ల ఇప్పుడిప్పుడే కంఠం సవరించుకుంటున్న నూతన కవి అనే నేను చెప్పదలచుకున్నాను. అపరిపక్వమైనవి కేవల వచన ప్రాయమైన కవితలు కూడా ఇందులో కొన్ని ఉన్నాయి. అక్కడక్కడ మంచి సృజనాత్మకతను చూపిన భావనలూ ఉన్నాయి. "*పెట్రోలు సంతకం*" అనే కవిత, సునీతపైన రాసిన కవిత దళిత కవిత్వంలో దార్ల ముద్రని చూపెడతాయి. విశేషించి '*కూలుతున్న గ్రంథాలయం*" అనే కవిత ఈ సిద్ధాంతానికి మంచి ఊపునిస్తుంది.

కొన్ని కవితల్ని చూస్తే దార్ల శ్రద్ధ తీసుకోలేదని పిస్తుంది. ధ్వనిని సమకూర్చేటప్పుడు ఒక విషయాన్ని పూర్తిగా చెప్పలేకపోవడం అసంపూర్ణంగా ఉండడం కనిపిస్తుంది. భాష విషయంలో కూడా ఇతను శ్రద్ధ తీసుకోవాలి. ఇందులో దొర్లిన భాషా దోషాలు ప్రయోగం అని బుకాయించడానికి కూడా కుదరదు. వీటితోపాటు వైరి సమాసాలు వేశాడు. "సంధ్య మసకలు", "ఆలింగన మరకలు" అని కొత్త సమాసాలు వేశాడు. నేను వైరి సమాసాలు వేయవద్దు అని చెప్పను కాని ఇక్కడ చేసిన వైరిసమాసాలు అందంగా లేవు వీటిలోని ధ్వని వినసొంపుగా లేదు. ఇలాంటి వాటిని చేసి ప్రయోజనం లేదు. "బోరుబావి" అనేది వైరి సమాసమే పైగా ఇంగ్లీషు పదం కూడా, కాని వినడానికి ఇది ఇబ్బందిగా లేదు. బాగుంది.

"*నెమలికన్ను*' అనే మాటను ఒక కవితలో పురాతన స్మృతికి సంకేతంగా వాడాడు. ఒక కవితలో దాన్నే దీనికి అంటే కవిత సంకలనానికి పేరుగా ఉంచాడు. కాని దీనికి వేరే అర్థం చెప్పుకోవచ్చు. నెమలి కంటికి నీరు కారితే వేటగాడిని ముద్దా అనే అర్థంలో ఈ కవితా సంకలనానికి ఉన్న పేరును గ్రహిస్తే ఇక్కడ వర్ణించిన దళిత వస్తువు వేటగాడి బారికి గురైన నెమలి వంటిది అవుతుంది. అలాగే సామాజిక ద్రోహానికి గురి చేసిన మిగతా సామాజిక వర్గాలు వేటగాడికి సంకేతం అవుతాయి. ఈ దృష్ట్యా ఈ కవితా సంకలనానికి ఈ పేరు కూడా బాగా సరిపోతుంది.

దార్ల వచన కవితా కళని అభ్యసించే స్థితిలోనే ఉన్నాడు. అక్కడక్కడా మంచి భావుకతని కూడా ప్రదర్శించాడు. తన గ్రామానికి వెళ్ళి ఒక నాస్తాల్జియాని

వర్ణించే క్రమంలో "*స్మృతి శిరటాలేవో తవ్వ కొచ్చే వీధి వీధుల్నీ ప్రొటెక్టెడ్ ఏరియాలుగా ప్రకటించాలి*" ఆర్కియాలజీ శాఖ అని అనడం చాలా కొత్తగా బాగుంది. మామూలు వచనాన్నే మామూలు వాక్యాన్నే మంచి కవిత్వంగా మార్చే అల్కెమీని గురించి దార్ల ఇప్పుడిప్పుడే గ్రహిస్తున్నాడు. దీనిలో అతను మరింత కృషి చేయవలసి ఉంది.

ఈ నిజాయితీ ఇతని కవితల్లో కనిపిస్తుంది. అలాగే అతని సామాజిక సంవేదన దళిత సిద్ధాంత నేపథ్యం కూడా మరింత బలీయం అయ్యే అవకాశం ఉంది. సామాజిక వాదంతో పాటు కవిత్వాన్ని వచనంలా తేలిపోయేలా చేయకుండా దీన్ని ఒక కళగా కూడా అతను ఇంకా బాగా అభ్యసించాలని నేను ఆశిస్తాను.

– ఆచార్య పులికొండ సుబ్బాచారి

Head, Department of Folklore and Tribal Studies,
Director, Internal Quality Assurance Cell (IQAC)
Dravidian University, Kuppam 517425, A.P.

❖ ❖ ❖

పురివిప్పిన నెమలి కన్నుల కవిత్వం

– ఆచార్య పి. కేశవకుమార్

డాక్టర్ దార్ల వెంకటేశ్వరరావు గుండె చాటున దాచుకున్న జ్ఞాపకాలకి పూసిన అక్షరాలీ *"నెమలి కన్నులు"* ఈ నెమలి కన్నుల నృత్యగానంలో అన్యాయాల్ని, అవమానాల్ని ఎదిరించిన ఆత్మగౌరవ సంగీతముంది. చీకటి వెలుగుల చాటున ప్రవహించిన బతుకుపాట వుంది. అక్షరాలు చేసిన ఆకలి చిందువుంది. జీవితానుభవాల్లోంచి పుట్టుకొచ్చిన దళిత దార్శనికత వుంది. వూరికీ, పల్లెకీ మధ్య ఉన్న నిప్పుల గీతల్ని చెరిపేస్తూ, పల్లెనీ, పట్టణాన్ని విడదీసిన "నాగరికతా" రహదార్లనీ కలిపేస్తూ సాగే జుగల్‌బందీ ఈ కవిత్వం.

నెమలి కన్నుల కవిత్వం నిండా దళిత కలలే. కొత్త జీవితం కోసం హుందాగా వుండే బతుకుకోసం చులకనతనం లేని ఆధునికత్వం కోసం, వూరి ప్రేమతో పెనవేసుకున్న రహస్య బంధాల్ని బహిరంగ రాగాలాపన చేద్దామని, తెల్లపంచెలో మహారాజై మీసం మీద చెయ్యేసి కోర్కెల గుర్రమెక్కిన అయ్య, పట్టుచీర కట్టుకుని ఫ్యానుకింద కూర్చుని కలరు టీవీ చూస్తున్న అమ్మ... ఇప్పుడు తన కలల్లోనూ ఊహల్లోనూ తండ్రి తోటమాలి కాదు. తల్లి పనిమనిషి కాదు. ఆత్మన్యూనతను అవతలికి విసిరేసిన నిండు మనిషి అతని కవితా వస్తువు. జీవితాన్ని, కవిత్వాన్ని అట్టాగే శాసించే నియంత్రకుడు కావాలను కుంటాడు. అట్టాగని వాస్తవ జీవితంలోంచి కలల ప్రపంచంలోకి పారిపోవాలనుకోవడం లేదు. అవమానమంటే అర్థమయ్యే అందరినీ ప్రేమించడం తెలిసే దళిత కులంలో పుట్టడమే మంచిదయిందంటాడు. ఆత్మగౌరవానికీ, ఆత్మవిశ్వాసానికీ వెన్నుపూసై

నిలిచిన పుట్టుమచ్చనే ప్రేమిస్తానంటాడు. ఈ కవిత్వంలో కులం కట్టుబాట్లు, సాహిత్యం, సంస్కృతి, భాష.. ఇలా అనేక రూపాల్లో వున్న బ్రాహ్మణత్వాన్ని నిలదీసిన దళిత దృష్టి వుంది. మాదిగచైతన్యంతో పురివిప్పిన నెమలి కన్నుల జీవితముంది.

ఈ కవితా సంకలనంలో అనేక విషయాలపైన ప్రతిస్పందించిన కవితలు ఉన్నప్పటికీ, అన్నిటా దార్లకున్న ప్రాపంచిక దృక్పథం సుస్పష్టం. అది బ్రాహ్మణీయ కులసమాజంపైన, సాహిత్యం, సంస్కృతిపైన ఎక్కుపెట్టిన అచ్చమైన దళితదృక్పథం ఈ నెమలి కన్నుల కవిత్వం కొత్త పార్శ్వాలను తాకి దళిత సాహిత్యం పరిధిని పెంచింది. ఉమ్మడి దళిత వుద్యమం నుండి మాదిగ దండోరా వుద్యమం వరకు సాగిన దళిత ఉద్యమవైనాన్నీ చూడొచ్చు. సాహిత్యం ద్వారా దళిత ఉద్యమానికి అవసరమైన మేధోపరమైన ఆలోచనని అందించింది. ఒకవైపు దళితస్పృహకి పదును పెడుతూనే దళిత ఉపకులాల మధ్య అంతరాన్ని గుర్తిస్తూ, సామాజిక న్యాయసూత్రం ద్వారా సమన్వయం ఏర్పరిచే ప్రయత్నం కన్పిస్తుంది.

దళిత జీవితానుభవం పునాదిగా సాహిత్యాన్ని రాజకీయాలనీ స్పృశించడమే గాక, అన్ని విధాలా దళితుల ఉన్నతినీ, అభివృద్ధినీ అధికారాన్నీ కోరుకున్నట్టు కన్పిస్తుంది. దళితుడంటే బాధలు, అవమానాలు, ఆకలీ, ఆవేదనలు అన్న నిన్నటి ఇమేజరీలకి దూరంగా జరిగి ఆత్మ గౌరవంతో హుందాగా, నిండుమనిషిగా మనమధ్య నడిచిపోయే దళితుడిని ఆవిష్కరిస్తాడు. దళిత అనుభవాల్ని వెంటాడే అవమానాలుగా గాక, అదో ఆత్మ జ్ఞానంగా, అమ్మవొడిగా చూస్తాడు. ఆ జ్ఞానాన్ని దళిత విమోచనగా మలుస్తాడు. ఆ దిశలోనే పుట్టుమచ్చల్ని ప్రేమిస్తాడు. పల్లెల్ని పట్టణాల్లోకి లాక్కొస్తాడు. అమ్మని యూనివర్సిటీలో పాఠంగా చేస్తాడు. అయ్యని దళిత తాత్త్వికుడిని చేస్తాడు. బ్రాహ్మణీయ జ్ఞానాన్ని తలదన్నేలా చేస్తాడు. ఈ కవిత్వంలో మారుతున్న కుల రూపాలనీ, మారని కులతత్త్వాన్ని బాగానే పసిగట్టేడు. కులమంటే వూరనీ, పట్టణం అందుకు భిన్నమనీ అనుకుంటాం. కులం అంటే ప్రాచీనమనీ, సాంప్రదాయమనీ, ఆధునికత అందుకు వ్యతిరేకమనుకుంటాం. కింది కులాల వాళ్ళు చదువుకుని ఆర్థికంగా ఎదిగిన కొద్దీ, కులం దానంతటదే కూలిపోతుందని కూడా చెప్తూవుండటాన్ని వింటూవుంటాం. అయితే, రోజువారీ వాస్తవ జీవితం అందుకు భిన్నంగానే వుంది. భారతీయ పౌరసమాజంలో కుల వికృతరూపం స్పష్టంగానే వుంటుంది. అగ్రకుల మధ్యతరగతి వర్గ, కుల

దురహంకారం నుండి ఒక్క అడుగైనా ముందుకేయలేదు. మారిందల్లా భాష, రూపమే. హృదయాంతరాల్లో కరడు కట్టుకుపోయిన కులం పదిలంగానే వుంది.

దళితుల్ని వ్యతిరేకించే ఉద్దేశ్యంతోనే రిజర్వేషన్లు కులం ప్రాతిపదికన గాక, ఆర్థిక ప్రాతిపదికగా ఉండాలంటారు. అట్లాగని కులం వల్ల వారసత్వంగా వచ్చిన అధికారం, హోదా, సంపదని ఏమాత్రం వదులుకోడానికి సిద్ధంగా వుండరు. ఆధునిక సమాజంలో కులహింస భౌతిక రూపంలో గాకుండా, మానసిక రూపంలోకి మారుతుంది. కులం గురించి ఆరాతీయడం ప్రత్యక్షంగా గాక, పరోక్షంగా వుంటుంది. కుల దురహంకారంతో దళితులపైనా, మరీ ముఖ్యంగా దళిత మధ్యతరగతిపైనా జరిగే దాడైతే వెయ్యి దబ్బనాలతో ఒకేసారి గుచ్చినట్టుంటుంది. పట్టణాల్లోకి ఉద్యోగరీత్యా వచ్చిన దళితులకి రోజువారీ జీవితం ఒక సవాలే. ఈ ఆధునిక ఆవాసాల్లో అభద్రతతో కూడిన జీవితం, సామాజిక జీవితం అంటూ లేని ఒంటరి జీవితాన్ని జనసమూహాల మధ్యే గడపాల్సి వుంటుంది. అందులో భాగంగా పుట్టుమచ్చల్ని కన్పించకుండా వుండాలనుకుంటారు. తనది కాని జీవితాన్ని అనుకరించే ప్రయత్నం చేయాల్సి వస్తుంది.

తన వూరి వాసనల్ని తన సొంత ఇంటి వాళ్ళను దూరంగా వుంచేలా చేస్తుంది. అనుదినమూ ఆత్మ న్యూనతకు క్రుంగిపోవాల్సి వుంటుంది. దళితుడు అగ్రకుల హోదాని పొందేందుకు, వాళ్ళ విలువలని అనుకరించేందుకు చేసే ప్రయత్నంలో చివరికి కుటుంబంలో ఓ హింసాత్మక పరిస్థితిలోకి నెట్టేయబడుతుంది. ఒక విధంగా చెప్పుకోవాలంటే ఆధునికతతో పాటు వచ్చిన హింసంతా దళిత కులాలే అనుభవించాల్సి వస్తుంది. ఈ నెమలి కన్నుల కవిత్వంలో, ఇటువంటి దళిత మానసిక స్థితిని బలంగానే పట్టుకున్నట్టు కనిపిస్తుంది. ఇది దళిత సాహిత్యానికి కొత్తగా తోడైన అంశం.

పల్లెల్ని, పట్టణాల్లోకి తీసుకొచ్చినా, కూలీనాలీ చేసుకునే తల్లిదండ్రుల్ని నగరం నడిబొడ్డులో దర్జాగా కూర్చోబెట్టినా, పండిత భాషని కాదని దళిత భాషని, యాసని అట్టాగే ముంగిళ్ళలోకి మోసుకొచ్చినా, ఆత్మ న్యూనతతో గాక, ఆత్మగౌరవంతోనూ, తనదైన గుర్తింపుతో బతకాలని చెప్పటంలో దార్ల దృక్పథం స్పష్టంగా కనిపిస్తుంది. మన మూలాల్లోకి వెళ్ళడానికి అలజడెందుకని ప్రశ్నిస్తాడు.

ఇది ఖచ్చితంగా అగ్రకుల ఆధునికతకు భిన్నమైన దళిత ఆధునికత. ఈ దళిత ఆధునికతలో జీవితానికి, అనుభవానికీ ఆచరణకీ వున్న పేగు సంబంధం వుంది. వ్యక్తుల్ని సామాజిక జీవితంలో భాగంగా చూడటమేగాక, ఆ సామాజిక జీవితం మరింత ప్రజాస్వామికంగా, గౌరవప్రదంగా వుండాలన్న తపన వుంటుంది. కొత్తవిలువలు, తార్కికత, విజ్ఞానం సంగతేమో గానీ, అటు దుర్మార్గమైన సాంప్రదాయ విలువలు, ఇటుమనిషిని సమానంగా గుర్తిస్తూ గౌరవము, హోదాని ఇస్తుందనుకున్న ఆధునిక జీవితం కుల సమాజంలో తనకి గుది బండగానే వుంటుంది.

దార్ల తన కవిత్వంలో భాషకి, బతుక్కి, సంస్కృతికీ ఉన్న సామాజిక సంబంధాన్ని బలంగా పట్టుకున్నాడు. తాను చదువుకున్న, ఉద్యోగం చేస్తున్న హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీలాంటి చోటైతే భాషే మనిషి అస్తిత్వాన్ని నిర్ణయిస్తుంది. చదువంటే ఇంగ్లీషే అన్నట్లు వుంటుంది. ఇంగ్లీషు రాకపోవడం అజ్ఞానంగా చూడబడుతుంది. అగ్రకులతనం, కాన్వెంటు చదవులు, పెదాలపై అతికించుకుంటున్న ఇంగ్లీషు ముక్కల రూపంలో ఆధిక్యాన్ని సంపాదించుకుంటుంది. పల్లెటూరు నుండి, గవర్నమెంటు బడి నుండి వచ్చే దళితులకిది నిత్యహింసే. అన్నీ తెలిసినా క్లాసురూములో మూగవాడిగా ఓ పక్క ఒదిగిపోవాల్సి వస్తుంది. ఇంగ్లీషే జ్ఞానకొలబద్దగా ప్రొఫెసర్లు భావిస్తూ, దళితుల్ని చదువురాని మొద్దులుగా చూస్తూ, మీకసలు ఇక్కడేమి పనన్నట్లు చూస్తారు. అట్లాగని తెలుగు చదువులు ఇంగ్లీషు చదువులకేమీ తీసిపోలేదు. తెలుగు సాహిత్యం విషయానికి వస్తే, బ్రాహ్మణీయ సాంస్కృతికాధిపత్యాన్ని చెలాయిస్తుంది. అందులో దళిత జీవితం ఉండదు. ప్రజాస్వామిక విలువలుండవు. సగటు మనిషి మాట్లాడుకునే తెలుగు ఉండదు. అందుకేనేమో ప్రాచీనసాహిత్యం క్లాసులో దళితుడైన దార్ల వెలేయబడతాడు. క్లాసురూములోంచి బయటకు పరిగెత్తాలనుకుంటాడు. భాషంటే బతుకు రూపం కదా. ఈ భాషలో తన ఉనికి సున్నాగా, అధమంగా ఉండడాన్ని గమనించిన దార్ల తనదైన భాషకోసం తన జీవితమున్న సాహిత్యం కోసం వెతుకులాడుకోవడం కనిపిస్తుంది. అందుకే సామాజిక అస్తిత్వంలో నుంచి, సామాజిక భాషా సూత్రాల్లోనుంచి అగ్రకుల బ్రాహ్మణీయ ఆధిక్యతను బట్టబయలు చేయాలనుకుంటాడు.

ఈ క్రమంలోనే తెలుగు ప్రాచీన భాషావాదుక విషయాన్ని గురించి మరింత ఆందోళన చెందుతాడు. సామాన్యులకెవరికీ అర్థంకాని గ్రాంథిక భాషకు వ్యతిరేకంగా వచ్చిన వ్యావహారిక భాషోద్యమం చివరికి బ్రాహ్మణీయ సంస్కృతినే కొనసాగించేలా చేసింది. ఎన్నో పోరాటాలు చేసి దళిత సాహిత్యం ద్వారా తమ అస్తిత్వాన్ని నిలబెట్టుకొనే క్రమంలో మళ్ళీ కథ వెనక్కి నడుస్తూనే వుందని గమనించి, తన సాహిత్యం కోసం. తన గొంతుకోసం, తన యాసకోసం, తనదైన మాటకోసం కవి పరితపించడం కనిపిస్తుంది. తన దళిత జీవితంలోంచి, అనుభవంలోంచి, పోరాటాల్లోంచి వచ్చిన జ్ఞానాన్ని పాఠ్య పుస్తకాలుగా చేయాలనుకుంటాడు.

దార్ల వెంకటేశ్వరరావు మాదిగ దండోరా ఉద్యమంతో బాటు ఎదిగిన మేధావుల్లో ప్రముఖుడు. అది తన కవిత్వంలో కూడా స్పష్టంగా కన్పిస్తుంది. దళిత ఉద్యమం బ్రాహ్మణీయ వ్యవస్థని తూర్పార బడితే, దళిత ఉపకుల అస్తిత్వ ఉద్యమాలు దళిత కులాల మధ్య వుండాల్సిన ప్రజాస్వామికత గురించి నొక్కి చెప్పింది. దార్ల కవిత్వం సామాజిక న్యాయం కోసం నినదించింది. శత్రు వైరుధ్యాలనీ, మిత్ర వైరుధ్యాలని గుర్తించి పోరాడాల్సిన అవసరాన్ని చెబుతూ మాదిగ మేనిఫెస్టో నందించింది. దార్ల మాదిగ దండోరా ఉద్యమాన్ని ఎంత ఆర్ద్రతతో గుండెలకు హత్తుకున్నాడో, అంతే స్థాయిలో ప్రజాస్వామిక సంఘటిత దళిత ఉద్యమాన్నీ అక్షర ఆవాహన చేసుకున్నాడు.

దార్ల కవిత్వం మనిషి జీవితానికున్న ఇంచుమించు అన్ని పార్శ్వాల్నీ తడిమింది. నేటికాలంలో దాపరించిన అన్ని సామాజిక సంక్షోభాల్నీ తన కవిత్వంలోకి లాక్కు రావడమే గాక, తనదైన విమోచనా గొంతుకని వినిపిస్తాడు. ప్రపంచీకరణమీద ఉక్కు పిడికిలై లేస్తాడు. ప్రపంచీకరణ ఎలా వనరులని కొల్లగొడతుందో, మన విలువల్ని ఎట్లా కూలదోస్తుందో కవిత్వం కట్టేడు. వనరుల వేటలో కోనసీమ బ్లో అవుట్లు, కొత్త మార్కెట్ పోటీకి చిరిగిపోయిన చేనేత అల్లికలు, ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీ, ఇంటర్నెట్ మోహినీ రూపానికి మసయిపోయిన ప్రేమలు, మానవీయబంధాలు, మనజ్ఞాన సంపద, లైబ్రరీ పుస్తకాలు, ఇట్లా ప్రపంచీకరణ మీద కలం పోట్లు పొడుస్తూ కవిత్వ తిరుగుబాటు జెండా ఎగరేస్తాడు.

దార్ల ఈ కవితాసంకలనంలో అటు ప్రాపంచిక ఉద్యమాలతోనూ, ఇటు ప్రాంతీయ ఉద్యమాలతోనూ ఒక దళిత సంభాషణ జరిపేడు. ప్రపంచీకరణ పేర

విస్తరిస్తున్న నయా వలసవాదాన్ని ప్రతిఘటిస్తాడు. నిలువెత్తు విశ్వమానవ నాశన రూపాన్ని ప్రపంచాన్ని శాసిస్తున్న శాసనాన్ని ధిక్కరించినోళ్ళని తనివితీరా ముద్దాడేడు. అగ్ర అమెరికా కాలుకింద భూమిని కుదిపేసిన యుద్ధవీరుడు సద్దాంకి సలాం చేస్తాడు. ప్రాంతీయంగా వున్న సామాజిక, ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాలకు అండగా కవిత్వాన్ని పరిచాడు దార్ల. ఉత్తరాంధ్ర, తెలంగాణ ఉద్యమాలని బలపరుస్తూ అంతర్లీనంగా ఉన్న సామాజిక అసమానతల్ని స్పృశించేడు. కోస్తా జిల్లాల్లో మాదిగ బతుకు, తెలంగాణ పోరాటానికేమంత భిన్నంగా లేదులే అంటాడు. ఏదో బతుకు తెరువుకోసం తెలంగాణ కొచ్చిన దళితుల్ని తెలంగాణాని కొల్లగొట్టినోళ్ళుగా చూడొద్దంటాడు. తెలంగాణా ఉద్యమం ఈ తేడాని గమనించాలంటాడు. ఇకపోతే, విప్లవ పార్టీలు కులాన్ని ఉపరితల అంశంగా గాక పునాదుల్లోని కులం చొరబాటుని గమనించాలని కోరుకుంటాడు. ఆ దిశగా పార్లమెంటరీ కమ్యూనిస్టు పార్టీలు, విప్లవ పార్టీలు కులాధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడాలని ఆశించినట్టు కన్పిస్తుంది. వేంపెంట మారణకాండకు వ్యతిరేకంగా విప్లవపార్టీలు పోరాటాన్ని, విప్లవపార్టీలో కులసమస్య పట్ల వచ్చిన వైఖరిని హర్షిస్తూ దళితులు కొత్తపోరాటానికి సమాయత్తమవ్వాల్సిందిగా చెబుతాడు.

దార్ల వెంకటేశ్వరరావు దళిత కవిత్వానికి ఎన్నో కొత్త హంగులద్దేడన్నది స్పష్టం. ఎన్నో ఆలోచనల్ని కవిత్వంలో మండించేడు. ఓ ప్రజాస్వామిక సమాజం కోసం, మనిషిని మనిషిగా గుర్తించే రోజు కోసం, కేవలం మాటలతోనే సరిపెట్టకుండా, ఒక పోరాటానికి దారివేస్తూ...

ఇప్పుడు కావాల్సింది... ధారాపాతమై కురవడం కాదు... అగ్నినేత్రమై మండడం.... ఓ వజ్రసంకల్పాన్ని అందించడం... మేధోకార్ఖానాలు మార్మోగట మంటాడు.

– ఆచార్య పి.కేశవకుమార్
డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిలాసఫీ,
యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ, ఢిల్లీ.

❖ ❖ ❖

ఆకసమంత ఆవేదనని తలకెత్తుకున్న దళిత తాత్త్వికుడు దార్ల

- డా॥ జి. వి. రత్నాకర్

మిత్రుడు డా. దార్ల వెంకటేశ్వరరావు తను రచించిన కవితా సంపుటి "దళిత తాత్త్వికుడు" గురించి నాలుగు మాటలు రాయమని అడిగి కూడా చాలా రోజులయింది. నాటకాల నుండి, కవిత్వం వైపుకి కవిత్వం నుండి అనువాదం వైపుకి మరలిన నా దృష్టిని సోదరుడు తిరిగి ఒకసారి వెనక్కి మరల్చాడు. అందుకు తనకి మొదటిగా అభినందనలు తెలుపుతున్నాను. నాటి దళిత మేనిఫెస్టో, గుండె డప్పు, నా మట్టి పలక పుస్తకాల నాటి చర్చలు సంఘటనలు కళ్లముందుకొచ్చాయి. ఇక కవిత్వం విషయానికొస్తే "బడిలో అమ్మ ఒడిలో...." అనే కవితలో

"ఈ కులంలో పుట్టటమే మంచిదయింది
అవమానమంటే అర్థమైంది"

అనడం అద్భుతమైన ఎక్స్‌ప్రెషన్‌గా కనిపించింది. ఎందుకంటే అవమానాల మూతి ముంతల, చింపిరి జుట్టులు, చింకిపాతలు, గోసి గుడ్డలు నేడు కవితా శీర్షికలై పత్రికల్లో కనపడుతున్నాయి. దక్షిణాఫ్రికాలో రైల్వేప్లాట్ ఫారంపై జరిగిన సంఘటన గాంధీజీ ఉప్పు సత్యాగ్రహానికి దారితీసింది. తరగతి గదిలో జరిగిన అవమానం బాబాసాహెబ్ అంబేద్కర్‌ని డాక్టరేట్ పట్టావైపు నడిపించింది. కనుక అవమానాల పాలైన జాతిలో పుట్టడమే మంచిదయిందని కవి అనడం బాగుంది. మావూరు నవ్వింది అనే కవితలో–"*మనం సదూకోకూడదంటే యిన్వేందిరా* పంక్తిలో తరాల తాత ముత్తాతల భయం, నేటి తరపు ధిక్కారం

కనిపించింది. ఆ అక్షరం నుండి ఆ చదువునుండి దళిత డాక్టరేట్‌లు పుదుతున్న వైనం, దళిత ప్రొఫెసర్‌లు, హెడ్ ఆఫ్ ది డిపార్ట్ మెంట్లు, వైస్ ప్రిన్సిపాల్‌లు, వైస్ ఛాన్స్‌లర్‌లు వస్తున్న రోజులివి. "పుట్టుమచ్చ మీద ప్రేమ" కవితలో-

"రేపు యుద్ధానికెళ్ళాలని తెలిసీ
ముందురాత్రి
శత్రు పాదాల్ని
ముద్దుపెట్టు కోవటమెందుకు?"

అనే పంక్తిలో అనేక ప్రశ్నలు కనిపిస్తున్నాయి. యుద్ధం ఎవరితో? సాటి దళితులతోనా లేక అగ్రవర్ణ భావజాలంతోనా? శత్రువు ఎవరు? సాటి దళితుడా? లేక అగ్రకులస్తుడా? అనేది కవి స్పష్టం చేయాలి. అదే కవితలో...

"నాపుట్టుమచ్చ మాత్రం
నాకు రక్షణ కవచమేనని గుర్తుచేసింది
ఆత్మగౌరవానికి, ఆత్మవిశ్వాసానికీ
వెన్నుపూసై నిలిచిన సౌందర్య మణి నా పుట్టుమచ్చ!"

అనే లైన్లు బాగున్నాయి. తమ పుట్టుక గురించి, అందం గురించి ఆలోచిస్తూ, అద్దంలో చూసుకుంటూ కునారిల్లే దశనుండి ఆత్మ గౌరవం, ఆత్మ విశ్వాసం వైపు సమాజాన్ని నడిపించే సందేశం ఇందులో ఉంది."హాస్టల్లో అమ్మ!" అనే కవితలో...

"ఎక్కడ నుండో అమ్మ అమృత హృదయమై
లాలిస్తూ జోలపాడుతూ
ఆకలీ అవమాన ప్రపంచాల్ని జయించమనే
మేలు కొల్పు గీతం విన్పిస్తుంటుంది"

అనే ప్రకటనలో మనిషి అనేక కష్టాల్లో నష్టాల్లో ఉన్నప్పుడు అతని నోటివెంట అమ్మా అనే శబ్దం వెలువడుతుంది. వెన్వెంటనే ఆ కష్టం నుండి బైటపడటానికి తనతో నాన్న వేయించిన నాటి మొదటి అడుగు, ఆలోచన అతన్ని వెన్నుతడుతుంది. అలాంటి మేలుకొలుపు ప్రకటన ఇందులో కనిపిస్తుంది.మరోచోట కవి అత్యంత ఆవేదనతో "అక్షరం ముక్క మాత్రం కనబడ నివ్వలేదుకదా" అనే

తరాల అజ్ఞానాన్ని, నిరక్షరాస్యతని నిలదీసి ప్రశ్నిస్తున్నాడు. అందని ఆకాశాన్ని అందుకోటానికి అక్షరాలతో, జ్ఞానంతో నిచ్చెనలేస్తున్నాడు. ఇంకొకచోట అందమైన భవిష్యత్ కలలో అంబేద్కర్ ఇచ్చిన జ్ఞానంతో అక్షరాలతో మరో ప్రపంచానికి శాసిస్తూ...

"మా యయ్యేమో...
తెల్ల పంచెలో మహారాజై
మీసం మీద చెయ్యేస్తున్నాడు"

అనే పలుకులు యుగాల అణచివేత నుండి, బానిసత్వం నుండి విముక్తి మార్గంలోకి పయనిస్తున్న మొదటితరం విద్యాధికుల, విశ్వవిద్యాలయ చదువుల క్రొత్త లోకపు చూపు కనిపిస్తుంది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని ఒక కుదుపు కుదిపి విద్యార్థిలోకాన్ని దళిత ఉద్యమంలోకి నడిపిన సునీత అకాల మరణాన్ని గుర్తుంచుకొని...

"ప్రేమంతా తానై
ఆ ఒడిలో ఒంపేసిన
సునీతను చంపేసి కూడా
క్యాంపస్‌లోనే ఆబోతులా తిరిగేవాడికి లేని...
వేలుకోసం తపస్సు చేసిన మహర్షులు
ఓ శంబూకుణ్ణి ప్రేమించేశారు"

అంటూ రాసిన కవిత శకలాలు, శకలాలుగా ఆ జ్ఞాపకాల్ని ఏరుకొంటున్న వైనం కనిపిస్తుంది. ఇంకా కవి దార్ల "నేనిప్పుడు దళిత సౌందర్య తాత్వికుణ్ణి, నాకు సోషియో లింగ్విస్టిక్స్ క్లాస్ చెప్పాలనిపిస్తుంది" అంటూ సామాజిక జీవన పార్శ్వాన్నే కాకుండా, దళితుల పాత్యాంశం కావాలంటాడు. అంగ కాకుండా ఒరిస్సా, గుజరాతుల్లోని సజీవ దహనాల్ని సిస్టర్స్‌ని అత్యాచారాలతో భీతావాహల్ని చేస్తూ ఉ న్న దృశ్యాల్ని అక్షరీ కరిస్తున్నాడు. రోజూ పేపర్లలో, టీవీల్లో కరీంనగర్ నుండి చీరాల వరకు చూస్తున్న నేతన్నల ఆకలి చావులపై స్పందిస్తూ...

"దారం వడికిన చేతులిప్పుడు
మగ్గం మీద

పేనుకొంటున్న ఉరి పగ్గాలు
నేత కార్మికుని
రక్తంతో తడిసి
అద్దకాల్లో కొత్త మెరుపు"

అంటున్నాడీ కవి. మరో చోట - దళితుల సమైక్య పోరాటాలన్నీ రాజ్యాధికార దిశగానే వెళ్తున్నాయనే దృష్టితో -

"ఒక్కొక్క సమాధీ
దళిత ప్రపంచానికై
నల్లసూర్యులై నినదిస్తున్న
చైతన్య ముద్రలు"

అని అంటున్నాడు. కారంచేడులో జరిగిన మారణకాండ జరిగిన జూలై 17 సందర్భంగా నాటి ఆ సమాధులకి ఇంకా రెండు సమాధులు నేడు జతైనాయి అని ఓ మిత్రుడు ఈ మధ్య అన్నట్లు గుర్తు. నాటి కారంచేదు సమాధులే ఈ కవి చెప్పే చైతన్యానికి ప్రతీకలుగా మారాలని నా ఆశ. చివరగా మిత్రుడు దార్ల కవిగా ఇంకా మరింత ముందుకు అడుగువేయాలని నేను ఆశిస్తున్నాను. వ్యాసకర్తగా, సమీక్షకుడుగా, ఉపన్యాసకుడిగా తనున్న బలమైన దశకి కవిగా కూడా తాను చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.

- డా॥ జి. వి. రత్నాకర్
అసిస్టెంటు ప్రొఫెసరు, హిందీశాఖ
మౌలానా కలామ్ ఆజాద్ నేషనల్
ఉర్దూ విశ్వవిద్యాలయం, హైదరాబాదు

❖ ❖ ❖

సామాజిక లోతుల ఆవిష్కరణ

– డా॥ విస్తాలి శంకరరావు

ఉత్తమ విమర్శకులు రాగద్వేషాలకు అతీతమైన మనస్తత్వంతో మంచి చెడులను నిర్ణయించే సామర్థ్యం కలిగి ఉంటారు. అలాంటి విమర్శకులే కవులయితే సమాజానికి అవసరమైన చక్కని కవిత్వం అందిస్తారు. అలాంటి కవులకు సమాజపు లోతు పాతులను అర్థం చేసుకునే నేపథ్యం ఉంటే విలువలతో కూడిన సాహిత్యం పాఠకులకు, సమాజానికి అందుతుంది. అటువంటి విశిష్ట లక్షణాలు ఉన్న కవి, విమర్శకుడు, మిత్రుడు దార్ల వెంకటేశ్వరరావు. మాటలోను, మంచితనంలోను ఇతరులను నొప్పించని మనస్తత్వం కలిగినవాడు. కనుక అటువంటి వారు ఏది చేసినా అది ప్రయోజనకరంగానే ఉంటుంది. దార్ల రచనలు అన్నీ సమాజ సహజ స్థితులకు, వ్యక్తుల మనస్తత్వాలకు, సమాజంలో జరిగే చిత్ర విచిత్రాలకు అద్దం పడుతూ ఉంటాయి.

దార్ల కలం నుండి జాలువారిన ఏ కవితైనా ఆనాటి సమాజ స్వరూపానికి నిలువెత్తు సాక్ష్యం. ఉదా : "ఆ రాత్రి" అనే కవితను పరిశీలిస్తే నేటి సమాజంలోని వ్యక్తులు క్షణం తీరిక లేక నిరంతరం ఉరుకులు, పరుగులతో తమ జీవితకాలాన్ని గడుపుతున్నారు. మానవ సంబంధాలతో పాటు చివరకు తినే తిండి కూడా కలుషితం అవుతున్న రోజులివి. ప్రతి ఒక్కరిలోను ఏదో తెలియని ఆందోళన. అందుకే నేటి సమాజంలో సగానికి పైగా వివిధ వ్యాధులతో అల్లాడిపోతూ జీవితాన్ని ఎలాగోలా నెట్టు కొస్తున్నారు. అటువంటి వారి జీవితాన్ని గురించి రాసిన కవితే ఈ "ఆ రాత్రి" నేటి సమాజాన్ని పట్టి పీడిస్తున్న మహమ్మారి "మధుమేహం". ఇది రావటం

అంటూ జరిగితే ఇక వారి జీవితం దానితోనే ముగింపు అన్నట్లు ఉంటుంది. అప్పటి వరకు ఆరోగ్యవంతునిగా ఉన్న వ్యక్తికి మధుమేహం వస్తే ఎలా ఉంటుందో దార్ల కవిత్వంలో దర్శించండి.

"ఆ క్షణంలో
ఎందుకలా విల విల్లాడి పోయాను
నాలో ఫిక్సెడ్ డిపాజిట్టు చేసిన
ఏ అనుబంధాన్నో అమాంతంగా
లాగేసుకున్నట్లు
ఆ క్షణంలో ఎందుకలా విలవిల్లాడి పోయాను"

మధుమేహం వచ్చిందని డాక్టర్ చెప్పిన క్షణంలో ఆ రాత్రి ఎలా ఉంటుందో ఈ వాక్యాలు అద్దం పడుతున్నాయి. మధుమేహం ఉన్నవారిని కదిలిస్తే ఈ వాక్యాల లోతు పాతుల్ని, మాటల కందని భావాలతో అందిస్తారు.

సాధారణంగా యుక్త వయస్సులో ఉన్నప్పుడు కొండలనైనా పిండి చేసే శక్తి ఉందనిపిస్తుంది. అలాంటిది నివారణలేని వ్యాధి వచ్చిందంటే ఆ హృదయం తల్లడిల్లిపోతుంది. తన సర్వస్వాన్ని కోల్పోయినట్లు ఉండేవారి బాధను "ఫిక్సెడ్ డిపాజిట్" ను లాగేసుకున్నట్లు ఉంది అనడం కవి యొక్క కవితా శక్తిని తెలియజేస్తుంది. అదే విధంగా...

"అమావాస్యకు దగ్గరవుతున్న
చందమామ
రోజు భయపెడుతుంది జీవితాన్ని"

అని మధుమేహగ్రస్తుల జీవితాన్ని కళ్ళకు కట్టినట్లుగా వ్యక్తీకరించాడు దార్ల. అలాగే "ఇప్పుడు నా శ్లోకంలో" అనే కవితలో మానవ సంబంధాలు అడుగంటుతున్న నేటి సమాజంలో తల్లిదండ్రుల పట్ల బిడ్డలకు గల బాధ్యతలను గుర్తుచేస్తున్నాయి.

"ఆరు మానెల గింజల కోసం
పదహారు మైళ్ళెల్లి
అర్థరాత్రి వరకు తడిసి ముద్దైన నాన్నంటే నాకిష్టం" అంటారు.

తల్లిదండ్రుల శ్రమను గుర్తించ గలిగిన బిడ్డలే వారికి నిజమైన వారసులుగా నిర్ణయించబడతారు. కొందరకి ఆస్తులు, బిడ్డలు ఉండి కూడా అనాధాశ్రమాల పాలవుతున్న నేటి సమాజంలోని యువతరానికి తల్లిదండ్రుల పట్ల ఉండవలసిన బాధ్యతను పరోక్షంగా సూచిస్తున్నాడు కవి.

"ఆ చీకట్లో అర్జునుడు అన్నం ముద్ద
సరిగ్గా తిన్నాడో లేదో గానీ
కాళరాత్రుల్లోను
నాన్న వేసే గునపం పోటుకు పెరుగు గడ్డలా విరిగిపడే
మట్టి బెడ్డల బరువు నాకు తెలుసు"

అని తండ్రి శ్రమను, అనుభవించిన కష్టాలను నెమరు వేసుకుంటూ నాన్నకు దూరమైన అక్షరం ఇప్పుడు నాన్న పాదాల మీద పడింది అంటూ *"నాన్నిప్పుడు నాలో ఉన్నాడు"* అని సగౌరవంగా ప్రకటించాడు. అలాగే, తెలుగు భాషకు క్లాసికల్ హోదా వచ్చిందని సంబర పడుతున్న వేళ భవిష్యత్తును కాంక్షిస్తూ దార్ల వ్యక్తం చేసిన "తెలుగు గుండెల్లో క్లాసికల్ గుబులు" అనే కవితలో లేవనెత్తిన ప్రశ్నలు ప్రతి ఒక్కరినీ ఆలోచింప చేసే విధంగా ఉన్నాయి.

"నిజమైన తెలుగంటే
ప్రజల సజీవ ప్రవాహం కదా!
అతకని అక్షరాలతో ఇదేంటిలా అసహ్యంగా
కాలంతో పరుగెట్టలేని పొడపాములా పడుంది!
ఇదేనా ప్రాచీనాంధ్రకు తెచ్చే పునర్ వైభవమంటే
సంస్కృతాన్నో, అచ్చ తెనుగునో
కృతకంగా గుదిగుచ్చడమేనా?"

అని దాని విధివిధానాలను సమీక్షించుకోమంటాడు. అలాగే పద్యం గొప్పతనాన్ని ఒప్పుకుంటూనే...

"తేనె తియ్యగా వుందని
నీటిలా దాహం తీర్చుకోలేం కదా?"

అని హెచ్చరిస్తాడు. అలాగే...

"బూజుపట్టిన తాళపత్రాల్లోనే పడున్న
తాత ముత్తాతల్నీ పైకిలేపి
సన్మానిస్తున్నందుకు కూడా
సంతోషంగానే ఉంది
కానీ...... ముని మనవడి మాటల్ని కూడా
వింటారో లేదోనని మాత్రం భయంగా వుంది!"

అని సందేహించాడు. ఇలా ఈ కవితలో భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆనేకాంశాలను కవిత్వీకరించారు. ఇలా దార్ల రచించిన కవితల్లో సమకాలీన సమాజంలోని సమస్యలు ఎన్నో దర్శనమిస్తాయి. సామాజిక ప్రయోజనం లేని ఎంత గొప్ప కవితలైనా అవి నిష్ప్రయోజనమే. స్వతహాగా కవితా స్పృహ ఉన్న విమర్శకుడు కాబట్టి దార్ల కలం నుండి వెలువడిన ప్రతి కవిత సమాజపు లోతుపాతుల్ని ఆవిష్కరించి ప్రగతి పథం వైపు మళ్లించే విధంగా ఉంది. ఇలాంటి మరెన్నో కవితలు రచనలు దార్ల కలం నుండి జాలువారాలని ఆశిస్తూ అభినందనలతో.....

– డా॥ విస్తాలి శంకరరావు
తెలుగు శాఖ
మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై -05

❖ ❖ ❖

భావనా బలంతో పాటు అభివ్యక్తి శక్తి

– డా. నాగభైరవ కోటేశ్వరరావు

"దార్ల వెంకటేశ్వరరావుకి మోడరెన్ కవిత్వం పట్ల స్పష్టమైన అవగాహన ఉంది...భావనాబలంతో పాటు అభివ్యక్తి శక్తితో కవిత్వరచనకు పూనుకున్న యువకుడు"

(*వార్త, ఆదివారం అనుబంధం,* 25-02-2001., పుట:45)

❖ ❖ ❖

కార్యశీల కవి, దార్శనికుడు డాక్టర్ దార్ల

- పొనుగోటి కృపాకర్ మాదిగ

తెలుగునాట గత రెండు దశాబ్దాల్లో అస్తిత్వ ఉద్యమాలు వెల్లువెత్తాయి. మాదిగ దండోరా ఉద్యమ చైతన్యం ఇందుకు పునాదిగా నిలిచింది. ఆత్మగౌరవం. హక్కులు కోసం మొదలై అణగారిన అన్ని సామాజిక సమూహాల్లోనూ ఈ చైతన్యం వికసించింది. ప్రతి సమూహంలో ప్రతిచోటా ఇది మేమెంత మందిమో మాకంత వాటాగా మారింది. జనాభా నిష్పత్తి ప్రకారం విద్య, ఉద్యోగ, సంక్షేమ అవకాశాలలో పంపిణీ, న్యాయంతో బాటు రాజకీయ ప్రాతినిధ్యాలు, రాజ్యాధికార స్పృహను రగిలించింది. ఈ నూతన చైతన్యం అపారమైన సాహిత్యాన్ని కూడా సృష్టించింది. అన్నింటా సంచార జాతులూ, జీవనాలూ, వీటి పర్యావరణ మంతా చర్యనీయాంశాలుగా, సాహిత్య వస్తువులుగా మారాయి. అణగారిన సామాజిక అస్తిత్వాంశాలు గౌరవనీయ ప్రాధాన్యతలనూ, నాయికా, నాయక స్థాయినీ అందుకున్నాయి. కవిత్వం, కథ, నవల, ఆత్మకథ, వ్యాసం, మాటాముచ్చట, వివేచన, పాట మొదలగు రూపాలో ఈ సాహిత్య అస్తిత్వాలు ఊరేగింపుల సందోహమై విస్తరించాయి. వికాసం పొందుతున్నాయి.

సరిగ్గా ఇక్కడే భాషా, సాంస్కృతిక, చారిత్రక, సాహిత్య రంగాల్లో పరిమితమైన, చర్వితచరణమైన, వివక్షాపూరిత, ప్రేరేపితమైనవిగా నిలిచి, తిరోగామికంగా మారిన ఆధిపత్యం సాహిత్య, సాంస్కృతిక దృష్టి కోణాలను, విమర్శను వొదిలించుకోవల్సిన చారిత్రక సాహిత్య సందర్భం ముందుకు వచ్చింది.

ఈ చారిత్రక అవసరం తీర్చే తరానికి చెందినదే డాక్టర్ దార్ల వెంకటేశ్వరరావు గారి కలం. డాక్టర్ దార్ల వెల్లువెత్తిన అణగారిన సాహిత్య అస్తిత్వ ప్రవాహాలకు కవిగా, రచయితగా, విమర్శకుడిగా, విశ్వవిద్యాలయ అధ్యాపకుడిగా, నిరంతర సత్యశోధకుడిగా నాయకత్వం వహించాడు. ఎగసిపడుతున్న బహుజన అస్తిత్వ సాహిత్య సాంస్కృతిక కెరటాలను కొత్తలోకానికి మార్చింగ్ చేయిస్తున్నాడు అస్తిత్వ సాహిత్య విమర్శని ఉదాత్త శిఖరాలకు చేర్చాడు.

ఆంతరికమైన సామాజిక అణచివేతల నిర్మూలన కోసం కృషి చేసే ఒక కార్యకర్తగా, నిత్య అధ్యయన శీలిగా, అస్తిత్వ సృజన కారుడిగా, వృత్తినీ, ప్రవృత్తినీ సామాజిక బాధ్యతతో నిర్వహించే ఆధునిక జాంబవైట్, అంబేద్కరైట్ దార్శనికతతో అణగారిన సామాజిక అస్తిత్వ సాహిత్య, సాంస్కృతులకు అవసరమైన "ప్రాసంగికమైన –నూతన దృష్టి కోణాలను, వివేచనా సూత్రాలను అందిస్తున్న సృజన సేనాని డాక్టర్ దార్ల కృషి సర్వులూ సర్వదా అనుసరించ దగింది.

దార్ల బాల్యం, ఎదిగిన క్రమం, ఎదుర్కొన్న వివక్షలు, నేపథ్యాల నుంచి రూపుదిద్దుకున్న మానవీయ వ్యక్తిత్వ చైతన్యానికి ప్రతీకగా ఆయన కవిత "*బడిలో అమ్మ ఒడిలో....!*" నిలుస్తుంది. మహాకవి గుర్రం జాషువా గారి వలె అసమానతలపై ఆక్రోశాన్ని, ధిక్కారాన్ని ప్రదర్శిస్తూ డాక్టర్ దార్ల మాదిగ దండోరా ఉద్యమ నేపథ్యంలో రాసిన *"మాదిగ మ్యానిఫెస్టో"* కవిత స్ఫూర్తిదాయకమైంది. పొరుగు దళిత సమూహం నుంచి ఎదురౌతున్న వివక్షలపై సూక్ష్మ స్థాయి విహంగ వీక్షణం చేయించాడీ కవి. న్యాయం కోసం, రెండు మెతుకుల కోసం మా నెత్తురును సిరాగా నింపుకొని, మా ప్రాణాల్ని సురేందర్‌లా జెండా చేసి ఎగరేస్తాం! అని పొన్నాల సురేందర్ మాదిగ స్మృతిలో రాసిన "ఒక పెట్రోల్ సంతకం" కవితలో కవి ప్రతిజ్ఞా గర్జన చేశాడు. ఉమ్మడి ఎస్సీ రిజర్వేషన్ పాలగిన్నెను వొడుపుగా, ఒంటరిగా సింహ భాగం జుర్రేస్తున్న ఆధిక్యతల దళిత పిల్లి రెప్పలు పీకి, గంట క(కొ)ట్టేస్తాడు కవి ఈ కవితలో. అట్లాగే, అభివృద్ధి చెందిన ప్రాంతానికి చెందిన అణగారిన దళితుడిగా, సర్వ రంగాల సహ బాధితుడిగా తెలంగాణ ఉద్యమానికి పూర్తిస్థాయి సహానుభూతిని, సంఘీ భావాన్ని అందిస్తూ '*'కోస్తా మాదిగోళ్ళూ తెలంగాణా బాటలోనే....* !" కవిత ద్వారా తెలంగాణకు కవి గొంతు కలిపాడు

దార్ల. అంతేకాదు, గోదారి వాళ్ళంతా గోదాముల్లా బొజ్జలు పెంచినోళ్ళు కాదని, రోడ్డు మూలల్లో చెప్పులు కుట్టుకుంటూ పూట గడుపుకుంటున్న నిరుపేదలను కూడా చూడమంటాడు కవి.

ఈ కవితలు అసమానతలు, వివక్షలపై పిడికిలెత్తిన ఒక యోధుణ్ణి, ఒక పరిపక్వమైన, సమదృష్టి కలిగిన కవిని డాక్టర్ దార్ల వెంకటేశ్వరరావులో మనకి దర్శింపజేస్తాయి. జాషువా కవి మాదిరిగానే డాక్టర్ దార్ల కవిత్వంలోనూ అణగారిన సమూహాల పట్ల అంతులేని ఆర్ద్రతా, కరుణా, అసమానతలపై ఆగ్రహ ప్రదర్శనమూ మనకు కనిపిస్తుంది. కవి, రచయిత, విమర్శకుడు, ఆత్మీయ మిత్రుడు డాక్టర్ దార్లకు శుభాకాంక్షలు. సమాజాన్ని మేలుకొలిపే దార్ల కవిత్వానికి స్వాగతం.

❖ ❖ ❖

దార్ల దళిత కవిత్వం
ఒక పరామర్శ

– డా॥ కె. లక్ష్మీనారాయణ

"డా. దార్ల వెంకటేశ్వరరావు తన కవితల్లో ప్రపంచీకరణ వల్ల దళితులకు జరుగుతున్న అన్యాయాల్నీ, మానసిక క్షోభని కూడా కవిత్వమై పలకరించాడు. *"అంతర్జాతీయ మార్కెట్లో పవిత్ర ప్రేమ "కూలుతున్న గ్రంథాలయం" "కాంక్రీటు పిచ్చుక గూళ్ళలో..."* వంటి కవితలు, మరి కొన్ని మినీ కవితలు ఈ కోణంలోనే వచ్చాయి. మానవ సంబంధాలు రూపాయి లేదా డాలర్ సంబంధాలుగా మారిపోయాయి. బతకాలంటే డబ్బుకావాలి. డబ్బు కావాలంటే ఉద్యోగం చేయాలి. అది మనం కోరుకున్న దగ్గరే దొరకదు. మనం కోరుకున్న చోటే ఉండాలంటే చాలీచాలని జీతం. ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. పిల్లల చదువులకీ, ఆరోగ్యాన్ని కాపాడు కోవడానికీ, ఇంటి అద్దెలకీ ఒకటేమిటి అన్నింటినీ లెక్కేసుకుంటే మనకిష్టమైన ఊళ్ళోనే ఉద్యోగం చేయాలంటే కుదరదు. అప్పుడు భార్యా భర్తలు, కుటుంబం అంతా కలిసుండాలంటే కుదురుతుందా! ఇవన్నీ అనివార్యంగా మనకి తెలియకుండానే మన జీవితాల్లో భాగమైపోయాయి. వాటి ఫలితంగా ఏకాకితనం, కుటుంబాల విధ్వంసం, మళ్ళీ కలిసిమెలిసి ఉండాలన్నా ఒకరకమైన జీవితాలకు అలవాటైపోయి, మళ్ళీ కలవలేక పోవడం... జీవితం విచిత్రంగా మారిపోతుంది. అందుకే పవిత్రమైన ప్రేమను కూడా అంతర్జాతీయ మార్కెట్ కొనేసింది. మారిన కాలమాన పరిస్థితుల్ని జీర్ణించుకోలేని వాళ్ళ జీవితాల్ని ముగించి పొమ్మంటుంది.

"కనీసం పోయేముందైనా
చివరి సారిగ్గానైనా

నీ కనుకొలికి కోటికాంతుల్లో
ఓ కిరణాన్నైనా
నాపై విదల్చ లేకపోయావా
దానితోనయినా సంతృప్తిపడి
పవిత్రంగా
ఈ సైనేడ్ కౌగిలిలో

ఆనాడేకరిగిపోయేవాణ్ణేమో!!' (అంతర్జాతీయ మార్కెట్లో పవిత్ర ప్రేమ) ఒకరి నొకరం వదిలి ఉండలేని అనుబంధాలిప్పుడు కుదరవనీ కరాఖండీగా ప్రపంచీకరణ తెగేసి చెప్తుంది. ఇంకెన్ని పరిణామాలకు కారణమవుతుందో ఊహించ లేనంతగా మానవ సంబంధాల్లో మార్పులకు కారణమవుతుంది.

"సద్ది పెట్టెలో అన్నీ పెట్టాం
ఇంట్లో రంగుల టి.వి.,
మాట్లాడాలంటే ఫోను
ప్రపంచాన్నాడుకోవడానికో
నెట్ కనెక్టెడ్ కంప్యూటర్
కాంక్రీటు పిచ్చుగ్గూళ్ళల్లో
చుట్టూ జన సంద్రం
పలకరించే మనిషి తప్ప!" (కాంక్రీటు పిచ్చుకగూళ్ళలో...)

ఒకప్పుడు మనుషులు కుటుంబాలతో గడిపేవాళ్ళు. నేడు ఉమ్మడి కుటుంబం పోయింది. ఆ తర్వాత వ్యష్టి కుటుంబం కూడా పోయింది. ఇప్పుడు ఎవరికి వాళ్ళే పేయింగ్ గెస్ట్ రూమ్స్‌లోనో, హోటళ్ళలోనో, క్యాంటీన్‌లోనో తినేసి కాలం గడిపేస్తూ కుటుంబాన్ని పోగొట్టేసుకుంటున్నారు. ఇక మరి తోడుండేదెవరు? తమకి కావలసినవన్నీ కంప్యూటరే సమకూర్చేస్తుంది. అందుకే ప్రపంచీకరణలో మానవుడికి అన్నీ కంప్యూటరే.

"ఊసుపోవట్లేదు
కాసేపు ఇంటర్నెట్ బ్రౌసింగ్
ప్రపంచంతో
ఆడుకోవడమే!" (మినీకవితలు)

కవి తన జీవితం నుండి సమాజాన్ని, సమాజం నుండి తన జీవితాన్ని చూడ్డం ఈ కవిత్వంలో కనిపిస్తుంది. కవిత్వ మెప్పుడూ సమకాలీన సమాజానికి ప్రతిబింబంలా ఉండాలి. అది ఈ కవిత్వంలో ప్రతిబింబిస్తుంది. సమకాలీన విద్యావ్యవస్థ తీరుతెన్నులు, దాన్ని నడిపించేశక్తులు, దాన్ని వ్యతిరేకించకపోతే వచ్చే అనర్థాలు, వాటిని గుర్తించిన వారి స్పందనలన్నీ దీనిలో ఉన్నాయి. ఒకే మూసలో ఉంటూనే, ఆ మూసలోనూ అంతర్గతంగా ఉండే లోటుపాట్లనీ గమనించి సరిదిద్దుకోమని సూచించే తత్త్వమూ ఈ కవిత్వంలో ఉంది.

కవిత్వమనేది కవి తనతోను, తనచుట్టూ ఉన్న సమాజంతోను నిరంతరం జరిగే సంఘర్షణతో వెలువడుతుంది. అది చదువుతున్న పాఠకుడు లేదా వింటున్న ప్రేక్షకుడు తన జీవితాన్నేదో తనకే చూపిస్తున్నట్లు అనుకోగలగాలి. లేకపోతే అది కవిత్వం కాదు. అది నిందో, స్తుతో అవుతుంది. దళిత జీవిత వ్యధకు ప్రధాన కారణం కులం. కులం కొనసాగినంతకాలం ఈ వ్యథ, కథ కొనసాగుతూనే ఉంటుంది. సంఘర్షణ అనివార్యమే అవుతుంది. వ్యవస్థ సక్రమంగా నడవడం కోసమంటూ, లోకశ్రేయస్సు అని చెప్తూ కొన్ని కులాల వాళ్ళని తరతరాలుగా కొన్ని విధులకే పరిమితం చేశారు. చెప్పేవన్నీ శ్రీరంగనీతులైనా, గుణ, కర్మల్ని బట్టి వాళ్ళని గుర్తించలేదు. విధులన్నీ కాలక్రమంలో వృత్తులుగా, వంశ పారంపర్యంగా మారిపోయాయి. తెలివి తేటలన్నీ కొన్ని కులాల వాళ్ళవనే సూత్రీకరణలు మొదలయ్యాయి. వాటిని వ్యతిరేకించే ప్రతిభావంతులైన దళితులు “శంభూకుణ్ణి” వధించే కుట్రల్లో బలైపోయారు. మిగిలిన వాళ్ళెవరైనా ఉంటే “ఏకలవ్యుడి”లా త్యాగాల పాలైపోయారు.

ఇంకొంతమంది ప్రతిభావంతులైన దళితుల్ని తిరుగుబాటు చేయకుండా “వాల్మీకి”లాగో, “వ్యాసమహర్షి”లాగో ఏదో ఒక పీఠమేసి కూర్చోపెట్టి, వాళ్ళచేతా తమ భజనే చేయించుకున్నారు. ఇవన్నీ నేడూ కొనసాగుతున్నప్పటికీ, అవి రూపాలు మార్చుకున్నాయి. వీటిని గుర్తించాడు కవి. అందుకే ఒక ఉద్యమ కవిలా ఆ భావజాలాన్ని పసిగట్టి బలంగా తిప్పికొట్టమంటున్నాడు.

ప్రజాస్వామ్యం వల్ల దళితులు కూడా తమ పిల్లల్ని చదివించుకోవాలని అనుకుంటున్నారు. వాళ్ళు చదువుకొంటే తమ పునాదులు కదిలి పోతాయని

గుర్తించిన ఆధిపత్య వర్గాలు సృష్టించే సాహిత్యం, రూపొందించే చలనచిత్రాలు దళిత జీవితేతి వృత్తంతో ఉన్నట్లే ఉండి, దళితుల్నే మోసం చేస్తుంటాయి. కూలీనాలీ చేసుకొనో, కులవృత్తుల వల్ల వచ్చే అవమానాలు తప్పించుకోవాలని తమ పిల్లల్ని చదివిస్తే, ఆ పిల్లలు తల్లిదండ్రుల్నే అవమానించినట్లో, వాళ్ళని పట్టించుకోనట్లో చిత్రిస్తూ చాలా సినిమాలు వచ్చాయి. అవి చూసిన దళిత తల్లిదండ్రులు తమ పిల్లల్ని తామెంతకష్టపడి చదివించినా, వాళ్ళూ ఇలాగే తయారవుతారేమోనని భయపడి అసలు ఆ దరిదాపులకే వెళ్ళకుండా చేసిన వాళ్ళున్నారు. ఇవన్నీ అగ్రవర్ణ, ఆధిపత్య భావజాలాన్ని గుర్తించలేకపోవడం వల్ల వచ్చే అనర్థాలు. అటువంటి సినిమాలు తీయడం వెనుకున్న "లక్ష్యాన్ని" గుర్తించాలంటున్నాడు కవి...

"ఇతివృత్తాల మూసధోరణిలో
నా తల్లిని పనిమనిషిగా
నా తండ్రిని తోటమాలిగా
చిత్రించే ఏవేవో ఊహల్నిక
ఊహలుగానే మిగుల్చుకోవడం మంచిది
ఆ దేవుడే దిగొచ్చినా
నా మొదటి ప్రాధాన్యత నా తల్లిదండ్రులకే!
నేనిప్పుడు దళిత సౌందర్య తాత్త్వికుణ్ణి!! (దళిత తాత్త్వికుడు)

చదువుకొంటున్న దళితులు, చైతన్యవంతులైన వాళ్ళు తమ తల్లిదండ్రుల్ని గౌరవంగానే చూసుకుంటారు. ఒకవేళ అలా గౌరవించలేకపోతే, తమ తల్లిదండ్రులపట్ల సదాలోచన కలింగించలేని ఆ విద్యా వ్యవస్థదే తప్పు.

ఒకపద్ధతి ప్రకారం సంస్కృతి, దేశభక్తి పేరుతో జరుగుతున్న దాడుల వెనుక కొన్ని ఛాందస వాదుల కుట్రల్ని గుర్తించాలంటున్నాడు కవి. ఒక దళిత, గిరిజన యువతినో, స్త్రీనో బట్టలూడదీసి ఊరేగించినప్పుడు, భర్త, కొడుకు, కుటుంబం ఎదురుగానే భార్యనీ, కుటుంబ సభ్యులపై అత్యాచారం చేసినప్పుడూ రానంత స్పందన ఒక అగ్రవర్ణ యువతిపై అత్యాచారం జరిగినప్పుడు వస్తుంది. దీని వెనుకున్న శక్తుల్ని గుర్తించాలి. అలాగే దళితుల ప్రతిభను ఒప్పుకోలేని, కీర్తించలేని వాళ్ళు అగ్రవర్ణాల వారి త్యాగాల్ని మాత్రం సాధారణీకరిస్తుండటంలోని

కుట్రనీ, ఆధిపత్య భావజాలాన్ని గుర్తించా లంటున్నాడు కవి. ఇది కవి వ్యక్తిగత సమస్య కాదు. వ్యవస్థలోని అవ్యవస్థది. ఈ కవితా పాదాల్లో అటువంటి కుట్రపూరిత వ్యవస్థనే తిరస్కరిస్తూ...

"నాకళ్ళ ముందు నిన్ననే జరిగిన
మద్యపాన నిషేధోద్యమంలో
నా తల్లి పేరేది?
భర్తే పోటీ చేసినా
ఓటేయడానికే ఇల్లు కదలని
అమ్మలక్కలు
నేడు ఉద్యమ నేతలుగా
సన్మానాలందు కోవడమేంటి?
కార్గిల్ "ఆపరేషన్ విజయ్"లో
ప్రాణాలెందరో పోగొట్టుకున్నా
ఆచార్య పద్మపాణి కెగిరిన కీర్తిపతాక
మావాళ్ళ కెందుకెగరలేదు?" (దళిత తాత్త్వికుడు)

అని ప్రశ్నిస్తున్నాడు కవి. అందరితో పాటు తమ పేరుకోసమో, మరో దానికోసమో దళితులు కూడా వాటినే కీర్తించడానికో, అవే చారిత్రక సంఘటనలుగా అభివర్ణించడమో, అంగీకరించడమో సరి కాదంటున్నాడు కవి. ఆవకాయంత ఉన్నదాన్ని ఆకాశమంత చేసుకొని చరిత్ర సృష్టించుకొని, దాన్నే తర్వాత తరాల వారికి చరిత్రగా, అదే తమ సంస్కృతిగా నమ్మించే ప్రయత్నాల్ని దళితులు తిప్పి కొట్టాలనే పిలుపునిస్తున్నాడు కవి. ఇప్పటికే ఝల్ కారీబాయి యుద్ధంలో పోరాటం చేస్తే, దాన్ని ఝాన్సీ లక్ష్మీబాయికి అంటకట్టి భారత వీరనారి అంటే ఆమె మాత్రమే గుర్తొచ్చేలా చేశారు. దళితులిప్పుడిప్పుడే ఉన్నత విద్యాభ్యాసం చేసి ఆ చరిత్రల్ని తవ్వి కొత్త ఆధారాల్ని చూపిస్తున్నారు. ఒక్కసారి అమెరికాలో ప్రసంగించినందుకే స్వామి వివేకానందుని అంతగా పొగిడి, ఒక గొప్ప ప్రవక్తగా మార్చేసిన వాళ్ళు జోతీబా పూలే, అంబేద్కర్‌లను ఎక్కడపెడుతున్నారు? ఇవన్నీ నేటి విద్యావంతులైన దళితులు గమనిస్తున్నారు.

చరిత్రని జాగ్రత్తగా పరిశీలిస్తే, కులం లేదనీ, దాన్ని పాటించవద్దనీ చెప్తున్న కులాలవాళ్ళే తమ కులస్థుల చరిత్రల్ని ఏర్చి, కూర్చి మరీ భవిష్యత్తు తరాలవాళ్ళకి అందిస్తున్నారు. పైకి ప్రగతిశీల భావజాలాలున్న వాళ్ళుగా చెప్పుకుంటూనే, ఆ సంస్థల్లో పనిచేస్తూనే వాళ్ళు నిర్మించే చరిత్రల్ని గమనిస్తే అవన్నీ కొన్ని అగ్రవర్ణ, ఆధిపత్యవర్గాల వారివే కావడం విశేషం. అందుకే వీటిని గుర్తెరిగి మసులుకోవాలంటున్నాడు కవి.

"నాకున్న పుట్టుమచ్చులో
నా ఎదుటి వాళ్ళకేమి కనిపిస్తుందో
శత్రువు + శత్రువు = మిత్ర బృందం!
భిన్న భావజాల్లాలైనా రహస్య రణవ్యూహంలో
వాళ్ళదంతా ఒకే దృక్పథం' (పుట్టుమచ్చ మీద ప్రేమ)

కొంతమంది దళితులు తమకులాన్నెక్కడా చెప్పుకోరు. కానీ, వాళ్ళ ఇంటిపేరు, పేరు, తల్లిదండ్రులు, వాళ్ళ బంధువులు, వాళ్ళ భావజాలం, వాళ్ళ భాష, వాళ్ళ సంస్కృతి...ఇలా దేన్నో ఒక దాన్ని బట్టి ఆధిపత్యవర్గాల వాళ్ళు దళితుల "దళిత తత్వాన్ని" పసిగట్టి, గట్టు కట్టేస్తారు. అందుకే తాత్కాలిక, వ్యక్తిగత సుఖ సంతోషాలకో, లాభాలకో, అవకాశాలకో లొంగిపోకుండా తమ హక్కులకోసం దళితులంతా ఏకతాటిపై నిలవాలంటాడు కవి. అలా నిలబడగలిగితే దళితులు ఒకరికొకరై తోడైనిలుస్తారనే విశ్వాసాన్ని ప్రకటిస్తున్నాడు కవి.

" రేపు యుద్ధాని కెళ్ళాలని తెలిసీ
ముందు రాత్రి శత్రువు పాదాల్ని
ముద్దు పెట్టుకోవడమెందుకు?
అలంకారమో, అసహ్యమో
నా పుట్టు మచ్చ మాత్రం
నాకు రక్షణ కవచమేనని గుర్తుచేసింది
ఆత్మగౌరవానికీ, ఆత్మవిశ్వాసానికీ
వెన్నుపూసై నిలిచిన
సౌందర్య రమణి నా పుట్టుమచ్చా !
నిన్ను నేను ప్రేమిస్తున్నాను" (పుట్టుమచ్చ మీద ప్రేమ)

దార్ల ఈ కవిత్వాన్నంతా ఉత్తమపురుషలో రాయడం వల్ల తనజీవితమే కవిత్వమైనట్లు అన్పిస్తుంది. పాఠకులకు అతని జీవితాన్నే చదువుతున్నట్లుంటుంది. ఈ జీవితంలో నిజంగా దార్ల ఉన్నాడు. కానీ, ఈ జీవితమంతా దార్లదే కాదు, దళితులందరిదీ. ఇటువంటి సమస్యలతో సతమతమవుతున్న వాళ్ళందరిదీ. బడిలో అమ్మ ఒడిలో..., నానీ నువ్వెప్పుడొస్తావురా వంటి ఒకటి రెండు కవితలు తప్ప, మిగతా కవిత లన్నింటిలోను కవి అందర్నీ తనలో ఇముడ్చుకొని కవిత్వమయ్యాడు. దీన్ని గుర్తించడానికి ఈ కవి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం చేస్తున్న ఉద్యమాన్ని సమర్థిస్తూ, కోస్తాంధ్ర మాదిగల తరపున తనభావాల్ని ప్రకటించిన "కోస్తా మాదిగోళ్ళూ తెలంగాణాబాటలోనే..." కవితగానీ, ఎస్సీ వర్గీకరణను సమర్ధిస్తూ రాసిన "మాదిగ మ్యానిఫెస్టో" గానీ, దళితులు తమ తమ వాటాల్ని పంచుకున్నంత మాత్రాన శాశ్వతంగా విడిపోయినట్లు కాదనీ, దీన్ని అవకాశంగా తీసుకొని దళితుల మధ్య శాశ్వతంగా శత్రుత్వాన్ని పెంచేవాళ్ళని గుర్తించమంటూ రాసిన "ఓ మైలురాయి" కవిత గానీ ... ఇలా దేన్ని చూసినా కవి జీవితం మాత్రమే ఈ కవితలకు వస్తువు కాదనీ, దళిత జీవితమే ఉత్తమ పురుష కథనంతో కవిత్వంగా మారిందనీ స్పష్టమవుతుంది.

ఈ కవితా సంపుటిలో ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ మూడు కవితలున్నాయి. మాదిగ దండోరా ఉద్యమం తీవ్రస్థాయిలో ఉన్నప్పుడే హైదరాబాదు విశ్వవిద్యాలయంలో మాదిగ సాహిత్య వేదిక ఏర్పడింది. తెలుగులో తొలిసారిగా దళితుల నుండి తమకు రావాల్సిన మాదిగ హక్కుల్ని వివరిస్తూ 1997లో మాదిగ చైతన్యం కవితా సంకలనం వచ్చింది. ఆ కవితా సంకలనంలో ఈ కవి రాసిన మాదిగ మ్యానిఫెస్టో కవిత ప్రచురితమైంది. దాన్నిప్పుడు ఈ కవితా సంపుటిలో చేర్చాడు. ఇది ప్రతీకలు, భావ చిత్రాలతో కూడిన బలమైన కవిత. కొంతవరకు దీర్ఘ కవితకున్న లక్షణాలు దీనిలో ఉన్నాయి. ఈ కవితా ఖండికలో ఒక మాదిగగా తన హక్కుల గురించి మాట్లాడుతూనే, అంతకు ముందున్న నక్సలైట్లు, వివిధ పార్టీలు తమనెలా వాడుకున్నాయో ఆ చారిత్రక క్రమాన్ని ప్రతీకాత్మకంగా వర్ణించాడు. అన్ని చోట్లా దోపిడీకి, అన్యాయానికీ గురై, తామే స్వతంత్రంగా ఉద్యమం చేపట్టాల్సి వచ్చిందని, అయినప్పటికీ తమ అస్తిత్వాన్ని గుర్తించే వాళ్ళందరితోను కలిసి పనిచేస్తూనే, తమ స్వీయ అస్తిత్వం కోసం పోరాడక తప్పడం లేదని స్పష్టం చేస్తుంది.

"అంటరాని తనంలో
మళ్ళీ అంటరానితనం పెంచే
ఇంటర్ సుపీరియారిటీని భరించలేక
అంతరాంతరాల్లోని
అగ్నిపర్వతం పగిలిందిప్పుడే!" (మాదిగ మ్యానిఫెస్టో)

తమ పోరాటం ఫలితంగా ఎస్సీ వర్గీకరణ జరగడానికి అసెంబ్లీ తీర్మానం చేయడం, వర్గీకరణ ప్రకారం అనేకమంది మాదిగ, ఉపకులాల వాళ్ళంతా ఆ ప్రయోజనాల్ని ఉపయోగించుకుంటున్న తరుణంలో మళ్ళీ సుప్రీంకోర్టు కెళ్ళి వర్గీకరణ చట్టం అమలు రాజ్యాంగ బద్ధం కాదని మాలలు ప్రయత్నించడంతో మళ్ళీ వర్గీకరణ ఉద్యమం కొనసాగించక తప్పలేదు. ఈ నేపథ్యాల్ని వర్ణిస్తూ, వర్గీకరణ జరిగిన తర్వాత జరిగిన పరిణామాల్ని, ఆ సందర్భంగా రాజకీయపార్టీల స్వభావాల్ని పట్టిచ్చే దృష్టితోనే *"ఒక మైలురాయి"* అనే కవిత వచ్చింది.

వర్గీకరణ అయిపోయిందనీ, ఇక దానిగురించి మరిచిపోతున్న తరుణంలో దళితుల్లోని కొన్ని మాల వర్గాలు కోర్టుల కెళ్ళి ఆ సమస్యను రగిలించేలా చేశాయి. దీన్ని తెలంగాణా ప్రత్యేక రాష్ట్రం కోసం జరుగుతున్న ఉద్యమంతో పోలుస్తూ "కోస్తాంధ్ర మాదిగలు తెలంగాణా బాటలోనే..." కవిత వచ్చింది....

"నిజానికి మనిద్దరిదీ
"ఉమ్మడి" తెచ్చిన తంటాలేనండి!
మనిద్దర మిప్పుడు
"జాతీయని" బంధంలో
చిక్కుకు పోయామండీ!
రాజ్జెమైనా, రాజ్జాంగమైనా
పెజల గోసినాలగందా"

(కోస్తాంధ్ర మాదిగలూ తెలంగాణా బాటలోనే....)

అగ్రవర్ణాల నుండి, ఆధిపత్య వర్గాల నుండి విముక్తి కోరుకున్నవాళ్ళు, అదే మార్గాన్ని అనుసరిస్తూ అంతః సంఘర్షణను పరిష్కరించమంటే వినని సంఘటనల చారిత్రక క్రమం ఈ మూడు కవితా ఖండికల్లోను వర్ణితమైంది. పిల్లల్లేక

తల్లి దండ్రులెలా తల్లడిల్లి పోతారో తెలుపుతూ రాసిన "నానీ..నువ్వెప్పుడొస్తావురా"లో కవిత మన హృదయాల్ని ఆర్ద్రం చేస్తుంది. రస గుళికల్లా ఉన్న మినీ కవితలు నిజంగా సముద్రమంత భావుకతను చిన్ని రెక్కల్లో బంధించే ప్రయత్నం చేశాయి.

ఈ కవితలన్నీ జీవితంలోని సుఖ దుఃఖాల మధ్య ఉన్న సన్నని తెరను చూపిస్తూనే, సమకాలీన దళిత జీవిత సంఘర్షణను మన కళ్ళ ముందు నిలబెడతాయి. మనిషి తన ఆశయాల్ని, లక్ష్యాల్ని సాధించాలని కల కనడం, వాటిని నెరవేర్చుకోవడానికి నిరంతరం ప్రయత్నించడం, కల నిజమైనట్లనిపించినప్పుడల్లా నెమలిలా పురివిప్పి నాట్యం చేస్తున్న అనుభూతిని అందిస్తుందీ ఈ కవిత్వం.

(ఈ అభిప్రాయాలు డా॥ కె. లక్ష్మీనారాయణగారు రాసిన 'దళిత కవిత్వం-పరామర్శ' (దళిత కవితా చరిత్ర) అనే గ్రంథం, పుటలు: 186-192 నుండి స్వీకరించాను)

❖ ❖ ❖

సం'వేదన'ల చిరక

– డా॥ ఊటుకూరి వరప్రసాద్

తెలుగు భాషా సాహిత్యాలను నిత్యమూ బోధిస్తూ విద్యార్థులను జ్ఞాన దీప్తులుగా అలరింపచేస్తున్నారు. మరో పక్క పరిశోధకులకు మార్గదర్శకతను నెరుపుతూ "దిక్సూచి"గా మసలుతున్నారు. పాతతరం కవుల రచనల్ని పరిశీలస్తూ నాటి కవుల రచనల ఆంతర్యాన్ని, రచయితల అంతరంగాన్ని వాటి లోతుల్ని తవ్వి మనముందు వ్యాసాల రాశుల్ని కుప్పలుగా పోస్తూ పత్రికల్లో ముద్రించి మనకందిస్తున్నారు ఆత్మీయ సోదరులు డా॥ దార్ల వెంకటేశ్వరరావు గారు. సత్య అధ్యయన శీలి, నిత్యనూత్న శైలి వీరి కలం కున్న బలం. గతంలో రచించిన తన రచనల్లో సామాజికాంశాలను విశ్లేషించడంలోని నేర్పరితనం నన్ను దార్ల గారికి దగ్గరగా చేర్చింది. ఆ అభిమానమే ఈ నాలుగు అక్షరాలను రాయడానికి నన్ను పురికొల్పాయి.

ఈ కవితా సంకలనం చదువుతున్నప్పుడు "ఇవి జీవన సంఘర్షణలను గర్భీకరించుకొని ప్రసవించిన అక్షరాలు. ఈ అక్షరాల వెనుక అవమానాల సుదులున్నాయి. జ్వలించే నుదులున్నాయి. ద్రవించిన గుండెతడులున్నాయి. జీవితం పంచిన అనుభవాల 'చిరక'ను మనతో పంచుకుంటున్నారు దార్ల. మనసున్న మనిషి గాయడినపుడు పుట్టే బాధలో కలిగే సంకల్పిత ప్రతీకార చర్యే కవిత్వమని నేనంటాను.

"బడిలో... అమ్మ ఒడిలో" కవితలో మనిషికి జన్మను ప్రసాదించేది తల్లి దండ్రులే. వారు తమ బిడ్డల్ని గారాబంగా పెంచుతూ తమకున్నంతలో ఏ లోటూ

లేకుండా ప్రేమను పంచుతూ పెంచి పెద్దవారిని చేస్తారు. పెరిగే శిశువుకు తల్లి ఒడే మొదటిబడి. శిశువుకు అనేక విషయాలు నేర్పే సాంస్కృతిక ప్రేమ కేంద్రం అమ్మ ఒడి. మాటలు "ఇంటిభాష"ను బట్టే అలవాటవుతాయి. చేతలకు ఇక్కడే బీజాలు పడతాయి బడికి వెళ్ళాక అనేక మందితో కలసి ఉన్న తన ఆలోచనలకు సన్నిహితంగా ఉన్నవారితో మాత్రమే దగ్గరవుతాడు. లోకం చూశాక అందులోని కల్మషం గురించి తెలిసాక "మనిషి తనం" తన కుటుంబం ద్వారా, తనకులం ద్వారా అబ్బినందుకు సంతోషిస్తాడు. '*'ఈ కులంలో పుట్టకపోతే నేను ఇంకోలా ఆలోచించే వాణ్ణేమోనని"* తనను తాను సముదాయించు కుంటాడు. తన తండ్రి కాలిపై ఉన్న గాయానికి గుర్తుగా మిగిలిన "మచ్చ" గురించి ఆరా తీసినపుడు అమ్మ చెప్పిన నిజం దిమ్మ తిరిగేలా చేస్తుంది ఎవరినైనా."నువ్వు కడుపులో ఉండగా పెద్ద తుఫానొచ్చింద''ని ఆ తుఫానులో వారి బతుకెలా బాధలమయమయ్యిందో చెపుతుంది. ఈ సంఘటన తాలూకు అవమానం, నిరాదరణ, నిరాశ్రయం, ఆకలి, ఆవేదన, కులం పేరుతో మనిషికి జరిగిన పరాభవానికి పరాకాష్టగా తలపిస్తుంది. అంత వానలో కొట్టుకురమ్మనడం, నిండు చూలానికి గంజి నీళ్ళు పొయ్యమని ప్రాధేయపడితే బియ్యపు కడుగు నీళ్ళుపోయడం ఎంతటి అమానుష చర్యో, పెద్దోళ్ళ కురచ బుద్ధులు చూసాక. *"ఈ కులంలో పుట్టటమే మంచిదయిందని నిర్ణయించుకుంటాడు...*

ఈ కులంలో పుట్టకపోతే
మనుషుల్ని ప్రేమించలేక పోయే వాణ్ణేమో!
ఈ కులంలో పుట్టకపోతే
నేనూ ఇంకొకలా ఆలోచించే వాణ్ణేమో
ఈ కులంలో పుట్టడమే మంచిదయ్యింది
అవమానమంటే అర్థమయింది
అందర్ని ప్రేమించడమూ తెలిసింది!"

తాను పొందిన అవమానాల నుండి "మానవత్వం"తనలో పల్లవించిందని, తాను పొందిన ఈసడింపుల వల్ల ప్రేమతత్వం అలవాటయిందని అందుకు తన కులం కారణమని నిర్భయంగా చెపుతాడు. తన శరీరాన్ని ప్రేమించని వారెవరూ

ఉండరు. దానిపై మమకారాన్ని పెంచుకుంటారు ప్రతిఒక్కరు. అయితే ఇక్కడ కవి "పుట్టుమచ్చ మీద ప్రేమ"ను ఇలా వ్యక్తం చేస్తున్నాడు. అవసరాలకోసం శత్రువులు మిత్రులుగా మారడం, యుద్ధంలో రేపు తలపడపోయే శత్రువు పాదాన్ని ముద్దాడటం నీతి బాహ్యతను తెలియచేస్తుంది. అయితే తన శరీరంపై ఉన్నపుట్టుమచ్చ.

"ఆత్మ గౌరవానికీ, ఆత్మ విశ్వాసానికీ
వెన్నుపూసై నిలిచిన
ఓ సౌందర్య రమణీ ! నా పుట్టు మచ్చా!
నిన్ను నేను ప్రేమిస్తున్నాను"

అని ఇష్టాన్ని బహిరంగ పరుస్తున్నాడు. ఒకప్పుడు తనవాళ్ళను, అనామకులుగ చేసి పక్కకు నెట్టి వేసారని, వారికి రావలసిన గౌరవ మర్యాదలు వారికి దక్కకుండా పోయాయని కలత చెందుతాడు, "దళిత తాత్త్వికుడు" గతం తెలిసిన వాడిగ, నేటి చరిత్రను ఎరిగినవాడిగా...

"ఆ దేవుడే దిగివచ్చినా
నా మొదటి ప్రాధాన్యత నా తల్లిదండ్రులకే!
నేనిప్పుడు దళిత సౌందర్య తాత్త్వికుణ్ణి"

అని తనలోని నిర్భయత్వాన్ని ప్రకటిస్తున్నాడు. ఎన్నో ఎన్నెన్నో సంఘటనల్లో మేము పాలి వారమయినా మమ్ముల్ని పరాయి వాళ్ళుగానే పరిగణిస్తున్నారని ఆవేదన వ్యక్తం మవుతుంది –

"నిజమే నన్ను నిరంతరం ద్వేషించినా
నన్ను నిరంతరం వేధించినా
నాకు నిన్ను ప్రేమించడమే తెలుసు!
ఇప్పటికైనా నువ్వెప్పటికైనా
అమ్మ తినిపించే గోరుముద్దల రుచిని చూడు
పసిపాప బుగ్గన్ని నిమిరి చూడు
కష్టపడి పని చేసి
మిట్టమధ్యాహ్నం చెట్టు నీడకెళ్ళిచూడు
నీకు ప్రేమించడమే తెలుస్తుంది

ప్రేమించడంలోనే

అమరత్వముందనీ అనుభవమౌతుంది!"

అని శ్రమ తత్వంలో ప్రేమ తత్వం చిగురిస్తుందని. ప్రేమించడంలోనే అమరత్వ ముందనే గొప్ప విశ్వాసాన్ని ప్రకటిస్తున్నాడు కవి. పాటకు మానవ జీవితానికున్న సంబంధం ఈనాటిది కాదు. మనిషి పుట్టిన నాటిది, మాట నేర్చిన నాటిది. అలాంటి 'పాట' హృదయంతరాల్లో దూరి సందండి చేస్తుంది. ప్రశ్నల పరంపరను రేపుతుంది. అందుకే చాలామంది కవులకు, అన్వేషకులకు పాటలు బాటలు వేశాయి. విశ్వనాథ వారు ఖండకావ్యం రాసినా, శిఖామణి కవితాఖండిక రాసినా, ఆర్.ఆర్. సుందరరావు లాంటి అన్వేషకుడు ఒక పుష్కరకాలం క్రైస్తవ పాటల పరిశోధనలో కాలికి బలపం కట్టుకొని తిరిగినా అది పాట నడిపింపే. పాటల పయనమే. రైలు బోగీల్లో అంధ భిక్షువుల పాటలే అంతరాల్లో మార్మోగుతూ ఉంటాయి. ఈ కవికూడా అలా ఒక వెంటాడిన పాటనే గుర్తు చేసుకుంటూ...

"బతుకు నెంతో పరవశింప జేసిన

ఆ గాయకుణ్ణి కోల్పోయాక

ఆ పాట విలువ తెలిసింది

ఆ పాడిన మనిషి విలువ తెలిసింది

ఇప్పుడు ఆ వెళ్ళే రైల్లో పాట కోల్పోయిన అనాథ లెందరో!

అని ఆ పాటను "ముఝే యాద్ రఖ్నా" అంటూ గతాన్ని పాడి మిగిల్చిన అనుభూతుల్ని నెమరువేస్తున్నాడు. తల్లి దండ్రులు తమ బిడ్డల కోసం ఎన్నో శ్రమల కోర్చి పెంచి పెద్దవాళ్ళను చేసి ప్రయోజకులవ్వాలని కలలుగంటారు. బిడ్డలు పెద్దవారయ్యాక చదువుల నిమిత్తమో, ఉద్యోగాల నిమిత్తమో రెక్కలొచ్చిన పక్షులై నగరాలకు ఎగిరిపోతారు. తల్లి దండ్రులు మాత్రం తాము పుట్టి పెరిగిన ఊరిలోనే అనుబంధాలను ఒదలలేక, అక్కడే మిగిలిపోతారు. అయితే బాధ్యతగల కుమారులు తమతోనే వారి తల్లి దండ్రులుండాలని ఆశించి నగరాలకు తీసుకువస్తారు. తమ ప్రేమను పంచాలని, జీవిత మంతా తమ కోసం కష్టపడిన వీరు తమ సుఖాల్లో ఆనందాలలో పాలివారు కావాలని భావించి తమతో ఉండమని బలవంతంగా నగరానికి తీసుకువస్తారు. భార్యా భర్తలు ఉద్యోగానికి వెళతారు, తల్లి దండ్రులు

పలకరింపుకు నోచుకోరు. "కాంక్రిట్ పిచ్చుక గూళ్ళు"లో అన్నీ ఉన్నా ఏకాకితనం. అమ్మ కిచ్చిన తీపివాగ్ధానాలన్నీ శుష్క ప్రియాలుగా మారడం చూస్తే తనమీద తనకే జాలి.

"నిజమే ఇప్పుడు కుటుంబమంతా
కలిసుండాలనేది ఒక కలగానే మిగిలిపోతుంది
డాలర్ సంబంధాలో, గ్లోబల్ గొప్పలో
బతకడాని కొచ్చిన తిప్పలో
రక్తసంబంధాలకీ, వ్యక్తి సంబంధాలకీ మధ్య
మినుకు మినుకుమని వెలుగుతున్న
వంతెనలన్నీ కూల్చేస్తున్నాయి"

అని పెరిగిపోయిన యాంత్రిక జీవనంలో మానవ సంబంధాలు ఎలా మసక బారుతున్నాయో చూసి ఆవేదన చెందుతాడు. తూర్పు గోదావరి జిల్లాలో "మాదిగ"లు మాట్లాడుకునే యాసలో రాసిన నిసర్గ సుందరమైన కవిత "కోస్తా మాదిగోళ్ళు తెలంగాణా బాటలోనే... ! అంటూ రెండుప్రాంతాల ప్రజల భాషలో "యాస" సహజం. సర్వ సాధారణం కూడా. అయితే ఈ "యాస"ను సినిమాల్లో రౌడీలు, దొంగలు, హాస్య పాత్రలకు పరిమితం చెయ్యడం వెనుక ఆంతర్యం ఏంటని ప్రశ్నిస్తాడు.

"మా బాసతోనే మమ్మల్ని
యేలన జేత్తున్నారని
మా బాసలోనే
మమ్మల్ని సంతలో అమ్మేత్తున్నారని చెపుతూ
నిజానికి మనిద్దరిదీ "ఉమ్మడి"
తెచ్చిన తంటాలె నండి!
మనిద్దర మిప్పుడు
జాతీ యనె బంధంలో
చిక్కుకు పోయామండీ! "

అని ఉన్న చిక్కుల్ని చెపుతున్నాడు. మాల మాదిగల మధ్య ఉన్న అంతర్గతమైన భేదాలు కేవలం వర్గ శత్రువులు కల్పించినవేనని నమ్ముతాడు.

"మా మాల మాదిగల్నిక
కలవనియ్య మనుకుంటున్నారేమో

మా కుటుంబ కలహాల్లో తప్ప
మా కష్ట కాలాల్లో
మేమూ నూటైదుమందిమేనని
నిరూపించే సమయమూ
ఒకటుందని తెలుసుకోండి!!"

అంటూ ప్రపంచానికి సవాలు విసురుతున్నాడు. ఏకతా రాగాన్ని ఆలపిస్తున్నాడు. ఐక్యతను అభిలాసిస్తున్నాడు.

"పొద్దున్నే భుజాన్నెక్కుతున్న సూర్యుడు
రైలు దిగినప్పుడు వెన్నెలవుతాడు"

జీవితంలో రొటీన్‌గా జరిగే పనులు కొంత విసుగుదలను పుట్టిస్తాయి. ఆ సమయంలో సృజన లోపిస్తుంది. అప్పుడే మనసు ఆట విడుపు కోరుకుంటుంది. అయితే ఎక్కడికెళ్ళి మనసును ఉత్సాహంతో నింపుకోవాలి అని ఆలోచిస్తున్నప్పుడు సొంత ఊరిని మించిన జ్ఞాపకాల నిధి ఇంకెక్కడుంటుంది. ఆ గాలి, ఆ నేల, ఆ పరిసరాలు, ఆ పలకరింపులు ఒళ్ళు జలదరింపచేస్తాయి. బయలుదేరి ఊరొచ్చాక పాత జ్ఞాపకాలు పలకరిస్తాయి. ఇక్కడి మట్టి వాసనలు, పైరుగాలుల్ని పీల్చాలని మనసు ఉవ్విళ్ళూరు తుండటం గమనించవచ్చు. సొంత ఊరి వాతావరణం "తల్లి స్పర్శ" లో ఉందని భావించి కవిత్వం రాసిన వాళ్ళు చాలా మంది కనిపిస్తారు. ఈ కవితా శీర్షికను "నాన్న స్పర్శ"గా చెప్పడంలో కవికి నాన్నతో ఉన్న అనుబంధాన్ని బలంగా చెప్పడం విశేషం. సొంత ఊరుతో ఇంత బంధం ఉన్నా నాన్న, అన్న తాలూకు చేదు జ్ఞాపకాలు భూతాలై భయపెట్టడం మనిషి జీవితంలో మరో పార్శ్వాన్ని చూపిస్తుంది.

"నానీ.... నువ్వెప్పుడొస్తావురా" కవిత చదువుతున్నప్పుడు గుండె బరువెక్కింది. బిడ్డల కోసం దంపతులు పడే వేదన కనిపిస్తుంది. మనిషికి ఎంత సంపదున్నా ఒక పసివాడి చిరునవ్వుకు అవి సమంకాదనే నిజాన్ని తెలియజేస్తాయి. పుట్టని బిడ్డ కోసం కలవరించడం, పలవరించడం, కన్నీటి ముత్యాల దండలు దాచుకోవడం అది దైనందిన మవడం ఒకింత బాధాకరం. కింగ్ డేవిడ్ రచించిన బైబిల్ లోని PSAMSలో ఇలా అంటాడు ''Sons are a heritage from the Lord, Children a reward from Him''. ఆశతో నిరీక్షించవలసిన వాటి విషయంలో కృంగిపోవలసిన అవసరం లేదు. తన శరీరంలో ఉన్న రుగ్మతను *'మధుమోహనాంగీ!'* అని ముద్దుగా పిలవడం గతంలో ఎండ్లూరి వారు, ఇప్పుడు దార్ల గారు చేశారు.

ఈ కవితా సంపుటిలో కవి నిలబడి నిజాల్ని నినదించడం కనిపిస్తుంది. పదాల పరదాల మాటున విషయాన్నెక్కడా దాచలేదు. నిర్భయంగా తాను చెప్పాలను కున్నది సూటిగ గుండెకు తాకేలా చెప్పడం ఈ కవితాసంపుటిలో మనం చూస్తాం. కులం గురించి చెప్పాలన్నా తన బలం గురించి చెప్పాలన్నా ఎక్కడా సందేహించదు. నిర్భయత్వం కవిత్వమయినపుడు నిజాల నిప్పుకణికలు ప్రజా హృదయాలను వెలిగిస్తాయనేది సత్యం. మంచి కవిత్వాన్ని మనకందిస్తున్న "దార్ల" గారిని అభినందిస్తూ, మనసారా ఆలింగనం చేసుకుంటున్నాను.

❖ ❖ ❖

దళిత తాత్వికతకు చిరునామా "దార్ల" కవిత్వం

– సైదులు ఐనాల

జీవితానుభవాల్ని కవిత్వీకరించడమే దళిత కవులు చేసిన గొప్ప పని. నివురుగప్పిన నిప్పుని గుండెల కెత్తుకొని ఏటికి ఎదురీదుతూ తనదైన చారిత్రక ముద్రని తెలుగు సాహిత్యంపై చిత్రించింది దళిత సాహిత్యం. కన్నీళ్ళనీ, కష్టాలనీ చెప్పుకున్న తొలిదశ నుండి చైతన్యం పొందిన దశలో పయనించి ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకుంది దళిత సాహిత్యం. దళిత కవిత్వం నిండా నిందలూ, తిట్లే ఉంటున్నాయన్న విమర్శలకి రెండవ దశ కవిత్వం సమాధానం చెప్పింది. దళిత కవిత్వం ఉద్యమ స్థాయిని దాట లేకపోతుందన్న నోళ్ళను మూయించింది మూడవ దశ దళిత కవిత్వం.

ఇప్పుడు దళిత కవిత్వం ఒకానొక తాత్విక భూమికపై నిల్చొని మాట్లాడుతుంది. ఇది నాల్గవదశ. ఆ తాత్విక పునాదుల్ని నిర్మించుకునే క్రమంలో తనను తాను అభివ్యక్తీకరించు కుంటూ సామాన్యుల భాషను తెరమీదకు తెచ్చింది. ఈ దశ గొప్ప విప్లవానికి నాంది పలికింది. సామూహిక అనుభవాల, సామూహిక ప్రకటనే నేటి దళిత సాహిత్యం ఈ దశలో ప్రధానమైంది. ఉపరితలంలో ప్రశ్నిస్తున్నట్లు కన్పిస్తూనే కావల్సిందేదో అంతర్లీనంగా డిమాండ్ చేయడం ఆధునిక దళిత కవిత్వపు లక్షణం. ఈ లక్షణాన్ని కలిగి ఉన్న కవిత్వం దార్ల కవిత్వం నిండా పరుచుకుంది.

"నిలువెత్తు మనిషిగా నిలబడిన నన్ను చూసి
మావూరు మళ్ళీ నవ్వింది"

అంటూ కవి దళితుల్లో వచ్చిన, వస్తున్న మార్పుల్నీ, దాన్ని సహించలేని వూరి పెత్తందారీ విషపు చూపుల్ని బహిర్గతం చేస్తాడు. "మావూరు నవ్వింది" కవితలో సుదీర్ఘ అనుభవాల తాత్వికతకూ ఫిలాసఫీ ఉంది.

"రాత్రుల్ని ఎన్నింటినో
లాంతరు బుడ్డుల్తో పగటిగా మార్చుకొని

గుల్లల్తోను, గూడల్తోను
నీటి చుక్కల్నే తడుపుకున్న నాకళ్ళల్లో
పాతదృశ్యాలేవో పలకరించి పోతుంటాయి"

అని చెప్పడంలో మా ఈ ఎదుగుదల, చైతన్యం వెనుక అణచి వేసిన కులాల కున్న మీ అంత సౌలభ్యంగానీ, పూలబాటలు గానీ లేవన్న అంతర్లీనతా ఉంది. దళితుల ఎదుగుదల, చైతన్యపు స్థాయి ఒక్క రోజులోనో, ఒక సంవత్సరంలోనో వచ్చింది కాదు. దశాబ్దాల పురిటి నొప్పుల ప్రసవ వేదన ఉంది. ఈ వేదన వెనుక అక్షరాల్ని హత్తు కోవడానికి గల నేపథ్యం "కూలుతున్న లైబ్రరీ"లో చెప్తాడు కవి.

"అక్షరం ఒక వైపు
అన్నం మరో వైపు పెడితే
నేను అక్షరాన్నే హత్తుకుంటాను ఆబగా"

అనడంలో తరతరాల "అక్షర" దాహం కన్పిస్తుంది. దళితుల్ని అక్షరానికి దూరం చేసిన అగ్రవర్ణ కపట వేదాల్ని ప్రశ్నించే అక్షర కత్తుల్ని నూరుతున్నాడీ కవి. అంతేనా... నోటికాడికొచ్చిన అక్షరాన్ని "గ్లోబల్ " పురుగు తొలుస్తున్న అనేక సంఘటనల పరంపరల తాలూకూ స్పృహ కవిలో ఉంది. అందుకే...

"ఇంటర్నెట్ ప్రకంపనల్తో లైబ్రరీ గోడల్లో పగుళ్లు
మరో మిలీనియం దాకా వెతికినా
నాకిక అక్షరం ముక్క మళ్ళీ కన్పించదేమో"

అని రాబోవు నష్టాన్ని ఊహిస్తున్నాడు. నేరుగా రిజర్వేషన్లని తీసే ధైర్యం లేక డొంక తిరుడుగా ఒక ప్లాన్ ప్రకారం ప్రభుత్వ సంస్థల్ని ఒక్కొక్కటిగా ప్రైవేట్ వ్యక్తులకి 'బలి'స్తున్న ఒక వర్గం కుట్రల్ని పసిగట్టాడు. ఆ కుట్రలని కవి బయటపెడుతున్నాడు. భవిష్యత్తులో మరోసారి దళితులకి అక్షరం దూరం కాబోతుందన్న 'కేకే' 'కూలుతున్న లైబ్రరీ' కవిత. తన జాతిని మేల్కొల్పే చైతన్య గీతాలాపన "హాస్టల్లో అమ్మ" కవిత ద్వారా చెప్తున్నాడు.

తనుంటున్న హాస్టల్లో మిగిలిపోయిన బువ్వకోసం వచ్చే స్త్రీల్లో తన తల్లి రూపాన్ని చూసుకున్నాడు. ఆమె ఆకలి ఆర్తనాదం ముందు తానొక చిన్నపిల్లాడై ఆమె ఒడిలో సేద తీరాలని కలలు కంటాడు. చివరికి "ఆకలీ, అవమానాల్ని జయించమనే మేల్కొలుపు గీతాన్ని" ఆమె కంఠం నుండి విని చైతన్యం పొందుతాడు. దార్ల కవిత్వంలో తాత్వికత పర్చుకొంది. ఎక్కడా బాంబులూ, బరిసెలూ కన్పించవు. కానీ, అంతకన్నా సెగను పుట్టించే దేదో అంతర్లీనంగా ఉంటుంది. ఉత్పత్తి కులాలను చైతన్య స్థాయికి తీసుకుపోవడం. కవిత్వం తాత్విక స్థాయికి చేరడమంటే కవిత్వం చుట్టూ మనుష్యులుండటం. మానవ సంబంధాలు అల్లడం. ఇదే తాత్వికత. దార్లకు సమాధుల్ని చూస్తే సుదూర వెల్తురు కన్పిస్తుంది. సమాధుల్తో మాట్లాడతాడు; ఆత్మీయంగా కౌగిలించుకుంటాడు. కరుగ్గా, వాడిగా, వేడిగా వాటితో చర్చిస్తాడు. మిలియన్ల కొద్దీ గంటల్ని క్షణాలుగా వాటితో గడుపుతాడు. ఎందుకంటా? వర్తమానతా లక్షణాన్ని కలిగి భవిష్యత్తుకు సూర్య కిరణాల్లా ప్రసరించడం దార్ల కవిత్వం నిండా కనిపిస్తుంది. ఎందుకంటే...

"ఒక్కొక్కసమాధీ
కాంతికోసమే కాలిపోయిన ఒక్కొక్క జాతికాగదా
దళిత ప్రపంచానికి నల్లసూరీడై నినదిస్తున్న చైతన్య ముద్ర"

అందుకే సమాధుల్ని, సమాధుల్లో ఆత్మల్ని పలకరించడం. దార్లకు ఇష్టమైనపని. ఇది అవసరమూను. పునాదుల్ని (మూలాల్ని) మర్చిపోని కవి దార్ల. తన మూలాల్లోని సమిష్టి సంస్కృతిని తెరమీదకు తీసుకొస్తున్నాడు. ఆ క్రమంలో అనేకానేక గుంజాటనలు. అయితే ఎక్కడా తడబాటు కనపడదు. ఇది పరిణత లక్షణం. తను నిల్చున్న భూమిని అక్షరాలతో కాంతిమంతం చేయాలనే ఆలోచనల్ని మోసుకుపోతుందీ కవిత్వం.

దళిత సాహిత్యం వ్యక్తి చైతన్యంతో ఆగిపోతే లాభంకన్నా నష్టమే ఎక్కువ. అదొక సమిష్టి చైతన్యంగా ముందుకు రావాలి. అప్పుడే ఒక నిర్దిష్టత కల్గియున్న లక్ష్యాల వైపుకి పయనిస్తుంది. ఈ ఎరుక దార్ల కుంది. అందుకే "మళ్ళీ మళ్ళీ మావూరికే నా ప్రయాణం" అని ప్రకటిస్తాడు. చదువుకోసం పట్నం వచ్చిన దార్ల వ్యక్తిగా చైతన్యం పొందాడు. తన లక్ష్యమైన సమిష్టి చైతన్యం వైపుకు పయనిస్తున్న క్రమగత పయనాన్ని ఈ కవితల్లో నేలపై నడుస్తూ నల్గుర్నీ పలకరించే కవిత్వం దార్లది. అంతటితో ఆగక భుజంపై చెయ్యేసి అలా తనవెంట తీసుకెళ్ళే తత్వాన్ని కలిగి ఉండడం వల్ల ఇది యూనివర్సల్ అయ్యింది.

అంబేద్కరిజం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దార్ల కవిత్వంలోనూ ఉంది. "పోరాడి సాధించుకోవాల"న్న అంబేద్కర్ ఆలోచన ఈ కవిత్వంలో కన్పిస్తుంది. మొలిస్తే, దాన్ని రెండవతరం కావడి కాసి పెంచుకుంది. ఇక అనంతర తరం పరిగె పోనీయకుండా ఆ పంటని పోగేస్తుంది. ఈ మూడవదశకు చెందినది దార్ల కవిత్వం. ఎక్కడా, ఏ విషయాన్నీ వదలడు. రాజ్యం నలుమూలలలో తన నేత్రాన్ని పరిచాడు. అది హాస్టల్ కావచ్చు; తన ఊరు కావచ్చు. ఏవైనా, ఏదైనా దార్ల కంటిని దాటిపోయింది లేదేమోనన్నంతగా కవిత్వమై విస్తరించాడీ కవి. తెరమీద చిత్రాల్ని అంటించి ఒకానొక "పొలి" కేక పెడుతున్నాడు. ఆ కేకతో ప్రపంచం బద్దలై ఒకానొక రోజు దళిత రాజ్యం ప్రసవం జరగక మానదు. ఆ ప్రసవ వేదనలకి పూర్వరంగమే దార్ల కవిత్వం. దార్ల "శంబూకుడి మీద సెప్పలేనంత ప్రేమ"ని కురిపించడంలోను, సమాధుల్ని ముద్దాడటంలోనూ గల తాత్వికత ఇదే. రేపటి ఆశ, ఆ ఆశను దాటిన సంఘర్షణ, ఆ సంఘర్షణ నుండి పుట్టిన భరోసా, ఆ భరోసాతో కూడిన రేపటి బహుజన రాజ్య స్థాపనా ప్రకటనై ముందుకొస్తుందీ కవిత్వం.

ఈ కవిత్వం ఎంతబలంగా మనస్సులోపలి పొరల్లోకి చొచ్చుకుపోతుందో, అంతే బలంగా వెలుపలికొస్తూ ఒరిపిడి పెడ్తుంది. తనను తాను వాస్తవీకరించు కోవడం వల్లనే ఈ లక్షణం అబ్బిందీ కవిత్వానికి. అందుకే పొరకుట్టి చేరడంలో ఈ తరం కవుల కవిత్వానికి భిన్నంగా ఉంది. సమాజంపై పడే నిరంతర సంఘర్షణలను ప్రతిబింబించిందీ కవిత్వం అనడంలో ఏమాత్రం సందేహం లేదు.

❖ ❖ ❖

బాధలు, వేదనల దళిత తాత్త్వికుడు

– జి. సుబ్బారావు

'ఇది నా జీవితం! ఆకలి, అవమానం నిండుకుండగా ఉండే దళిత జీవితానుభవమే నాకీ కవిత్వాన్నిచ్చింది" అంటూ కవితా సంపుటికి *"లిప్తకాల స్వప్నం"* పేరుతో కవి ఎంతో నిజాయితీతో చెప్పుకున్న మాటలే దార్ల వెంకటేశ్వరరావు కవిత్వానికీ, జీవితానికీ లోతైన తాత్త్విక నేపథ్యాన్ని ఏర్పరిచినై. అందుకే ఈయన *"దళిత తాత్త్వికుడు"*. కావ్యం నిండా ఆ మరకలు, ఆ మచ్చలు, బాధలు, వేదనలు మనకు దర్శనమిస్తాయి.

"ఈ కులంలో పుట్టకపోతే
నేనూ ఇంకోలా ఆలోచించేవాణ్ణేమో
ఈకులంలో పుట్టటమే మంచిదైంది
అవమానమంటే అర్థమైంది"

అని రాసిన *"బడిలో అమ్మ ఒడిలో...!"* కవితలో విద్యార్థి తాత్త్వికుడైతే, అదే కవితలో తన తండ్రి కాలి మచ్చ గురించి ప్రశ్నించిన కొడుకు గురించి *"ప్రశ్నించడం నేర్చుకుంటున్నా డేమవుతుందో?"* అనే అమ్మ ఆలోచనలో ఒక దళిత తల్లి తాత్త్వికురాలిగా కనిపిస్తుంది. "*మా వూరు నవ్వింది*" కవితలో "*మనం సదూకోకూడదంటే విన్వేందిరా!*" అనే మాటల్లో జీవితాన్ని కాచి వడబోసిన తండ్రి ఒక తాత్త్వికుడై దర్శనమిస్తాడు. '*'పుట్టుమచ్చ మీద ప్రేమ"* లో

"పుట్టుకతో వచ్చిన మచ్చ
ఒకడికి అందమైన అలంకారంగానూ
మరొకడికి అసహ్యంగానూ మారుతుంది"

అన్న మాటల్లో ఆ వర్ణ సమాజంలో నలిగిపోతున్న ప్రతి దళితుడు ఒక తాత్త్వికుడుగా కనిపిస్తాడు. యూనివర్సిటీ హాస్టల్లో మిగిలిన అన్నం పట్టికెళ్ళే బిచ్చగత్తెలో '*హాస్టల్లో అమ్మ"* కనిపించడం ఈ దళిత తాత్త్వికత వల్లనే.

"నన్ను పెంచిన తీరు
ఆ తల్లిలో ప్రతిబింబిస్తుంటే
నా కళ్ళ ఎడారిని
ఓ జాలి నిట్టూర్పు ఆర్ద్రమై
తడుపుతుంది"

అన్న అభివ్యక్తి ఎంత గాఢంగా ఉంటుందో

"ఎక్కడ నుండో అమ్మ అమృత హృదయమై
లాలిస్తూ జోలపాడుతూ
ఆకలీ, అవమాన ప్రపంచాల్ని జయించమనే
మేలుకొలుపు గీతం వినిపిస్తుంటుంది"

అన్న వాక్యాల్లో ధ్వనించే దళిత వేదనా ఘోష అంతే లోతుగా తగులుతుంది. ఆకలిని జయించినా, పుట్టుక కారణంగా అనుభవించిన అవమానాల్ని జయించటం అంత సులువా? అందుకే ఎందరో దళిత కవులు అక్షరాలను ఆత్మ రక్షణ కవచాలుగా చేసుకుంటున్నారు. అయితే, ఈ కవి అక్షరాల్లో సాంత్వనను ఎలా వెతుక్కుంటున్నారో చూడండి.

"అక్షరం ఒక వైపు
అన్నం మరో వైపు పెడితే
నేను అక్షరాన్నే హత్తుకుంటాను ఆబగా"....
"మా తాత ముత్తాతల మడతల పడిన
ఆ పొట్టల్ని సాగదీస్తే

అంబలైనా దొరుకుతుందేమో కాని
అక్షరం ముక్క మాత్రం కనపడదు"

ఈ వాక్యాలు "కూలుతున్న గ్రంథాలయాలు" లోనివి. ఇందులో నేతన్నల, గీత కార్మికుల, దళిత కూలీల ఎన్నెన్నో వేదనలు కన్పిస్తాయి. ఇదొక మంచి దళిత ఆర్తి కావ్యం. ఖాళీ దొరికిన చోట చాలా మంచి మినీ కవితల్ని బోనస్‌గా ప్రకటించడం ఈ సంపుటి ప్రత్యేకత. కోస్తా జిల్లాల పలుకుబడి ఉన్న మంచి కవితా సంపుటి.

(రమ్య భారతి త్రైమాసిక పత్రిక, మే-జూలై,2005. పుటలు : 27-28)

❖ ❖ ❖

జాతిని జాగృతం చేస్తున్న కవి 'దార్ల'

– దుగ్గినపల్లి ఎజ్రాశాస్త్రి

"మా తాత కూలి పనికెళ్ళే వాడు
మా అయ్య అక్షరం కోసం ఆశగా చూసేవాడు
నేనిప్పుడు కవిత్వం రాస్తున్నాను"

అంటూ అక్షరాలను ఆలింగనం చేసుకొని వాటితో పెనుగులాడి, నిరంతర తపస్సు, యజ్ఞం (అధ్యయనం) చేసి ఒక నిజాయితీ, నిబద్ధత కలిగిన నేటి సమాజంలో నిలబడ గలిగిన వీరుడైన కవి దార్ల. అస్తిత్వ ఉద్యమాల నేపథ్యంలో ఆధిపత్య పోరులో తన భాష జీవం కోల్పోతున్నప్పుడు తన భాష విముక్తి కోసం తన రెండు చేతులు చాలక... వేయి బాహువులను కోరుకుంటాడు కవి. దళిత సాహిత్యానికి మాదిగ సాహిత్యమే మూలం అని నమ్మి ముందుకు తీసుకుపోతున్న వారిలో దార్ల ముఖ్యుడు.

"నెమలి కన్నులు" అనే పేరుతో ఒక కవితా సంపుటిని దార్ల మన ముందుకు తెస్తున్నాడు. కొత్తగా కవి సమాజానికి కాని పాఠకలోకానికి కాని పరిచయం అక్కర్లేని వ్యక్తి. సాహిత్య వ్యాసాల కవితా సంపుటులు ముద్రించిన సీనియర్ కవి. సమాజంపట్ల ఒక స్పష్టత ఉన్నవాడు. జీవితం వేరు... కవిత్వం వేరు కాదు. తాను అనుభవించిన జీవితాన్ని చాలా వరకు కవిత్వీకరించాడు కవి. ఈ కవి నేటి సమాజానికి ఏది అవసరమో దానినే కవిత్వీకరించి ప్రజల ముందుంచుతాడు. అంటే... సమకాలీన సమస్యలు, ఉద్యమాల నేపథ్యాన్ని చిత్రిక పట్టడంలో దిట్ట మన దార్ల.

నేటి సమాజంలో జన్మనిచ్చి పెంచిపెద్ద చేసిన తల్లిదండ్రులను ఏ వృద్ధాశ్రమాల్లోనో వదిలేసి, తన బాధ్యత తీరిపోయిందనుకుంటున్న క్రమంలో దార్ల నేటి తరానికి ఓ గొప్ప సందేశాన్ని ఇచ్చాడు. ఈ సృష్టిలో తల్లిదండ్రులను మించినది ఏదిలేదు వారికే మొదటి ప్రాధాన్యం అని చెప్పడమే కాకుండా చేతల ద్వారా చూపిస్తున్న నిజాయితీగల కవి దార్ల. అట్లానే తల్లిదండ్రుల తర్వాత తన దేశభక్తిని చాటుకున్నాడు. దేశం కోసం, దేశ భవిష్యత్ కోసం, తూటాలకు, లాఠీలకు భయపడేదిలేదు... ప్రాణత్యాగానికైనా సిద్ధం... అంటూ ఒక గంభీర స్వరంతో ఒక సాహస ప్రయోగాలతో ముందుకు నడిచాడు కవి. కోస్తా జిల్లాల పెత్తందార్లు, వ్యాపార వేత్తలు, రియల్టర్ల వలన తెలంగాణ ప్రజలు దోపిడీకి గురౌతున్నట్లే కోస్తాలో మాదిగలు మాల సోదరుల దోపిడీకి, మోసానికి గురౌతున్నారని రచయిత స్పష్టంగా చెప్పడం జరిగింది. కవులు తమ కవిత్వంతోనే కాదు కార్యదీక్ష కలిగి ఉండాలి అంటాడు. దళిత సమైక్యత లేనప్పుడు ఎన్ని మొక్కుబడి రాతలు రాసినా అవి వ్యర్థమంటాడు కవి.

మాదిగ సాహిత్యం... దళిత సాహిత్యం నుండి బహుజన సాహిత్యం దాకా పాఠకుణ్ణి ముందుండి వేలుపట్టుకొని నడిపించాడు దార్ల. ఇవన్నీ ఒక ఎత్తైతే సాంప్రదాయ సాహిత్యం నుండి ప్రపంచీకరణ దాకా సాహిత్యాన్ని తూర్పారబట్టి, జల్లెడ బట్టాడు కవి. ఇంత ప్రక్షాళన తర్వాత మేలైన విత్తనాల్లాంటి కవిత్వాన్ని మనకందిస్తున్నాడు దార్ల. గోదావరి మాండలికాన్ని మచ్చుకు మన ముందుంచాడు. తనలోని ఆవేదనను తన యాసలో శ్వాసించాడు కవి. సంపుటికర్త ప్రథమంగా విమర్శకుడు కావడం విశేషం. అందువలన కవిగా పాఠకుణ్ణి ఆలోచింప జేయగలడు. అందువలన కవిత్వంలో నిజాయితీ... స్వచ్ఛతా ఉంటుంది. అందుకే దార్ల వ్యక్తిగా, కవిగా నాకు నచ్చుతాడు. కవిత్వం చదవండి. మీకూ అలాగే అనిపిస్తుంది.

❖ ❖ ❖

దళితుల మానసిక, సామాజిక, సాంస్కృతిక వేదన

– కాసుల ప్రతాపరెడ్డి

డాక్టర్ దార్ల వెంకటేశ్వరరావు '*'దళిత తాత్త్వికుడు''* అనే కవితా సంపుటిని వెలువరించారు. అప్పుడప్పుడు రాసిన కవితలను ఏరి కూర్చి ఒక పుస్తకంగా తెచ్చారు. ఆయన కవిత్వంలో దళిత వాదం ఉంది.

"ఈ కులంలో పుట్టకపోతే
నేను ఇంకోలా ఆలోచించేవాణ్నేమో..
ఈ కులంలో పుట్టటమే మంచిదైంది"

అని అనుకునే దార్ల వెంకటేశ్వరరావు కులం వల్ల సంక్రమించిన ఆత్మ న్యూనతను అధిగమించి ఆత్మగౌరవాన్ని ప్రకటిస్తున్నాడు. నేటి దళిత కవిత్వానికి కావాల్సింది అదే. అందువల్లనే ఆయన శంబూకడి మీద ప్రేమను వ్యక్తం చేశారు. *"దళిత తాత్వికుడు"* అనే కవిత కవిత్వ పరంగానే కాకుండా ఆయన దృక్పథానికి కూడా అద్దం పడుతుంది. ఈ కవితా సంపుటిలోని కవితలన్నీ గ్రామీణ ప్రాంతంలో దళితులు పడే మానసిక, సామాజిక, సాంస్కృతిక వేదనను వ్యతిరేకిస్తూనే దాన్ని అధిగమించే మార్గం చెబుతాయి.

"అన్నీ మామూలై పోయాయి,
కొత్త బట్టలేసు కొన్నప్పుడల్లా
వింత వింతగా చూసే వాళ్లెదుట

ఏదో తప్పు చేసినట్లింకా కుంగిపోలేను,
రంగునీ, రూపాన్నీ, భాషనీ...
అన్నింటినీ అనుమానించినా,
ఆత్మన్యూనత కింకా అర్థం కల్పించలేను"

అని ప్రకటిస్తున్నారు దార్ల వెంకటేశ్వరరావు. దార్ల వెంకటేశ్వరావు మంచి కవిత్వం రాయగలరనడానికి ఈ పుస్తకంలోని కవితలే నిదర్శనం.

(http://thatstelugu.oneindia.in)

❖ ❖ ❖

దళిత వెలుగుల దివిటీ

– *మల్లవరపు సుధాకరరావు*

దళితవాదంలో ప్రత్యేకత ఏమిటంటే ప్రతి దళితుడి స్వీయానుభవమూ ఒక మహాభారత గ్రంథం లాంటిది. అది తెలుసుకోవాలంటే అనుభవాల లోతులు కొలవాల్సిందే. చైతన్యం, హక్కులు, ఆత్మగౌరవం అనేవి దళితులకు ఒకరు ఇస్తే పుచ్చుకునేవి కావు. వాటిని తమంతట తాము సాధించాలన్నదే దళితుల వాదన. ఇవి సాధించుకోవడంలో అందరూ కలిసి యుద్ధం చేయడం మొదటి విధానం. రెండవది ఎవరికి వారు నిత్యం పోరాటం చేయడం. ప్రధానంగా రెండవ విధానమే డా॥ దార్ల వెంకటేశ్వరరావు కవిత్వంలో కనపడుతుంది.

ఆశలకు, ఆశయాలకూ మధ్య సంఘర్షణ కూడా డా॥ దార్ల వెంకటేశ్వరరావు కవిత్వంలో కనపడుతుంది. ఆశలు వ్యక్తిగతం. వాస్తవాలు నిత్య సత్యాలు. సాంఘిక న్యాయం జరగదనేది విశ్వ సత్యం. పుట్టుక, కులం వల్ల పొందిన అవమాన భారమే కవిలో వెలుగు నింపింది. ఆ వెలుగు రగిలించింది అమ్మ. ఆమెను నిత్యం తలుస్తూ జ్ఞాపకాల పచ్చికలు పరిచాడు డాక్టర్ దార్ల వెంకటేశ్వరరావు. "*బడిలో అమ్మ ఒడిలో*" అనే కవితలో...

> "*రాత్రంతా గూడ తోడీ తోడీ*
> *గాయాల చేతుల్తోనే పొద్దున్న*
> *కారం పచ్చడి నూరుతూ మా కళ్ళకు కనిపించకుండా*
> *మాయమ్మ పడిన బాధంతా...*"

అని అమ్మ చుట్టూ – అమ్మ పడిన బాధల చుట్టూ, తలపుల చుట్టూ తిరుగుతుంది. తల్లి పడ్డ ఆవేదనను సజీవ చిత్రంగా గీసి చూపగలిగారు. విషయాన్ని సూటిగా చెప్పి, ఆర్ద్రతతో వ్యక్తీకరించారు. ఎందుకంటే "తనను తన గమనాన్ని... భయపెట్టే గ్రామ *పెత్తందారీతనం...*" ఇప్పుడు "చెట్టెక్కో పుట్టెక్కో పట్టెడన్నంతో కడుపు నిండా కొడుక్కి అక్షరాలు నింపడంతో ఊరు అర్థం చేసుకోవాల్సినన్ని డిగ్రీలు అందుకోవడం చూసి మళ్ళీ మా ఊరు నవ్విందని నిలువెత్తు మనిషిగా నిలబడడం అక్షరం వల్లే సాధ్యమైందని, అమ్మనీ, అక్షరాన్నీ ఏకకాలంలో కీర్తిస్తాడు. అంతే కాదు...అమ్మ గురించి కలలు కంటూ –

"మాయమ్మే స్వయంగా ఉత్తరం రాస్తుంది
స్వయంగానే ఉత్తరం చదువుతుంది
మాయమ్మ కూడా పట్టుచీర కట్టుకుని పేరంటాని కెళ్తుంది
ఫ్యాన్ కింద కబుర్లతో కలర్ టీ.వీ. ఠీవీగా చూస్తుంది
పుణ్యక్షేత్రాల నెన్నింటినో సందర్శిస్తుంది ..."

దళితుల ఇంత చిన్నచిన్న కలల్ని కూడా యదార్థమనే ఫిరంగులు పేల్చేస్తున్నాయంటాడు. అందుకే "దృశ్యాల్ని శాసించే నియంతనైతే ఎంత బావుణ్ణు" అని కవి "కల అదృశ్యం కాదు" అనే కవితలో చెబుతాడు. కలలో కూడా స్వేచ్ఛ లేదంటాడు. సమాజం ఇదా దళితుని కిచ్చిన స్వేచ్ఛ అనేది స్ఫురింపజేస్తాడు. అమ్మ తలుపుల్లో భాగంగానే "హాస్టల్లో అమ్మ " కవితలో...

"మిగిలిన అన్నం పట్టుకెళ్ళడానికి
తెల్లవారగట్ల ఓ తల్లి దీనవదనంలో
మాయమ్మ రూపం అందంగా కనిపిస్తుంటుందని'

అమ్మ గుర్తుకొచ్చినప్పుడల్లా "ఆకలీ, అవమాన ప్రపంచాన్ని జయించమనే మేలుకొలుపు గీతం వినిపిస్తుందని" అందుకే అక్షరం మీద ప్రేమ పెంచుకున్న కవి "కూలుతున్న గ్రంథాలయాలు" కవితలో సాంకేతిక విప్లవాల్లో ఇంటర్నెట్లు అగ్రవర్ణాల వారి వేదికలుగా మారిపోతుంటే, అణగదొక్కబడిన వారికి లైబ్రరీలే వేదాలయాలూ, విశ్వవిద్యాలయాలూనూ అని అవీ కూలిపోతూ, శిథిలాలుగా

మారిపోతుంటే "లైబ్రరీలోనే చచ్చిపోయి, మళ్ళీ లైబ్రరీలో ఓ పుస్తకమై పుట్టాలని" కోరిక వ్యక్తం చేస్తాడు.

ఊళ్ళో తన గురించి కలలుగని – తన మీద ఆశలు పెంచుకుంటున్న తల్లి తండ్రులకు చేతి కర్రలా ఉండాల్సినప్పుడు కూడా దళితులు కొన్ని తప్పనిసరి పరిస్థితుల్లో ఆ యా పనులు చేయక తప్పడం లేదు. ఈ భావాలను ఆత్మాశ్రయ పద్ధతిలో వర్ణిస్తూ...

"నేనేమో సముద్రాల లోతుల్లో వెళ్ళి
తిమింగలాలతో పోట్లాడుతున్నాను
పర్వతాలెక్కే మేఘాల్తోనూ
ఎర్రెర్రని సూర్యుళ్ళతో
ఏవేవో చర్చల్లో తలమునక లవుతున్నా"

అంటాడు. దళితుల నిరంతర జీవన సంఘర్షణ తప్పదనీ అందువల్ల కన్నవారితో గడపడానికి కూడా సమయం చిక్కని పరిస్థితికి వాపోతాడు కవి.

నిజానికి దళితుల పుట్టుకే ఒక సంఘర్షణ. తల్లి కడుపులోనే ప్రశాంతత. ఒకసారి భూమ్మీద పడ్డాక ఊహ తెలిసినా, తెలియకపోయినా, ఇష్టమున్నా, లేకున్నా పోరాటం చేయక తప్పదు. ఒక పోరాటంలో గెలిచినా, అలసటతో అక్కడే ఆగి ఆనందించడమంటూ కుదరదు. ఈ పోరాటంలో ఏమాత్రం అలసత్వంగా ఉన్నా–

"నన్నే కులం గుంపులోనో
ఎన్నికల దొంగ ఓటరుగానో
అక్రమ కేసులు బనాయించిన నేరస్తుడిగానో
చేస్తారని భయం"

అందుకే ఈ పోరాటం ఎంత వరకంటే "ఎండమావుల్లో నిస్సత్తువయ్యేంత వరకు పరుగు" తప్పదంటారు కవి. నిరాశనుండి కసి ఉద్భవిస్తుందని లోకోక్తి. కానీ దార్ల గారు కులం తనకు ప్రేమించడం నేర్పిందని సగర్వంగా చెబుతున్నాడు.

"ఈ కులంలో పుట్టడమే మంచిదయింది
లేకపోతే మనుషుల్ని ప్రేమించలేకపోయేవాణ్ణేమో"

"ఈ కులంలో పుట్టడమే మంచిదయింది
అవమానమంటే అర్థమయింది
అందరినీ ప్రేమించడం తెలిసింది"

అదే సమయంలో...

"నన్ను నిరంతరం ద్వేషించినా, వేధించినా
నాకు నిన్ను ప్రేమించడమే తెలుసు
ఇప్పటికైనా నువ్వెప్పుడయినా
అమ్మ తినిపించే గోరుముద్దల రుచిని చూడు
పసిపిల్లల పాలబుగ్గలెప్పుడయినా నిమిరి చూడు
నీకు ప్రేమేంటో తెలుస్తుంద' ని ప్రబోధిస్తాడు.
తన వేదన మన ఎదలోతుల్లో తాకినా –

అవి సానుభూతి కోసం మాత్రం కాదు. అవి ప్రేమ ఉప్పొంగించడానికి చేసిన ప్రయత్నాలు. తన కులం తనకు పుట్టుమచ్చ లాంటిదని, పుట్టుకతో పడిన కులపు మచ్చలో విలువలను ఇలా చెబుతాడు కవి.

"సౌందర్య రమణి నా పుట్టుమచ్చ
నిన్ను నేను ప్రేమిస్తున్నాను"

ద్వేషించే వారిని, అవమానాలకు గురిచేసే వారిని ప్రేమించడం తనకు ఈ కులంలో పుట్టడం వల్లనే సాధ్యమైందని, లేకుంటే ...

"అవమానాలకి తట్టుకోలేక
ఆగ్రహం పట్టలేక హత్యలెన్నింటినో చేసేసే వాణ్ణేమో"

అని అనుమానాన్ని వ్యక్తం చేస్తాడు. దార్ల కవిత్వంలో ఎక్కడా తనను బాధించిన వర్గంపై హింసను ప్రబోధించలేదు. ఈ కవిది నిరసన, తిరుగుబాటే తప్ప, అది హింసను ప్రబోధించే మార్గం కాదు. ఇంకా లోతుకెళ్ళి చెప్పాలంటే ఈ కవిది ప్రేమ మార్గం. మానవుల నందరినీ ప్రేమించే మార్గం. ప్రత్యామ్నాయ హిందూ సంస్కృతి అంతర్లీనంగా బోధించే మార్గం. అది మానవులనందరినీ ప్రేమించమనే సంస్కృతి! అమ్మ తినిపించే గోరుముద్దల రుచిలో, పసిపిల్ల పాలబుగ్గల మెరుపులో,

మిట్ట మధ్యాహ్నపు చెట్టు నీడలో ప్రేమను, ప్రేమించడాన్ని ఎలా తెలుసుకోవచ్చు?అంత సున్నితత్వం ఇప్పుడు లోకానికుందా?

అంత సమయం ఈ స్పీడు యుగంలో ఎవరికి ఉంది? *"బడిలో అమ్మ ఒడిలో"* కవితలో చెప్పినట్లు తుఫానులో తల్లిని ఆదరించని గ్రామాన్ని ద్వేషించకుండా, గ్రామం చేతే ప్రేమించబడాలనుకోవడం! అక్కడక్కడా రహస్య రాగబంధాలుంటాయనే సత్యాన్ని గుర్తించడం!! ఇదే దళితుల నిజమైన తత్వం. ఎక్కడ అవమానింపబడ్డామో అక్కడే గౌరవింపబడాలనేది ప్రతి మనిషికీ ఉండే ఆత్మ గౌరవతత్త్వం. అందుకనే అవమానం నేల మీద ఉంటే, మన ఆశయాలు మాత్రం ఆకాశంలో ఉండాలనేది కవి భావన. సహజంగా హేతుబద్ధమైన చదువు వలన దళితుడిలో కలిగే సంఘర్షణను వర్ణిస్తూ–

"ప్రాచీన సాహిత్యం పాఠమైనప్పుడల్లా
నా ముఖ కవళికలన్నీ మారిపోయేవి
బయటపడకూడదనో, పారిపోవాలనో
బహిష్కరించాలనో అనుకుంటుండేవాణ్ణి."

సాహిత్యంలో 'తను" కనపడని విషయం గమనించే కొద్దీ తాను పొందిన అనుభవాల్నీ, అవమానాల్నీ పోల్చుకొని వాటి మూలాల్లోకెళ్ళి విశ్లేషించి...

"నెత్తుటి పువ్వుల్ని చేసి నేలలో కూల్చేసినా
బంగారమై బయటకు రావొచ్చు
ఆకాశంలో విసిరేసినా వాన చినుకులై ప్రాణం పోయవచ్చు
సముద్రంలోకి తోసేసినా ముత్యాలై మెరిసిపోవచ్చు"

అని ఒక గొప్ప ఆశని ప్రకటిస్తాడు. దళితుల్లో ఆత్మ గౌరవం, హక్కుల కోసం పోరాడే చైతన్యాలను సమాధి చేసి పాతేస్తే, సమాధి నుండి తిరిగి లేపడానికి చేసే ప్రయత్నమెలా ఉండాలో ఈ 'దళిత తాత్వికుడై'న డా. దార్ల వెంకటేశ్వరరావు కవిత్వంలో కనిపిస్తుంది. తన బాల్యంలో అవమానాలకు గురి చేస్తే అప్పుడు తెలిసీ తెలియని తనంలో కులం వల్ల మానసికంగా కుంగిపోవడం జరుగుతుంది. కానీ , ఈ దేశంలో కులం ఒక వాస్తవమని తెలిసిన తరువాత కూడా తనకులాన్ని

అవమానిస్తూ మాట్లాడుతుంటే, కొన్ని కులాలే గొప్పవని వాదిస్తుంటే ఆత్మన్యూనత కింకా అర్థం కల్పించడం సమంజసం కాదంటాడు కవి. నిజాని కిప్పుడు కులాన్ని చూడాల్సిన దృష్టి ఇదే! దేనికైనా ఒక హద్దు ఉండాలి. దళితులే కాదు, ఇతరులకైనా సరే ఆత్మగౌరవం చాలా ప్రధానం. దీన్ని కవిత్వీకరిస్తూ ఒక ప్రవక్తలా...

"వినయం

బానిసత్వమైతే

జీవితం మోయలేనంత బరువు'

అవుతుందని వర్ణించాడు కవి. దళితుల పోరాటం దేనికోసం? ఏమిటీ యుద్ధాలు? అని ఇతరులు ప్రశ్నిస్తే, మనం చెప్పే యదార్థాలు విని అవహేళన చేస్తూ, ఇంతోటి దానికా పోరాటమూ! యుద్ధమూ! అంటూ ఆశ్చర్యపోతారు. వాళ్ళకు దళితుల సంఘర్షణ అర్థం కాదు. గుర్తించనూ లేరు. ఎందుకంటే అవన్నీ వారి జీవన సంప్రదాయంలో భాగం కాదు కాబట్టి. ఈ సంప్రదాయాన్నే ప్రశ్నించారు దళితులు. ప్రశ్నిస్తూనే ఉన్నారు. వాటన్నింటినీ కవిత్వీకరిస్తూ... '

'అన్నీ మామూలైపోయాయి

కొత్త బట్టలేసుకున్నప్పుడల్లా వింత వింతగా చూసే వాళ్ళూ"

'రంగునీ రూపాన్నీ, భాషనీ అన్నింటినీ అవమానించినా

ఇతివృత్తాల మూస ధోరణిలో

నా తల్లినీ, పనిమనిషినీ, నా తండ్రినీ, తోటమాలినీ

చిత్రించే వర్ణనలకు' ఇప్పుడు చెల్లు చీటీ అంటాడు.

"మోసగించడం తెలియక

మోసగింపబడడమూ ఇష్టం లేక

ఇవ్వేనా బ్రతుకు బంగారు బాటకు నిర్వచనమని"

అడుగుతూ అది భరించలేక *'నవ్వుతూ నరకాన్నైనా ముద్దుపెట్టుకోవడం నయమంటున్నాడు.* ఇదే దళితుల్లో నిజాయితీ. ఇదే దళితుల్లో బలహీనత కూడా.మోసగించే లోకంలో... ఇమడలేక తనను స్వారీ చేసి తన స్వేచ్ఛను నిర్దేశించే ఈ సమూహంలో లోపల్లోపలే కులవివక్ష దహించేస్తుంటే ఏ. సీ. రూములు కూడా ఉక్కపోస్తాయని, వీటన్నిటికంటే తన మూలాల్లోకి వెళ్ళి గుడిసెల్లో, ఎండల్లో, వానల్లో

తడుస్తూ అలిసిపోతే కళ్ళు మూసుకొని పడుకోవడంలోనే ఆనందం ఉందని చెబుతాడు. అందుకే తన కవిత్వంలో దళిత లోకపు లోతులు తెలియాలని, వాస్తవికత ఉండాలని వర్ణనల రూపంలో ఆకాశంలో విహరింపక వాస్తవికతను నేల మీదనే ఉంచారు దార్ల. జీవితపు మజిలీలో చుట్టూ ఉన్న పరిసరాలు శాశ్వతం కాదు. వాటిని ఎప్పటికైనా వదిలేయాలి.

"ఎక్కాల్సిన రైలు దిగాల్సిన ప్లాట్‌ఫారమ్
జీవన్మరణ ప్రయాణాల రైలాగదు"

అంటూ జీవిత సత్యాన్ని చెబుతాడు. మమతాను బంధాల్ని పెంచుకోవడం, రాగద్వేషాలు తుంచుకోవడం జీవులకే కాదు. స్థల కాలాలకీ అతీతం కాదు.

ప్రపంచీకరణ మార్కెట్ సంస్కృతిలో కనుమరుగవుతున్నవి ఎన్నో. వాటిలో నలిగే జీవితాలు ఎన్నో – అనుభూతులు అంతరించి పోవడం గుర్తించిన దార్ల గారి సున్నితత్వాన్ని గుర్తించాలి. అందమైన వెన్నెల ఏ సూర్యకిరణ స్నానంలోనో వెలిసిపోయింది. కాగితాల పడవలు కలల్ని ఏ తీరాలకో సాగనంపుతున్నాయి. పందిరి అల్లుకొనే లత ఎన్నాళ్ళకీ పందిరి కాలేకపోవడం! అసమర్థులకు ప్రతీకలా? 'సమర్థుల' ప్రతీకారాలా? మార్కెట్ సంస్కృతి అనే పిచ్చుకకు రాబందుల రెక్కలొచ్చి ప్రపంచాన్ని విస్తరించాయా?

కవి తన చుట్టూ ఉన్న పరిసరాల్ని నిరంతరం పరిశీలిస్తూ ఒంటరితనం, అవమానం, అసహనం అన్నీ ప్రశ్నించుకుంటూ జీవితాన్వేషణ సాగిస్తున్నా రనిపిస్తుంది. అక్షరమే దళితుల్లో వెలుగు నింపుతుందని బలంగా నమ్మి...

"అక్షరం ఒకవైపు
అన్నం మరొక వైపు పెడితే
నేను అక్షరాన్నే హత్తుకుంటాను అబగా"

అంటూ అందరికీ దారి చూపుతూ వెలుగుల దివిటీ చేతబట్టారు దార్లగారు.

❖ ❖ ❖

వెలివాడల దయనీయమైన బతుకుల తీరు

- గోగు శ్యామల

ఒక సాదా సీదా వ్యక్తి, తన జీవితంలో ఒనగూడిన అనేక అనుభవాలు, ఒడుదుడుకులు, ఆటుపోట్లు, గుండెల్లో పదిలపర్చుకున్న రీతి, వాటికై రచయిత దేవులాడే తీరును పాఠకులుగా మనం తెలుసుకోడానికి ఈ కవితలు ఒక మంచి అవకాశంగా తారసపడతాయి. మరుపురాని తీపి జ్ఞాపకాలు, చేదు అనుభవాలు, ఆవేదనలు, నిస్సహాయతలు, అసహనం, నిట్టూర్పు, ఉక్రోషం, ఆగ్రహం తదితర అన్ని భావాలు, భావరసాలు, సారాలు కలగల్సిన మనిషి జీవితాన్ని తనదైన శైలిలో అక్షరీకరించాడు దార్ల వెంకటేశ్వరరావు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో ఊరు, పల్లె, చెరువు, ఏరు, కాల్వలు లాంటి ప్రకృతినీ, దాని రమణీయతను గురించి ఇప్పటికే ఎంతో మంది కవులు రాసినప్పటికీ అదే ప్రకృతి గూర్చి దార్ల రాయడంలో ఒక కొత్త కోణం ఈ కవితల్లో స్పష్టంగా కనిపిస్తుంది. ప్రకృతితో వెలివాడకున్న పేగుబంధం రోజువారి జీవన అనుబంధం, అదే సమయంలో పేగుబంధాన్ని తెంపేసిన వెలివేతను కవి నిలదీయడం ఇక్కడ కొత్త కోణం. దార్ల గుది గుచ్చిన ఈ కవిత్వంలో వెలివాడ కొత్తకోణం, మాదిగ పెద్దింటి దర్వాజై పుస్తకంలోకి సాదరంగా ఆహ్వానిస్తుంది.

ఒక అమాయకపు బడి విద్యార్థిగా, తల్లి ఒడిలో పసికూనగా వెలివాడ దయనీయమైన బతుకుల తీరును కవి అనుభవించి వాటినే పుస్తకం పొడవునా

పాతకులతో పంచుకుంటాడు. మూడువేల సంవత్సరాలుగా కండ్లు బైర్లు కమ్మిన వర్ణాశ్రమధర్మ అసమాన ప్రపంచాన్ని దాటి తన ఇంటా బైటా ఆప్తులను ఈ కవిత్వంలో కలవరిస్తూ పల్కరిస్తాడు.

ఆధునిక భారత దేశంలో మాదిగ మాల అంటేనే బ్రాహ్మణ హిందూ రాజ్యానికి ఈసడింపు, చిన్నచూపు. కాశ్మీర్ నుండి రామేశ్వరం దాక, గుజరాత్ నుండి అరుణాచల్‌ప్రదేశ్ దాక దేశమంతా వివిధ పేర్లతో ఉన్న దళిత ప్రజలను చిన్నా, పెద్దా, పండుముసలి, పసికూన ఆడా, మగల తేడా లేకుండా, పట్టపగలు అర్ధమ్మ రాత్రిలు వాన, ఎండ, యాల, పాల లేకుండా ఆధిపత్య కులాలు గుంజుకున్న భూములల్ల, పశువుల కాడ దళితులను కుటుంబాలకు కుటుంబాలనే తరతరాలుగా వెట్టికి గిర్వి వెట్టుకొని మూల్గులను, రక్తమాంసాలను జుర్రూకుంటనే వేలఏండ్ల నుండి అంటరాని తనమని వెలివాడలనేమగ్గి ఉండుమని నక్రబాజి నాటకాలాడుతున్నరు. ఈ నాటకాలను రంజుగా రక్తి కట్టించనీకె రామాయణం, మహాభారతం, భగవద్గీతలను నుండి, సుప్రభాతం దాక చెవిలో జోరీగలై, కంట్లో నలుసులై ఈనాటికీ దళితులను, స్త్రీలను వెట్టి బానిసత్వంలో కుక్కి ఉంచడమే లక్ష్యంగా నడుస్తున్నది.

ఈ దేశపు మూలవాసుల దళితుల మాతృ కుటుంబ విలువల శాక్తేయాన్ని, పశుపాలక జీవన సౌందర్య సంపదల సర్వాన్ని బ్రాహ్మణీకరించి వైష్ణవీకరించింద్రు. లేని హిందూ వ్యవస్థను సృష్టించి మూలవాసుల, దళితుల, ఉత్పత్తి కులాల, తెగల కుటుంబాల పాలిట తెలియని, ఊహకందని తీరొక్క మారణ హోమాల రూపంలో ఉరితాళ్లను పేన్తనే ఉన్నరు. బిగిస్తనే ఉన్నరు. ఇంత పేనుదు, బిగించుదు కొనసాగుతున్నప్పటికినీ దార్లా ఒక కవిగా ఈ కవితల్లో "ఈ మాదిగ కులంలో పుట్టడమే మంచిదయింది" అని చెప్తున్న దంటేనే తన అస్తిత్వం పట్ల ఎంతగా అస్సర్షన్ ప్రకటిస్తున్నాడో!

మా పుట్టుబడి ఎక్కువ అనే అహంకారాన్ని అదే స్థాయిలో ధిక్కరిస్తున్నాడు ఈ దళిత కవి. అయినా ఈ అస్సర్షన్‌లో ఉన్న మానవీయ కోణం, సమానత్వ ఆకాంక్షను అంగీకరించలేక పోతున్నారు.

తెలుగు పీఠాధిపతులు అంగీకరించలేక చూడలేక పోతున్నారు. కారణం వీరు మనువు వామన వామపక్ష జిడ్డులో పీకల దాక కూరుకుపోయిండ్రు. అసమర్ధులు, కుళ్ళు బోతులు, దురహంకారులు, పరాన్న జీవులైన వారు ఆధిపత్య కులాల పేరుతో చలామణి అవుతూ నోరు తెరిస్తే మాదిగ, మాల, చండాల అని తిడుతూ, ఈసడిస్తూ తాము పుట్టిందే దళితులను పాతాళంకు తొక్కడానికి అన్నట్లు, అది తమ జన్మ హక్కు అన్నట్లు. మనువు మత్తు కుతికల దాక మునిగినోడు శాస్త్రవేత్త అయితేనేమి, డాక్టరు, ప్రొఫెసరు. నాయకుడు ఎవరైతేనేమి. వారి జ్ఞానం అంతా కలుగులో ఎలుకను మించి ఉండని స్థితి.

అందుకే ఎంత సాంకేతిక అభివృద్ధి జరిగినా, అంటరాని తనం, వెట్టిగాయిద విధానం చెక్కుచెదరడం లేదు. పైగా రూపు మార్చుకుని ఇంతింతై వటుడింతై, ఇందున్న దందులేడు, ఎందెందు వెతికినా అందందు గలడు అన్నట్లు మాల మాదిగలను అంటరానితనం పేరుతో చీల్చి చెండాడుతున్నది. వీటన్నింటి బారిన పడుతూనే, గాయపడుతూనే దార్ల తన కవితలో ఆత్మగౌరవాన్ని, ధిక్కారాన్ని ప్రకటిస్తాడు. దళితులకు ప్రగతిని, మానవత్వాన్ని కోరుకునే వారికి ఈ కవితలు నడికాలపు ఎండల్లో అంబలిగా, చిగురాకుల కానుగ గుబురుగా, పరిమళాలు గుబాళించే వేప చెట్టుగా సేద తీరుస్తాయి. అస్తిత్వాన్ని ప్రకటించే కవిత్వం కోసమే పాఠకులు ఎదురు చూస్తున్నారని భావిస్తూ, ఇక ముందు ఇంకెంతో సాహిత్యాన్ని డా॥ దార్ల వెంకటేశ్వరరావు రాస్తారని ఆశిస్తూ.....

❖ ❖ ❖

బహుజన చైతన్య ప్రస్థానం

– డా॥ బద్దిపూడి జయరావు

వర్తమాన తెలుగు సాహిత్యంలో బలమైన కవిత్వం రాస్తూ, తన మట్టి గొంతుకను వినిపిస్తున్న రచయిత, వక్త, విమర్శకుడు డా॥ దార్ల వెంకటేశ్వరరావు. నిషిద్ధవాడలో పుట్టి, అంటరాని సరిహద్దులు దాటి, పంచమ చైతన్యాన్ని పుణికి పుచ్చుకున్న బహుజన కళా తాత్త్వికుడు ఈయన. వీధిబడిలో ఓనమాలు దిద్దుకొని, చదువుల తండ్రిగా ఎదిగి విశ్వవిద్యాలయంలో పాఠాలు బోధిస్తూ, యువ కలాలను సాహిత్య సమరం వైపు పరుగులు తీయిస్తున్న నిత్య అధ్యయనశీలి. ప్రగతి పవనంలో అభ్యుదయ స్వరాన్ని వినిపిస్తూ, విస్తృతమవుతున్న ఈ కాలం కవి డా॥ దార్ల వెంకటేశ్వరరావు.

ఈయన రచనల్లో ఊరు నవ్వుతుంది. ప్రకృతి పలకరిస్తుంది. మానవత్వం పరిమళిస్తుంది. దేశభక్తుడి ధైర్యం, తెగింపు కనిపిస్తుంది. పరివర్తన కలిగిన భగ్న ప్రేమికుని హృదయంలా తీయని గాయాలను రుచి చూపిస్తుంది. అమ్మ ఒడిలా సేద తీరుస్తుంది. ప్రతివ్యక్తిని సత్యాన్వేషణ వైపు నడిపిస్తుంది. బరువు బాధ్యతలను గుర్తు చేస్తూ, పడిలేసే కెరటంలా కర్తవ్యాలను ప్రబోధిస్తుంది.

డా॥ దార్ల వెంకటేశ్వరరావు మంచి రచయితే కాదు, మానవతావాది కూడా. పుట్టిన మట్టిమీద, పెరిగిన పరిసరాల మీద ప్రేమ కలిగిన వాడు. పచ్చని పైరులతో పరవశించే కోనసీమ అందాల్ని, కన్నీటి బిందువుల్ని ఆస్వాదించినవాడు. అందుకే ఈయన కవిత్వం అనుభవాల పొరల్లో నుండి, అనుభూతుల ప్రవాహం నుండి

ఆర్ద్రంగా ఆవిష్కరింప బడుతుంది. సృష్టి మూలాల సుగంధంలా, తొలకరి మట్టి వాసనలా, పసిబిడ్డ బోసి నవ్వులా స్వచ్ఛంగా మనసును హత్తుకుంటుంది. ఈయన కవిత్వంలో మానవీయ విలువలే కాదు, ప్రతిఘటనలు, ఆకలి పేగుల ఆర్త నాదాలు, తాత్త్విక చింతన, బహుజన ప్రస్థాన లక్ష్యాలు, భవిష్యత్ పయనాలు స్పష్టంగా కనిపిస్తాయి. సమస్యల పట్ల ప్రళయంలా ప్రజ్వరిల్లే తత్త్వం, సామాజిక స్పృహ కలిగిన చలన సాహిత్యమై ముందుకు నడిపిస్తుంది. నూతన అధ్యాయ అన్వేషణల వైపు పరుగులు తీయిస్తుంది.

ఏడేళ్ల క్రితం అనుకోకుండా ఒక రోజు బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో "కైతు నకల దండెం" పుస్తకావిష్కరణ సభలో పరిచయమయ్యారు దార్ల. దశాబ్దాల మైత్రీబంధం ఉన్నట్లు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నాం. అలా మొదలైన మా స్నేహబంధం ఎన్నెల నవ్వులా, సెలయేటి గానంలా సాగిపోతుంది. కలుసుకున్న రోజులు పంచుకున్న వేదికలు తక్కువే అయినా, విడదీయలేని భావబంధం ఆత్మీయ సంబంధంగా పెనవేసుకొంది.

డా॥ దార్ల వెంకటేశ్వరరావు బాల్యపు జ్ఞాపకాలు, స్నేహితులతో ఆటపాటలు, వర్ణ వివక్షతో మగ్గిపోయిన, గుండెలోతుల్లో పేరుకుపోయిన ఆత్మఘోషను ఆవిష్కరించిన బహుజన సిద్ధాంత కర్త చిన్నతనంలో అనుభవించిన వెలివాడ బతుకులు, భూస్వాముల పెత్తందారీ తనంలో బిక్కు బిక్కుమంటూ బతికిన బానిస జీవితాన్ని అనుభవించిన ఈయన ఆ సందర్భాలను కళ్ళకు కట్టినట్లు వర్ణించారు.

"దొంగ చాటుగా నేనూ బళ్ళో దూరితే
"మనం సదూకోకూడదంటే యిన్నేందిరా!"
భయపెట్టే గ్రామ పెత్తందారీతనం
మాయమ్మా బాబుల గొంతుల్లో ఆవేదన జీరకు
సజీవ సాక్ష్యాలుగా
నా కన్పించే మా వూరి పాఠశాల !"

కష్టాలకు కన్నీళ్ళకు మధ్య జీవితం రణరంగ మవుతుంటే తల్లడిల్లి పోవడం తనవంతు కాకుండా స్పందించే గుణం వశీకరించుకొని మానవ వనసీమల్ని గెలవాలని అక్షర సేద్యం చేస్తున్నవారు డా॥ దార్ల వెంకటేశ్వరరావు.

"పొద్దు నడి నెత్తినైనా దాటకముందే
జీవితంలో సంధ్య మసకలు
దారి పొడవునా పెదవి దాటని
పన్నీటి జల్లుల ఆలింగన మరకలు !"

జీవన గమనంలో లోకం పోకడలో అబద్ధాల్ని అందంగా పేర్చి అవినీతి నృత్యం చేసే కుటిల సమాజం మీద పతనమవుతున్న విలువల్ని కాలరాసే కుటిల వారసత్వం మీద ఈయన కలం విరుచుకు పడుతుంది. డా॥ దార్ల వెంకటేశ్వరరావు కసికలిగిన కవిత్వంలో కళ్ళు కాచిన దృశ్యాలు అగ్నికెరటాలుగా, నెత్తుటిపూలుగా మారి సమాజాన్ని దహించే విధం మనం అక్కడక్కడా చూడవచ్చు.

"దీనికంటే నవ్వుతూ నరకాన్నైనా
ముద్దుపెట్టుకోవడం నయంకదూ!
జీవనచౌరస్తాలోకొచ్చిన కొత్తలో
వెలుగులు విరజిమ్మిన వసంతం
భవిష్యత్తు మొగ్గల్ని ఇంతతొందరగా చిదిమేసి
శిశిరమైన చీకటి అవతారం!"

సృష్టికి మూలం ప్రేమ. ప్రపంచ ఫలాలకు ఆది బిందువు ప్రేమ. ప్రేమ సందేశాన్ని, ప్రకృతి పరవశాన్ని గలగలపారే జలపాతాన్ని, హృదయ వేదనలను, ప్రియురాలి గుండె చప్పుడును సహితం ఆరాధించేవాడే అమర ప్రేమికుడు కాగలడు. ప్రశాంత వనంలో నిస్వార్థ జీవి ఒంటరితనంలో కూడా తుంటరి కాలాన్ని తనకు అనుకూలంగా ఏర్చి కూర్చి మార్చుకున్న గొప్ప సహనశీలి మనకు దర్శనమిస్తారు.

"ఇదిగో గదిలో కొస్తే
ఏదో కోల్పోయిన వెలితి
నిండిపోతున్న ఒంటిరితనం
బరువెక్కిపోతున్న హృదయం
భవిష్యత్తు ముందే తెలియడమెంత నరకం!
బయటికిపోతే

నీతో విహరించిన స్థలాల వెక్కిరింత
ప్రతి దానిలోనూ నువ్వే"

"తెలుగు సాహిత్య ప్రస్థానంలో ఓనమాలు దిద్దుకొని, రచయితగా విస్తరిస్తూ, విశ్వకళా వేదిక మీద ఉన్నత శిఖరాల కోసం పదయజ్ఞం చేస్తున్న శ్రీ దార్ల వారు లైబ్రరీని 'అమ్మ'తో పోల్చడం గొప్ప ప్రయోగంగా భావించవచ్చు. మాటలను హత్తుకునే మనసుండడం భావుకుడి లక్షణం. ప్రతిస్పందించే గుణం కవులు, కళాకారుల సహజ నైజం. ఈ రెండు లక్షణాలు సమృద్ధిగా ఉన్న కవి డా॥ దార్ల వెంకటేశ్వరరావు.

"అమృతానికి ఇక అవతలుండాల్సిందేనేమో...
నాకు గ్రంథాలయాన్ని చూసినప్పుడల్లా
అమ్మ నులివెచ్చని కడుపులో
కేరింతలు కొడుతున్న పసివాడిలాగో
యవ్వనం కరిగిపోకుండా కలకాలం నిలిచిపోయిన
ఉడుకురక్తం మరుగుతున్నట్లో ...!
నేనిప్పుడు గ్రంథాలయంలోనికి వెళ్తుంటే
సీసం కరిగించి పోసిన చెవుల్నిప్పుడు
ప్రతి బుక్ ర్యాక్ నుండీ
విందుల కాహ్వానిస్తూ వేద ఘోషలు!"

కాలాన్ని కట్టేయలేని జీవితాన్వేషణలో మానవుడు శ్రమజీవిగా మారి సమకాలీన సమాజంలో సమరం చేస్తున్నాడు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ సంఘటనలపై కలం ఎక్కుపెట్టడం నేర్చుకున్నాడు. యుగాల చరిత్రలో తరతరాలుగా బానిసత్వంతో మగ్గిపోతున్న బడుగుజీవుల అంగలారిన బతుకు చిత్రాలను కవిత్వీకరించడానికి చలించే మనసు, జ్వలించే నైజం అవసరం. అలాంటి కదలిక కలిగిన తెలుగు తల్లి ముద్దుబిడ్డల్లో ఈయన ఒకరు.

సమాజపోకడలకు హద్దుల్లేవు. ప్రపంచీకరణలో దేశం కృత్రిమ వేషాలతో కొత్త కొత్త అభినయాలతో దూసుకుపోతుంది. అవినీతిలో కూరుకుపోయింది. గతి

తప్పిన సంఘాన్ని సంస్కరించడం కోసం కలాన్ని ఖడ్గంలా ఝుళిపిస్తున్న సమర సైనికుడీయన.

"ఒకప్పుడు ఎదురుపడితే చాలు
పరవశంతో మెరిసిపోయే ముఖం

నేడు విద్వేషాల లోగిళ్ళకు ఆలవాలమవ్వడం
సమకాలీన సందర్భమో
అసంకల్పిత ప్రతీకారమో
మన మధ్య చరిత్ర
ఓ మైలు రాయి పాతేసింది!
గొంతు తడిసింది
కడుపు నిండిందా?
ఆకులు ఖాళీగానే మిగిలిపోయాయి
ఆశలు ఆశలుగానే మిగిలిపోవాల్సిందేనా?"

నవమాసాలు మోసి పేగు తెంచి జన్మనిచ్చిన అమ్మ బాధ్యతలు భుజాన వేసుకొని కుటుంబ పోషణలో గొడ్డుచాకిరికి బానిసైన నాన్న. తల్లిదండ్రుల ప్రేమలో పెరగిన బాల్యం, తెలిసీ తెలియని ప్రాయంలోనే కన్న కలలు కలలుగానే మిగిలిపోతున్నాయి. జీవితం ఊహల జ్ఞాపకాలను నెమరు వేసుకొంటూ తల్లిదండ్రులకు దూరంగా బతికే మనసున్న కొడుకు పడే ఆవేదన, తపన, ఆరాటం, ప్రేమ కవితా వస్తువులై పాఠకుల మనసు ద్రవింపజేస్తాయి.

"జీవిత మంతా గడిపిన గుర్తుల్నేవో వెతుక్కొంటూ
ఊళ్ళోనే వుంటానంటూ అమ్మా, నాన్న...
కొత్త జీవితాన్నేదో కోరుకొంటూ
బాల్య జ్ఞాపకాల్నంటినీ తొక్కుకొంటూ
నగరంలోనే నేను...
తరాల మధ్య అంతరమేదో అనివార్యమౌతోంది
కుటుంబమంతా కలిసుండాలనేది
ఓ కలగానే మిగిలిపోతోంది'

'తాను ఉద్యోగ బాధ్యతల్లో మునిగి తేలుతూ వయసుడిగిపోతున్న అమ్మకు దగ్గరుండి సేవచేయలేక పోతున్నాననే బాధ. ఒకప్పుడు కొంగు పట్టుకొని వేలాడిన చిట్టి చేతులే! నేడు ఆరితేరి నగరంలో యాంత్రిక జీవనం గడుపుతున్న కొడుకు పగటిపూట అమ్మను పలకరించడానికి కూడా వీలులేని పరిస్థితి. పొద్దు పోయాక అమ్మను చూడాలంటే భయం. అమ్మను చూడగానే మాట మౌనమైపోతుంది. ఒకప్పుడు చెప్పుకున్న మాటలు ఈటెల్లా గుండెల్లో గుచ్చుకుంటుంటే ఆ కన్న బిడ్డపడే హృదయ వేదనను రచయిత డా॥ దార్ల వేంకటేశ్వరరావు అద్భుతంగా వర్ణిస్తారు. తరాల మధ్య అంతరమేదో సుదూరాలకు కదిలిపోతూ, బాల్యాన్ని వెక్కిరిస్తూ, అంతరాలు అనివార్య మవుతున్నాయని వాపోతారు.

"ఇవేనా ఒకప్పుడు అమ్మను వదిలి ఉండలేనని
మారాం చేసిన చిట్టి పొట్టి చేతులు?
ఇవేనా ఒకప్పుడు పెద్దయ్యాక అమ్మను కార్లో
ఊళ్ళన్నీ తిప్పుతాననీ ఆశపెట్టిన పాదాలు?
ఇవేనా ఒకప్పుడు ఊయల్లో ఊపుతాననీ
ఉద్యోగం చేసి కష్టాలన్నీ తీర్చేస్తాననీ
పువ్వుల్తో దేవతలా పూజిస్తాననీ...
తీయని కబుర్లెన్నో చెప్పిన తేనెలు కురిపించిన పెదవులు?"

అనాథ అంధబిక్షువు గొంతులో పుట్టే పాట. తడియారని గుండెలకు కష్టాల్ని, కరుణ రసాన్ని, తత్త్వాలను కలగలిపి వినిపించే ఆకలిపాట. రైలు బండిలో ఎన్ని హృదయాలను కదిలిస్తుందో! ఎన్ని చితికిన మనసులకు ఓదార్పు పంచుతుందో! జీవన పోరాటం చేస్తూ పయనించే వారికి సేదతీర్చేది ఓ సుమధుర స్వరగాత్రం ఆ పాట.

"ప్రతీ సాయంత్రం
సంధ్య కిరణాల్ని చూడలేకపోయినా
ఆ అంధబిక్షుకగొంతునుండి రాలిపడ్డ
ఆ పాటేదో పూడ్చలేని నా వెలితిని మాత్రం తీర్చేది"

ఆ గాయపడిన పాట ఆగిపోయింది. అభిమానులకు ఏకాంతాన్ని, ఎదురు చూపుల్ని బహుమానంగా వదిలి నీలిమేఘాల్లో కలిసిపోయింది. ఇప్పుడు పాటలేదు. ఆలపించే గాత్రం లేదు. దిగులు పిట్టల్లా ఎదురుచూసే మంచి మనసులకు ఎక్కడో తెలియని బాధ, వెలితీ మనసులను దహించి వేస్తుంది.

"ఆ గాయకుడ్ని కోల్పోయాక
ఆ పాట విలువ తెలిసింది
ఆ పాడిన మనిషి విలువ తెలిసింది
ఇప్పుడు ఆ వెళ్ళే రైల్లో పాట కోల్పోయిన అనాథలెందరో!"

ఇలాంటి కవితలు ఎన్నో డా॥ దార్ల వెంకటేశ్వరరావు కవిత్వంలో ఆణిముత్యాల్లా మనకు దర్శనమిస్తాయి. నగ్నసత్యాలను కవిత్వీకరించాలనే తపన కలిగిన వాడు ఈయన. ఇంకా మానవసంబంధాలు, ఆదర్శభావాలు, అభ్యుదయవాదాలు నాన్న స్పర్శలా జగ జాగృతికి విజయ సోపానాలుగా కనిపిస్తాయి. పదాలతో పలకరిస్తూ, మాటల తూటాలతో కవితల గొంతులు విప్పుతూ బహుజనులను మేల్కొల్పడానికి మార్గదర్శకాలై ఆలోచింప జేస్తాయి. అణగారిన అంటరాని పునాదుల్ని కూల్చి ప్రగతికి బీజాలు వేస్తాయి. "రాబోయే కాలం మనదే" అనే నమ్మకాన్ని కలిగిస్తాయి. ఆశయసాధనలో అడుగులు రాజ్యాధికారం దిశగా పయనిస్తే అంతిమ విజయం మనదే అనే భరోసా కలగజేస్తాయి.

❖ ❖ ❖

దళిత కవిత్వానికి తాత్త్విక అన్వయం

– ఇ.వెంకటేష్

దళిత కవిత్వాన్ని కేవలం అనుభవాల, ఆత్మ న్యూనతా భావాల వ్యక్తీకరణగా కుదించే ప్రయత్నం చేసిన అగ్రకుల ఆధిపత్య సాహితీవేత్తల కుహనత్వాన్నీ, కుటిలత్వాన్నీ ప్రశ్నించి, ఆర్థిక నియతి వాద అసమగ్రతని బద్దలు కొట్టి తెలుగు సాహిత్యాన్ని ఒక కుదుపు కుదుపింది దళిత కవిత్వం, యావత్తు దళితసాహిత్యం! దళితుల ఆశలకీ, ఆకాంక్షలకీ, ఆవేదనలకీ, ఆక్రోశానికీ, ఆగ్రహానికీ, ఆత్మ గౌరవానికీ ప్రతిరూపంగా నిలిచిన దళితకవిత్వం కొత్త చూపుతో, కొత్త వ్యక్తీకరణతో బలంగా వస్తోంది. ఈ కోవలోనే వచ్చి దళిత సాహిత్యంలో కనిపించే బలమైన తాత్విక భూమికను విశదీకరించే కవితల సంపుటి "దళిత తాత్త్వికుడు"

డా॥ దార్ల వెంకటేశ్వర రావు ఈ కవితలన్నీ అప్పుడప్పుడూ రాసినా, దళిత తాత్త్విక భూమికను ఒకేచోట చూపడంలో ఏకసూత్రత కనిపిస్తుంది. వస్తువు రీత్యా మాత్రమే కాకుండా, అభివ్యక్తిలోనూ ఈ కవితలు కొత్త పంథాను తొక్కాయి. మామూలు మాటలుగా కనిపిస్తూనే మనసునీ, మనిషినీ కుదిపేసే నిర్మాణం ఈ కవితాభి వ్యక్తిలో ఉంది. మన సమాజ పరిణామక్రమంలో దళితుడు తనకుండే ఆత్మన్యూనతా భావాన్ని విడనాడి ఆత్మగౌరవ పోరాటానికి నడిపే కవితలకు ప్రతీకలుగా వీటిని అభివర్ణించవచ్చు. '*బడిలో అమ్మ ఒడి"లో* కవితలో కవి దళితుల ఆత్మగౌరవాన్ని కవిత్వీకరించాడు...

"ఈ కులంలో పుట్టక పోతే
నేను ఇంకోలా ఆలోచించే వాణ్ణేమో
ఈ కులంలో పుట్టడమే మంచిదైంది
అవమానమంటే అర్థమైంది
అందర్ని ప్రేమించిడం తెలిసింది"

అంటాడు కవి. ఈ కవిత కథనాత్మక శైలిలో, దీర్ఘ కవితా లక్షణాలతో కొనసాగింది. చిన్న నాటి నుండే అందరిలా చదువుకోవాలని దళితులకూ ఉన్నా, తప్పనిసరిగా పశువుల్ని మేపడానికో, కూలి పని చేయడానికో వెళ్ళవలసి వస్తుంది. కేవలం పేదరికం వల్ల మాత్రమే కాదు... గ్రామపెత్తం దారీతనం పెట్టేభయం వల్ల కూడా అలా వెళ్ళవలసిన దయనీయ స్థితిని ఈ కవితలో వర్ణించాడు కవి.

ప్రాచీన సాహిత్యం నేటికీ పాఠశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో తప్పనిసరి బోధనాంశమవుతోంది. నిజానికి ఆ సాహిత్యం అత్యధిక భాగం కొన్ని వర్ణాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రాసిందే. కానీ, ఆ ప్రాచీన సాహిత్యంలోనే శాశ్వత విలువలున్నాయనే అనేక మంది వితండ వాదనల వల్ల యావత్తు ఆ సాహిత్యం పట్లనే చాలా మందికి వ్యతిరేకత కలుగుతుంది. దీన్ని కవి కవిత్వీకరించాడు.

"ప్రాచీన సాహిత్యం పాఠమైనప్పుడల్లా
నా ముఖ కవళికలన్నీ మారిపోయేవి
మూకుమ్మడిగా కళ్ళన్నీ నాపైన ఫోకస్
ఎన్ని సార్లు చంపుతావంటూ
దేవుణ్ణి కాలర్ పట్టుకోవాలనిపించేది"

అనడంలో దళితుల మానసిక సంఘర్షణను కవి బలంగా అభివ్యక్తీకరించ గలిగాడు. ఈ మధ్య కాలంలో ప్రాచీన సాహిత్యాన్ని పాఠ్యాంశాలుగా బోధించడం చాలా ఇబ్బందిగా ఉందంటూ చాలా దుమారమే చెలరేగింది. ఉభయ పక్షాల వాళ్ళూ పరస్పర వాదోపవాదాలు చేసుకున్నారు.కవిని తన పల్లె తాలూకు గతం వెంటాడుతోంది. పురుగుల్ని, పాముల్ని లెక్క చేయకుండా, గాయాల చేతులతో పొద్దున్నే కారం పచ్చడి నూరుతున్న అమ్మ గుర్తొచ్చి 'మా ఊరు నవ్వింది' కవితలో చక్కగా చిత్రీకరించాడు.

'మనం సదూకోకుడదంటే ఇన్వేందిరా'
భయ పెట్టే గ్రామ పెత్తందారీతనం
మా యమ్మా బాబుల గొంతుల్లో ఆవేదన జీరకు
సజీవ సాక్ష్యాలుగా నాకు కనిపించే
మా ఊరి పాఠశాల, పశుపాకలు'

అని నాటి బాల్య స్మృతులను గుర్తుచేసుకుంటున్నాడు. దళిత తాత్త్వికతని, దళిత సౌందర్యాన్ని 'పుట్టు మచ్చ మీద ప్రేమ' అనే కవితలో...

'పుట్టుమచ్చ ఒకడికి అందమైన అలంకారంగాను
మారుతుంది
నాకున్న పుట్టుమచ్చలో
నా ఎదుటి వాళ్ళకేమి దర్శనమవుతుందో కానీ
నా వెన్నుపూసై నిలిచిన సౌందర్య రమణీ
నా పుట్టుమచ్చా
నిన్ను నేను ప్రేమిస్తున్నాను"

అని అనడంలో కులం వల్ల వచ్చిన హీనత్వంతో పాటు, తన కులమే తనకు రక్షణ కవచంగా కూడా నిలిచే ఒక విచిత్ర పరిస్థితిని దీనిలో వర్ణించాడు కవి. కులం పోవాలనుకుంటూనే, మళ్ళీ ఆ కులం వల్లే భద్రత పొందడంలో ఒక ద్వైదీభావం కనిపిస్తుంది. రిజర్వేషన్స్ లేకపోతే కనీసం తమకి రావాల్సిన వాటిని అందుకోలేని స్థితినీ, రాజ్యాంగ పరంగా దళితులు కావడం వల్లే ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం వంటి వాటి వల్ల కనీస ఉపశమన భావాన్ని చక్కని లోతైన ప్రతీకలతో అక్షరీకరిస్తున్నాడు కవి. దళితుల సహనశీలతను, ప్రేమించే తత్త్వాన్ని ఆధిపత్య అగ్రవర్ణాల వాళ్ళు ఎంత ద్వేషించినా, వేధించినా దళితులెంతగానో ప్రేమించే తత్త్వాన్నే కలిగి ఉంటారని దళిత తాత్త్వికుడు కవితలో రచయిత కవిత్వీకరించాడు.

'ఇప్పటికైనా
నువ్వెప్పుడైనా
అమ్మ తినిపించే గోరుముద్దల రుచిని చూడు

మిట్ట మధ్యాహ్నం చెట్టు నీడకెళ్లి చూడు
నీకూ ప్రేమించడమే తెలుస్తుంది'

అంటూ ప్రేమించే తత్త్వాన్ని నేర్చుకోవాలని ఈ కవిత ద్వారా శక్తిమంతంగా తెలియజేస్తున్నాడు. పత్రికలు ఆధిపత్య వర్గాల, వర్ణాల వారి చేతుల్లో ఉన్నప్పుడు, వారి వ్యాపార ప్రయోజనాల్ని దృష్టిలో పెట్టుకోవాలి తప్ప. దళిత సాహిత్యం రావట్లేదనడం సరికాదు. పత్రికల స్వభావాన్నిబట్టి పత్రికల్లో సాహిత్యం వస్తుంది. కానీ, వ్యక్తిగతంగా దళితసాహిత్యం బాగానే వస్తుంది. దళిత సమస్యలున్నంత వరకు దళితసాహిత్యం రాకుండా ఎలా ఉంటుంది? అందుకనే దళిత తాత్త్విక దృక్పథంలో వస్తున్న తీరుతెన్నులు గమనించేందుకు ఈ కవితాసంపుటిని చదవాల్సిందే. అప్పుడే దళిత సాహిత్య తత్త్వం పతాక స్థాయిని అర్థం చేసుకోగలుగుతారు.

– (సూర్య సాహిత్యానుబంధం)

❖ ❖ ❖

జీవిత సంఘర్షణ

– వేల్పూరి కామేశ్వరరావు

దార్ల గారు తన కవిత్వ పుస్తకానికి నా అభిప్రాయం రాయమంటే మొదట ఆశ్చర్యం వేసింది. "నేనేమిటి పుస్తకానికి నా మాట రాయడమేమిటని". అది నా పని కాదు. నేను రచయితను కాదు. ఏదో నా తలకాయి బద్దలవుతున్నపుడు, నిద్రలేకుండా చేస్తున్నపుడు రాసిన వ్యాసాలు, కవితలు కలిపి "జిజ్ఞాస తరంగాలు" రెండవ ముద్రణ తీసుకువస్తున్నపుడు నా పుస్తకానికి ముందు మాట రాయాలని దార్లగారికి విజ్ఞప్తి చేశాను. అప్పుడు నా "జిజ్ఞాస తరంగాలు – పీడిత వర్గచైతన్య కిరణాలు" అని ముందుమాట వ్రాసి ప్రోత్సహించారు. రుంజ విశ్వకర్మ రచయితల కళాకారుల వేదిక ఆధ్వర్యంలో కీర్తి శేషులు సాహిత్య బ్రహ్మ వి.వి.ఎల్. నరసింహారావు గారు నా "జిజ్ఞాస తరంగాలు" పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆ ఆవిష్కరణ సభలో దార్ల గారు వచ్చి ప్రసంగించారు. ఆ సభలో ప్రముఖ విప్లవకవి నగ్నముని గారు ఉపన్యసించారు. ఆ పరిచయం అనేక సామాజిక, రాజకీయాలపై సాహిత్య విషయాలపై చర్చలు చేయడం తప్ప నేను రచయితను కాదు.

నా కార్యక్షేత్రం కార్మికోద్యోమం. ఆ క్రమంలో "రైల్ శక్తి" మాసపత్రిక ఎడిటర్ బాధ్యత తప్ప రచనలపై అభిప్రాయం చెప్పే సాహసం చేయడం సరి అయినది కాదు అని నా అభిప్రాయం. అయినా సాహిత్యం పై అభిలాషతో చదువుతుంటాను. నేను వీరి రచనలు చదవడం జరిగింది. సాహిత్యానికి నేను కూడా ఒక వస్తువును మాత్రమే. సాహిత్యకారులు, కష్టజీవుల వేదనలు, వారి పోరాటాలు వారి సంఘర్షణలు గురించి, సరి అయిన దృక్పథంతో రాయకపోవడం వలన కొంతమంది కష్ట జీవులు బాధితులు వాళ్ల జీవితాలు గురించి వారే

రాసుకోవడం జరుగుతున్నది. అవి మహా రచనలుగా మారిన పరిస్థితి కూడా చూడగలం. కొంతమంది రచయితలు కూడా మీ జీవితాలు గురించి మీరే రాయండని సలహాలు కూడ ఇస్తున్నారు. దార్ల గారు కష్టజీవుల కోసం, వారి వేదనలు, వారి పోరాటాలు, వారి సంఘర్షణలు గురించి నిరంతరం తన ఆరోగ్యాన్ని కూడా చూసుకోకుండా నిబద్ధతతో బాధ్యతగా స్వీకరించి చేస్తున్న రచయిత. వారికి మా కృతజ్ఞతలు. చాల మంది రాస్తుంటారు. కాని కష్టజీవుల గురించి, అణగతొక్క బడిన కులాల, ప్రజల జీవితాల గురించి, వారి బాధలను గురించి, వారి ఆపుకోలేని కన్నీళ్ల గురించి, వారి ఆవేదనలను గురించి, వారి పోరాటాల గురించి, వారి విజయాల గురించి చాలా తక్కువ మంది రాస్తున్నారు. వారే కార్మిక వర్గ దృక్పథంలో కవులు, రచయితలూ. మిగతా ప్రచురించబడిన రచనలన్నీ టాయిలెట్ పేపర్లు. చలి కాచుకోవడానికి ఉపయోగ పడే చెత్త కాగితాలు. మహా కవి శ్రీ శ్రీ గారే చెప్పినట్లు... “కవిత్వానికి బాధే పర్యాయపదం”; “కష్టజీవికి అటు ఇటు ఉండేవాడే కవి” ఆ విధంగా రాస్తున్న వారే కవులు... రచయితలూ. అదే సాహిత్యం. మహాకవి శ్రీ శ్రీ గారే తను రాసిన కొన్ని రచనలు గురించి బాధ పడ్డారు. ఎలాంటి పరిస్థితులలో రాయవలసి వచ్చిందో వారి ఆత్మ విమర్శ యాదాటి కాశీపతి రాసిన “మధ్యతరగతి మందుహాసం”లో తెలియ చేశారు. దార్ల గారు కవి. వారు కష్టజీవికి అటు ఇటు ఉండి వారి ఆపుకోలేని కన్నీళ్ల గురించి, వారి ఆవేదనలను గురించి, వారి పోరాటాల గురించి, వారి విజయాల గురించి రాస్తున్నారు. అందుకే వారు గొప్ప రచయిత. వారి రచనలు చిరకాలం ఉండే రచనలు. ఈ కవితలు, వీరి రచనలు చదువుతుంటే జీవనం, జీవితం, వేదన, సంఘర్షణ మార్పుకోసం పడిన తపన కనిపిస్తుంది. ఈ పుస్తకంలో ప్రచురించబడుతున్న కవితలలో కూడా అదే స్పష్టంగా కనిపిస్తుంది.

“సమాధులలో పూడ్చబడిన
లక్షలాది దళిత వీరులతో
మాట్లాడటమంటే నాకిష్టం”

అంటున్నారు “సమాధులు” అన్న కవితలో. ఈ వాక్యం ఎవరు వ్రాయ గలరు? వర్గ దృక్పథంతో వ్రాస్తున్న సాహిత్య కారులు ఇలాంటి వాక్యాలు రాయిగలరా, రాయలేరు. జీవితంలో ఆ ఆవేదనను అనుభవించిన దళిత కవులే వ్రాయగలరు. అంతేకాదు దళితులను దళితులనే అనకుండా “దళిత వీరులు, లక్షలాది దళిత

వీరులతో మాట్లాడటం" అని వ్రాయడమంటే, దళితులు మార్పుకోసం ఎంత సంఘర్షించారో ఎంత బాధపడ్డారో, రోదించారో వారికి తెలుసు అందుకనే అలా వ్రాయగలిగారు. ఇంకా "బడిలో అమ్మ ఒడిలో..." అనే కవితలో "ఈ కులంలో పుట్టటమే మంచిదయిందని" నిర్ణయించుకుంటాడు

"ఈ కులంలో పుట్టకపోతే
మనుషుల్ని ప్రేమించలేక పోయే వాణ్ణేమో!
ఈ కులంలో పుట్టకపోతే
నేనూ ఇంకొకలా ఆలోచించే వాణ్ణేమో
ఈ కులంలో పుట్టటమే మంచిదయ్యింది
అవమానమంటే అర్థమయింది
అందర్నీ ప్రేమించడమూ తెలిసింది!
అందర్నీ ఆలోచింపచేస్తుంది"

అన్ని కులాల్ని ప్రశ్నిస్తుంది. దళిత కులంలో పుడితేనే అందర్నీ ప్రేమించడం తెలిసింది. నిజమే అగ్రకులాల్లో పుడితే ప్రేమ తెలియదు. ఆధిపత్యం, అహంకారమే తెలుస్తుంది. వారికి ప్రేమ కూడా ఆధిపత్యంలో, అహంకారంలో అంతర్భాగం అవుతుంది. ప్రేమకు – ఆధిపత్యానికి, అహంకారానికి అసలు పడదు. ప్రేమంటే ఏమిటో తెలియాలంటే దళిత కులంలో పుట్టటమే సరి అయినది అనిపిస్తుంది.

కాని ఇంకా తీవ్రంగా ఆలోచిస్తే, అభివృద్ధి చెందిన దళిత కులాల మనుషులలో ప్రేమ ఉంటుందా అంటే ఉండదు. ఇది కూడ ఒక సత్యం. డబ్బు ప్రేమకు దూరంగా ఉంచుతుంది. ప్రేమను చంపుతుంది. నాకు తెలిసిన దళితులే ఎంతో మంది తల్లి దండ్రులను చూడని వారున్నారు. తండ్రి చనిపోయినా రాని దళితులను కూడ చూశాను. అంటే ఇక్కడ దళిత కులాల్లో పుడితే ప్రేమంటే తెలుస్తుంది. కాని అది డబ్బు వచ్చిన తర్వాత అది నిలబడదు అని తెలుస్తుంది. ఇక్కడ వర్గ దృక్పథం అవసరం. వ్యక్తిగత ఆస్తి లేని స్పృహ అవసరం. ఆ స్పృహ లేకపోతే ప్రేమంటే ఏమిటో తెలిసినా, అగ్రకులాల్లో ఉండే ఆధిపత్య, అహంకారాలతో పతనం చెంది, ప్రేమ చచ్చిపోతుంది. ఏమైనా ఈ వాక్యం వెంటాడుతూనే వుంది.

ఇంకా... "ఇప్పుడు కావాల్సింది" అనే కవితలో...

"ఇప్పుడు కావాల్సింది
ఒంటి చేత్తో చప్పట్లు కాదు
కరచాలనం చేస్తూనే

విరిచేనొసట విరుపులుకాదు
మేధో కార్ఖానాలు మార్మోగాలి"

కరచాలనం చేస్తూనే, విరిచే నొసట విరుపులుకాదు. దళిత కవులకు, వెనకబడిన కులాల రచయితలకు, సామాజిక మార్పుకు కృషి చేస్తున్న కార్యకర్తలకు, నాయకులకు, వారు రాసిన "ప్రతి ఒక్కరికి కరచాలనం చేస్తూనే, విరిచే నొసట విరుపులు కాదు" అని అనుభవం అయి ఉంటుంది... ఇక్కడే నాకు గుర్రం జాషువా రాసిన పద్యం జ్ఞాపకం వస్తుంది.

"నా కవితా వధూటి వదనంబు నెగాదిగ జూచి రూపు రే
ఖా కమనీయ వైఖరులు గాంచి భళీ భళీ యన్నవారే, మీ
దే కులమన్న ప్రశ్న వెలయించి, చివాలున లేచిపోవుచో
బాకున గ్రుమ్మినట్లగున్ పార్థివ చంద్ర! వచింప సిగ్గగున్!"

ఎంత ఆవేదనతో జాషువా గారు రాశారో, అదే కనిపించింది ఆ కవితలో. కవులు కాబట్టి వ్యక్తీకరించారు. కాని కార్యకర్తలు నాయకులు ఎంత సంఘర్షణ పడతారో అనుభవించిన వారికే తెలుస్తుంది. వారు రాయలేక పోవచ్చు. కాని ఆవేదన వారికే తెలుసు. అందుకే "మేధో కార్ఖానాలు మార్మోగాలి" అంటారు. ఒక direction గా సూచిస్తారు. అవును! మేధో కార్ఖానాలు మార్మోగినపుడే కరచాలనం చేస్తూ విరిచే నొసటి విరుపులు తగ్గి నూతన మానవుడి సృష్టికి ఈ దేశంలో విత్తనాలు వస్తాయి. సమ సమాజం కోసం విత్తనాలు వస్తాయి. ఇంకా దళిత మేధావులు ఆత్మావలోకనం చేసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయని "కూలుతున్న లైబ్రరీ" అనే కవితలో చెప్పారు...

"గ్రంథాలయంలోనే చనిపోయి
మళ్ళీ గ్రంథాలయంలో
ఓ పుస్తకమై

పుట్టాలనే కోరిక
పుట్టుకతోనే చచ్చిపోవాల్సిందేనేమో
తొందరగా ఏదో ఒక్కటి చేయాలి"

అందరం పుస్తకం మంచి స్నేహితుడు అంటాం. మంచి పుస్తకాల్ని ప్రేమించండి అంటాం. కందుకూరి వీరేశలింగం చినిగిన చొక్కానైనా తొడుక్కో మంచి పుస్తకం కొనుక్కో అంటారు. కాని దార్ల గారు...గ్రంథాలయంలోనే చచ్చిపోయి మళ్ళీ గ్రంథాలయం లోనే ఓ పుస్తకమై పుట్టాలనే కోరిక వ్యక్తం చేశారు. పుస్తకం అంటే ప్రేమ మాత్రమే కాదు. అనిర్వచనీయమైన ప్రేమ వల్ల తానే ఒక పుస్తకమై పుట్టాలంటున్నారు. ఈ భావ వ్యక్తీకరణ సామాన్యులకు అసాధ్యం. ఇది దార్ల గారికి సాధ్యమయింది. వారికి నా నమస్సులు.

ఇలా రాస్తూ పోతూ ఉంటే అంతులేని వ్యక్తీకరణలు రాయాలి. ప్రతి కవితలో జీవనం, జీవితం, ఆవేదన, సంఘర్షణ, తపన కనిపిస్తాయి. మన మెదడుకు పదునుపెడతాయి. హృదయాలను కదిలిస్తాయి. కవితల్లో మార్గ నిర్దేశం కనిపిస్తుంది. వారి సాహిత్యానికి నేను అభిప్రాయం వ్రాయడం అంటే ఒక సాహసమే. అయినా చేసాను. కారల్ మార్క్స్ కార్మికులు రాజ్యాధికారం చేపట్టాలి అన్నారు. ఆ స్ఫూర్తి నాలో ఉండటం రాజ్యాధికారం చేపట్టాలనే నా కార్మిక వర్గం దృక్పథంలో భాగంగా నేను కూడా పుస్తకంపై అభిప్రాయం చెప్పలేనా అని కష్ట సాధ్యమైనా ఒక ప్రయత్నం చేశాను.

ముందుగానే చెప్పినట్లు నేను సాహిత్యకారుణ్ణి కాను. నా కార్యక్షేత్రం కార్మికోద్యమం. దార్ల గారి పుస్తకం చదివిన తర్వాత నాకున్న సాహిత్య అవగాహన పరిమితులల్లో (రచయిత నా కార్య కార్యక్షేత్రం కాదు కాబట్టి) అభిప్రాయం రాయడానికి ప్రయత్నించాను. వీరి పుస్తకం... ఒక ఆవేదన, జీవిత సంఘర్షణ, ఒక ఆలోచన ఒక అవగాహన, ఒక ఆవేదన, ఒక direction . మార్పు కోసం పడే తపన, మార్పు కోరే ప్రతిఒక్కరు చదవాల్సిన పుస్తకం.

❖ ❖ ❖

నిశ్శబ్దపు ప్రవాహాల ప్రభంజనం

- డా॥ మల్లెగోడ గంగాప్రసాద్

ఈ మాటలు నేను అనుభవించి పలవరిస్తున్న దార్ల గారి కవిత్వపు కన్నీటి అత్తర్లు, నెత్తుటి పరిమళాలు. ఈ నెమలి కన్నుల పేజీలను స్పర్శించే ముందు తెలుసుకునే అంశాలు చాలా ఉన్నాయి. మీరు అనుకున్నట్లు ఇది దార్ల వెంకటేశ్వర రావు గారి అకడెమిక్ గ్రంథం కాదు. ఇందులో మీకు యాంత్రిక పరమైన విషయాల వివరణలు, సమాచార సేకరణకు తోడ్పడే పేజీల సంఖ్యలు, ఆకర గ్రంథాల లిస్టులకు పనికొచ్చే వివరాలేమి లేవు. అవే కావాలనుకుంటే దార్లగారు విరివిగా రాసే విమర్శక ప్రక్రియను దర్శించవచ్చు ఆయన ప్రతి రోజూ ఎప్పటికప్పుడు నిత్య నూతనంగా సమాచారాన్ని, విలువైన సాహిత్యపు విషయాలను అందించే ఇంటర్‌నెట్ బ్లాగునుసందర్శించవచ్చు.అంతేకానీవాటికోసమైతే ఈపుస్తకాన్ని తెరవకండి. దార్లగారి హృదయానికి, కంటికి కనిపించకుండ గుచ్చుకున్న గాజుపెంకుల శకలాలు స్పర్శించాలని ఉంటే ఈ పుస్తకం తెరవండి. దార్లగారి కాలిలో నడవడానికి వీలులేకుండ లోతుగా దిగిన ముళ్లను, వాటిని తీయడానికి పడ్డ నానా అవస్థల వ్యవస్థలను తడిమి చూడాలనుకుంటే ఈ పుస్తకం తెరవండి.దార్ల వెంకటేశ్వరరావుగారు నాకు పాఠాలు బోధించిన గురువు. నేను వారిని ఎనిమిదేళ్ళు గా చూస్తున్నాను. నిత్య నూతనంగా పాఠాలు చెప్పాడానికి, విద్యార్థులలో ప్రతిభను సానబెట్టడానికి కొత్త ప్రయోగాలు చేసి సఫలీ కృతుడైనారు. భావితరాలకు ఆదర్శ ప్రాయంగా నిలిచారు, ఇంకా నిలుస్తూనే ఉంటారు. వీరికి తెలుగు సాహిత్యాన్ని టెక్నాలజీ ఉపయోగించి బోధించటమూ తెలుసు, బోర్డు మీద రాస్తూ అలవోకగా

విషయాన్ని అన్వయం చేసే పద్ధతీ తెలుసు. ప్రతి వారం పత్రికలలోనో, సభలమీదనో, ఇంటర్‌నెట్‌లోనో తెలుగు సాహిత్య స్రవంతిని తనదైన బాణిలో విశ్లేషించడమూ తెలుసు. ఇన్ని తెలిసిన వీరికి కవిత్వం తెలియదనుకోవటం పొరపాటవుతుంది. కవిత్వం తెలియడం వేరు, కవిత్వం సృజించడం వేరు. కవిత్వం యాంత్రికంగా రాయాలని తలపిస్తే అది యంత్రాలు చేసే శబ్దంలాగనే ధ్వనిస్తుంది. అదే కవిత్వాన్ని గుండె గాయాలతోనో, ఆలోచనల స్వేచ్ఛారేవాలతోనో అలవోకగా రాస్తే అది హృదయ మృదంగ ధ్వనిలా లయాత్మకం అవుతుంది. దార్లగారు కవిత్వాన్ని సృజించటంలో గుండెకే ప్రాధాన్యమిచ్చారు.

'తనకీ, ప్రపంచానికి సామరస్యం కుదిరిందాకా కవి చేసే అంతర్, బహిర్ యుద్ధారావమే కవిత్వమంటాడు చెలం'(యోగ్యతా పత్రం). ఈ కోణంలో ఈ పుస్తకాన్ని తెరచి చూస్తే మనకి దార్లగారి అక్షరాలలో ఉన్న తడి మన కంటిలోకి కనిపిస్తుంటుంది. కేవలం ఏదో వ్యాసం చదివినట్లు లేదా పత్రికల పేజీలు తిరగేసినట్లు ఈ పుస్తకాన్ని చదవాలనుకుంటే మనకేమి అర్థం కాదు. పుస్తకంలోని కవిత్వాన్ని, కవిత్వంలోని ప్రతి వాక్యాన్ని, వాక్యంలోని ప్రతి పదాన్ని, పదంలోని ప్రతి అక్షరాన్ని, అక్షరంలోని ప్రతి శబ్దాన్ని గుండెకు హత్తుకున్నపుడే అందులోని తడి తెలుస్తుంది. ఒక దళిత పుట్టుక వెనుక ఉన్న సంఘర్షణ, ఒక దళిత చదువు వెనక తగిలిన రాళ్ల వాన, ఒక విజయం వెనక దాగిన పోరాటం, ఒక మచ్చ వెనక దాగున్న దెబ్బ ఇంకా ఎన్నో ఎన్నెన్నో సుడిగుండాల ఆనవాళ్ళు కనిపిస్తాయి. కనిపించి ఊరకనే ఉంటాయి అనుకునేరు. అవి మనకు తెలీకుండానే నిశ్శబ్దపు నిట్టూర్పుల భీకర ధ్వనిలో మునకలేస్తాయి. మనకు తెలీకుండానే మన కన్నీటి బిందువులు అక్షరాలను ఆలింగనం చేసుకుంటాయి. మనకు తెలీకుండానే మన ఆలోచనలు భీకర సంద్రలో అల్లల్లాడిపోతుంటాయి.

ఇందులో ప్రతి కవిత దార్లగారి జీవిత ప్రయాణంలో ఒక శకలంలా కనిపిస్తుంది. ప్రతి వాక్యం దార్లగారి గుండె కోతలోంచి పురుడుపోసుకున్న రక్తాక్షరిలా అగుపిస్తుంది. ఈ కులంలో పుట్టకపోతే నేను ఇంకోలా ఆలోచించేవాణే?మో అంటూ అవమానమంటే అర్థమైందని, ప్రేమించడం తెలిసిందని తెలిపిన వైనం అక్షరాల నిజం. గుర్రం జాషువా పాటించిన యుద్ధపుటడుగుల హుంకారం ప్రతిధ్వనింప

చేసారు. ఒక్క గుర్రం జాషువానే కాదు ప్రతి దళితుని జీవిత సంఘర్షణ ఇలాగే ఉంటుంది. అసలు దార్లగారు 'ఇంకెన్ని కన్నీళ్ళను గుండెల్లో దాచుకున్నారో, గుచ్చి గుచ్చి అడిగితే తప్ప, చెప్పరెప్పుడు' (బడిలో అమ్మ ఒడిలో), 'గాయాల చేతుల్తోనే కవిత్వపు పచ్చడి నూరుతూ కళ్ళకు కనిపించకుండా వారు పడిన బాధంతా గుర్తు చేసుకుంటే నిజంగా అన్నం తినడం అమాంతంగా ఆపేస్తాము, నిస్సయాతగా మనలోకి మనమే ఉండ గట్టుకు పోతుంటాం.

ఈ కవితల్లో దార్లగారు ఒక నిరుద్యోగిలా దర్శనమిస్తాడు. క్యాజువల్ అనౌన్సర్‌గా పార్ట్ టైం జాబ్ చేసిన వీరు *క్యాజువల్ లైఫ్...*

ఆకాశవాణి నా ఆశాగానంలో
చైతన్య ప్రబోధమో
శృంగారాన్నొలక బోసే యుగళ గీతమో
నిరాశను గొంతులోనే దాచుకుంటూ
క్యూ చేసెయ్యాలి

అంటూ జీవిత సంఘర్షణను వెలిబుచ్చారు. ఈ పుస్తకంలో నిస్సయాతగా ఉన్న దార్ల కనిపిస్తారు.

' ఆ క్షణంలో ఎందుకలా విలవిల్లాడిపోయాను
ఏదో కోల్పోయిన వెలితి
నిండిపోతున్న ఒంటరి తనం
బరువెక్కిపోతున్న హృదయం
భవిష్యత్తు ముందే తెలియడమెంత నరకం

అంటూ అమావాస్యకు దగ్గరవుతున్న చంద్రుని జీవితం తలపించేలా విలపిస్తాడు.

ఈ కవితా సంకలనంలో విద్యార్థి దశనుండి ఆచార్య స్థాయికి ఎదిగిన దార్లగారు అగుపడతారు.

'కలగా ఉంది
కళగా ఉంది...

పాఠాలు విన్న విద్యార్థి స్థానం మారినా
ఆ' స్థానం మారని నిత్య విద్యార్థినవుతూనే
మాష్టారు ముందు నిలబడేదెప్పుడూ..
చదువుకున్న చోటే చదువు చెప్పే చోటయ్యింది
చెప్పలేని మధురానుభూతి...

అంటూనే తన గురువులను కూడా వినమ్రంగా తలుచుకున్న తీరు మనసుని కదిలిస్తుంది. ఈ కవితల్లో దార్లగారు తెలుగు సాహిత్యాన్ని అర్థం చేసుకోడానికి మథన పడి, దాన్ని సాధించి ముందుకు నడిపించే లక్ష్యం కలిగిన యోధుడిలా ఎదురౌతారు.

క్లాసికల్ తెలుగంటే
ప్రాచీనమో, సంప్రదాయమో
శిష్టమో, విశిష్టమో
మీ ఇష్టమైన పేరుతో పిలవండి
తెలుగు భాషను మాత్రం
ప్రజల భాషగానే మననివ్వండి....

అంటూ ఎలుగెత్తిన అభ్యుదయవాదిలా కనిపిస్తాడు. ప్రాంతీయ, అస్తిత్వపు చైతన్యాలను ఆకళింపు చేసుకున్న తీరు 'కోస్తా మాదిగోళ్లూ తెలంగాణ బాటలోనే' అన్న కవితలో కనిపిస్తుంది. అంతర్జాతీయ మార్కెట్టులో పవిత్ర ప్రేమ, కూలుతున్న లైబ్రరీ, చేనేత దృశ్యాలు, నగర పురస్కారం, కాంక్రీటు పిచ్చుగూళ్ళలో, మినీ కవితల్లో ప్రపంచీకరణ విషపునాగు బుసలు కొడుతుంటే నిస్సత్తువైపోతున్న జీవిత మధురానుభూతులను ప్రశ్నించిన దార్ల కనిపిస్తారు.

'ఊర్లో గ్రంథాలయాలన్నీ ఖాళీ
అన్నీ ఇంటర్నెట్‌లోనే చూసుకోవాలట
మరో మిలీనియం దాక వెతికినా
నాకిక అక్షరం ముక్క మళ్ళీ కనిపించదేమో
లైబ్రరీలోనే చచ్చిపోయి
మళ్ళీ లైబ్రరీలోనే

ఓ పుస్తకమై పుట్టాలనే కోరిక
పుట్టుకతోనే చచ్చిపోవాల్సిందేనేమో..

అనే వాక్యాలు అందుకు మచ్చుతునకలు. అసలు ఈ నెమలి కన్నుల్లో అమ్మా, నాన్నా దగ్గర బాల్యంలో గడిపిన అమృత క్షణాలను తలచుకున్న మెత్తని మనసున్న తనయుడైన దార్ల దర్శనమిస్తారు.

నెమలి కన్నులు ఒలక బోసుకున్న కలలివి. నెమలి కన్నులు దర్శించిన చీకటి వెలుగులివి. నెమలి కన్నులు కురిపించిన వేదనలూ, వెన్నెలలివి. నెమలి కంటికి చూపుండదని ఎవరన్నారూ... ఒక్కసారి ఈ నెమలి కన్నుల్లోకి మీ కళ్ళుపెట్టి చూస్తే తెలుస్తుంది. ఆ కళ్ళల్లో దాచుకున్న నిశ్శబ్దపు ప్రవాహాల ప్రభంజనం. ఆ నయనాల్లో మసలే దావాగ్ని సెగల విలయం. ఆ చూపులో దాగున్న ఆశా కిరణాల అమృత వెలుతురు. ఇంత గొప్ప కవిత్వ దర్శనాన్ని అనుభవించి పలవరించమని పుస్తక రూపానికి ముందే అవకాశం ఇచ్చినందుకు మనసారా దార్లగారికి కృతజ్ఞతలుతెలుపుకుంటూన్నాను.

– డా॥ మల్లెగోడ గంగాప్రసాద్
తెలుగు అధ్యాపకులు
హైదరాబాద్ విశ్వవిద్యాలయం
మొబైల్ : 9912359070

❖ ❖ ❖

దళితుల ఆత్మకథాత్మక కవిత్వం "నెమలి కన్నులు"

– గిన్నారపు ఆదినారాయణ

డా॥దార్ల వెంకటేశ్వర రావు రాసిన *'నెమలి కన్నులు'* కవిత్వం చదివిన తర్వాత దీన్ని దళితుల ఆత్మకథాత్మక కవిత్వంగా చెప్పవచ్చు. 1980 నుండి మొదలైన దళిత సాహిత్యం ఆత్మకథా ప్రక్రియ విషయంలో ఇంకా మొగ్గ దశలోనే ఉన్నా,సృజనాత్మక రచనా ప్రక్రియల్లో దళిత కవులు, రచయితలు తమ వారి వారి అనుభవాలను చెబుతూ ఆత్మకథాత్మాక సాహిత్యాన్ని విస్తృతపరుస్తున్నారు. ఇలాంటి అంశాలే *నెమలి కన్నులు* కవిత్వంలో అనేకంగా కన్పిస్తున్నాయి. కడుపు కాలినప్పుడే కవిత్వం పుంఖాను పుంఖాలుగా పుట్టుకొస్తుందన్న మాట ఈ కవిత్వం చదివిన వారికి మరింత వాస్తవంగా కన్పిస్తుంది. ఈ కవిత్వం చదువుతుంటే ఆకలికి ఆమడ దూరంలో ఉండి కడుపు తుక తుక ఉడికినప్పడే కలం పట్టాడు కవి అన్పిస్తుంది. అయితే మా గురువుగారు డా॥దార్ల వెంకటేశ్వర రావు సాహిత్య విమర్శను ఎంత సహృదయతతో విశ్లేషిస్తారో, కవిత్వం కూడా అంతే స్పందనతో రాస్తున్నాడనిపిస్తుంది. సందర్భానుసారంగా మాండలిక పదాలు వాడుతూ కవిత్వానికి నవ్యత్వం చేకూర్చారు. ఈ కవిత్వం నిండా నవ్యభావనలతో పాటు, భాష విషయంలో కూడా నూతనత్వం చేకూరుస్తూ, అల్పాక్షరాలతో అనల్పార్థాన్ని చెప్పారు.

మా గురువు గారు నిత్య సాహితీ విద్యార్థి. సాహిత్యంతో పాటు టెక్నాలజిలో కూడా కాలంతో పరుగెడుతూ ఎప్పటికప్పుడు అప్ డెట్ అవుతూ ఉంటారు. తను చూసిన ముఖ్యమైన అవసరమైన సన్నివేశాన్ని, సమావేశాన్ని ఎప్పటికప్పుడు తన

బ్లాగులో మన ముందుంచుతారు. కంప్యూటర్ టెక్నాలజిలో తనకు రాని విషయాన్ని రకరకాల ప్రయోగాలు చేసి రప్పిస్తారు. బోధనలో కూడా రకరకాల ప్రయోగాలు చేసి కనువిందు చేస్తారు మా గురువుగారు. అయితే ఈయన జీవితం వడ్డించిన విస్తరి కాదు. తాత ముత్తాతలు అక్షరాలకు దూరమై మట్టితో జీవనం సాగించిన మట్టి వాసన తెలిసినవారు. అందుకే అక్షరాన్ని హక్కున చేర్చుకున్నారు. కోనసీమ నుండి క్యాంపస్ వరకు ఎదిగి ఇక్కడే అధ్యాపకులు అయ్యారంటే మామూలు విషయం కాదు. చదివిన దగ్గరే ఉద్యోగం సంపాదించడమనే అవకాశం అందరికీ రాదు. అయినా తన జీవితంలో ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కున్నారు. అందుకే మా గురువుగారు ఎంతో మంది విద్యార్థులకు ఆదర్శనీయంగా నిలుస్తున్నారు.

సామాన్య దళితుడి జీవితం సమాజంలో నిత్య పోరాటం. ప్రతి చిన్న పని దగ్గరా పోరాటమే. పోరాటం చేస్తే కాని దేన్ని సాధించుకోలేమని ఈ కవిత్వంలో స్పష్టంగా తెలిపారు. ఇందులో అతని జీవితం, హృదయ స్పందన చాలా స్పష్టంగా తేటతెల్లమవుతుంది. ముఖ్యంగా తనకు అమ్మంటే ఎంతిష్టమో ఈ కవిత్వం చదివితే అర్థమవుతుంది. తల్లడిల్లే ఏ తల్లి కన్పించినా తన తల్లిగానే భావిస్తాడు.

గాయాల చేతుల్తోనే కారం పచ్చడి నూరుతూ
మా కళ్ళకు కనిపించకుండా
మా అమ్మ పడిన బాధంతా గుర్తొచ్చినప్పుడల్లా
అన్నం తినడం అర్థంతరంగా ఆపేస్తుంటాను.

(మా వూరు నవ్వింది)

అంటూ తల్లి వేదనను తలుచుకొని పాఠకుల కళ్ళల్లో కన్నీళ్ళను గిరగిరా రప్పించాడు కవి. ప్రతి మానవుడికి మొదటి గురువు తల్లి. తాను కడుపు మాడ్చుకొని కొడుకుకు కడుపు నింపే తత్వం తల్లికే ఉంటుంది. అట్లాంటి తల్లి తన కొడుకు ఉన్నత ఆశయం కోసం రోకటి పోటు బాధలను ఎన్ని అనుభవించిందో అంటూ బాధ పడిన తీరును తలచుకుంటున్నాడు. అలాగే కుటుంబ సమస్యలాంటి యస్సీ వర్గీకరణ గురించి చెబుతూ ఇలా అంటారు.

నాసోదరుడే నావ్యక్తిత్వం మీద
అవమాన ముద్ర వేస్తున్నాడు

అది నా ఆత్మను దహించకుండా మేల్కోవాలి
నా చెట్టుకాయలు
నాకు దక్కేలా నా బతుకు నా బతుగ్గా
బతకాలనే విత్తనాలే నాకో నినాదాన్నిచ్చాయ్
గుండె దండోరాని మ్రోగించమన్నాయ్

ఇక్కడ గురువు గారు తన జాతి ఔన్నత్యం కోసం దండోరా వేస్తున్నారు. మాల మాదిగల మధ్య ఉన్న అభిప్రాయ భేదాలను తెలుపుతూ తన తోటి సోదరుడే తనను మోసం చేస్తే ఇక వేరే వాడు చేయడంలో పెద్ద ఆశ్చర్యం లేదంటున్నారు. తనలాంటి అవమానాలు పొందిన తన తోటివాడే తనకు కళ్ళకు గంతలు గట్టి మాయలు చేసి, అవమానిస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. వర్గీకరణ వాదంలో దళితులందరికీ సమానావకాశాలు దక్కాలంటున్నారు. అలాగే సమకాలిన తెలుగు భాషా స్థితిగతుల గురించి స్పందిస్తూ..

'మళ్ళీ పాతకాలానికే
లాక్కోనిపోతారేమోనని భయంగానూ వుంది
మళ్ళీ కందుకూరి, గురజాడ, గిడుగుల అడుగుల్ని
వెతుక్కోవాలసివస్తుందేమోనని
గుండె గుబులుగానే వుంది'

(తెలుగు గుండెల్లో క్లాసికల్ గుబులు)

అంటారు కవి 'తెలుగు గుండెల్లో క్లాసికల్ గుబులు' శీర్షిక వింటేనే అర్థమవుతుంది. కవి ఇక్కడ ఎన్నో అస్తిత్వవాద ఉద్యమాలు తెలుగు సాహిత్యంలో నేడు కన్పిస్తుంటే, భాషలో ఒక్కొక్కరికీ ఒక్కోవిధంగా భాషా వైవిధ్యం కన్పిస్తుందని స్పష్టంగానే తెలుస్తుంది. అయినా మళ్ళీ తెలుగుకు ప్రాచీన హోదా అనడం వెనుక గల కుట్రను ఛేదించాల్సి ఉందంటున్నారు. మళ్ళీ వేదాలు, పురాణాలను మనమీద రుద్దేప్రయత్నం చేయడమే మనతెలుగుగా ప్రచారం చేయడాన్ని కూడా నిరసిస్తున్నారు. బండిరాలు, శకటరేఫల వంటివి అవసరమైనంతమేరకే తెలుగు వర్ణమాలను సరిచేసుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నాడు. వర్ణమాల సరళీకరింపబడాలనేది వీరి ఆలోచనగా కనిపిస్తుంది. గురజాడ, గిడుగు రామ్మూర్తి లాంటి వారు చేసిన

భాషా సంస్కరణలను గుర్తుచేస్తూ, అటువంటివి మళ్ళీ మళ్ళీ చేయాల్సిన పరిస్థితి రాకూడదంటున్నారు. ఇక్కడ భాష సామాన్యీకరించబడాలనేది, ప్రజాస్వామ్యీక రించాలని కవి దృక్పథం. అంతేగానీ, ఉన్న వర్ణమాలను తగ్గించేయాలని కాదు కానీ, ఉచ్చరణా విధానం మరింత సరళం కావాలనేది కవి దృక్పథమని గమనించాలి. ఆంగ్లంలో జరిగింది అదే. నగరంలో ప్రపంచీకరణ ప్రభావంతో మనుష్యుల మధ్య సంబంధాలు తెగిపోయి అను నిత్యం యాంత్రిక జీవనం గడపాల్సిన స్థితి గురించి చెప్తూ ...

డాలర్ సంబంధాలో, గ్లోబల్ గొప్పలో
బతుక్కొచ్చిన తిప్పలో
రక్తసంబంధాలకీ, వ్యక్తి సంబంధాలకీ మధ్య
మిణుకు మిణుకుమని వెలుగుతున్న
వంతెనలన్నీ కూల్చేస్తున్నాయి.

పచ్చటి పరిసరాల పిచ్చుక గూళ్ళ ఆనందాలను వదిలి, డబ్బు సంపాదన ముసుగులో కనీసం పక్కింటి వారు ఎవరో కూడా తెలియని కాంక్రీటు పిచ్చుకగూళ్ళల్లో జీవనం సాగిస్తున్నామంటూ, నవమాసాలూ మోసి అల్లారు ముద్దుగా లాలించి, పాలిచ్చి, పెంచి పెద్దచేసి చక్కని రూపుం పోసిన అమ్మ తన ఇంటికి వస్తే తనివితీరా మాట్లాడే సమయం కూడా లేకుండా చేస్తుందీ ఈ ప్రపంచీకరణ ప్రభావం అంటున్నారుకవి. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలవుతున్న కుటుంబ సంబంధాల్ని ఈ కవిత పట్టించింది. వంతెనలన్నీ కూల్చేస్తున్నాయనడం ద్వారా మానవసంబంధాలన్నీ తెగిపోతున్నాయని సూచిస్తున్నారు కవి.

"మాతాత ముత్తాతల నుండీ
ముడతలు పడిన కడుపులో
అంబలైనా దొరుకుతుందేమో గాని
అక్షరం ముక్కని మాత్రం కనపడనివ్వలేదు కదా
ఈ వర్ణాధిక్య పెద్దలు !
అక్షరమంటే అందుకేనేమో నాకంత ఆత్రం "

అనడం ద్వారా తరతరాలుగా దళితులు అక్షరాలకు దూరమైన చారిత్రక సత్యాన్ని కవిత్వీకరించారు.

ఆకలి బాధతో పాటు అక్షరం బాధ ఎరిగిన వ్యక్తి మా గురువు. అందుకే వర్ణాధిక్య సమాజాన్ని ప్రశ్నిస్తున్నారు. అక్షరాన్ని తన తాత ముత్తాతలు కనీసం మట్టి బలపంతో కూడా ఎరుగరు. అందుకే నేనిప్పుడు అక్షరం కోసం ఆత్రుత పడుతున్నానంటున్నారు. ఇక్కడ తరతరాలుగా దళితులకు విద్యావకాశాలకు దూరం చేసిన వైనాన్ని, ఆ చారిత్రక క్రమాన్ని ఆత్మీకరించుకొని కవిత్వమైయ్యారు. అలాగే నేడు సమాజంలో ప్రపంచీకరణ ప్రభావంతో లైబ్రరీల పరిస్థితి దయనీయంగా ఉందని ఆవేదన చెందుతున్నారు. ప్రాంతీయ సమస్యలతో ఆంధ్రప్రదేశ్ రెండుగా విడిపోవాల్సినప్పుడు కోస్తామాదిగోళ్ళూ తెలంగాణా బాటలోనే పయనిస్తున్నా రంటూ...

'మాదీ గోదారి జిల్లానేనండి
గోదారోళ్ళంతా
గోదాల్లా బొజ్జలు పెంచుకున్నోల్లే కాదండోయ్
మమల్నందరినీ చేరదీసిన కిరస్తానీ వోళ్ళ
సదువులూ సంస్కారం నేర్పారంటారే
ఆ దళితులనే మమ్మల్నీ పిలుత్తార్లేండి'

అని కోస్తా భాష కూడా అవహేళనకు గురవుతున్న స్థితిని చెప్తూనే, అక్కడున్నవాళ్ళంతా తెలంగాణాకు వ్యతిరేకులు కాదని స్పష్టం చేస్తున్నాడు కవి. తనదీ గోదావరి జిల్లా అని చెబుతూనే, గోదావరి జిల్లా వాళ్ళంతా బొజ్జలు పెంచుకున్నోళ్ళు కాదని చెప్పడంలో కోస్తావాళ్ళంతా దోపిడీదారులుగా చూడకూడ దంటున్నాడు కవి. అలాగే కోస్తావాళ్ళంతా తెలంగాణాను వ్యతిరేకించేవాళ్ళూ కాదనీ అందులోనూ దళితులు, మాదిగలు తెలంగాణను సమర్థిస్తున్నారని గుర్తించాలని చెపుతున్నాడు. నిజానికి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం వచ్చినప్పుడు కోస్తా జిల్లాల వాళ్ళు కూడా చాలా మంది తెలంగాణా ఉద్యమాన్ని సమర్దించారు. అలాగే ఇందులో అంబేద్కర్ చిన్న రాష్ట్రాల ద్వారా అభివృద్ధి చెందుతుంది అనే ఆలోచన విధానాన్ని సమర్థించారు. ఈ జిల్లాలో ఉన్న దళితులకు చదువులు,

సంస్కారం, వినయం, విధేయతల వంటి అక్షరాలను క్రిస్టియన్లు నేర్పిన దళితులం మేం అనే విషయం చెపుతున్నాడు. మేం దళితులం ఇంగ్లీష్ వాళ్ళలాగ మీ రాజ్యాన్ని పాలించడానికి వచ్చినవాళ్ళం కాదు అంటున్నాడు. అణగారిన వర్గాలకు అధికారం కోసం పోరాడేవాళ్ళుగా దళితుల వేదనను, స్పృహను కల్గిస్తున్నారు. దీంతో పాటు కవి దళిత స్త్రీలు మాత్రమే దేవుడికి పెళ్లాలుగా నచ్చుతారా ? అని ప్రశ్నిస్తూ...

" ఈ ప్రపంచంలో నేను పుట్టడానికి మాత్రం
ఒక్కటే సిద్ధాంతం
వంశపారంపర్యంగా దళిత కుటుంబం వాళ్ళే
దేవుడి పెళ్ళాల్కైపోవడం!!
భూస్వామ్యానికి భోగవస్తువున్కై
ఎత్తందారీ చిత్తాన్ని రాగరంజితం చేయడం! "

దళితులపై జరుగుతున్న అరాచకాలను ప్రశ్నిస్తున్నాడు. సమాజం తన పై చెరగని ముద్రగా దేవదాసి పుట్టుమచ్చను ప్రవేశపెట్టింది. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ఏర్పడిందే మన దేశం అని చెబుతూ, స్త్రీ మాతృమూర్తితో సమానం అని అంటూనే అన్నింటి పై అధికారం చెలాయిస్తున్నారు ఈ అగ్రవర్ణ పెత్తందారులు. ఒక బండ రాయిని తీసుకువచ్చి దేవుడని, ఆ బండకే ఒక స్త్రీని పెళ్ళి చేయడం అనేది చాలా దుర్మార్గమైన విషయం. ఒక స్త్రీ ని దేవుని భార్య అంటూనే గుడి చుట్టూ ఉండే పెత్తందార్లు ఆమెను ఉంపుడుగత్తెగా వాడుకోవడం చాలా సిగ్గుచేటు అంటూ తన నిరసనను తెలుపుతున్నాడు. అయినా ఈ దేవుళ్ళు కూడా అగ్రవర్ణ స్త్రీలను ఎందుకు పెళ్ళాడరు? కేవలం దళిత స్త్రీలను మాత్రమే ఎందుకు పెళ్ళాడుతారు. దేవుళ్ళకు దళిత స్త్రీలే నచ్చుతారా అంటూ కవి ప్రశ్నిస్తున్నాడు. దళిత పురుషుల్నే కాకుండా దళిత స్త్రీలను కూడా పీడించేతత్వాన్ని ఎండగడుతున్నాడు కవి. ఇలా ఈ కవిత్వంలో కవి ఆత్మానుగతంగా రాసినవి ఉన్నాయనిపిస్తుంది. ఎందుకంటే తాను కోనసీమ నుండి హైదరాబాదు విశ్వవిద్యాలయం వరకు వచ్చి చదివి ఇక్కడే ఉద్యోగం సాధించాడు. తన కవిత్వంలో తాను చదువుకుంటున్న సందర్భంలో అనేక విధాలుగా దళితులు ఎదుర్కున్న వివక్ష స్పష్టంగా కన్పిస్తుంది. తనూ తన చుట్టూ ఉండే సమాజం పరిసరాల దృష్ట్యా తన అవగాహన సామర్థ్యం

మేరకు అనేక విషయాలను ఈ కవిత్వం ద్వారా మన ముందు పెట్టాడు. ఆత్మకథాత్మకంగా సాగినా అంతా తన జీవితంగానే భావించాల్సిన పనిలేదని ఇందులో చాలా కవితల్ని బట్టి చెప్పోచ్చు. సిస్టర్స్ పై, అత్యాచారం, దేవుడికి పెళ్ళాలైపోతున్న దళిత స్త్రీల గురించి రాసినటువంటి కవితలన్ని నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ విధంగా ఈ కవిత్వమంతా చూసినప్పుడు ఆత్మకథాత్మక కవిత్వంగా ఉంటూనే దళితుల ఆత్మకథాత్మక కవిత్వంగా భాసిల్లుతోంది.

– గిన్నారపు ఆదినారాయణ
రీసెర్చ్ స్కాలర్
హైదరాబాదు విశ్వవిద్యాలయం
మొబైల్ : 9949532456

❖ ❖ ❖

దళిత జీవితనావకు దిశా నిర్దేశం

– బడిగె ఉమేశ్

'కాదేది కవితకనర్హం, కవిత్వం ఒక తీరని దాహం' అని శ్రీశ్రీ అన్న మాట ఇప్పుడు *నెమలి కన్నులు* కవిత్వం చదివినప్పుడు కూడా నాకు అనాలనిపించింది. ఎవరైనా అనేక బాధలు, కష్టాలను ఎదుర్కొన్నప్పుడు వారి ఆలోచనలు హృదయం నుంచి వచ్చే వాస్తవాలవుతాయి. అలాంటి వాస్తవాలే ఈ కవిత్వంలో నా అనుభవంలోకి వచ్చాయి. కొన్ని కవితలు నా చిన్ననాటి పల్లె జీవన ఆనందాల్నీ, విషాదాల్నీ, నగర జీవిత బాధలను గుర్తుకు చేశాయి. మరికొన్ని కవితలు చదువుతుంటే గుండె బరువెక్కి, కళ్లల్లో నీళ్ళు చెమ్మగిల్లాయి. సమాజంలో దళితులు అనుభవించిన జీవితం ఎంత దుర్భరమైందో కళ్లకు కట్టినట్లు ఈ కవిత్వంలో కనపిస్తుంది.

మా గురువు డా॥ దార్ల వెంకటేశ్వరరావు గారు కవిగా, రచయితగా, పరిశోధకుడిగా, విమర్శకుడిగా సుప్రసిద్ధులు. వీరు రాసిన విమర్శ గ్రంథాలను చదివితే ఒక వ్యాసం ఎలా రాయాలో తెలుస్తుంది. ఒక అభిప్రాయాన్ని ఎలా వెల్లడించాలో అర్థమవుతుంది. ఒక నూతనాంశాన్ని ఎలా ప్రతిపాదించాలో తెలుస్తుంది. ఒక మౌలిక సూత్రాన్ని ఎలా సమన్వయించాలో తెలుస్తుంది. మొత్తంగా ఒక పరిశోధకుడికి కావాల్సిన లక్షణాలు అలవడతాయి. అయితే, ఈయన రాసిన కవిత్వం చదివితే సృజనాత్మకంగా ఆలోచించడం అలవడుతుంది. సృజన శిల్పం తెలుస్తుంది. ఈ కవిత్వంలో నాకు అమ్మా నాన్నలపై ఉండే ప్రేమానురాగాలు కనిపించాయి. సమాజంలో సాటి మనిషి సాధక బాధకాలు చూసి కవి ఏవిధంగా

స్పందిస్తాడో అర్థమయ్యింది. ఒక జాతి వివక్షకు గురైనప్పుడు పడే ఇబ్బందులు తెలిసొచ్చాయి. సమకాలీన సమాజంలో ప్రపంచ వ్యాప్తంగా బహుజనులపై జరిగే దాడులు బోధపడ్డాయి. ఇలా ఎన్నో, ఎన్నెన్నో ఈ నెమలి కన్నులు కవిత్వంలో పురివిప్పి నాట్యం చేశాయనిపించింది.

ఓ సృజనకారుడుగా వీరు రాసిన కవిత్వం ఎంతో గొప్పదనిపించింది. సాధారణంగా కడుపు మండినప్పుడు, అవమానం జరిగినప్పుడు, మనసుకు బాధేసినప్పుడు కవిత్వం కట్టలు తెంచుకుని ప్రవహిస్తుంది. అలాంటి సందర్భాల్లో పుట్టిందే ఈ కవిత్వం అనిపించింది. అందులో భాగంగానే ప్రధానంగా దళితుల గురించి ప్రస్తావించిన కవితలు కొన్ని గమనించి ఈ విషయాలను రాస్తున్నాను. డా॥ దార్ల వెంకటేశ్వరరావుగారు ఇంటర్మీడియెట్ నుండి బి.ఏ., స్పెషల్ తెలుగు వరకు అమలాపురంలోని శ్రీ కోనసీమ భానోజీ రామర్స్ లో చదివారు. ఈ కాలేజీ యాజమాన్యం విద్యార్థినీ, విద్యార్థుల కోసం ప్రతి ఏడాదీ ఒక మేగజైన్‌ని ప్రచురించే వారు. అక్కడ నిష్ణాతులైన కవులు, రచయితలుగా ఉన్న డా॥వి.చక్రపాణిరావు, డా॥ ద్వానాశాస్త్రి, డా॥ బి.వి.రమణమూర్తి, డా॥పైడిపాల మొదలైన వారు సంపాదకులుగా ఉండి విద్యార్థినీ విద్యార్థుల సృజనాత్మక రచనలను ఎంపికచేసేవారు. ఈ కళాశాలలో డా॥ దార్ల వెంకటేశ్వరరావుగారు ఇంటర్ చదువుతున్నప్పుడు రాసిన మొదటి కవిత '*జీవిత నావ*'. ఈ కవిత కాలేజ్ మేగజైన్ లో 1992లో అచ్చయింది. ఈ కవితలో కవి బాల్యంలో ఉన్నప్పుడే ఎంతో దార్శనికంగా ఆలోచించి '*జీవిత నావ*' అనే కవితను రాశారనిపించింది. ఇక్కడ కవి మానవ జీవితాన్ని ఒక నావతో పోల్చడం గమనించవచ్చు.

"అంతులేని విషాద సాగరంలో
జీవితమనే నావ పయనిస్తున్నది
ఎన్నో తుఫానులు, సుడిగుండాలు, కెరటాలు
భయంకరమైన
మృత్యు మత్స్యాల నడుమ బ్రేక్ డ్యాన్సులతో
ఆబగా సాగుతుంది
అసమానత ల్లేని ఆనందపు తీరం చేరాలని

విజ్ఞాన దీధితుల్ని వెదజల్లే వైట్ హౌస్ ని
అందుకోవాలని
ఇంకా ఇంకా.... బరువుగా సాగుతూనో ఉంది."

ఇందులో కవి మానవ జీవితాన్ని ప్రతీకలతోను, భావచిత్రాలతోను పోల్చి చెప్పడం సౌందర్యాత్మకంగా ఉంది. పడవ ప్రయాణం చేస్తున్నప్పుడు అలల తాకిడికి పడవ ఎన్నో ఒడిదుడుకులకు లోనవుతుంది. మనిషికి కూడా జీవిత ప్రయాణంలో అనేక కష్ట నష్టాలకు గురవుతుంటాడు. వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటేనే జీవితం బరువనిపించదని కవి సందేశం ఇచ్చినట్లనిపించింది. దళిత బాల్య సంవేదనలకిది నిదర్శనం.సమాజంలో దళితులను అగ్రవర్ణ ఆధిపత్య కులాల వారు తమ రాజకీయ అవసరాలకు ఉపయోగించుకుని, అవసరం తీరాక పట్టించుకోని పరిస్థితిని కవి వివరించిన తీరు... *'మా వూరు నవ్వింది'* కవితలో కన్పిస్తుంది.

"నన్నో కులం గుంపులోనో
నన్నో దొంగ ఓటరుగానో
అక్రమ కేసుల బనాయించిన నేరస్తుడిగానో
అవసరానికో చలిమిడి ముద్దగా చేసుకునే
మా వూరు నన్ను చూసి నవ్వింది! "

కులం తక్కువ వాడు పెద్ద చదువులు చదివితే సహించని కొంతమంది అగ్రవర్ణ ఆధిపత్య వర్గాల వారు నేటికి పల్లెల్లో ఉంటున్న స్థితిని కవితీకరించారు. 'నవ్వు నాలుగు విధాలు చేటు' అని ఒక సామెత. కానీ ఇక్కడ నవ్వు నాలుగు విధాలుగా మంచిదైందని అర్థం చేసుకోవచ్చు. 'నవ్వింది పట్నమయ్యింది' అని మరో సామెత ఉంది. అదే ఇక్కడ నిజమైందనిపిస్తుంది. గ్రామీణ రాజకీయాలకు దళితులెలా బలి కావాల్సి వస్తుందో గుర్తించాలంటున్నారు కవి. సమాజంలో దళితులు ఎదగడానికి చదువే ప్రధాన మార్గం. అందుకు చదువుకోవాలని దళితులు ప్రయత్నిస్తే ఎన్నో ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సి వచ్చిందనే చారిత్రక సత్యాన్నీ, ఆ సంఘర్షణల్నీ *'వారసత్వం'* కవిత ద్వారా మన ముందుంచుతున్నారు కవి.

"మా ముత్తాత
చెప్పులు కుట్టేవాడు
మా తాత
కూలి కెళ్ళేవాడు
మా అయ్యేమో
అక్షరం కోసం ఆశగా
ఎదురు చూసేవాడు
నేనిప్పుడు
కవిత్వం రాస్తున్నాను
రేపు
నా కొడుకు
ప్రొఫెసరవుతాడు!"

అంటూ కవి జ్ఞానం ఒకరి సొత్తు కాదనీ, అందరిదీ అని చెప్పారు. దళితుల జీవితం మార్పులు చెందిన విధానాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారీ కవితలో. వంశపారంపర్యంగా సంక్రమించిన వృత్తులు కొంత మందికి ముఖ్యంగా దళితుల అభివృద్ధికి గుదిబండలా తయారయ్యాయి. అందువల్ల ఆ వృత్తులు పోయినంత మాత్రంచేత దళితులు తెగ బాధ పడాల్సిన పని లేదు. నిజానికి వృత్తులకు సామాజిక గౌరవంతో పాటు, ఆర్థిక స్థితి గతుల్లో మార్పులు వచ్చే వరకు ఆవృత్తులు నశించినా పర్వాలేదు, కేవలం కొన్ని వృత్తులకే గౌరవంతో పాటు, ఆర్థికంగా స్థిరత్వం కలగడం వల్ల చారిత్రకంగా దళితులు నష్టపోయారు. అంబేద్కర్ తెచ్చిన చైతన్యం వల్ల వంశపారంపర్య వృత్తుల్లో మార్పులు వచ్చాయి. ఇవన్నీ ఈ కవిత్వంలో కనిపిస్తాయి. కవిత చిన్నదిగా కనిపిస్తుంది. దానిలో అనేక వందల సంవత్సరాల దళితుల చారిత్రక వేదన, సంఘర్షణ, చైతన్యం ముప్పేటలా కనిపిస్తుంది. కానీ దళితుల్లో వచ్చిన పరిణామాల్ని అయిదు తరాల వారి సంఘర్షణతోపాటు చైతన్యం వ్యక్తమవుతుంది.

ఒకప్పుడు దళితులు వంశపారంపర్యంగా సంక్రమించిన చెప్పులు కుట్టే వృత్తిలోనే నిర్భంధంగా జీవించాల్సి వచ్చింది. ఇది మొదటి తరం. దీని నుండి

స్వేచ్ఛగా కనీసం కూలీనాలీ చేసుకునే ప్రయత్నం చేయడం అనేది నిర్బంధం నుండి బయట పడిన రెండవ తరం గురించి చెప్తున్నారు కవి. స్వాతంత్రం వచ్చి విద్యా హక్కు, సమానత్వం వంటివి రాజ్యాంగ పరంగా సంక్రమించిన హక్కులు వీటి వల్ల దళితుల్లో కొత్త ఆశలు చిగురించాయి. ఇవన్నీ ప్రాథమిక హక్కులుగా, నిర్దేశిక సూత్రాలుగా రాజ్యాంగంలో చేరడానికి దళిత నాయకులెంత కష్టపడి ఉంటారో! ఇది మూడో తరం. ఇక నాలుగవతరం వచ్చే సరికి దళితులు కూడా చదువుకోవడమే కాకుండా అన్ని రంగాల్లోనూ పోటీ పడే స్థాయికి చేరుకుంటున్నారు, సన్మానాలు అందుకుంటున్నారు.

ఒకప్పుడు 'ప్రతిభ' అంటే చదువుకోవడం, దాన్ని చెప్పడం మాత్రమే ప్రధానమనే దాన్ని దళితులు కూడా సాధించి చూపుతున్నారు. లలిత కళల్లో ఉత్తమోత్తమం కవిత్వమయితే, దాన్ని దళితులు సాధించి ప్రధాన స్రవంతిగా కొనసాగుతున్న కవిత్వానికి ఏమాత్రం తీసి పోవడమే కాకుండా, కొత్త కొత్త పదజాలంతో, ప్రయోగాలతో, నూత్నాభివ్యక్తులతో కవిత్వాన్ని రాస్తున్నారు. ఇది నాలుగవ తరం. ఒకప్పుడు వేదాలు వింటే చెవుల్లో సీసం పోయించుకోవాల్సిన దుస్థితిలో ఉన్న దళితులు, ఒకప్పుడు వేదం గురించి మాట్లాడితే నాలుక కోయించుకోవాల్సిన దుస్థితిలో ఉన్న నేడు దళితులు పాఠాలు బోధిస్తూ సర్వోన్నత స్థానంగా భావించే గురువులు (ప్రొఫెసర్స్) అవుతున్నారు. ఇది అయిదో తరంలో కనిపిస్తున్న మార్పు. ఇలా దళితులు వంశ పారంపర్యంగా సంక్రమించిన వృత్తులు వదిలేసి కొత్త కొత్త వృత్తుల్ని స్వీకరించడం వల్ల మాత్రమే సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా వికాసాన్ని సాధించగలుగుతున్నారు. ఇప్పుడు '*వారసత్వం*' సంపద గురించి మాట్లాడే వాళ్ళు వారసత్వానికీ ప్రతిభకీ కొత్త నిర్వచనాన్ని ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వంశ పారంపర్యంగా రక్తమాంసల లోనే పౌరుషం, శక్తి సామర్థ్యాలు, తెలివితేటలు సంక్రమిస్తాయనే సిద్ధాంతాలు, వాదాలు తప్పని దళితులు సాధించిన వికాస క్రమాన్ని చూస్తే అర్థమవుతుందని ఈ కవిత తెలియజేస్తుంది. సమాజంలో ఆ నాటి నుండి ఈ నాటి వరకు దళితులను చదువుకు దూరం చేస్తున్న విధానాన్ని కవి నిరసించిన భావాలు '*కూలుతున్న లైబ్రరీ*' కవితలో కనిపిస్తుంది.

"మా తాత ముత్తాతల నుండీ
ముడతలు పడిన కడుపుల్లో
అంబలైనా దొరుకుతుందేమో గాని
అక్షరం ముక్కని మాత్రం కనపడనివ్వ లేదు కదా
వర్ణాధిక్య పెద్దలు!"

అగ్ర వర్ణాధిపత్య వర్గాల వాళ్లు దళితులకు కొంత కాలం పాటు అక్షరాలను చూపించలేదని కవి వాపోయిన విధానం అక్షరాలా నిజం. తర్వాత కాలంలో మారుతున్న కొద్దీ అక్షరం రుచి చూసిన దళితులు దాన్ని ప్రేమించి అక్కున చేర్చుకుని విద్యావంతులై ఎవరికీ తీసిపోని వాళ్లం కాదని నిరూపించారు. దళితులు ప్రయాణించిన నావ ఎన్నో కష్టాలను చవిచూసింది, ఇంకా చూస్తూనే ఉంది. ఈ కష్టాల నుండి, బాధల నుండి విముక్తి పొందాలంటే దళితుల్లో ఎంతో చైతన్యం రావాలని కవి '*సమాధులు*' కవితలో ఇలా అంటున్నారు.

"ఒక్కొక్క సమాధీ
దళిత రాజ్యం కోసం
నల్లసూర్యుడై నినదిస్తున్న చైతన్య ముద్ర"

దళితులు అభివృద్ధి చెందాలంటే దానికి చేయూతనిచ్చే '*నల్ల సూర్యుడు*' లాంటి వారు చాలా మంది ముందుకు వచ్చి చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఉందని కవి గుర్తు చేస్తున్నారు. '*నల్ల సూర్యుడు*' అనే ప్రయోగం దళితుల్లో రావాల్సిన చైతన్యం గురించి చెప్తుంది. అన్నదమ్ములు ఆస్తిని సరిసమానంగా పంచుకుంటేనే జీవితం సంతోషంగా ఉంటుందని వర్గీకరణ దృక్పథంతో '*మాదిగ మ్యానిఫెస్టో*' కవితలో ఇలా అంటూన్నారు.

"అన్నా... !
నువ్వే నాతో కలిసి తినలేవ్ ?
నువ్వే నాతో కలిసి జీవించలేవ్
అన్నా... !
'కోతి–పిల్లులు రొట్టె కథ'ను
మరిచిపోతున్నావు కదూ ! "

మాల, మాదిగల వర్గీకరణ జరిగితే దళితుల్లో రెండు వర్గాలు అభివృద్ధిలోకి వస్తాయి. దళితుల్లో దళితులే పొట్లాడుకోవడమెందుకు? అని దళిత మ్యానిఫెస్టోలో తెలిపారు. దళితులు అంతఃసంఘర్షణల వల్ల రావాల్సిన కొత్త హక్కుల రూపంలో ఉన్నా, ఉన్నవాటిని కూడా పోగొట్టుకునే పరిస్థితి రావచ్చునని జాగ్రత్త పడమని హెచ్చరిస్తున్నారు కవి. ఈ కవిత్వంతో వాడిన భాషకు ప్రామాణిక భాషకు దగ్గరగా ఉంటూనే అక్కడక్కడా మాండలిక భాషను కూడా ప్రయోగించారు. పదజాలం అలంకారాలతో కూడుకొని ఉంది. కవిత్వం చదువుతుంటే అలా సాగిపోతుంటుంది. కవి తాను అనుభవించిన జీవితాన్ని మాత్రమే తన కవిత్వంతో చర్చించలేదు. తన చుట్టూ వున్న సమాజాన్ని మిళితం చేశారనిపించింది. తాను రైలు ప్రయాణం చేస్తున్నప్పుడు కనిపించిన బిచ్చగాడి జీవితాన్ని, దళిత ఆడ పిల్లలను జోగినులుగా చేసి, వారిని మానసికంగా వేధించే పద్దతిని కవి తన కవిత్వంలో నిరసించారు. ప్రపంచంలో జరిగే ప్రజాస్వామిక ఉద్యమాల గురించి కవిత్వంలో కనిపిస్తుంది. ఇక్కడ కవికి ఉన్న సమాజం పట్ల ప్రేమానురాగాలు వెల్లడవుతున్నాయి. ప్రపంచీకరణ నేపథ్యాన్ని కవి తన కవిత్వంలో ప్రతిఫలింపజేశారు. దళితుల ఆశాజ్యోతి డా॥ బి. ఆర్ అంబేద్కర్ భావజాలం వైపు దళితుల జీవిత నావ పయనించాలనేది ఈ కవి దృక్పథంగా తెలుస్తుంది.

'*నెమలి కన్నులు*' అనే ప్రయోగం 'జ్ఞాపకాలు' అనే అర్థంలో ఉపయోగించి నట్లనిపిస్తుంది. గ్రామం నుండి ప్రపంచం వరకూ కవిగా తానూ, తనలో దళితుల్నీ, మానవుల్నీ అందరినీ సామాన్యీకరించుకున్న స్థితి ఈ కవిత్వంలో కనిపిస్తుంది. ప్రధానంగా దళితుల జీవితాను భావాలు ఆనంద డోలికల్లో తేలియాడేలా ఉ ండవు. పూల పాన్పుపై పయనించినట్లుండవు. అడుగడుగునా ముళ్ల పాదాలు ఎదురు పడుతుంటాయి. చిన్న చిన్న దారి చేసుకుని, ప్రధాన మార్గానికి రావాలి. అది దళితులు పడుతున్న జీవితానికి నిదర్శనం. తన ఇంటి సమస్య, తన గ్రామ సమస్య, తన చుట్టూ ఉండే వాళ్ల ప్రభావాల సమస్యలన్నింటికీ దళితులు పడే సంఘర్షణ మిగతా వాళ్లతో పోలిస్తే చాలా భిన్నంగా ఉంటుంది. అదంతా 'నెమలి కన్నులు' కవిత్వంలో కనిపిస్తుంది. దళితుడు జీవించిన బాల్యం ఎలా ఉంటుంది? ఇతర కులాల మాదిరి ఉంటుందా? అనే వేదన ఈ కవిత్వం చెపుతుంది.

తన గ్రామం నుండి గ్లోబల్ విలేజ్ గా మారిన ప్రపంచం వరకూ దళితుడు తన అస్తిత్వం ఎలా ఉందో ప్రశ్నించుకోమని నిలదీస్తుంది. తానెటు వైపు నిలబడాలో, తానెల సంఘర్షణకు గురవుతాడో ఆ సంఘర్షణలనుండి బయట పడాలంటే అంబేద్కర్ చైతన్యమే మార్గమనే సూచనిస్తుందీ కవిత్వం. రాయాల్సింది చాలా ఉన్నా, రాయగలిగిన అంశాలనేకం ఉన్నా పుటల పరిమితి నా రాతకు సంకెళ్ళు వేస్తుంది. ఈ కవిత్వం దళితులే కాదు మిగిలిన వాళ్ళ మనసులకు హత్తుకుంటుంది. వాళ్ళు రసహృదయులైతే !!

–బడిగె ఉమేశ్,

పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం,

సెంట్రల్ యూనివర్సిటి, హైదరాబాదు

మొబైల్ : 09494815854

❖ ❖ ❖

మా దార్లన్నీ మా "దార్లే"

– డా॥ నారాయణం సురేశ్ బాబు

మహాప్రస్థానంలో శ్రీశ్రీ చెప్పినట్లు "పరస్పరం శక్తులు సంఘర్షించుకుంటే కవిత్వం పుట్టిందన్నట్లు' దార్ల కవితావాహిని వెనుక దాగిన సత్యం కూడా ఇదే. సమస్యలు మనిషిని మనీషిని చేస్తాయనడానికి చక్కని ఉదాహరణ మా దార్ల. విశ్వవిద్యాలయంలో చదివేరోజుల్లో హాస్టల్ దార్లగదిలో నిద్రపోయేటప్పుడు నల్లగా ఉన్న నల్లబల్లే తెల్లవారేసరికి కవితాక్షరవర్ణచిత్రాలతో భాసిల్లడం మాకందరికీ ఆశ్చర్యం కలిగించే నమ్మలేని నిజం. ఎందుకంటే అప్పటికి మా దార్లలోని సాహిత్యనైజం, కవితా ఇజం మేం అర్థం చేసుకోలేక పోయాం కాబట్టి. పెదాలమీద నవ్వుకు ఆనకట్టవేయకుండా, మనసు తలుపులు తెరిచిపెట్టి, కవితావరదను అదుపుచేయడం బహుశా మాలో ఒక్క దార్లకే చెల్లింది. నడకలో, నడతలో, ముఖకవళికలో ఏమాత్రం దైన్యం కనపడనీయని ఒక సాహసి దార్ల. తనమీద తనకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా అహరహం శ్రమించే కవితాకర్షకుడు మా దార్ల. ప్రపంచంలో తాత్త్వికవేత్తలందరూ అంతర్ముఖీనంగా ఉంటారనే సత్యం మాదార్లను చూసిన తరువాత గాని మాకు అర్థం కాలేదు. మా మాటల సందర్భంలో దార్ల ఎక్కువగా ఉపయోగించే "సైద్ధాంతికనేపథ్యం' అనే పదంలోని నిగూఢత్వం రోజులు గడిచేకొద్దీగానీ మాకు బోధపడలేదు. దార్లకు తీయని బాధచేసిన గాయంతో మేమందరం ఒక్కటైయ్యాం. "మా' అనే ఏకాక్షరానికి ఉమా, దార్ల, ఈశ్వర్, సురేశ్, మోహన్ అనేది వ్యుత్పత్త్యర్థం. కొన్నాళ్ళకు ఈ అర్థం విస్తృతమై 'శర్మ' అనే పదం కూడా మాలో అంతర్భాగమైంది. త్రిపురాంతకపు సముద్రాల

లక్ష్మీవేంకట ఉమామహేశ్వరరావు, అమలాపురం దార్ల వేంకటేశ్వరరావు, నర్సీపట్నం ఈశ్వర్, విజయవాడ నారాయణం సురేశ్ బాబు, ఖమ్మం దారపనేని మోహన్ బాబు, సిద్ధిపేట గౌరీభట్ల బాలముకుంద శర్మ. ఏ ఊరైతేనేం, ఏ ఇంటిపేరైతేనేం, ఏ ఇంటివాళ్ళమైతేనేం మేమందరం జాషువా శిశువు కవితలోని వాళ్ళం. మాయలు, మర్మాలు అప్పటికి లేనివాళ్ళం, తెలుసుకోనివాళ్ళం. మొత్తం మీద సమాజానికి మనుషులం, తరగతిగదిలో విద్యార్థులం, హాస్టల్ గదిలో పసిమనసుల శిశువులం. ఎందుకంటే విశ్వవిద్యాలయంలో ఏ దురలవాట్లు మా జోలికి రాలేదు. కాదు మా దగ్గరకు రానివ్వలేదు. మాకు చదువు నేర్పిన గురువులకు పాదాభివందనాలు.

మా దార్ల కవిత్వంలోని ఇజాలజోలికి పోకుండా, నిజాల్ని నమ్ముతూ, కవితా మాధుర్యాన్ని మాత్రమే ఆస్వాదించే స్వభావం ఉన్నవాళ్ళం మేమంతా. కాబట్టే ఇప్పటికీ స్నేహితులుగానే ఉండగలిగాం, ఉంటున్నాం, ఉంటాం కూడా. ఐతే మా దార్ల ఎన్ని కవితా సంకలనాల్ని వెలయించినా దాని వెనుక దాగి ఉన్న జీవన పోరాటచైతన్యమే కనపడుతుందే గానీ వ్యక్తిగత అభిప్రాయాలకు చోటుకల్పించం. ఎందుకంటే మా దార్లలోని కవినే మేం ఎప్పుడూ చూడాలని కోరుకుంటాం. కవికి కానీ, కావ్యానికి కానీ అంతిమంగా ఉండేది లోకహితమే కాబట్టి. ఒక కవితాచైతన్యానికి హద్దులూ, వర్గాలూ, వైషమ్యాలు, ఉండవనేది మా అందరి ప్రగాఢవిశ్వాసం.

కానీ మాదార్ల కవితాస్రవంతికి మూలధాతువు సంఘర్షణ. సగటు మనిషిగా సమాజంలోని వ్యవస్థను సునిశిత పరిశీలనాదృక్పథంతో చూసిన జీవితానుభవంతో కవిగా తన భావతీవ్రతతో ప్రకంపలను సృష్టించగలిగాడు. అందువల్ల దార్లలో మనిషిగా ఎదుర్కొన్న సామాజిక సంఘర్షణకు కవితాచైతన్యం సాధనమై కావ్యం రూపంలో ఆకారం ధరించిందని భావించవచ్చు. నిజాన్ని మార్చే శక్తి ఈ ప్రపంచంలో ఎవ్వరికీ లేదు, కానీ ప్రపంచాన్ని మార్చే శక్తి నిజానికి ఉందని నమ్మిన దార్శనికుడు మాదార్ల. ప్రశ్నించే శక్తి, ఆసక్తి ఉన్నా గెలవాలన్న తపన, గెలవగలను అన్న నమ్మకం, నిరంతర సాధన ఈ మూడే మా దార్లను ఇంతటి ఉత్తమస్థితిలో ఉంచగలిగాయి. ఎవరైనా గెలవటంలో ఓడిపోవచ్చు, కానీ ప్రయత్నించడంలో గెలుస్తుంటారు, ప్రయత్నిస్తూనే గెలుస్తుంటారు, గెలిచి తీరుతారు

అన్న జీవనసత్యాన్ని పుణికిపుచ్చుకున్న మా దార్ల నిరంతరకృషి ఈ స్థాయికి తీసుకురాగలిగింది. ఈ ప్రయత్నంలో విచ్చుకున్నవే ఈ *నెమలి కన్నులు.*

మా దార్ల ఒకగొప్ప తాత్త్వికుడు. దానికి చక్కని ఉదాహరణ ఈ కవితా సంకలనానికి *నెమలికన్నులు* శీర్షికే. ఆకాశంలో నీలిమేఘాలు కమ్ముకుంటే, మురిసి, మైమరచి, పురివిప్పినాట్యం చేస్తూ, బాహ్యప్రపంచంతో సంబంధాలను తెంచుకొని, అలౌకిక ఆనందానుభూతులకు లోనౌతుంది నెమలి. అందువల్ల నెమలి కన్నులు భౌతికప్రపంచంతో సంబంధంలేని ఒక అలౌకికానందభూమికలకు ప్రతీకలు. ఈ చిన్మయానందం నుండే కవి కవితాస్రవంతిని వెలయిస్తాడన్న వర్డ్స్ వర్త్ మాటలను నిజం చేస్తూ రచించిందే ఈ *నెమలి కన్నులు* అనే కవితాసంకలనం. శ్రీకృష్ణుడు శిరస్సుపైన ఉన్న కిరీటంలో నెమలిపింఛం ఉండటం వెనుకకానీ, పదహారువేలమంది గోపికలకు శ్రీకృష్ణుడు ఒకేసారి సాక్షాత్కరించడం మొదలైన ఆధ్యాత్మికాంశాలలో నెమలి కన్నుకు ఈ అర్థమే ఉంది. ఈ భావాన్ని ఆకళింపు చేసుకొన్న మా దార్ల భౌతిక ప్రపంచంలో చేటుచేసుకుంటున్న అనేక అకృత్యాలను ప్రశ్నిస్తూనే ఒక అలౌకికానంద పరవశత్వంలో మానసిక సంఘర్షణకు లోనై రచించిన కవితాసంకలనమే *నెమలికన్నులు.*

బడిలో... అమ్మ ఒడిలో పడ్డ వేదనని, మా వూరు నవ్విందని రహస్య ద్వారాల రాగబంధాల్ని, నభూతో నభవవిష్యతి, గర్భకాన్ని, ఎక్సరే రిపోర్ట్ విషాదాంతాన్ని, అంతర్జాతీయ మార్కెట్లో పవిత్రప్రేమ సైనెడ్ కౌగిలిలో మిగిలి పోవడాన్ని, ఆ రాత్రి వేదనని, ఎంతకాలమిలా కాలంలో కసరత్తుచేయడాన్ని, తీయనిబాధచేసిన గాయాల్ని, పుట్టుమచ్చప్రేమని, హాస్టల్ అమ్మని, కూలుతున్న లైబ్రరీగాథనీ, గోడకివతలివైపు జీవనచిత్రాన్నీ, కల అదృశ్యంకాదనే దృశ్యాన్ని, ఓమైలురాయి దాటడాన్ని, చేనేతదృశ్యాల్ని, ఒంటరిగా బ్రద్దలౌతున్న సంఘర్షణని, సమాధులు మాట్లాడడాన్ని, నగరపురస్కారాన్ని, తెలుగు గుండెల్లో క్లాసికల్ గుబులుని, ఇప్పుడు కావాల్సిందాన్ని, ప్రాంతీయచైతన్యాన్ని, కాంక్రీటు పిచ్చుకగూళ్ళలోని తీయని కబుర్లనీ, పిచ్చోడిమీద జాలేస్తుందనడాన్ని, ఒక పెట్రోల్ సంతకాన్ని, నాన్న స్పర్శని, నానీ... నువ్వెప్పుడోస్తావు రా లోని ఆశని, ఇక్కడ పుట్టడమే నేరమా అని ప్రశ్నించడాన్ని, వికసించిన నల్లవజ్రాన్ని, మరకమంచిదేననడాన్ని, రహస్యం

విప్పిన చిలుకని, అంతా భ్రాంతియేనా అని ఒక తాత్త్విక లోకంలో అణువులో అణువౌవ్వడాన్ని బహుశా మా దార్ల చూసినంత గొప్పగా మరెవరూ చూడలేరేమో అనే సందేహం కలుగుతోంది.

దృశ్యమానప్రపంచంలో ఎదురౌతున్న ప్రతిసమస్యను ప్రతిబింబించే విధంగా తన కళ్ళను నెమలికన్నుల్లో చూపించే ప్రయత్నంచేశాడు మాదార్ల. సమాజాన్ని అతి దగ్గరగా చూసిన అనుభవం, సామాజికసమస్యలతో పెనవేసుకున్న జీవితం, అడుగడుగునా ఎదురౌతున్న జీవన పోరాటం వెరసి మాదార్లని ఒక సామాజిక చైతన్యంతో భాసిల్లే మానవతావాదిగా మార్చేసింది ఈ ఆధునిక ప్రపంచీ కరణసమాజం. ఎందుకంటే నెమలి కన్నుల్లో దాగిఉన్న సామాజిక వ్యవస్థ భావితరాలవాళ్ళకు చరిత్రపాఠాలు నేర్పుతుంది. ఒకనాటి సమాజస్థితిగతులను బేరీజువేయడానికి రాబోయే తరాలకు ఒక సంజీవినీ ఈ *నెమలి కన్నులు.* "చరిత్రేముందిరా చింపేస్తే చిరిగిపోతుంది" అనే పెట్టుబడీదారీ దురహంకారాన్ని, అసమతౌల్య మనస్తత్వాన్ని ఎదిరించి ప్రశ్నించగలిగిన ఒక ఆయుధం ఈ *నెమలి కన్నులు.*

అమ్మ ఒడి కమ్మదనాన్ని, బాల్యం గొప్పతనాన్ని వివరిస్తూ...

"శీతాకాలంలో దుప్పటి
అమ్మఒడిలో వెచ్చదనం
మళ్ళీ గుర్తొచ్చింది
బాల్యం!"

జీవన రహస్యాన్ని విశ్లేషిస్తూ...

"క్షణక్షణాల్లో జీవితం
వరం పొందాకే నిర్వేదం!
నీటి బుడగలో, మట్టి కుండలో
కొవ్వొత్తి వెలుగులో
ఆకాశనక్షత్రాల్లో...
తెలుస్తున్న జీవ రహస్యం!"

ప్రపంచీకరణ మత్తులో జోగుతున్న పబ్లిసిటీని వివరిస్తూ...

"నమ్మకాన్ని నమ్మేవాళ్ళున్నంతకాలం
నీ నమ్మకాన్ని కొనేవాళ్ళున్నంతకాలం
నిన్ను నమ్మేవాళ్ళున్నంతకాలం
నీకు నువ్వేసాటి
మనుషుల్ని రోబోలుగా
రోబోల్ని మనుషులుగా చేసేయ్
మరకమంచిదే!!"

మనిషిమస్తిష్కరంలో తేడా ఉంటుందేకానీ పుట్టుకలో కాదు అని నిరూపిస్తూ...

'నేనెవడికి పుట్టానో
నాకెవడివల్ల ఎవడు పుట్టాడో
ఆ దేవతల
చేతనే చెప్పించాలనిపిస్తుంది!'

ఆధునికసమాజంలో తన సామర్థ్యం తనకు తెలిసినా తెలియనట్లు నటించేవాళ్ళను, ఇతరులకు వచ్చే అవకాశాలను చూసి ఈర్ష్య, అసూయలతో వ్యవస్థనే నాశనం చేయాలనుకునే వాళ్ళను ప్రతీకాత్మకంగా వర్ణిసూ...

"నడవడమే చేతకానివాడు
పరుగు పెట్టేవాళ్ళతో పోటీపడుతూ
పాదచార్లందరికీ అడ్డు పడుతుంటాడు
తన స్థితిని తానే అర్థం చేసుకోలేక
'రోడ్డు' నే ధ్వంసం చేయాలనుకుంటాడు
ఇసుకరేణువుల్లైనా పెళ్ళగించలేక బోర్లాపడుతుంటాడు
పిచ్చోడిమీద జాలేస్తుంది."

అమెరికా దురహంకారాన్ని విశ్లేషిస్తూ...

"అందరూ చావాల్సిందే
చావుకి నిర్లేతో కొత్త నిర్వచనమిచ్చావ్

నీలోనూ లోపాలున్నా
యుద్ధం చేయాల్సిన వాడితోనే
నువ్వు యుద్ధం చేస్తున్నందుకేనేమో
నీతో చేస్తున్నా నా కరచాలనం
ప్రపంచాన్ని శాసిస్తున్న శాసనాన్ని
ధిక్కరించినందుకే నీకు నేను చేస్తున్నా ఓ సలామ్!"

ఆధునిక యాంత్రికజీవనంలో అపార్టుమెంటుబ్రతుకుతో సతమత మౌతున్న మనీమనిషిని విశ్లేషిస్తూ-

"సద్ది పెట్టెలో అన్నీ పెట్టాం
ఇంట్లో రంగుల టి.వి.
మాట్లాడాలంటే ఫోను
కాంక్రీటు పిచ్చుగగ్గూళ్ళల్లో
చుట్టూ జనసంద్రం పలకరించే మనిషి తప్ప!"

ఇలా సాగిపోతాయీ కవితలు.

నానీ..నువ్వెప్పుడొస్తావురా! అన్న కవితలో మా దార్లలోని వ్యక్తి గతజీవితం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. పిల్లలు కలగలేదనే నిర్వేదం, ఆ నిర్వేదంలోనే ఆనందాన్ని ఆశావాదంలో అనుభవించే భవిష్యత్ జీవితం వెరసి మాదార్లలో వెలితిని పసిగట్టవచ్చు. దార్లను దగ్గరగా చూసిన అనుభవం, అనుబంధం నన్ను ఈ విధంగా మాట్లాడేలా చేస్తున్నాయి. కానీ మా దార్ల అనేక కవితాపసిశిసువులను వెలుగులీ *నెమలికన్నులు* కవితాసంపుటికి ప్రమిదలరూపంలో పేర్చాడు. అందువల్ల మా దార్లకు పిల్లలు లేరనే బాధ లేదు. దార్ల లాగే పిల్లలు లేని ప్రతి తల్లిదండ్రులు మానసిక సంఘర్షణలకు లోనవుతుంటారు. అప్పుడిది కేవలం కవి పడిన సంఘర్షణ మాత్రమే కాదు, వాళ్లందరి సంఘర్షణలకు కవితావిష్కరణగా చూడాలి.

ఈ అభిప్రాయానికి "మా దార్లన్నీ మా దార్లే" అని శీర్షిక పెట్టడంలో ఒక ఆంతర్యం ఉంది. మా స్నేహితులందరిలోకెల్లా అత్యున్నతస్థితిలో ఉన్నవాడు మాదార్లే. సాహిత్య వ్యాసంగంలో నిరంతరం నిమగ్నమౌతూ కవితాశిశువుల్ని

సృష్టిస్తున్న చతుర్ముఖుడు మా దార్ల. మా ఉమా ఇప్పటికి దాదాపు ద్వాదశ గ్రంథనిర్మాణం చేసినా, ఈశ్వర్ మనసున్న మనిషిగా మానవసేవలో తరిస్తున్నా, మోహన్ జాబులో జాలీగా ఉన్నా, నేను పరిశోధనలో ఆసక్తి చూపిస్తున్నా దానికి మూలకారణం మా దార్లే. మా అదంరికీ ముందు నిలబడి ఉన్న దార్లను చేరుకోవడానికి మాకు మేము చేయదగిన ప్రతిప్రయత్నానికీ ప్రేరణ మాత్రం దార్లే. నిజానికి మాదార్ల ఉన్నస్థితి మాకు ఉన్నత స్థితి. కారణం మా దార్ల తెలుగు సాహిత్యంలో ఆచార్యుడిగా కేంద్రీయవిశ్వవిద్యాలయంలో ఉండటం మా అందరికీ ఒక గౌరవం, ఒక గుర్తింపు. అందువల్ల మా కళ్ళన్నీ దార్లనే చూస్తూ ఉంటాయి. మా లక్ష్యాలన్నీ దార్లవైపే నడుస్తుంటాయి. ఇప్పటికీ, ఎప్పటికీ మేము మేంగా ఉంటాం, మా దార్లన్నీ మాదార్లే. ఉన్నస్థితికన్నా ఇంకా ఉన్నతస్థితికి మా దార్ల వెళ్ళాలని, *నెమలికన్నులు* లాంటి మరిన్ని కవితాసంపుటిల్ని సాహిత్య లోకానికి అందించి మాకందరికీ ఆనందాన్ని కలిగించాలని, దీనికి కావలసిన ఆయురారోగ్యాలను ఆ దేవదేవుడు మా దార్లపైన అపారంగా కురిపించాలని కోరుకుంటూ.......

మీ

స్నేహితుడు

-డా॥ నారాయణం సురేశ్ బాబు,
సంస్కృతాధ్యాపకుడు,
ఆంధ్రలొయోలకళాశాల(స్వయంప్రతిపత్తి),
విజయవాడ-520 008.
చరవాణిః 9866282107

❖ ❖ ❖

మనసు విప్పేస్తున్నాను దార్లా!

–డా. ఎస్. ఎల్. వి. ఉమామహేశ్వరరావు

హాయ్ దార్ల! ఎలా ఉన్నావ్? కులాసానే కదా! నువ్వు పంపిన విద్యుల్లేఖ నా ఇన్ బాక్స్ తలుపు తట్టింది. తెరిచి చూశాను. సహస్ర ముఖాలుగా పురివిప్పాయి 'నెమలి కన్నులు'. ఒక్కొక్క కన్నును పరిశీలించుకుంటూ ముందుకు సాగుతుంటే, మనసు గతంలోకి పయనించింది. మస్తక పుస్తకాల్లో(Face Book) మానవ మనుగడ మంత్రించబడ్డ కాలంలో, విద్యుల్లేఖల షాకు తగిలి రెక్కలు విప్పుకొని పారిపోతూనో, రెక్కలు విరిగి కింద పడుతూనో సాంకేతిక సాలెగూళ్ళలో చిక్కుకున్న పావురాన్ని బయటకు తీశాను మనోభావాన్ని పంచుకోడానికి మాధ్యమంగా.

"చీనాంశుకమివ కేతో ప్రతివాతం నీయమానస్య" అని కాళిదాస మహాకవి చెప్పినట్లుగా పేజీలు ముందుకెళ్తుంటే మనసు వెనక్కి పరుగులు పెట్టింది, వేగంగా వెళ్తున్న రథానికి కట్టిన జెండాలా. 1995 జులై 17 వ తేదీ యూనివర్సిటీలో అడుగుపెట్టి, ఎడ్మిషన్ కు సంబంధించిన ఫార్మాలిటీస్ అన్నీ పూర్తిచేసుకొన్న తర్వాత 'డి' హాస్టల్ కేటాయించారు. ఎంత సిస్టమాటిక్ గా ఉంది ఇక్కడి వ్యవస్థ! అనుకుంటూ హాస్టల్ ఆఫీసుకు వచ్చాను.

ఆశ్చర్యం! నేను రాకుండానే నాకోసం ముందుగానే రూమ్ బుక్కయ్యింది. ఆరా తీస్తే మీ ఫ్రెండ్ బుక్ చేశాడని ఆఫీసు వాళ్ళు చెప్పారు. నాకు తెలిసిన ఫ్రెండ్ చిన్నప్పటినుండి కలిసి చదువుకున్న ఈశ్వరే. వాడు రావడానికి ఇంకా నాలుగు రోజుల టైముంది. మరెవరు?

నా ప్రమేయం లేకుండానే నా మార్గాన్ని తన మార్గంలోకి మళ్ళించ ప్రయత్నించిన 'దుర్మార్గుడు' ఎవరా? అని ఆలోచిస్తున్నాను. ఏది ఏమైనా పల్లెటూరి చెరువు నుండి పట్నం ఎక్వేరియంలోకి అడుగు పెట్టిన నాకు అనుకోని ఆప్యాయ ఆతిథ్యం అందినందుకు ఆనందంగానే అనిపించింది. ఆశ్చర్యం ఆనందాల అలలపై తేలియాడుతున్న నాముందు అకస్మాత్తుగా ప్రత్యక్షమయ్యావు.

"ఆయ్! ఉమామహేశ్వరరావు అంటే మీరేనాండి? నాపేరు దార్ల వెంకటేశ్వరరావు, ఎస్కేబీయార్ కాలేజీ, అమలాపురం ఆయ్!" అన్నావు. *'నేనెలా తెలుసు మీకు?'* అని అడిగాను. ఏదీ దాచలేదు. అంతా ఓపెన్ గా చెప్పావు. *"మీరు ఎంట్రన్స్ టాపర్ కదండీ! అందుకనే నా రూమ్మేంటుగా వేయించుకున్నాను"* అని. అందుకనే 'కూలుతున్న లైబ్రరీ'లో...

"అక్షరం ఒక వైపు

అన్నం ఒక వైపు పెడితే

నేను అక్షరాన్నే హత్తుకుంటాను అబగా!" అని నువ్వు అన్నప్పుడు నాకు ఆశ్చర్యం వెయ్యలేదు.

కానీ ఒక్క విషయం మాత్రం నిజం దార్లా! అప్పటివరకు చదువుకోవడమే తెలిసిన నాకు, ఆ చదువును గోడౌన్ లో నుంచి షోరూముల్లోకి ఎలా తేవాలో నీ దగ్గరే ఓనమాలు దిద్దుకున్నాను. నేనే కాదు! ఈశ్వర్, సురేశ్, మోహన్ అందరం. క్యాంపస్ లో మనం తిరగని చోటు లేదుకదా! అరమరికలు లేకుండా అన్నీ పంచుకునే వాళ్ళం.

రెండు వేల మూడువందల ఎకరాల సువిశాలమైన క్యాంపస్ లో మేధావుల ముసుగులో కొన్ని సంకుచిత దారులు స్పష్టంగానే కన్పించడం మొదలు పెట్టాయి. ఆ సంకుచితత్వానికి ఎవరి వాదనలు వారికున్నాయ్. నాలో చిన్నప్పటి నుండి సంస్కార భావాల్ని నాటిన ఆర్.ఎస్.ఎస్, 'ఆత్మవత్ సర్వభూతాని' అన్న ఆలోచనను ఆచరణలో చూపిస్తున్న జిల్లెళ్ళమూడి అమ్మ ఆశ్రమం అందించిన విశాలభావం మన మధ్య ఆ సంకుచిత భావాల్ని దరి చేరనివ్వలేదు. ఎంగిలి పంచుకోవడం ఇష్టముండదు. కానీ ఆప్యాయతను పంచుకోవడానికి అది అడ్డుకాలేకపోయింది. ఉప్మాను ఒకే కంచంలో పంచుకుంటున్న కంటికింపైన దృశ్యం కొందరికి

కంటగింపైంది. వాళ్ళలా మారిపోతున్నావని నన్ను, వాళ్ళతో చేరిపోతున్నావని నిన్ను ఈసడించు కుంటున్నా మనం మనలాగే ఉన్నాం.

తమకు నచ్చని ఎదుటివారి భావాల్ని గౌరవించలేని కొందరు చీకటిని ప్రేమించి వెలుగుల్ని ఆహ్వానించలేని గుడ్లగూబల్లా తయారయ్యారు. ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ ఉన్నవాడు దాన్ని కప్పిపుచ్చుకోవడానికి సుపీరియర్‌గా ప్రవర్తించినట్లు పశుబలాన్ని మాధ్యమం చేసుకున్నారు. సర్వమానవ సమానత్వం కోసం పోరాడుతూ, పరులపై ఆధిపత్య ధోరణిని నిరసిస్తూ తన జీవితాన్నే ప్రబోధంగా మార్చిన ప్రపంచ మేధావి పేరును ఆదర్శంగా చెప్పుకుంటున్న ఒక వర్గం, తనలాంటి తోటివాడినే తొక్కెయ్యడానికి కూడా ఆలోచించడంలేదు. ఇక ఇతరుల పట్ల వాళ్ళెలా ఉన్నారనేది చెప్పాల్సిన అవసరం లేదు. వాళ్ళు తమ ప్రవర్తనతో ఆత్మగౌరవానికి –దౌర్జన్యానికి మధ్య ఉన్న సరిహద్దు రేఖను చెరిపి వేస్తున్నప్పుడు విశాల మనో వీధుల్లో కూడా మంచు తెరలు కమ్ముకునే సూచనలు కన్పించాయి. కానీ ఆర్.ఎస్.ఎస్ నేర్పిన సంస్కారం, అమ్మ ఆశ్రమం అందించిన భావ వైశాల్యం వివేచనా సూర్యరశ్మిని ప్రసరించాయి.

నోటితో మాట్లాడి నొసటితో వెక్కిరించే మేక వన్నె మౌఖిక మద్దతుదారుల్ని 'మన' అనుకొని మురిసిపోయారు. శల్యసారధ్యాలు, శకుని కాపట్యాలకంటే బహిరంగంగా బయటకు వచ్చిన యుయుత్సుడే మేలుకదా!

'కుహనా సంస్కర్తల, కుహనా మేధావుల, కుహనా సమర్ధకులతో వచ్చిన, వస్తున్న చాప కింది ప్రమాదం 'అగ్రకుల ఆధిపత్యం' కంటే ప్రమాదమేమో. ఆలోచన ప్రసరించని చీకటి మార్గం. ఆ ఆలోచనా మార్గంలో కూడా పయనించిన మేధావులు తమ గోడు వినే నాథుడు కరువై పుస్తకాల్లో అక్షరాల్లా మారిపోతున్నారు. దార్లా! కూతురి నుండి పొందలేని సామరస్య భావనను కోడలి నుండి ఆశించాల్సిన అగత్యాన్ని కల్పిస్తున్న సమాజంలో అస్తిత్వ నిరూపణం అంత సులభమేం కాదు. కానీ సమాజంలో సమానత్వాన్ని నింపి, శ్రేయస్సును పెంపొందించాల్సిన 'సాంఘిక సంక్షేమం' కొందరు నాయకుల కాదు! కాదు! అందరి స్వార్ధపరుల అధికార కొనసాగింపుకు ఆధారమై రాజకీయ రంగు పులుముకున్న నేపథ్యంలో, నియమలేఖనం చేసిన ప్రపంచ మేధావి వైపు అనుమానంగా చూస్తుంది తమ

అసహాయతను అధిగమించలేని మధ్యతరగతి అగ్రవర్గం.

రాజ్యాంగ సంస్కరణం అనగానే ఉలిక్కిపడుతుంది సంక్షేమ కుహనా మేధావి వర్గం, ఎక్కడ తమ గుట్టు బయటపడి పుట్టి మునిగి పోతుందేమోనని. అందరి ఆకలి పేరు చెప్పి తెచ్చుకుంటున్న ఆహారంతో కొందరే కడుపులు నింపుకొని, మిగిలిన వారి కడుపు మంటల వెలుగులో తమ అవసరానికి మించిన భవిష్యద్దర్శనాన్ని చేసుకుంటున్నారు. '*'సోషల్ రిఫార్మ్కు మూలస్తంభం విడో మారేజే అయినప్పుడు, ఇన్ ఫాంట్ మారేజే లేకపోతే విడో మారేజీకి అవకాశ మెక్కడుంటుం'*దన్న గిరీశ వారసత్వం సోదరుడి పైనే మూడో పాదం మోపుతుంది. '*నీ ఎడమ చెయ్యి తియ్! నా పుర్ర చెయ్యి పెడతా*'నన్నట్లు, ఏ స్వార్థ పరత్వానికి, ఏ ఆధిపత్య భావనకు, ఏ అణచివేతకు వ్యతిరేకంగా అస్తిత్వ పోరాటం చేశామో, అదే స్వార్థం, అదే ఆధిపత్యం కోసం ఆ అణచివేత మార్గాన్నే ఎన్నుకుంటున్నాం కదా! కాకపోతే అప్పుడు పరాయివాడు, ఇప్పుడు మనవాడు. మళ్ళీ అదే మాట చెప్తున్నా దార్ల! కూతురు నుండి పొందలేని సామరస్య ధోరణిని కోడలి నుండి ఆశిస్తున్నాం. పాతసంకెళ్ళు వదిలించుకుంటున్నామన్న మోజులో కొత్త సంకెళ్ళను తగిలించుకుంటున్నాం. పరస్పరం సంఘర్షించిన శక్తులలో చరిత్రే కాదు వర్తమానం కూడా నడుస్తుంది. రావణ కాష్టాన్ని రగిలిస్తూనే స్వార్థ భవిష్యత్తుకు రాజమార్గాలు నిర్మించుకుంటుంది, బడుగు జీవుల మాంసాన్ని మట్టిగా, ఎముకల్ని కంకరగా, నల్లని రక్తాన్ని తారుగా చేసి. లేకపోతే ఏంటి దార్ల! ఒక ప్రపంచ మేధావి ఒక దశాబ్దం కోసం చేసిన ప్రణాళిక ఇంత దారుణంగా విఫలమవుతుందా ఫలితాన్నందించలేక? చెట్టుకు మందు కొట్టే సమయం చేజారి పోతుం(యిం)ది. వేరుకు చికిత్స చెయ్యాల్సిన తరుణ మాసన్నమయ్యింది.లేకపోతే చెట్టు పేరు చెప్పుకొనే కడుపు నిండిన పరాన్నజీవులు విజృంభించి ఆకలి కడుపుల్ని కాల్చి అదే చెట్టుకు ఎరువుగా వేస్తాయి.

ఏం దార్లా! సమాజపు బాధను నీ బాధగా చేసుకొని అక్షరీకరించిన నీ మనసును సరిగానే అర్థం చేసుకున్నానా? కానీ ఒకటి మాత్రం చాలా నచ్చింది దార్లా! తప్పు చేసిన కౌరవులతో త్రికరణ శుద్ధిగా సంధి ప్రయత్నాలు చేసిన

యుధిష్ఠిరుడిలా అన్యాయానికి గురై కూడా అనురాగ హస్తాన్ని చాపిన నీ సమన్వయ ధోరణికి జోహార్లు. నీ కవిత చదివిన తర్వాత ఇంత ఆలోచించాను దార్ల! ఇంత ఆలోచించిన తర్వాత మళ్ళీ ఆ కవితను చదవాలని ఉంది.

"కందిన చరిత్ర గాయం
నేడు దండోరా గేయమై మ్రోగుతోంది
మిత్రవైరుధ్య శత్రు శిబిరంలో
సింహస్వప్నంలా కన్పిస్తోంది!

అంటరానితనంలో
మళ్ళీ అంటరానితనం పెంచే
ఇంటర్ సుపీరియారిటీని భరించలేక
అంతరాంతరాల్లోని
అగ్నిపర్వతం పగిలిందిప్పుడే!
....
....
సముద్రపు లోతుల్లోకెళ్లాను
మొసళ్ళ విజృంభణను చూశాను
అందితే స్వజాతినే తినేస్తున్న
అవకాశ కొరమీనుల సమూహం పాడిన
సమైక్యతా గీతాలను విన్నాను"

'ప్రజాసేవ' చెయ్యడం కోసం ఎత్తుకు పై ఎత్తులతో పోటీపడ్డ రాజకీయనాయకుల్లా 'సమసమాజం'కోసం, సర్వమానవ 'సమానత్వం'కోసం చేస్తున్న పోరాటంలో ఆధిపత్యం కోసం జరిగే బూటకపు ఎన్ కౌంటర్లలోని చీకటి కోణం నిజంగానే వెన్నులో వణుకు పుట్టించిందంటే నమ్ము.

"అడవి తల్లి కదా అనుకొని
అక్కడికి పోయి చూస్తే

అధికారం రక్తం మరిగిన సింహాలు

జూలు విదిలించి

చిత్ర వధ చేస్తున్నాయ్

జిత్తులు చేసి

కుట్రలు పన్నే గుంట నక్కలు

గోతులు తవ్వుతూనే వున్నాయ్!"

పరాయి బిడ్డలకు కులాంతర, మతాంతర వివాహాలు చేస్తున్న కుహనా సంస్కర్తలు అదేస్థితి తమ బిడ్డల వరకు వచ్చేసరికి మనస్సుపై మేధస్సును స్వారీచేయించి బోర్డుమీద రాతల్ని డస్టర్ తో తుడిపినంత ఈజీగా మనసుల్ని ఫినాయిల్ తో ఇంకా అవసరమైతే ఏసిడ్ తో కడిగిన వాళ్ళను మనం చూడలేదా?

ఆధిపత్య, అవకాశవాద నిర్మూలన అస్తిత్వం, ఆత్మగౌరవం అంటూ గూట్లో గర్జిస్తున్న పక్షులు, అందని కిరీటాల కోసం అర్రులు చాస్తూ అధికారుల అనుగ్రహం కోసం, ఆత్మను తాకట్టుపెడుతూ భజన బృందంతో చేరి తోడిరాగానికి వంతపాడుతున్నాయి. అమ్మపుట్టిల్లు మేనమామకు తెలీదా! సరేలే వాళ్ళని వదిలెయ్ దార్ల!

***

నీకవితల్ని ఒక్కొక్కటీ సానుభూతితో విశ్లేషించుకుంటున్నాను. సానుభూతి అంటే అందరిలా దయా, జాలి అనే అర్థంలో నువ్వు అనుకోవని నాకు తెలుసు. 'నీ అనుభవంతో సమానమైన అనుభూతి'తో అని నేను నీకు వివరణ ఇవ్వాలనుకోవడంలేదు. దార్ల! నీ స్నేహితుడిలా కాక ఒకసారి విమర్శక విద్యార్థిలా నీ కవిత్వాన్ని చదివాను. పురాణ ప్రతీకల్ని ఎంత సమర్థంగా వాడుకున్నావు దార్ల! నీకున్న సంప్రదాయ పునాది నాకు తెలియందేం కాదు. కానీ నువ్వు వాటిని వాడుకున్న సందర్భశుద్ధి నిజంగానే ఆశ్చర్యం కల్గించింది. ధృతరాష్ట్రకౌగిలి, అగ్నిపరీక్ష, కణ్వుని ఆర్ద్రత, కర్ణుడి ఆవేదన, చీకట్లో అర్జునుడు, రేపల్లెలో క ృష్ణుడు, అగ్నినేత్రం, పాదలేపనం, అగ్నిహోత్రం, మంత్రమహిమలు, స్వర్గనరకాలు, అమృతంగమయ... శబ్దం మోయలేనంత అర్థంతో కూర్చావు. అనుకోకుండా అయ్యే ఎస్ ఆఫీసర్ వచ్చి తన పక్కన కూర్చున్నట్లుగా

సామాన్యవాక్యం కూడా సంబరపడిపోయింది.

"కాంక్రీటు పిచ్చుకగూళ్ళలో..." కవిత చదువుతున్నప్పుడు దార్ల! నిజంగా నన్ను నా ముందే నగ్నంగా నిబెట్టింది. ఆర్థికంగా తోడ్పడ్డమే కానీ, ఆప్యాయంగా అమ్మా నాన్నల్ని చూసుకోలేని ఆధునిక జీవితం ఆదేశించిన అసహాయతకు నాకు తెలియకుండానే అవమానంతో బరువెక్కిన నా తల నేలను చూస్తూ ఉండిపోయింది.

ఆధునిక జీవితం అర్థంకాకపోతే ఆధునిక కవిత్వం అర్థంకాదంటారు శ్రీశ్రీ. నీ కవిత్వం చదువుతున్నప్పుడు నీ జీవితాన్ని దగ్గర నుండి చూసిన నాకు శ్రీశ్రీ వాక్యం ప్రత్యక్షర సత్యమని మరోసారి అర్థమయ్యింది దార్ల! ఆ సమయంలో 'కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ' తనలోని ఔన్నత్యాన్ని నా ముందు సగర్వంగా ప్రదర్శించడానికి సంకోచించలేదు.

*"బడిలో... అమ్మ ఒడిలో, మావూరు నవ్వింది, హాస్టల్లో అమ్మ"*లాంటి కవితల్ని చదువుతున్నప్పుడు మన యూనివర్సిటీలోని వి.సి.రాక్ మీదనో, చెట్లకిందనో, లైబ్రరీ లాన్ లోనో, సాయంత్రపు నడకలోనో మనం పంచుకున్న చిన్ననాటి జ్ఞాపకాలు, కాలేజీ రోజులు, యూనివర్సిటీలో కళ్ళముందు జరిగిన సంఘటనలు, వెక్కిరించిన 1995నాటి స్వాతంత్ర్యదినం అన్నీ గుర్తుకొస్తున్నాయి దార్ల! ఆడంబరాలే అవసరాలుగా మారిన ఈ రోజుల్లో అవసరాల్నే ఆడంబరాలుగా ఆనందించే జనం గురించి నువ్వు కన్న '*'కల అదృశ్యంకాదు'*లే దార్ల! యూనివర్సిటీలోని రంగుల ప్రపంచం, ఊహలలోకం మురిపిస్తున్నా వాస్తవాల్ని వీడకుండా నిన్ను నువ్వుగా 'జల్లెడవేసుకున్న' క్షణాలు నాకు కొత్తకాదులే!

దార్ల...! నీకో విషయం చెప్పనా! మా కొలీగ్ '*ఆరాత్రి*' కవిత చదివి 'మీ' దార్ల కెవరైనా గర్ల్ ఫ్రెండ్ ఉన్నారా?" అని అడిగాడు. పంచపాండవుల్లాంటి మన అయిదుగురిలో నీకు మరింత ఆప్తుడైన ఈశ్వర్ బతుకు తెరువు బాటలో బీహార్ వెళ్తుంటే రైలెక్కించి వచ్చిన నాటి "ఆ రాత్రి" నీ పరిస్థితిని నా కళ్ళముందు మరొక్కసారి ప్రదర్శించింది. దీన్ని నువ్వు చాలా జాగ్రత్తగా మరొక దానితో ముడివేసి సాధారణీకరించే ప్రయత్నం చేశావు కదూ! అందుకేనేమో కవిత్వం వైయక్తికంగాకనిపిస్తూనే అందర్నీ తనతో ముడివేసుకోగలుగుతుందంటారు.

'జల్లెడవేసుకో', 'అంతర్జాతీయ మార్కెట్లో పవిత్రప్రేమ' లాంటి కవితల్ని చదువుతుంటే మన ఆత్మీయగురువులు ఆచార్య ముదిగొండ వీరభద్రయ్యగారి క్లాసే గుర్తొచ్చింది దార్ల! ప్రతీక ల్ని, భావచిత్రాల్ని ఎంత బాగా చెప్పేవారో కదా! వాటిని బాగానే జీర్ణించుకున్నావని నీ కవిత్వమే చెప్తుందిలే! ఆ పాఠాలెంతగా పట్టకపోతే *'నెమలికన్నులు'* అని పేరెలా పెడతావ్!

క్యాంపస్‌లో పున్నమి వెన్నెల రాత్రిలో ఎల్.హెచ్-3 దగ్గర ఈశ్వర్, నువ్వు, నేనూ, మోహన్, సురేశ్, శర్మ , కరుణ, శైలజా, అంజనీ, షర్మిల అందరం రోడ్డు మీద కూర్చొని పన్నెండు గంటల వరకు 'కొత్తపాట' కవితా సంకలనం చదువుకున్నాం గుర్తుందా! లైబ్రరీ లాన్ లో కూర్చొని బాలవ్యాకరణం, ప్రబంధాలు, శ్రీశ్రీ, గురజాడల గురించిన చర్చల్లో మునిగిపోయి, మూసేసిన మెస్‌ను తెరవమని మెస్ సెక్రటరీని బతిమాలుకున్న రోజులు మళ్ళీ గుర్తుకొస్తున్నాయి దార్ల!

ఇప్పటికీ మనం మారలేదు దార్ల! కబుర్లలో పడితే కాలమే తెలీదు మనకు. నిన్నకాక మొన్న ఫోన్ లో బాలెన్స్ అయిపోతేగానీ తెలీలేదు. అప్పటికి గంటా ఇరవై నిమిషాల నుండి సామాజిక సమస్యల్ని, వాటిని సాహిత్యీకరిస్తున్న ధోరణుల్నీ మన సంభాషణ రోళ్ళలో రుబ్బుతున్నామని!

సరే దార్ల! నీ కవిత్వం చదువుతుంటే మన క్యాంపస్ జ్ఞాపకాల వర్షం కురుస్తూనే ఉంటుంది. ఇక, ఉండనా మరి!

ఇక్కడ అమ్మా, నాన్న, కరుణ, పాప అందరూ క్షేమం. అక్కడ అమ్మకు నమస్కారాలు తెలియజెయ్యి. మంజుని అడిగానని చెప్పు.

ఉంటాను. ఆ! ఒక్క నిమిషం దార్ల! ఇప్పటికీ మనం మారలేదు అని పైన రాశానుకదా! కానీ, ఈ విషయంలో మారడం అవసరమా?!.

ప్రేమతో...

ఉమ

❖ ❖ ❖

ఆత్మలు కురిసిన కవిత్వం
"నెమలి కన్నులు"

–వేముల ఎల్లయ్య

దళిత సాహిత్యం ఉగ్రూతలూగుతున్న రోజుల్లో మాలాంటి కవులం ఆనందాన్ని అనుభవిస్తుంటే ప్రెస్‌క్లబ్, బషీర్‌బాగ్ సదస్సు నిండా ఆనాడు వీళ్ళు పరిశోధక విద్యార్థులు. కవులు బస్ చార్జీలు లేక కాలినడకలతో కాలం ఎల్లదీసిన కవులు వీళ్ళు. అందులో దార్ల ఒకరు. తెలుగు శాఖలో పరిశోధన విద్యార్థుల్లారా... విన్నవిస్తున్నాం వినండి. ఈనాడు యుజిసి ఫెలోషిప్పుల వల్ల బండ్లు, కార్లు, కాలం కలిసి రావడం, కాలినడకన వచ్చిన విద్యార్థులే అధ్యాపకులయింద్రు. వీళ్ళను గౌరవించండి. వాళ్ళు ఫెలోషిప్ డబ్బు కొంత ఖర్చు చేశారు. *మాదిగ చైతన్యం* లాంటి సంకలనం యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, తెలుగు శాఖ నుండి రావటం తెలుగు సాహిత్యంలో అస్తిత్వ ఉద్యమాలకు ఎంత ఊరట నిచ్చిందో చూడండి.

బాటలు అనేకం, బంధాలు వేరువేరు అయినా కొద్ది మందే కవిత్వమై జీవిస్తూ, నిలదొక్కుతుంటారు. అయితే అస్విత్వ నిర్మాణంలో కోస్తా భాషా శ్కెలిని జీవిత నిర్మాణాన్ని దార్ల నిర్మించాడని పాఠకులు గమనిస్తే ఇంకా మంచిది. కవితా ప్రక్రియలో దళిత సౌందర్యాన్ని బోధించే బోధకుడిగా, కవిగా, ఏ కులానికి ఆ కులం ముక్క ముక్కలైనా దానిపద్ధతిని మాత్రం ఏరి కోరి భావ నిర్మాణం చేసి తన కుల తాత్వికతను తన ముందుతరాలకు అందించిన దళిత తాత్వికుడే

మాదిగ చైతన్యం సంకలనంలో తన కవితా శీర్షిక *"మాదిగ మానిఫెస్టో"* ను ప్రకటించడం సాహితీలోకాన్ని కుదిపివేసిన ఒక గొప్ప సంఘటన. ఆ రోజుల్లో 'మండుతున్న మాదిగడప్పు' కవితా శీర్షిక దళిత కవిత్వానికి ప్రేరణినిచ్చిందని చాలా మంది మంచి కవులు, వాళ్ళ సమూహాల్లో చర్చలు చేశారు. అందులో శివసాగర్ కవిత్వం సొంత సమూహ కవులకు గుండె ధైర్యాన్నిచ్చిందని చెప్పటానికి ఎలాంటి సందేహమూ లేదు. కోస్తాంధ్ర బురద కాళ్ల బుడ్డోడు పడిలేచి యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్ క్యాంపస్‌లో ఎన్ని డక్కా ముక్కీలు తింటే ఈ *మాదిగచైతన్యం* సంకనానికి సహ సంపాదకునిగా ఉండగలిగి ఉంటాడు? అదీ ఒక చరిత్ర. కవీ నిన్ను మరిచిపోదుగాక జాతి అని మాట ఇస్తున్నాం.

ఉద్యమ నాయకులందరూ తెలుగులో నిష్ణాతులే. పాలనా భాష ఉర్దూ, ఆంగ్లం. భాషా నిర్మాణ చర్చలు అంటున్నారు. వాళ్ళ అవసరాల నిమిత్తం ప్రజల భాషను స్వీకరించారు. మెజారిటీ భాష తెలుగే. అగ్ర కులాలు అందలాలెక్కి తందనాలు ఆడి పరాయిదేశంలో రంధీ అనే బందిఖానాల్లో జీవిస్తున్నారు. మీరు వాళ్ళ గురించి ఆలోచించకండి. ఇన్ని బాధలల్లో నుండి వచ్చిన 'దార్ల' కవి అయ్యిండు. అధ్యాపకుడై కోటానుకోట్ల మాదిగల సాంస్కృతిక జీవనాన్ని అధ్యయనం చేయడానికి ఒక మేజరు రీసెర్చు ప్రాజెక్టు తేవటం సాహసోపేత చర్యగానే భావించాలి. దానిలో భాగంగా యాభై వేల రూపాయల పుస్తకాలు కొనుగోలు చేయటం... అందులోనూ దళిత బహుజన మరియు వారివారి ఉపకులాల వీరగాథలు సేకరించి కొనుగోళ్ళు చేయటం వంటివన్నీ తెలుగు శాఖకు, సెంట్రల్ యూనివర్సిటీకి అదనపు బలమని చెప్పొచ్చు. ఈ దారిలోనే మాల కుల సాంస్కృతిక అధ్యయనం పేర వేరే శాఖకు ఒక ప్రాజెక్టు రావడం కూడా దార్ల దారిలోనే అని చెప్పవచ్చు.

ఇరవై సంవత్సరాల మాదిగ రిజర్వేషన్ పోరాటమిది, దండోరా ఉద్యమం, సాహిత్యం ద్వారా చాలా మంది కవుల కూడలిలో ఒక పరిచయం. నాకు కొన్ని చెడు అలవాట్ల వలన 2009లో నాకు గుండెజబ్బు వచ్చి ఆ ప్రమాదం నుండి బయట పడ్డాను. నా కవిత్వాన్ని అంతటినీ సేకరించి "ముల్కీ" కవిత్వంగా ముద్రించాను. ఆ పుస్తకం ఎక్కడో చూసి ఫోను చేశాడు దార్ల. "అన్నా... నాకు

బుక్ పంపావా..!" అన్నడు. *"రెండు కాపీలు నీ మాదిగ వెబ్ సైట్ కోసం పంపిన"* అన్నాను. ఆ పలకరింపులోనే నా గుండె జబ్బు గురించి కూడా చెప్పాను. అప్పుడే నా చదువు వివరాలు, గుండెజబ్బుకి అయ్యే మందుల ఖర్చులు వగైరా అడిగాడు. *"నా దగ్గర మేజర్ ప్రాజెక్టు పడ్డది. అప్లై చేయి'* అన్నడు. ప్రాజెక్టు వివరాలు అడిగిన. "*అది మాదిగ సాంస్కృతిక అధ్యయనం కాబట్టి నీకు దగ్గరగా ఉంటుందిలే"* అన్నడు.

ఆ రోజు జ్వరంతో ఉన్నా నాకోసం వచ్చి అప్లికేషను తీసిచ్చాడు. ఇంటర్వ్యూ డేట్ రావడం... తెలుగుశాఖ సిబ్బంది అధ్యాపకుల సమక్షంలో ప్రొ.సూర్యా ధనుంజయ్ ఎక్స్‌పర్ట్ గా వచ్చి ఇంటర్వ్యూకి చాలామంది వచ్చినా, ప్రాజెక్టుఫెలోగా నన్ను ఎంపికచేయటం, "రచయిత వేముల ఎల్లయ్య మేజర్ ప్రాజెక్ట్ ఫెలోగా ఎంపిక" అని వెబ్ సైట్ లో రావడం.... అసలు అసలు కవిత్వమంత ఆశ్చర్యమనిపించింది. నన్ను ఇంట్లకు పిలిచి *"అన్నా .! నీకు గుండె జబ్బు... నీకేమైనా అయినా నేను ఈ పని ఆపను. నేను చచ్చినా...నువ్వు మాత్రం ఈ పనిని ఆపొద్దు"* అని మాటదీసుకుండు. ఇద్దరం కలిసి ప్రాజెక్టు పూర్తి చేసినం. నన్ను రిలీవ్ చేశాడు. సంతోషం. కలలోకూడా అనుకోని ఒక ఫోన్ కాల్ నన్ను సెంట్రల్ యూనివర్సిటీలో పరిశోధకుడిగా మార్చింది. తనకు గుండెనొప్పితో ఉషాముళ్ళపూడిలో చేరడం, స్టెంటులు వేయించుకోవడం, మళ్ళీ సాహిత్యంతో పాటు, తన జాతి ఔన్నత్యంకోసం పాటుపడ్డం నాకు ఆశ్చర్యాన్నీ, ఆనందాన్నీ కలిగిస్తుంది.

ఆకు మలిగిన చెట్టు కొమ్మ గాలి ఎగసిన గానమై పల్లవికి అక్షరాలనద్ది తను కవిత్వమై వెనుదిరుగుతారు కవులు. అంతర్మథనతత్వం, ఆత్మవిశ్వాసమంతై, కాలం ముందు ఒక నిరసన గొంతవుతుంది. కవితలెత్తి రాజ్యాన్ని నిగ్గుతేల్చే వారసత్వమే కాల ప్రవాహంలో బతుకు తోడవుతుంది. అప్పుడే సాహితీ క్షేత్రంలో కలిసి నడవగలిగిన అడుగులు రాబోవు తరాలకు ఆనవాళ్ళుగా ఆత్మగౌరవమై అందిస్తూ, ఆనందిస్తాయి. చరిత్రలో అక్షరాలకు మించిన సాక్ష్యం ఏమి ఉంటుంది? కవి మదిలో కదిలి మెదిలిన భావం సామాజిక ప్రయోజనమై, నిత్య చైతన్యమై, జ్ఞానమనే వెలుగును, చీకటి గూడేలకు భావ వ్యాప్తి కిరణాలై ప్రసరించాలి. అప్పుడు

గానీ,పడిలేచి నిలువెత్తు నిత్య నూతనంగా నీడ కింద తన జాడ దొంగలించబడిందనే విషయ జ్ఞానం ఎంతో దూరం పయనిస్తే తప్ప మనిషికి అంత సులభంగా అంతు పట్టదు. ఆ దూరం తనదనే రందీ... మనుషులో కలకలం రేపాలి. కవి మనసు కల మైకడవలు దొర్లిన ఉర్కుట్లల నడక పదునెక్కి అంటరాని ఆత్మలు కవిత్వమై అల్లుకుంటాయి. ధాన్యం దులిపిన అక్షరగింజల పుస్తకం మొదట వస్తువై తన శైలిని ఆత్మగౌరవ ప్రతిఘటనకు తన రూపమై పదునెక్కి నిత్య నూతనత్వాన్నీ, నిత్యం రద్దీ కూడళ్ళ నడుమ గాయం చెప్పిన బంధం కవిత్వమై కత్తులు, గొడ్డలు, వేట కొడవళ్ళు ఆకస్మిక దాడులు బాధితులు మొండాలై, లేవనెత్తిన ప్రశ్నలు అనేకమై, గొప్ప మలుపు దారిలో ఉద్యమవుతాయి. ఈ దారిలోనే మాదిగల ఆత్మలు కురిపించిన కవిత్వమే దార్ల వెంకటేశ్వరావు "నెమలి కన్నులు" కవిత్వమైంది. ఈ కవితా సంపుటిలో నెలవంకల్ని మొగులు దులిపిన దోసిట్లో అవమానం తరిమిన కన్నీటి కవిత్వాన్ని అందిస్తున్నాడు కవి. ప్రతి కవితా తన మీద తాను రాసుకున్నదే. తానొక జాతి చైతన్యమై రాసిందే. ఒక విధంగా కవిత్వం సబ్జెక్టివ్ గదా... *'నాకవిత్వంలో నేను దొరుకుతాను'* అని కదా "*అమృతం కురిసినరాత్రి'* లో దేవరకొండ బాలగంగాధర తిలక్ వాపోయిండు. తను కవిత్వమై... తను ధ్వంసమై... ఆల్టిమేట్‌గా సబ్జెక్టివ్ కవిత్వమై తాను దొరుకుతానంటాడు. తాను దొరకడమంటే "తాను" ఒక వ్యక్తిగా, ఒక వ్యవస్థగా దొరకడం. తన కాలాన్ని చూపించడం. తన సమాజ స్వరూపాన్ని కళ్ళముందుంచటం. తానొక అనుభవాల పందిరిగామారడం. దీనికి వివరణ ఎంతైనా ఇచ్చుకోవచ్చు. సమాజానికి అక్కరకు వచ్చే భావాన్ని కవి అందిస్తూ, దానికి ఆనందిస్తాడు. మనకు దార్ల కూడా తిలక్ కంటే తన కులం, ప్రాంత అస్తిత్వంలో పదింతల గాఢంగా చెప్పగలడని *నెమలి కన్నులు* చెప్తోంది.

ఈ కవితా సంపుటిలోని 'మాదిగ మ్యానిఫెస్టో' కవితలో కవి మాదిగ కవిత్వమై కొన్ని తరాలుగా మాదిగల చరిత్ర నిండా గాయాలు, అమానుషం, అవమానాలు నిండిపోయాయన్నాడు. అందరికీ దక్కాల్సిన వాటాలో అన్యాయాన్ని నిలదీసి అడగడం చైతన్యవంతులవుతున్న మానవుల లక్షణం. అది ఆధునిక మానవుల ప్రజాస్వామిక పోరాటంలో భాగం. మాదిగ దండోరా ఉద్యమం చేసిందదే.

"అంటరాని తనంలో
మళ్ళీ అంటరాని తనం పెంచే
ఇంటర్ సుపీరియారిటీని భరించలేక
అంతరాంతరాల్లోని
అగ్ని పర్వతం పగిలిందిప్పుడే"

దళితులంతా అంటరాని తనంలో అల్లాడుతుండే మళ్ళీ అక్కడ కూడా మరీ అంటరాని తనం పెంచే విధానం అవలంభిస్తున్న విధానాన్ని వర్ణిస్తూ ''అంతరాంతరాల్లోని అగ్గి పర్వతాలు బద్దలయ్యింది'' అంటాడు కవి దార్లవెంకటేంశ్వరరావు. 'మాదిగ మేనిఫెస్టో'లో మాదిగలకు కూడా దళితుల్లో భాగంగా చేసి రాజ్యం కల్పించిన ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్ ఫలాలు కొంతమంది అందినవి అందినట్టే తన్నుకు పోతుంటే దిక్కుతోచని దీనస్థితిలో ఆ హక్కులు కోల్పోయిన వాళ్ళంతా దండోరా గేయమై వినిపిస్తున్నారంటున్నాడు కవి. 'దళితులంతా ఒకటే' అని చెప్పుకునే దళితుల్లోని మాలలు మాదిగలతో నిజానికి బంధుత్వాలు జరపరు. మాదిగలతో కలిసి భోజనాలు చేయరు. మాదిగలను తక్కువగా చూస్తారనే విషయాన్ని ఇలా వర్ణిస్తున్నాడు కవి. ఇదొక అనుభం. తన అనుభవాన్ని, తన జాతి అనుభవాన్నిలా కవిత్వమై పలవరిస్తున్నాడు.

"అన్నా నాకు నీ అన్నం
పరమాన్నమైంది కానీ...
నా కూడు నీకు చూసే సరికే
ఊరబెట్టే తోళ్ళ కంపు కొట్టింది కదా
"యాక్ మాదిగోడి అన్నం తినాలా" అంటూ
వాంతులు చేసుకున్న
నీ ప్రేమాభిమానాల్ని
జాలి కన్నీళ్ళతో ఊడ్చి పారేశాను
అన్నా...నువ్వే నాతో కలిసి తినలేవు
నువ్వే నాలో కలిసి జీవించలేవు
అన్నా... 'కోతి పిల్లుల రొట్టె' కథను

మరిచిపోతున్నావు కదూ... అని మాలలు మాదిగలతో కలిసి మెలిసి భుజించని సామాజిక, సాంస్కృతిక వాస్తవాల్ని కవిత్వం చేస్తున్నాడు. అందుకనే వాటిని 'జాలికన్నీళ్ళతోఊడ్చిపడేశాడు'. ఏమి బాధలురా తండ్రి... అన్నానికి ఎన్ని కరువురోజులు గతులు వడపోశాం. సామాజిక అంతరువుల్లో చివరోల్లు మాలలు మాదిగలు. మరి మళ్ళీ ఇక్కడా ఈ అసమానతలు ఏంది? చెరిపివేయడానికి సుద్దముక్కలా యేంది? హృదయం బద్దలైతే ఎంతతేడా? కవి చెప్పిన నిజానికి నీరాజనాలు. సత్యం, సత్యం సౌజన్య తత్వమైంది. తేడాలు ఖండ ఖండాలై తెగిన బంధాలు. తెలుగు దళిత కవిత్వంలో ఎంత అబద్దాలకోరులున్నారు. ఈ అసమానతలు నిజం కాదా? 'వర్గీకరణ వద్దు ఐక్యత ముద్దు' అన్న మీ నోర్లుపడిపోను. మన వెనుక మీకూ మాకూ ఉపకులాలు ఉన్నాయి కనపడ్డంలేదా? అంధకారంలో మగ్గుతున్నవాళ్ళ బతుకులు ఏమి కావాలే ? మీ కంచాల్లోని బువ్వ అడుగుతుండ్రా మాదిగలు? మీరు తొడుక్కొనే బట్టలడ్గుతుండ్రా? మాదిగలకు, మిగతా ఉపకులాలవాళ్లకీ న్యాయంగా రావాల్సినవే కదా అడిగేది. కనీసం చదువుకోటానికి యస్. సి రిజర్వేషన్లు వర్గీకరించాలంటే, ఐక్యత కూతలు ఎవరి వెతలు నెరవేర్చుతాయి చెప్పండి? ఎస్సీలను వర్గీకరించకుంటే మీ అధికారపీఠాలు కదులుతాయని గుర్తించండి. 1965లోనే భారతదేశవ్యాప్తంగా జరిపిన సర్వే ప్రకారం మాలల్ని రిజర్వేషన్ జాబితాలోనే తీసేయమన్నారు. వీటన్నింటినీ బయటకుతీయాల్సివస్తుందని గుర్తించండి. ప్రియమైన దళిత కవులు, రచయితలారా... దళిత కవిత్వ ఉద్యమంలో పేచీ ఎక్కడ జరిగింది? ఎవరూ చెప్పటానికి సాహసించలేదు. సాహసించినందుకు జి.లక్ష్మీనరసయ్య, కంచె ఐలయ్య లాంటి వాళ్ళని మరలా మరలా అవమానించి, మానసికంగా దెబ్బతీశారు.

1994 జుల్కై 7 ఈదుమూడి మాదిగల పోరాట జీవనాడి ఆ ప్రవాహం ఉధృతిని ఉమ్మడి రాష్ట్ర రాజధానిలో మాదిగలు ఎస్సీ రిజర్వేషన్ విధానాన్ని ఎ.బి.సి.డి. గా వర్గీకరించాలని చేసిన డిమాండ్ పాలకులను గడగడలాడించింది. దండోరా ఉద్యమం అప్పుడు వివిధ రూపాలలో ఉన్న పోరాటం దండోరా పోరులో కలిసిపోవటంతో ఉద్యమం 'మానవ హక్కులే – మాదిగ హక్కులు' అనే స్థాయికి వచ్చింది. అప్పటికే దళిత సాహిత్య ఉద్యమం మనసులో కుట్రల రూపేణ మాల

కవులు దళిత కవిత్వాన్ని ప్రక్క దోవ పట్టించారు. సాహిత్య పేజీలలో లాబీలు చెయ్యటం, పేపర్ ఇంచార్జీలను మేనేజ్ చెయ్యటం, మెయిన్ స్ట్రీమ్ కవులంటే "మాల కవులు" అనీ; "దళిత కవిత్వం" అంటే "మాలకవులదే" అనే స్థాయికి దళితసాహిత్యాన్ని తెచ్చారు. దళిత సాహిత్యాన్ని వ్యవస్థీకృత స్థాయి నుండి ఒక వర్గానికి చెందిన వైయక్తిక స్థితికి దిగజార్చేశారు కదా.

చిక్కనవుతున్న పాట సంపాదకులు జి.లక్ష్మీనరసయ్య, త్రిపురనేని శ్రీనివాస్ కోదాడ దళిత సాహిత్య సదస్సు గొప్ప మలుపనుకున్నారు. కానీ, అప్పటికే రిజర్వేషన్ ఫలాలు అందుకున్నవారు రాజ్యంలో భాగమై, దళిత సాహిత్య ఉద్యమంలోను చొరబడ్డారు. కొత్త పలుకుబడి, నుడికారాలతో రాస్తున్న మాదిగ కవులను గమనించి అణచి వేయటం మొదలుపెట్టారు. మద్ధతునిచ్చిన ప్రజాస్వామిక కవులు, రచయితలను లేనిపోని అభాండాలతో, దూషణలతో క్షేత్ర స్థాయినుండి గెంటేశారు. ఈ పరిస్థితిని గమనించిన కొందరు మాదిగకవులు వివిధ గుంపులో *పదునెక్కినపాట, బహువచనం, చండాల చాటింపు, గూటం దెబ్బ, మేమే, మొగి, దళిత తాత్వికుడు* మొదలైన కవితా సంపుటులుగాను, అక్కడక్కడా బలమైన ప్రత్యేకతలతో మాదిగ కవిత్వాన్ని పండించారు. ఈ నేపథ్యంలోనే '*దళితతాత్వికుడు*' కవితాసంపుటినీ, ఇప్పుడొస్తున్న '*'నెమలికన్నులు*" కవితాసంపుటినీ చూడాలి.

దళిత తాత్వికుడైన కవి ప్రేమించడంలోనే అమరత్వం ఉందంటున్నాడు. ప్రేమించడం తెలియని వాళ్లు కవులని, కాలరెగిరేసుకుంటూ తిరుతుంటారు. కానీ, దార్ల నిర్ధయులను కూడావెతుక్కుంటూ వెళ్ళి ప్రేమిస్తాడు. ప్రేమించడంలోనే అమరత్వం ఉందని గుర్తించమంటాడు కవి. నిజమే దళిత తాత్వికుడు కవిత మనసుపెట్టి వదలిపెట్టకుండా బుక్కునిండా అదిమిపట్టి చదవండి. కవి ప్రదర్శించిన తాత్వికత తెలుస్తుంది. చదవకుండా, చూడకుండా, కనీసం చూపించకుండా, జీవితం ముందుమాట ఎవరు రాసారో జీవితమనే పుస్తకం శీర్షికను కవి నిరూపించాడు చూడండి. కవిత్వానికి వస్తువే ముఖ్యమనుకుంటే తను జీవించినంత జీవితమంతా ఏమికావాలి? సమస్తం చదవడం, చూడటం, చూపించటం బతుకొక ముందుమాట కవిత్వం అవుతుందంటాడు కవి.

సరిగ్గా కవి దార్ల వెంకటేశ్వరావు నిండు ఆరోగ్యంతో ఉండి 2013

మార్చి పదమూడు నాడు తన కవితా పుస్తకం ఒకసారి చూడమని ఇచ్చిండు. సంక బ్యాగుల పెటుకొని లింగంపల్లి రైల్వేస్టేషన్, ఎంఎంటిఎస్ లోకల్ ట్రైన్‌లో వెనుక సీటులో వొరిగి చదువుతూ నిద్రపోతూ కవిత్వాన్ని కలగంటున్న రోజులవ్వి. ఉద్యమ కవుల కంటి నిండా , ఒంటినిండా హింస... ఆర్ట్స్ కాలేజీ స్టాప్ మూల మలుపు తిరిగి లేడీస్ హాస్టల్ దారికి బారికేట్స్ కరెంటుతీగలు ...విద్యార్థుల రాళ్లు... పోలీసుల రబ్బరు బుల్లెట్లు... అబ్బా ఏమి యుద్ధం... ఓ.యు.లో బాష్పవాయుగోళ పొగగొట్టాల, పొగలు కంపు వాసన... కాన్గాకు వైద్యం, ఆడబిడ్డల యుద్ధ నైపుణ్యం...ఎంత గమ్మతి... రోజూ ఒక పాఠం....

ఈ కవి దార్ల వెంకటేశ్వరరావు, అధ్యాపక కవి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు విద్యార్థుల నిరాహార దీక్షకు మద్దతు తెలిపిన కవి. ఈ కవి న్యాయం వైపు ఉంటాడు. ఎస్సీ. వర్గీకరణ అడిగినవాడు ఎవడైనా తెలంగాణకు మద్దతు తెలపాల్సిందే. ఈ కవి తన కవితలో అదే రూపమిచ్చాడు చూడండీ.

" కోస్త మాదిగోళ్లూ తెలంగాణ బాటలోనే,
మీలాగే మేమూ మాకు రావాల్సినవన్నీ మాకియ్యమని
మా సోదరులతో పోరాడుతున్నోళ్ళమేనండీ
ఏదో బతుకు తెరువు వెతుక్కుంటు
కడుపులోకికాసిన్ని గంజి నీళ్ల కోసం వచ్చినోళ్ళమేనండి
మేమేమీ వోమనోడులాంటోలం కాదు లెండి"

ఇదీ లెక్క! మనసున్న మాదిగ కవి ముచ్చటే మంది కవిత్వమంటే. ఉద్యమ కారుడే పాలకుడైన వేళ జయదు దొర హైదరాబాదు బుక్ పేర్‌సాక్షి కవిత్వానికి వెయ్యి రూపాయిలు ఇస్తే మేము సైతం అమ్మకానికి సిద్దమంటున్నారు తెలంగాణా కవులు, రచయితలు. ఇంత దౌర్జన్య కరమైన బెదిరింపు ఏ కాలములనన్న చూశామా చెప్పండి. బుద్ధి జీవులారా కాస్త సంఘీ భావ కవిత్వం చదివండ్రా, తెలంగాణా బాటలో కదూ! మీ అధికారాన్ని గుంజుకోవటానికి రావద్దు. రియలెస్టేట్ యాపారం చెత్తూ. మా భూములన్ని లాక్కోవడానికొచ్చినోల్లం అసలే కాదండి, మమ్మల్ని నమ్మండి. మేము ఏమీ లేని జాతి వాళ్ళం. దళితులం... మాదిగలం... మమ్ముల నమ్మండి' అని నమ్మకంతో చెప్పాడు కవి. ఓట్ల భరోసా

ఇచ్చిన వాళ్ళకు మీరేమి బదులు చెప్పగలరు. విశ్వాసమంతా నిజం కావాలి. కవిత్వంలో మాకు ఉమ్మడి ఎస్సీ రిజర్వేషన్ విధానంలో ఎ.బి.సి.డి.వర్గీకరణ జరగాలని కోస్తా మాదిగోళ్ళు సంకకు డప్పు తగిలించుకొని మీలాగే మేము/ మాకు రావాల్సిన యన్నీ మాకీయనమని మాల, సోదరులతో పోరాడు తున్నామంటున్నాడు కవి. పాలకుడు రామచిలుకై బోనులోకెల్లి వచ్చి అనుకూలమప్పుడె జాతకం చెబుతానంటాడు. రాబంద్రై, బ్యాలెటు పేపరు కోసం ఇరవై సంవత్సరాల పోరాటమిది. తమింకా రాజకీయ వాటా అడగలేదు. కేవలం చదువుకోసం ఉన్న రిజర్వేషన్ ని జనాభా దామాషా ప్రకారం పంచమంటున్న ఎస్సీ లను బి.సి.ల్లాగానే ఎ.బి.సి.డి.లుగా వర్గీకరించమని ఖరాఖండీగా చెప్పుతున్నాడీకవి. *"కోస్తా మాదిగోళ్ళూ...తెలంగాణా బాటలోనే ..."* అయ్యా ప్రజలారా ఇంకా చెప్పేదేముందండి మాబతుకు ఆలకించండి అంటున్నాడు కవి.

''చెప్పులు కుట్టుకుంటా / ఏ రోడ్డు మూలనో తప్ప
సదువుకొని సర్కారు కొలువులో ఉన్న
మా మాదిగోళ్ళను లెక్క పెట్టండి
వేళ్ళ మీద కూడ కనపడనండి"

*''ఇసాలాంధ్రలో ఇసాల భావాలెక్కడున్నాయ'*నే నిజాన్ని నిరర్థంగా నిలదీస్తున్నాడీ కవి. ఇంకా కొంచెం ముందుచూపుతో ఎస్సీ లో *"ఉపకులాల ఊసులేదేందిరా వాళ్ళ బతుకు చదువుకతేంది"* అని ప్రశ్నించితే ఇంకా సంపూర్ణమయేది. ఏదిఏమైనా *కావడికుండలు* కవితా సంకలనంలో చక్కని విమర్శనాత్మక భావ సూటితత్వంతో రాసిన కవిత 'తెలంగాణా బాటలోనే మాదిగలు కూడా పయనిస్తున్నారని కోస్తా మాండలిక భాషలో 'శభాష్' అనిపించుకున్నాడు కవి దార్ల వెంకటేశ్వరావు. *కావడి కుండలు* కవితాసంకలనంలో కొందరు స్వార్థ బుద్ధితో ఎస్సీ వర్గీకరణ మాటలేకుండా వక్ర బుద్ధి కవిత్వం అల్లి ఉమ్మడిలో తెలంగాణ వేరు కావాలన్నారు. కాని ఎస్సీ వర్గీకరణ జరగాలని చెప్పనివాళ్ళ భావం విశాలమైనదని ఎట్లా నమ్మగలం. కాని ఈ కవి 'పాలకుడా విను' అని కాలరు పట్టుకున్నాడు. ఉమ్మడిలో దగాతిన్న మాదిగలను మదిలో తలచుకున్నాడు. నాలుగున్నర కోట్ల కోరిక ఉమ్మడి రాష్ట్రం నుండి తెలంగాణా ఏర్పడాలని కవిత్వం

అల్లి చెప్పాడు. ఈ కవిత కదిలించిన మాట నిజం, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నిజం. కాని ఇరవై సంవత్సరాల సుదీర్ఘపోరాటంలో ఎంతోమంది మాదిగల త్యాగాలు గాలిలో కలిసిపోయాయి. కాని ఉమ్మడి రిజర్వేషను విధానం ఏ,బి,సి,డి. వర్గీకరణ జరిగితే ఈ కవి కలల పంట పండుతుంది. విజయం వైపు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యమం నడుస్తుంది. అందులో ప్రజాస్వామికవాదులూ భాగస్వాములై పాలకుల మెడలువంచి పార్లమెంట్ లో ఎస్సి వర్గీకరణ బిల్లు పెట్టి చట్టం చేయాలని కోరుకున్నాడు కవి. రెండు సార్లు ఆర్డినెన్సు ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసింది. ఫలితం చూశాడు కవి. అందుకని ఉమ్మడి దగా మీద దండోరా వేయాంటాడు కవి. రాబోయే తెలంగాణా రాష్ట్రంలో పాలకులు అగ్రకులాలేనని దళిత ముఖ్యమంత్రి మాట ఉత్తదేనని ఆనాడే చెప్పాడీ కవి. చివరికి నేడు మాదిగలు తప్ప ఆ దళిత ముఖ్యమంత్రి మాటే ఎత్తుతలేరంటే ప్రజాస్వామ్యం ఏమి కావాలె? ఎట్లా నమ్మాలి? ఎన్నెన్ని చీలికలు... మంద కృష్ణ మాదిగ మీద దండయాత్ర యెవనిసృష్టి? ఇంకా పొన్నాల సురేంద్ర మాదిగ స్మృతి కవిత్వం చదవండి.

" చచ్చినా శవాలపైనే
దళిత దశాబ్దోత్సవాలు చేసుకోండి.
మేము మాత్రం కనీసం రెండు మెతుకుల కోసమైనా
మా ప్రాణాల్ని సురేందర్‌లా జెండాను చేసి ఎగరేస్తా...
మా కలల నిండా మా నెత్తురును సిరాగా నింపుకుంటూనే ఉంటా"

సూద్దాం గదా ఎంత సిద్దమై రాసిండీ కవిత్వం. కడుపులో కలేజా ఉండాలే. నెత్తురు వాగ్దానమే కవిత్వం. ఎటూగాని సజాతి వాడు శత్రువు శిబిరం నుండి సుందెలుక రూపమై ఎగతాళి చేస్తాడు. కాని ఎస్సీ వర్గీకరణ మీద స్పష్టమైన సంతము లేనివాడు ఎంత చదువుకుంటే ఎంత లాభం. స్వంత పరిశ్రమలు తప్పా!! దమ్ముంటే దండోరా జెండా నెత్తి తిరగాలి అని హెచ్చరిస్తున్నాడీ కవి ఒక పెట్రోల్ సంతకమై!

" తెలుగు గుండెల్లో క్లాసికల్ గుబులు" ఈ శీర్షికలోనే ఒక అద్భుతం ఉంది. సమకాలీన తెలుగు భాష చరిత్రలో కనిపిస్తున్న పరిస్థితిని చర్చకు

పెడుతున్నాడు కవి. *"మళ్ళీ జంఘాలశాస్త్రులవ్వమంటారేమో... కృతక భాషనే మాటాడమంటారేమో.... ప్రామాణికమైన భాషలంటూ... మాండలికాన్ని నిషేధిస్తారేమో... ఏమో... ఏమైనా జరగొచ్చు... "* ఇక్కడ కవి పడే వేదనను అర్థం చేసుకున్నప్పుడు నిజంగానే భయమేస్తుంది. ఈ కవితలో చాలా విషయాలు ఆలోచింపచేయిస్తాయి. ఈకవితను చదివిన వెంటనే భాషాశాస్త్ర విమర్శకులు తప్పులు చేస్తున్నారని కూడా చెప్పవలసి వస్తుంది. ఇప్పటి ఆధునిక కవుల్లో లేని ఆర్ద్రత కవి దార్లలో ఉందనీ తెలుస్తుంది.

తెలుగు భాష పేరుతో సంస్కృతాన్ని మనమీద రుద్దుతున్న తీరుని బలంగానే నిరసిస్తున్నాడు కవి. భాషను ఒక ప్రవాహినిగా గుర్తించి ఇతర భాషల్లో నుండి మన భాషకూ, మన భాషనుండి ఇతర భాషల్లోకి కొన్ని భాషాపదాలు అలవోకగా వచ్చిచేరతాయని భాషాశాస్త్రవేత్తలకు తెలిసికూడా ఇలా ఎందుకు ప్రవర్తిస్తున్నారనే చర్చ తీసుకొస్తున్నాడు కవి. నిజానికి అన్యభాషా పదజాలాన్ని స్వీకరించి భాషను సంపద్వంతం చేసుకోవాలి. సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా లిపిని కూడా సంస్కరించుకోవాలి. అంతేగాని ఒకప్పటి అవసరాలకు ఏర్పరుచుకున్న భాషా సంకేతాల్నే పట్టుకొని వేలాడతామని, అదే గొప్పదని మూర్ఖంగా వాదించడం వెనుక ఒక ఆధిపత్య భావజాలం కూడా ఉందని గుర్తించమంటున్నాడు. ఇక్కడే ఉన్నాడు నిజమైన దళిత కవి. దళిత దార్శనికతా, దార్ల మాదిగ తాత్వికత ఉన్న కవి. కాబట్టి మనిషి జన్మ ఒకే కుదురునుండి ఉద్భవించాయని, మొదట మానవులు అందరూ మాదిగలే అనే విషయం తెలిసిన వాడు. రాబోవు తరం ముందు ఇతని భావాలు యువతరం మీద ఉంటాయి. దార్ల నడుపుతున్న మాదిగ వెబ్‌సైట్‌చూస్తే మాదిగల కోసం ఈ కవి చేస్తున్న కృషీ తెలుస్తుంది. కులం పేరు చెప్పుకోవడానికి బాధపడేవారికి మాదిగవెబ్‌సైట్ సెన్సేషన్, ఒక ఇన్షిపిరేషన్, ఒక పవర్ జనరేషన్. ఈ బాటలోనే '*నెమలికన్నులు*' కవిత్వంలోను జాతికి ఇన్షిపిరేషన్ ఇస్తున్నాడు కవి. సమకాలీన సమాజాన్ని, దానిలోని సంఘర్షణనీ కవిత్వంగా అందించిన కవి దార్ల వెంకటేశ్వరరావుని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

❖ ❖ ❖

ఇంటర్నెట్‌లో వచ్చిన కొన్ని అభిప్రాయాలు

'బడిలో అమ్మఒడిలో...' **కవిత గురించి** cbrao **ఇలా రాశారు.**

మనం ఏం కులంలో పుట్టాలో అని ఎంపిక చేసుకునే అవకాశం మనకు లేదు. అలాగే మన తల్లి తండ్రులూను. అంతా ప్రకృతి చేతిలో ఉంది. మన ఆలోచన విధానం, సంస్కారం మనం పుట్టి పెరిగిన వాతావరణంపై ఆధారపడి ఉంటుంది. ప్రతికూల పరిస్థితులలో పెరిగిన మీరు సమాజం పై ప్రేమ కలిగి ఉండటానికీ ఏవో దోహదపడి ఉంటాయనుకుంటా. మీ తోటి మనుషులను మీరు ఇలాగే కలకాలం ప్రేమించాలని ఆశిస్తూ...

❖ ❖ ❖

spandana (http://naapaluku.blogspot.in/ http://blog.charasala.com/ Washington, D.C., United States పై అభిప్రాయానికి ఇలా స్పందించారు.

అవును మరి. ఆ బాధేంటో అందులోవున్నవారికి గాక బయటివారికి ఎలా తెలుస్తుంది. అమెరికాలో నీగ్రోలను, జపానులో యూదులను పెట్టిన కష్టాలను చూసి కన్నీరు కార్చే నేను వేల ఏళ్ళ సంవత్సరాలనుండి ఇప్పటికీ జరుగుతున్న ఈ తంతును తలచుకుంటే గుండె చెరువవుతుంది. నిజమే ఆ కులంలో పుట్టడమే అదృష్టం. బాధించే వాడి జట్టులో గాక బాధను మింగే వాడి జట్టే ఉత్తమం కదా!

మావూరు నవ్వింది కవిత పై స్పందనలు.

spandana said...

మంచుగడ్డతో చేసిన గునపం గుండెలో గుచ్చుకుంటున్నట్లుగా వుంది.

http://blog.charasala.com

"ఎక్సరే రిపోర్ట్!' కవిత పై రాధిక

(http://snehama.blogspot.in/) గారిలా స్పందించారు.

"మీ మిగిలిన అన్ని కవితలకంటే నాకిది బాగా నచ్చింది. చాలా ఆర్ద్రంగా ఉంటుంది మీ కవిత్వం."

"అంతర్జాతీయ మార్కెట్లో పవిత్రప్రేమ" **కవిత దగ్గర రాసిన స్పందనలు**

keshavachary said...

"చందమామని వదలి ఉండలేనని ఒట్టేసుకున్న వెన్నెల"....జాబిలికీ వెన్నెలకీ వున్న అనుబంధాన్ని ఎంత అద్భుతంగా చెప్పారు గురువుగారు! ఈ వాక్యాల్ని మళ్ళీ మళ్ళీ చదువుతున్నప్పుడల్లా నాకు కలిగిన అనుభూతిని, ఆనందాన్నీ చెప్పాలంటే.... చాలా కష్టంగా వుంది. అందుకోసం మళ్ళీ ఓ కవిత రాయాలేమో!! నిజంగా ఈ కవితలో ఎంత భావుకత నిండివుందో కదా!

"అల్లుకొనే లతకీ ఎన్నాళ్ళకీ పందిరి కాలేక పోయిన అసమర్థుడి పట్ల అసహనమని చెప్పనా?" నువ్వు నుదుటి మీద కుంకుమ బొట్టు పెట్టుకొనేటప్పుడు అద్దంలో చూసుకోవద్దు. అధరామృత స్మృతి విష బిందువై తాకిన తొలగని మచ్చేదో గుర్తొస్తుంది! మూత బడని ఈ మూగ దృశ్యాన్ని తొలి వేదనకే రాలిన మూత్యాల గుసగుసల్ని ఏనాడైనా ఇంటర్ నెట్ నుంచైనా తీసుకొని ధరించే వీలుందా?" యిది నిజంగా నాకు నచ్చిన కవిత. చాలా చాలా బావుంది.

radhika said...

adbhutam .manasuloa nilicipoyea adbhutamayina vaakyaalu vunnayi.

బాలసుబ్రహ్మణ్యం said...

అంతా బావుంది. కానీ ఒక తాత్వికుడు "దళిత"అని కుల గుర్తింపు తగిలించుకోవడమే బాలేదు. తాత్వికులు యావన్మానవ జాతికీ చెందుతారనుకుంటా. కుల గుర్తింపు అంత అవసరమా? లేదా ఈబ్లాగు దళితేతరుల కోసం ఉద్దేశించబడింది కాదనుకోవాలా ?

పై అభిప్రాయానికి "స్పందన" గారిలా స్పందించారు

చాలా చాలా బాగుంది. అందరూ తత్త్వాలు చెప్తారు. కానీ దళిత తత్త్వమెవరూ చెప్పరు. ఏళ్ళకేళ్ళు రోజూ చూసీ చూసీ అవమానం అవమానంగా కనపడదు. అస్పృశ్యత అంత పాపంగా కనపడదు. కానీ, దళిత కోణం చూసినప్పుడే, దళితునిగా కాసేపు ఊహించుకుంటేనే గానీ ఆ బాధ తెలియదు. గట్టున కూర్చుని ఎన్నైనా చెప్పొచ్చు.

–ప్రసాద్ http://blog.charasala.com

ప్రసాద్ said.....

మీ తాజా పోస్టు చూసి మీ కవితా సంపుటి పేరులో "దళిత" అన్నపదం తొలగిస్తారేమోనని భయపడి ఈ వాఖ్య రాస్తున్నా!

"నా" ఏడుపు నాదయినప్పుడు,

"మీ" ఏడుపు మీదయినప్పుడు,

"మహిళా" వాదం మహిళల దయినప్పుడూ,

"దళితుడి" తాత్వికత దళితుడిది ఎందుకవ్వదూ?

దళితుడి దృక్కోణం నుండీ తాత్వికత దళితుడి నుండే రావాలి. అది దళిత తాత్వికతే అవుతుంది. మరొకరికి ఆ తాత్వికత చెప్పటం రాదు. అందరికీ వుపయోగపడే తాత్వికత దళితుడూ చెపుతున్నట్లయితే చెప్పనీ, కానీ దళితుల మనోభావాలు, మనసున గుచ్చుకున్న ముళ్ళ గురించి వున్న తత్వము "దళిత తత్త్వమే" అవ్వాలి. పేరు గొప్పగా వుంది. దాన్ని మార్చక్కర లేదు. ఇది నా అభిప్రాయము.


–ప్రసాద్ http://blog.charasala.com

❖ ❖ ❖

నెమలికన్ను
దార్ల వెంకటేశ్వరరావు

ముప్పైయ్యేళ్ళ జీవిత గాయాల జ్ఞాపకాల్లోనుంచి
మూడు వేల సంవత్సరాల సాంఘిక చరిత్రను తడమడం
ఈ కవిత్వంలోని ప్రత్యేకత.
పుట్టుక, మరణాల మధ్య
ఈ సంతోషాలు, ఈ ఆనందాలు,
ఈ దుఃఖాలు, ఈ వేదనలు
మనిషి చుట్టూ ఎన్ని బంధాల్ని
పెనవేసిపెట్టాయో దార్ల కవిత్వం
చదివితే తెలుస్తుంది.
దార్ల ఉగాది కవి కాదు;
దార్ల సంక్రాంతి కవి కాదు;
దార్ల ఆకాశవాణి కవీ కాదు;
దూరదర్శన్‌ల కవీ కాదు;
దార్లకు కవిత్వ రచన ఒక సామాజిక బాధ్యత.

- ఆచార్య తుమ్మల రామకృష్ణ



దార్ల వెంకటేశ్వరరావు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల్లోనే కాదు,
యావత్తు భారతదేశంలో జరుగుతున్న
సామాజిక ఉద్యమాలను గమనించడానికీ,
అదీ దళిత సమస్యలపై జరుగుతున్న
పోరాటాలను గమనించడానికి
ఈ కవితాసంపుటి చక్కని అవకాశాన్నిస్తుంది.
సుమారు మూడుదశాబ్దాల భారతీయసమాజంలోని
అనేక పార్శ్వాలను ఈ కవితల ద్వారా గుర్తించవచ్చు.

- డా॥బె.భీమయ్య

ISBN 978-81-908963-5-1

Cover Designed By : Sri Laxmi Graphics @ 9298252527